# అగ్నికణం

(AGNIKANAM - THE SPARK)

అగ్నికణం నవలను విప్లవ రచయితల సంఘం నెల్లూరు జిల్లా యూనిట్ తమ ప్రచురణ నెం. - 2 గా ప్రచురించారు.

ప్రచురణ తేది 21-08-1983.

162 పేజీల ఈ నవల వెల ఆరు రూపాయలు మాత్రమే.

ముఖ చిత్ర రచన ఆర్టిస్ట్ దాశరథి.

ప్రతులు : వెయ్యి.

నెల్లూరు లోని కోణార్క ప్రింటర్స్‌లో ముద్రించారు. ప్రతులకు ఇచ్చిన చిరునామాలు-

1. వి. చెంచయ్య<br>6-5-13, పిన్నంరాజు వారి వీధి<br>కావలి - 524 201
2. సి.ఎస్.ఆర్. ప్రసాద్<br>సి-108, శ్రీనివాసనగర్ కాలని<br>గుంటూరు - 6
3. సృజన<br>హన్మకొండ<br>వరంగల్ - 1



# ఒక్క క్షణం.......

ప్రస్తుతం వచన సాహిత్యంలో అశేషజనాన్ని ఆకర్షిస్తున్న ప్రక్రియ నవల. నవలా సాహిత్యం వస్తున్నంత కుప్పతెప్పలుగా మరే సాహిత్యం రావడంలేదు. విప్లవ రచయితల సంఘం రాశిలో నవలా సాహిత్యాన్ని ఎక్కువ సృష్టించలేక పోయినా, వాసిలో చెప్పుకోదగిన స్థాయిని నిలబెట్టుకుంటూనే వుంది. ఆ స్థాయిని నిలబెడుతున్న విప్లవ నవలాకారుల్లో అల్లం రాజయ్య ఒకరు.

పోరాటాన్ని చిత్రించే నవలలన్నీ విప్లవాత్మక నవలలు కావు. చాలామంది ఊహాజనిత పోరాటాన్ని చిత్రించి తృప్తిపడుతుంటారు. కొందరు సిద్ధాంతం కోసం సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవితాన్నీ, పోరాటాన్నీ వక్రీకరిస్తుంటారు. నిజమైన విప్లవ రచయితలు జీవితాన్ని సామాజిక, ఆర్థిక, రాజకీయ నేపథ్యాన్నీ పోరాట పద్ధతినీ సహజంగా చిత్రించి, తద్వారా విప్లవ సిద్ధాంతాన్ని ప్రతిబింబింపజేస్తారు. ఈ కోవకు చెందిన విప్లవ నవలాకారుడు అల్లం రాజయ్య.

నవలాకారుడుగా అల్లం రాజయ్య ఈవరకే తెలుగుదేశానికి సుపరిచితుడయ్యాడు. పెద్ద చదువులు చదువుకోకపోయిన, తెలుగు సాహిత్యాన్నంతా తరచి చూడకపోయిన, తన కందుబాటులో ఉన్న జీవితాన్ని మథించాడు. పుస్తకాలు చదివి నవలలు రాయడంకన్నా జీవితాలు చదివి నవలలు రాసేపద్ధతిని మొదట్నుంచీ అలవర్చుకున్న రచయిత రాజయ్య. ప్రజల్నుంచి నేర్చుకుని ప్రజలకే చెప్పడం ఆయన నవలల ప్రత్యేకత.

రాజయ్య నవలల్లో పట్టణ జీవితంకన్నా, పల్లె జీవితమే ప్రధానంగా కనిపిస్తుంది. వ్యవసాయ ప్రధానమైన మనదేశంలో ముందు గ్రామాల్లోనే విప్లవాగ్ని రగుల్కోవాలి. జనంలో సగభాగం ఉన్న స్త్రీలు విప్లవపోరాటాల్లో అగ్నికణాలుగా మారాలి. సమాజానికి ఎదురీదిన బయ్యక్క పోరాట జ్వాలలో ఎలా అగ్నికణంగా మారిందో సహజంగా చిత్రించే నవల ఇది.

తెలంగాణ మాండలిక భాషలో ఉండడం ఈ నవల్లోని మరో ప్రత్యేకత. మాండలికాల్లో నవలలు రాయడం గురించి ఇంకా కొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఒకనాడు శిష్ట వ్యావహారిక భాషలో రాయడాన్నే వ్యతిరేకించారు. అందుకే గిడుగు రామ్మూర్తి వ్యావహారిక


www.eTelangana.org

భాషోద్యమాన్ని చేపట్టవలసి వచ్చింది. ఇవాళ వ్యావహారిక భాషలో సాహిత్య రచనలు అందరూ అంగీకరిస్తున్నారు. ఇంకొన్నాళ్లుపోతే మాండలికాలకూ జనామోదం పూర్తిగా లభిస్తుంది. గ్రాంథిక భాష మృతభాష. వ్యావహారికం సజీవభాష. వ్యావహారికంలో కూడా ఏ ప్రాంతం వారికి ఆ ప్రాంతపు మాండలికమే సజీవమైంది. అందుకే ఈనాడు ప్రజారచయిత అయినవాడు మాండలిక భాషను స్వీకరించక తప్పదు. తన తొలి రచనల్లోనే ఈ వాస్తవాన్ని గుర్తించిన ప్రజా రచయిత అల్లం రాజయ్య.

ఈ నవల్లో కొంతభాగం 'అరుణతార'లో సీరియల్‌గా వచ్చింది. సంవత్సరం క్రితమే ఇది పుస్తకరూపం ధరించవలసింది. ఆర్థిక ఇబ్బందుల వల్లనే ఆలస్యమైంది.

ఈనాటికైనా ఈ నవలను తీసుకురాగలగినందుకు గర్విస్తున్నాం. ఈ నవలను చదవండి. నిశితంగా పరిశీలించండి. విరసం సృష్టిస్తున్న పోరాట సాహిత్యాన్ని గుర్తించండి. గుణదోష విమర్శ చెయ్యండి. సలహాలివ్వండి. విప్లవ సాహిత్యోద్యమానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తోడ్పడండి.

ఈ నవల ప్రజల ముందుకు రావడానికి తోడ్పడిన మిత్రులందరికీ మా కృతజ్ఞతలు.

నెల్లూరు
18.8.1983

వి. చెంచయ్య
విప్లవ రచయితల సంఘం
నెల్లూరు జిల్లా శాఖ



# అగ్నికణం

## 1

"తెల్లవార్తుందహోఁ" అంటూ కోళ్ళు గూసినయ్. గుడిసె చూరు కింది గూట్లె కోడి తన ముల్లేందో పోయినట్టుగ అదేపనిగా కూస్తున్నది. నులక మంచాల పండుకొనే కండ్లు తెరిసిన... రుక్కుబాయి ఏడుపు జీరగ నీర్సంగా కడుపు అవిసిపోయేటట్లు అట్లాగే వినబడుతంది. ఆమె మొగడు గుడగుడ సప్పుడు చేస్తూ, మధ్యమధ్య కాసేపాగుతూ ఏదో అంటడు. అది ఓదార్పా? ఏమో......

"ఎవలకెట్ల రాసుంటె అట్ల జరుగుద్ది. ఏడ్సేడ్సిసత్తవ్. ఇంటన్నవా? ఇచ్చినోడు మర్సిపోవాలె... గీ పల్లెల నువ్వొక్క దానివేనా? పూసిన పూలన్ని కాయలయితయ? కాసిన కాయలన్ని పండ్లయితయ? మా అవ్వకు పన్నెండు గురిల నేనొక్కన్నే దక్కిన." గిదీ వరుస.....

రుక్కుబాయి ఏడు పాపదు. గ సోకంల ఎంతో కన్నతల్లి కడుపుతీపి.......రుక్కుబాయికి ఎనమండుగురు పిల్లగండ్లు పుట్టి పోయిండ్లు. కొందరు మలేరియ జరంగొట్టి, మరికొందరు ఆకలి పెద్దరోగం సోకి. ఎనిమిదో పిల్లగాడు పది దినాల నుంచి మంచంల అచ్చేపానం పాయేపానం జేసి నిన్ననే పోయిండు.

ఈ ఆడివిల శెట్లల్ల శెట్లోలె గుట్టల్ల రాల్లోలె జనం బతుకుల్ల గిది మామూలు సంగతే......కాని......నాకండ్లల్ల నీళ్ళూరుతున్నాయి. ఏ అడుగు పొరల్లనో చిక్కుబడిపోయిన తల్లిపేగు పొర్లుతంది... కడుపు సింపుక పుట్టిన నెత్తురు ముద్దను తను సూసుకోనన్నా లేదు....వద్దు ఆ పీడకలలు...దయ్యం బతుకు మరింక వద్దు...

కరకర పొద్దు పొడిసేదాక మిడిగుడ్లేసుకుని సూసుకుంట నులక మంచాల కదలక మెదలక పడివున్న........ఇంకా ఇట్లాగే ఉంటే.....మూడేండ్ల బట్టి ఎన్నడు గింత తీరికగ ఉండెరుగ. ఊపిరి సలుపని పనులలో నన్ను నేను మరిచి తిరిగిన.........ఓహ్....ఎందరు మనుషులు... ఎన్ని గూడేలు, పల్లెలు, వాగులు, చెట్లు, పుట్టలు ఇయ్యాల్లెందుకో నా పాత బతుకు యాదికొత్తంది...ఛట్........


www.eTelangana.org

"అక్కా....తెల్లారింది లేలే....నల్లపిట్ట ఎప్పటినుంచో పీసుపీసు మంటంది" నా మంచం దగ్గర కూకుండి బిక్కు పాసి పండ్లెల్లబెట్టి నవ్వుతున్నాడు.

బిక్కు మొకంలకు చూసిన... పాసుపండ్లు, బుడ్డసెంపలు, పూసిన పెదువులు... మొకం నెత్తురులేక తెల్లబడిపోయింది. కామిండ్లరోగం బాగ ముదిరిపోయినట్టున్నది. మట్టి బాగ తింటడేమో? కాగోలె బొత్త........తప్పకండ్లు ఎప్పుడో సచ్చిన బుడ్డపరక సాపల తీరుగున్నయి. జుట్టు అడ్డదిడ్డంగా పెరిగున్నది.......తోలుకాళ్ళ తీరుగ ఊగులాడే కాళ్ళు........అక్కడో పోస ఇక్కడో పోస మీసాలు.....ఉలిక్కి పడ్డ......గ కండ్లు... అచ్చం మా అన్న కండ్లే... మా అన్న...

బిక్కు మొకంల నుంచి చూపు తప్పించి బజార్లకు చూసిన...ఎవడో కావడి బుజానేసుకొని గంగకు నీళ్ళకోసం కాబోలు పోతున్నడు. రుక్కుబాయి ఏడుపాగిపోయింది. రుక్కుబాయి మొగడు భీం గొనుక్కుంట ఎటో పోతున్నడు. బక్కెడ్లు చెవులు టపటప లాడిచ్చుకుంట దోమలు తోలుకుంటున్నయి.

మంచాలనుంచి లేచి చీర సరిచేసుకున్నాను... తూర్పు కొండమీద కంక పొదల మీద పొద్దు పొడుపుకు గుర్తుగా రగరగలాడుతున్న కిరణాలు...... గంగన్న యాదికొచ్చిండు. గంగన్నకు పొద్దుపొడుపుకు జత కలుపుకుంట వాకిట్ల కొచ్చినాను. పడమటి దిక్కు ప్రాణహిత నదిదాకా నల్లరేగడి బీళ్ళు. నదికావల పచ్చచీరె ఎండేసినట్టు అడివి... ఉత్తర దక్షిణాలూ అడివే... ఓహ్ ఇయ్యల్ల అంతా అందంగనే కన్పడ్తందే....కూనిరాగం తీయబోయిన...

బక్కెడ్లు, ఆవులు, ఏరంధీ లేనట్టు తామూలుగా నడుస్తూ మధ్య మధ్య ఆగి సిలసిల ఉచ్చలుబోస్తూ, పెండ బెడుతూ, ఏదో యాదికచ్చి ఒర్రుతూ ఎనక కెనుకకు సూసుకుంట పసురాలు అంతలోనే ఆకలి గుర్తొచ్చి ఆబగా అడివికేసి నడుస్తున్నాయ్. వాటి వెనుక ఈడుపుగాళ్ళ పసువులకాపర్లు మొకాలు రెచ్చికొట్టుకొని అవే మనుషులన్నంత కసిగా తిట్టుకుంట నడుత్తండ్లు....... నేను వీళ్ళతోని పోదునా? అనుకున్న......

దారంట నిదుర మోహాలతోటి కొంతమంది నెత్తిమీద విప్పపూల గంపలెత్తుకొని ఊళ్ళెకత్తండ్లు...

నేనింకా పసురాలు లేపుతున్న దుమ్ముగనే సూసుకుంట నిలుసున్న-జీడిగింజ తీర్గ నల్లగున్న పిల్లొకతి నా ముంగటికొచ్చి నిలుచున్నది. ఆమె నెత్తిమీది గంప బరువుకు మెడ జువజువ లాడుతున్నది. వాకిట్లకచ్చి కాసేపు తటపటాయించి మెడలు రిక్కించి చుట్టూ చూసింది. నా దగ్గెరకచ్చి గంప దించింది. చుట్ట బట్ట తీసి అందట్ల నుంచి చిన్న కాయిదం ముక్కతీసి నా చేతికిచ్చి ఏ మెరుగనట్టు గంపెత్తుకొని వెళ్ళిపోయింది.

ఆ చీటీ విప్పి చూసిన...'సాయంకాలం రడీగుండు'. ఎక్కల్లేని హుశారు కలిగింది. రెండు దినాలుగ నేనిక్కడ చిక్కుబడిపోయిన..... పరధ్యాసల చీటీ ఉండజుట్టి పారేసిన...



వెనకకు తిరిగి గుడిసెలకు పోబోయిన...బిక్కు దేక్కుంటచ్చి ఆకాయిదాన్ని నోట్లేసుకు మింగేసిండు. నవ్వుకున్న... మెచ్చుకోలుగ చూసిన.

రుక్కుబాయి తను కట్టుకున్న గజం గుడ్డపేగు కొస ముంగట ఏలాడేటట్టు ఏసుకొని అంబలికుండ కడుగుతంది... రుక్కుబాయి సెత్తల గోరెడు మాంసమన్నా లేదు... గీ దేశంల బతికే కోటానుకోట్ల మనుషుల్ల మనిషే రుక్కుబాయి. గీ పల్లెల రుక్కుబాయి తీర్గ బతికే సానామంది మనుషులకు అంబలి తప్ప అన్న మెరుకనే లేదు. గ అంబలి కూడ ఏడాదిల మూన్నెల్లే దొరుకుతది. ఎండాకాలంలనైతే పనులు గినులేవీ లేక అడవిల సిగురాకులు దూసుకచ్చి తింటరు....... తునికిపండ్లు వో పదిహేనొద్దులు ఆదుకుంటె...విప్పపూవు మరో పదిహేనొద్దులు... ఇయ్యన్ని అయిపోయినంక కంకబెనం పది పదిహేనొద్దులు తింటరు.....

ఆనకాలంలైతే ఎప్పుడన్నా దొరికే కూలి. రోజుకూలి తవ్వెడు జొన్నలు....గ తవ్వెడు ఇంటిల్లిపాది రొండు పూటలు గడపాల్నంటే అంబలి గాక బువ్వేడ దొరుకుతది?... గందుకనే ఆకట సచ్చేటోళ్ళకు లెక్కేలేదు.......రోగాలకు నొప్పులకు మందు గోళీలుంటా యని ఎరుకనే లేదు......పరధాన్లమెంటోడు సెప్పింది మాట...ఇచ్చింది పసరు.....గీ పల్లెల్లకు ఏవైనా పన్నులో గిన్నులో. ఓట్లగీట్లో వచ్చినప్పుడు తప్ప తెల్లబట్టలోల్లు రానేరారు. అచ్చిన అధికార్లు 'కాకిరి బీకిర'ని ఏందేందో మాట్లాడి యాల్లు సాదుకున్న కోల్లు సిక్కుడుగాయలు ఎత్తుకపోనే వత్తరు. అట్లా తెల్లబట్టలోల్లంటేనే యాల్లకు బయం.... తెల్లబట్టలోల్లు ఊరి పొలిమేర్ల కనిపిత్తె సాలు పిల్ల మేక బొయి గుట్టల్ల బడుతరు. జనాభా లెక్కల పంతులచ్చినా 'అదిప్పిత్తం - ఇదిప్పిత్తం' అని ఇంటికి ఆఠాణా వసూలు చేసుకపోతడు... కాని రూపాయినోట్లు సూడనోల్లు ఆడ సానామందున్నారు.

ఇట్లా ఆళ్ళ బతుకు గురించి రుక్కుబాయి చెప్పిన సంగతులు గుర్తుతెచ్చుకుంట కసువూడుద్దామని చీపురు తీసుకున్నా. రుక్కుబాయి నాచేతుల చీపురు గుంజుకున్నది.

"నాకు పనేమిలేక ఉత్తగుంటన్న" నేను.

"మా అందరి పని నెత్తినేసుకున్నవ్ గద" అన్నది రుక్కుబాయి.

బిక్కు దేక్కుంటచ్చి పాసుపండ్లెల్లబెట్టి నవ్విండు.

పిడుక బొగ్గు తీసుకొని మొకం కడుక్కోను అంపుల కాడికి నడిచిన.....ఇప్పుడు పొద్దు బాగా పైకొచ్చింది. గుడిసెల మీదినుంచి కయ్యర బియ్యర అరుసుకుంట సిలుకల గుంపులు ఎటో పోతున్నాయి... గూడెం మొదట ఎవలో ఎవలనో కోపంగ తిడుతండ్లు.....

పండ్లు కిరకిర సప్పుడు సెత్తంటే తోముతున్న...... ఈ సప్పుల్ల ఎనుక ఎంత వద్దనుకున్నా నా మనుసుల ఎందరెందరో తిరుగుతండ్లు ఏడ్సుకుంట...తిట్టుకుంట... ఆళ్ళందరినీ గుర్తుపట్టవద్దని నేను అనుకుంట...


www.eTelangana.org

పొద్దు గూకినప్పటి నుంచి ఎప్పటి తీర్గనే ఆరాటం... బట్టసంచిల నా చీరె రయికె కుక్కుకున్న....గయితప్ప ఇంకా నా సామాను ఒకటి రెండు పుస్తకాలు...అవి అందట్ల పడేసుకున్న. రుక్కుబాయి తంటాలుపడి నాకోసం గడుక వండింది. భీం గంగనుంచి సాపలు దెచ్చిండు. కసంత నూనె. రెండు ఉల్లి గడ్డలు సావుకారి నడిగి పట్టుకొచ్చిండు. బిక్కు తన ముల్లేదో పోగొట్టుకున్నోని తీర్గ దిగులుపడి నా దగ్గర్నే కూకున్నడు....

"బిక్కు మన రాజ్జె మచ్చినంక నీ కాళ్ళకు మందు బెట్టిత్త" అన్న, అతని దిగులు కొంచెం పోగొడ్దామని.

"మారె గిది నేనునమ్మ నక్క........ నాకు కాళ్ళు అత్తాయి" అన్నాడు... ఇంకా ఏమన్నా తన కాళ్ళ గురించి మాట్లాడాలని.

"తప్పకుండత్తయి సూడు నువ్వు మన్ను దినకు. మన్ను దింటె పేగులు పాడై పోతయి."

"ఆకలైతెట్లక్కా? నాకేమొ కాళ్ళు గిట్లుండె...అన్న, అదినె దెచ్చింది ఆళ్ళకే సరిపోదాయె. పనిజేసెటోల్లకు కూసంతన్న ఆసరుండద్దా?"

నాకేం చెప్పాల్నో తోచలే. "మనకు మంచి దినాలత్తయి. గప్పుడు గీ ఆకలుండది. ఎరికేనా?" అన్న...

"మళ్ళెప్పుడన్న కనిపిత్తర! చెట్లల్ల బతికే జివాలసొంటోల్ల కాడికచ్చి మా బతుకల్ల కలెగల్సిపోయి మంచి జర్గుతదని సెప్పిండ్లు జంగుబాయి దేవర......." రుక్కుబాయి గుడగుడ గోండు బాసల ఇంకేదో అన్నది. అది నాకు తెలువలేదు. గొంతు పూడుకు పోయింది.

భీం మోకాళ్ళమీద తలపెట్టుకొని గుడిసె బయటికి సూసుకుంట కూకున్నడు....

ఆ ముగ్గురి మనుసుల్ల చెప్పరానంత దిగులు కనిపిత్తనే ఉన్నది. ఎవలు వీళ్ళు? వీళ్ళకు నాకున్న బందమేంది?

ఏం మాట్లాడన్నో తోసలేదు... వాళ్ళ మొకాలు సూడలేక బయటకెల్లి చూసిన... చీకటి ముసురుకుంటంది... సిమ్మెట్లు ఒకటీ రెండు పలుకుతున్నయి. గుట్టమీద ఒకటి అరా సుక్కలు మిలుకు మిలుకు మంటన్నయి. అడివికి బోయిన ఆడోల్లు ముచ్చెట్లు బెట్టుకుంట పోతున్నరు.... పక్క గుడిసె ముసులోడు బజార్ల కూకుండి సుట్ట తాగుతున్నట్టున్నది... మళ్ళ గుడిసెల కచ్చిన...... పొయ్యి దగ్గెర కూకున్న రుక్కుబాయి సప్పుడు కాకుండ ఏడుత్తంది...

ఇప్పుడు ఎంత టయిమయ్యిందో?

ఎటూ తోసక నులక మంచంల కూకుండి, నెమరేత్తన్న బక్కెద్దును సూత్తన్న... దాని కండ్లు నిలబడిపోయున్నయి.... ఇంతట్ల వాకిట్ల అడుగుల సప్పుడు... సీకటి తీర్గ



నల్లగున్న మనిషొకడు తొంగి సూసిండు.... మంటెలుగుల అతని కండ్లు టపటప లాడినయ్....లోపటి కచ్చిండు... ఇంకా పదారేండ్లు సరిగ్గా లేని పిల్లగాడు. నన్ను ఎగాదిగా సూసి పిడికిలి బిగిచ్చి సెయ్యెత్తి సలాం చెప్పిండు... నేను మారు దండం అన్నట్టుగా పిడికిలెత్తిన.

"సారు మిమ్ముల తీస్క రమ్మన్నడు" అన్నడు గొంతు తగ్గిచ్చి.

"ఏమన్న తింటవ?" నేనడిగిన... నిచ్చానికైతే అంతా అయిపోయింది.

"తినచ్చిన" అన్నడు.

"బతికిచ్చినవ్..." అన్న.

పిలగాడు అంత తెలిసినట్టుగ నవ్విండు.

నా సంచి తీసుకొని నిలబడినాను. రుక్కుబాయి మనిషంతా ఊగిపోతూ నామీద పడి ఏడ్చింది.....

"నన్ను మతికుంచుకుంటవ అక్క?" బిక్కు కండ్లు తుడుసుకుంటున్నడు.

"తప్పకుంట.... మళ్ళచ్చినప్పుడు నీకు అంగి పట్టుకత్త" అనేసి. రుక్కుబాయిని యిడిపిచ్చుకొని భీంకు దండం చెప్పి వాకిట్ల కొచ్చిన... నా తోటట్టుగ బిక్కు వాకిట్ల కచ్చిండు.

నా కండ్లల్ల గుబగుబ నీళ్ళచ్చినయ్. కండ్లు తుడుసుకుంటనే నడిసిన.... కొంతదూరం నడిసి ఎనుకకు దిరిగి సూసిన.... బిక్కు ఆ శీకట్లో మట్టిపెడ్డ తీర్గ కూలబడిపోయి చేతులు మొకం మీద కప్పుకొని ఏడుత్తండు.

మేమిద్దరం రేగడిమన్ను పెళ్ళలు తొక్కుకుంట అడివికేసి నడుత్తన్నమ్....పిలగాడి సిటికెనేలు కావచ్చు సిటుక్కు సిటుక్కుమంటంది. నాకీ బతుకిచ్చి... నన్ను దయ్యం జేసి తరివేసిన మనుషుల మాయమర్మాలిప్పి చెప్పి మనిషిని జేసిన రాజరాం యాదికొచ్చిండు. నాతీర్గ ఎందరిని మనుషుల జేసిండో? ఇప్పుడేడున్నడో? తొనుకు బెనుకు లేకుంట ఏమందిని కుప్పేసి మాట్లాడుతండో? అతనితో కలుసుకున్న దినాలు యాదొచ్చినయ్. అతను నేర్పిన పాటలు, కతలు, అచ్చరాలు... ఆటెనుక అల్లుకుపోయిన ఎన్నో బతుకు బాదలు... అన్నీ గుర్తుకొచ్చినయ్... నేను నా రోతబతుకును ఎప్పుడు యాదికి తెచ్చుకొని ఏడ్సుకుంట కూకుంటె అతను 'తెల్లకురుల పిల్ల*' కత చెప్పెటోడు. నేను బెల్లంగొట్టిన రాయోలె కూకున్నప్పుడు హుశారు పుట్టించేటందుకు 'అన్నాలన్నా లెన్నియలో' అంటూ గొంతెత్తి పాడేటోడు.

---

*చైనా విముక్తి ముందు భూస్వాముల దౌర్జన్యానికి వెరచి కొండ కోనలలో తలదాచుకొని గుహలలో వుంటూ ఆకాలంగా వెంట్రుకలు తెల్లనైన అమ్మాయి కథ.


www.eTelangana.org

నాకు తెలువకుంటనే ఆ పాటెత్తుకొని పాడుకుంట నడుత్తన్న. పిల్లగాడు తను గొంతు కలిపిండు.... కొడిశె ఆకులలో గాలి మాకు సుతి పడుతోంది.......

"బగ్గ పాడినవక్క!" అన్నడు పాట ఆగడంతోనే... మరికొంత దూరం నడిచి ప్రాణహిత గంగను చేరినం. నేను చీరె పైకి కట్టిన... నీళ్ళు నల్లగా... అసలేం కనబడకుంట... ఆకాశంల సుక్కలు జెగజెగ మెరుత్తన్నయ్.

"గీ గంగ బలే జిత్తులమారి దక్క...మనకైతే దారిత్తది... అదే మన పగోళ్ళకైతే లోతు పెరుగుతది...." పిల్లగాడు సెప్పిండు.

నీళ్ళల్లకు దిగినం.... నీళ్ళు బాగనే ఉన్నయి... దొబ్బుతన్నయికూడ.

"నా చెయ్యి పట్టుకో అక్క......."

నాకైతే దిక్కుమొక్కు ఏది తెలవటం లేదు. నీళ్ళల్లో పాతిన కర్రలు ఎరుక సూసుకుంట పిల్లగాడు రయ్యిరయ్యిన ముంగటికి నడుత్తండు... గంగ దాటేటాల్లకు రాత్రి ముదిరిపోయింది.

ఒడ్డెక్కినం....ఒడ్డు పొంట ఎక్కన్నో దూరంగ నక్కలు ఓరడి గక్కుతన్నయి. వొడ్డుమీద మళ్ళా చేండ్లు. దూరంగ ఏదో ఊరున్న దానికి గురుతుగా దీపాలు మిలుకు మిలుకు మంటన్నయి. ఒడ్డుమీద మాకు కుడివేపు అడివిల ఎలుగడిపడి మండు తంది.ఊరు పక్కనుంచి దాటిపోయినం... నా కాళ్ళు మండుతన్నయి. పొత్రాల్లు తాకి బొటనేలు శిట్లిపోయింది...మళ్ల అడివిల కొచ్చినం....ఇంకెంత దూరం నడువన్నో?

"నీకేమన్న పాటలత్తయా తమ్మీ..."

"తెలుగు పాటలు బాగ పాడరావు."

"మరేం పాటలత్తయి?"

"గోండు."

"సరే. కొంచెం మెల్లెగ పాడు. ఏం పర్వలేదుగద.... సుట్టుపక్కల..."

*"తాకరో కొయిదాదా తాకరో*

*వమినె వమినె..."*

అనే పాట పాడిండు. పాటంత అయిపోయిన తరువాత అతనే దాని అర్థం కూడ చెప్పిండు... మళ్ల 'కోళ్ళు తెమ్మంటాడు, నేనేడ తెచ్చేది,' అనే పాట పాడి శెప్పిండు.

అట్ల మేమిద్దరం అడివిలనుంచి నడిచి నడిఝాము రాత్రి అయ్యేటాల్లకు ఒక పల్లె చేరుకున్నం. గ పల్లెల అన్ని గలిపి ఓ ఇరవై గుడిసెలున్నట్టున్నయి.... అప్పటికే గుట్టబోర్ల మీదినుంచి శెట్ల కొమ్మల మీదినుంచి ఎన్నీల మీది కొచ్చింది. ఎన్నీల ఎలుగుల గుడిసెలు ముసులోల్ల గుంపు తీర్గ కన్పించినయ్. నన్ను ఓ ఇప్పసెట్టు మొదట్లకై నీడకు



కూకుండబెట్టి పిలగాడు ఒక్కడే ఊళ్లెకు పోయి కాసేపటికి తిరిగచ్చిండు. అటెనుక అతనెంట నేను నడిసి ఓ గుడిసె ముంగట ఆగినం. గుడిసె ముంగట పందిరి. పందిరికి సిక్కంగ తొవ్వకెళ్లి దడిగట్టి ఉన్నది.... ఇద్దరం పందిట్లకు బొయి నిలుసున్నం... పందిరి కిందంత సీకటి సీకటిగున్నది....పందిరి కింద మంచాల ఓ నడీడామె కునికిపాట్లు పడ్తంది.... ఆమె నా మొకంలకు అనుమానంగా సూసింది. పిలగాడు గోండు బాసల ఏందో సెప్పిండు. గుడిసె తలుపు తెరిసింది... మేమిద్దరం లోపటికి పోవడంతోటి తలుపు మూసింది. గుడిసెలోపట దీప మెలుగుల కాయిదాలు అడ్డదిడ్డంగ పరుసుకొని గంగయ్య ఏదో రాత్తండు. మమ్ముల్దిద్దరిని చూసి రాతాపి పిడికిలెత్తిండు. నేను పిడికిలెత్తి దండాలు సెప్పిన.

పిల్లవాడు నాకు గంగయ్యకు దండాలు జెప్పి ఎళ్లిపోయిండు....

గంగయ్య మళ్లీ కలం సేతులకు తీసుకొని నిట్టాడు కానుకొని ఏందో ఆలోశన జేసుకుంట "బయ్యక్క, కులాసే కద... మనం కలిసి చాలా రోజులయ్యింది గద.... చాలాదూరం నడిచివచ్చిండ్లు. ప్రయాణం బాగా సాగినట్టే గద....నాక్కొంచెం పని మిగిలిపోయింది. ఇంకో అర్ధగంట లోపల అయిపోవచ్చు. ఈ అవకాశం పోతే మళ్ళీ పురుసత్ దొరకదు... అంతదాక మీరు రెస్టు తీసుకోండ్లి.... అవసరమేమో.." అనేసి సంజాయిషిగ చిన్న నవ్వు నవ్వేసి తన పనిల బడిపోయిండు.

నేను గోడతీర్గ గట్టిన కొడిశె పొరుక తడుకకు ఒరిగిన. కాళ్ళు గుంజుక పోతన్నయి.... అరి పాదాలు మండుతన్నయ్. బొటిన వేలు ఉబ్బి సలుపుతంది... కండ్లు మూసు కున్నాను...

మనుసుల తిరిగీ లొల్లి.... ప్రాణహిత గంగ నీళ్ళు పారినట్టు, టేకుటాకుల మీదినుంచి ఈదురుగాలి తోలినట్టు.....దొర బంగుళ ముంగట మొట్టమొదటిసారి ఊలోల్లందరు ఊరేగింపు దీసినట్టు ఒక్కటే లొల్లి....గ లొల్లిలనుంచి రుక్కుబాయి తెగిపోని ఏడుపు... బిక్కు కామిండ్ల రోగపు మొకం....తప్పకండ్లు, దొడ్డు పెదువులు, కందుపండ్లు, సిప్పిరి సిప్పిరిగ పెరిగిన నెత్తి జుట్టు, మాసి తోళ్ళయిపోయిన ఒంటి బట్టలు... ఎవలాళ్ళు.....మాఅన్న....వద్దువద్దు.. గుళ్ళె పెట్టిన నైవేద్దెం ఎత్తుకపోతున్న తెల్లెంటికిల పిల్ల..... ఊరోల్లందరు తరుమంగ ఉరుకుతున్న పిల్ల..... మొగని గుద్దులకు బయపడు కుంట బయంబయంగా సూసుకుంట పక్కపక్క ఒదిగి ఒదిగి నడిసే అమ్మ...... తన తప్పగాళ్ళ కొడుక్కు రవ్వంత సంబురం కలిగించినతనికి తన దగ్గరున్నదే యివ్వ బోతూ...."తమరికంత సూడబుద్ధి గాకపోతె మొకంమీద గుడ్డేసుకోండ్లి" అంటన్న బురదల ఆడది... జిన్లింగ్ చేత సావదెబ్బలు దిని పారిపోతున్న పిల్ల... ఇయ్యన్నీ ఒకెత్తు.....పెయ్యంత దెబ్బలతో, సిరిగిన గుడ్డలతో ఊరోల్లంత తరుమంగ దిక్కుమొక్కు లేకుంట ఉరుకుతున్న బయ్యి......వద్దు వద్దంటే వద్దు......

నేనెన్నో కతలు సదివిన.......గ కతల్ల మనుషులంతా గుర్తే... నా కత సుత సదువదగ్గదేనా? కండ్లు తెరిచిన... గుండె లబడదిబడ కొట్టుకుంటంది... గొంతు


www.eTelangana.org

తడారిపోయింది. కాసిన్ని మంచినీళ్ళయితె బాగుండు.....నాకత..........గిది కొత్త గున్నది.......అతనింక ఏందో రాసుకుంటనే ఉన్నడు. ఏమి రాత్తుండవచ్చు? రిపోరటు కావచ్చు... మనుషుల మంచిసెడ్డలు... కొట్లాటలు, ఏడుపులు, శింతలు... అన్నీ అన్నీ కలగలిపి ముద్దజేసి... ఆ ముద్దలనుంచే నిచ్చవేందో బయటికి దీత్తడు గావచ్చు.....రిపోరట్లు... నేను మంచినీళ్ళకోసం లేత్తే అతనికి మనసు మరో పక్కకు పట్టచ్చు. ఇంకొంత సేపాగుతె అయిపోతది...

మళ్ళ కండ్లు మూసుకున్న......నేను నాకత రాత్తెగీత్తే ఎట్ల రాసుడోనని ఇసారం జేసిన......ఒకటెనుకటి......ఎనుకది ముంగట ముంగటిది ఎనుక.....అన్ని కలెగలిసిపోయి దారపుకండె తీర్గ సిక్కుబడి పోతన్నయి....కొట్లు, తిట్లు తప్ప సానా సంగతులు ఎందుసేతో మరుగునబడి పోయినయ్.....మొగిలిగాని పెండ్లాం మొకం, సావుకారి మొకం ఎంత యాదికి తెచ్చుకున్న గుర్తుకు రావటం లేదు.....అరరె! అప్పుడే అన్నీ అడుగునబడి పోతన్నయె! మారే గియ్యన్ని రాయటం కల్ల..కండ్లు తెరిచిన.

గంగన్న కాయిదాలు మలిసి పక్కకు బెట్టి బీడి ముట్టిచ్చి కాసేపు కండ్లు మూసుకొని కూకుండి నుదురు రుద్దుకొన్నడు. నేను మళ్ళ కండ్లు మూసుకున్న.......

"లే.......లే బయ్యక్క......" నన్ను కుదిపి, "అగో ఆమూల కుండలో నీళ్ళున్నాయి... కండ్లు కడుక్కోవడం మంచిది" అన్నాడు.

గంగన్న అప్పటికే కండ్లు కడుక్కొని లేచి నిలబడి గుడిసెల అటిటు తిరుగుతండు... చెయ్యెత్తు మనిషి, పెద్దమీసాలు... మొదట్ల తను గంగన్నను సూసినప్పుడు గంగన్న మొద్దుకుమొద్దు ఉండెటోడు.....గిప్పుడైతె బొక్కలు దేలినయ్.

నేను ఈడిగీలబడి లేచి చేతులు కాళ్ళు ఝాడిచ్చి కుండల నీళ్ళు ముంచుకొని గటగట తాగి మొకంమీద కొన్ని జల్లుకొని కొంగుతోటి తుడుసుకొని గంగన్న కెదురుగ కూకున్న.

గంగన్న మళ్ళ ఓ బీడి ముట్టించి "మన అసలు పరిస్థితేమిటో ముందుగ మనం చెప్పుకోవాలి.... ఇది మీకు బాగా తెలిసే ఉంటుంది... అయినా ఇదీ సంగతి" అని చిన్న చిన్న మాటల్ల ఇప్పటిదాక ఉన్నసంగతి, పోరాటాల సంగతి కొంచెం వివరంగనే చెప్పుకొచ్చిండు.... ఆ సంగతులన్ని నాకు తెలిసినవే అయినా బలాబలాల గురించి, మా ఎదుటివాళ్ళ గురించి నాకు దెలియనివి చాలా చెప్పుకచ్చిండు.

"ఇప్పుడు మనమేం చెయ్యాలె ననేటందుకు సూచనలు మీకు అందే ఉంటాయి. నువ్వు చర్చలలో పాల్గొన్నవా?"

"నాకు కొంచెం సమఝ్ చేసుకోవటం కట్టంగనే ఉన్నది" అన్న నసుగుతనే.

"కట్టమే, బాగసదువాలె......... రానురాను అదీ తొలిగిపొద్ది... అర్థంగానిది అడగచ్చు......." గంగన్న.



నేను కొన్ని సంగతులడిగిన... గంగన్న ఓపిగ్గ చెప్పుకొచ్చిండు.

"సరే! ఇప్పుడసలు సంగతికొద్దాం...ఈమధ్యన కొన్ని మార్పులు చేయవలసొచ్చింది ....మీరు ఇదివరకు చేస్తున్న పనికన్న మరింత బాధ్యత గలిగిన పని అప్పగించాలెనని డి.సి. నిర్ణయం.....మిమ్ములను ఆర్గనైజర్‌గ వేయాలనుకున్నం......మీకు మరో ఇద్దరు తోడుగ ఉంటరు. ముగ్గురు గలిసి యూనిట్‌గా ఉండాలి. నాయకత్వాన్ని కిందినుండి పైకి ఏర్పాటుచేయడం సాధ్యమైనంతవరకు మనం చేయాలె........." గిట్ల నేను చెయ్యవలసిన పనుల గురించి, తీసుకోవాల్సిన జాగర్తల గురించి, మరింక కొన్ని సంగతుల గురించి చెప్పుకచ్చిండు.

"కాని.....నాకీ పని పురాగ కొత్త......" అన్న తడబడుతు.

"అదేంగాదు.... నువ్వు మాకన్న బతకు గురించి బాగా తెలిసినదానివి.బతుకు వెనుక జరిగే క్రమానుగత మార్పులను సదువుకుంటే నువ్వే బాగ పనిజేత్తవు......"

"పెద్ద పరీచ్చే పెడుతండ్లు" అన్న సిన్నంగ నవ్వుకుంట....

"మనం గెలిచితీర్తం బయ్యక్క......." అన్నడు. సిత్రంగ అతని కండ్లు మెరుత్తన్నయ్.......

మరికొంతసేపటికి ఒక ముసలోడచ్చిండు. ముసలోడు ముంగట నడువంగ నేను ఎనుక నడిచిన. మళ్ళీ గదే అడివి....ఆకుల గలగల...తెల్లారేటాల్లకు మేము ఓ సిన్న పట్నం చేరుకున్నం.........

✳

## 2

మళ్ళ ఎరిగున్న తావులు.....నేను బయటకు పొయేటందుకు లేదు. ఆడి కొత్త సంగతుల గురించి నాకేమెరుక లేదు....... కొంతసేపు ఇంటామెతోటి మాట్లాడిన. ఇంటామె సన్నగా నాజూగ్గా ఉన్నది. ఆమెకు సంగతులేమన్న తెలుసునేమోనని అడుగుదామనుకున్న. ఎట్ల అడుగాలే? అదే సమఝ్ కాలే.....

వంకాయలు కోసుకుంట "ఇప్పుడెట్లున్నది ఎవారం?' అన్న ఉండబట్టలేక.

ఆమె పొయ్యి పొగలనుంచే నాకెళ్ళి సూసింది ఒక్కమారు....

"ఏ సంగతంటరు?"

"ఎన్ని సంగతులున్న యేమిటి?"

"సవాలచ్చ.........ట్రైకు పేలయ్యింది."


www.eTelangana.org

"ఎందుకెట్ల?"

చెప్పబోయి ఏదో గుర్తుకొచ్చిన దాని తీర్గ ఆగిపోయి నా మొకంలకు తటపటాయింపుగ సూసి నవ్వింది. అంటే లాభం లేదన్నమాట. అయినా చూద్దామని "పేర్లుగాదు నాగ్గావల్సింది జరిగిన సంగతి" అన్న.......

"నాకంత బాగెరుకలే......" అని తప్పిచ్చుకున్నది.

మరింక ఎవల నడుగాలె... ఇంటాయన రెండు దినాలదాక రాడని చెప్పింది

అట్లా ఒక దినం గడిసింది.... చెయ్యవలసిన పని గురించి ఇసారం జేసుకుంట పండుకున్న... నిదుర పట్టిందెప్పుడో! రాత్రి నన్ను లేపిండ్లు......నా మంచంపక్క ఓ పిలగాడు నిలుసున్నడు. కండ్లు నులుపుకొని లేసి కూకున్న.

ఇంటామె తన పనైపోయినట్టు ఆడినుంచి పోయింది. ఆ పిలగాడు దండంజెప్పి నిలుసున్నడు...

"కూకో కామ్రేడ్" అన్న......పిలగాడి మొకంలకు చూసిన... పిలగాడి మొకం ఎప్పుడో సూసినట్టే ఉన్నది. ఎక్కడ సూసినట్టు? ఎక్కడ?......... మరెక్కడ. ఆ కళ్ళు, చెంపలు, "పికిలీ" సంబురంగ అరిచిన.......పిలగాడి మొకంల రంగులు మారినయ్.

"నేను పికిలీ!.....బయ్యక్కను......" నాకు మరింక మాట పెకల లేదు. కండ్లల్ల గుబగుబ నీళ్ళూరినయ్. మీదపడి ఏడువాలనిపిచ్చింది..... అంతా అంతా చెప్పాల్నని పిచ్చింది.

పిలగాడు నోట మాటరాక బిత్తరిపోయి సూసుకుంట నిలుసున్నడు.

"ఔ పికిలీ......నేను బయ్యక్కనే.......మనం మళ్ళ కలుత్తమని... కలిసిన గిట్ల కలుత్తమని నేనెప్పుడు అనుకోలే." నా గొంతు పొడారిపోయింది.... అతన్ని పట్టి ఊపి మంచంమీద కూకుండబెట్టిన......

ఆ రాత్రంత ఒకల గురించి ఒకలం చెప్పుకున్నం. అన్నిటికన్న చిత్రమైన సంగతేమిటంటే పికిలి నాతో పనిజేయాల్సిన రెండవ మనిషి.

పికిలి ఎంతో మారిపోయిండు. మాటలో నిదానం... ఆచి తూచి మాట్లాడిండు. "నేనీంత కారం మింగేత్త బయ్యక్క" అన్న నా చిన్నారి పికిలికి ఈ పికిలికి ఎంత తేడ..... ఏడ పొల్లుమాట లేకుంట సదుకున్నోని తీర్గ ఇలవరిసెబెట్టి మాటెనుక మాట చెప్పబట్టిండు. మేము పనిచేయాల్సిన జాగలోని ఊళ్ళగురించి జనం గురించి చెప్పుకచ్చిండు.....

నేను మా వూళ్ళెనుంచి ఎల్లిపోయిన కాన్నుంచి ఎన్నెన్ని పుల్లెందులు బడ్డనో చెప్పుకచ్చిన. అంతా చెప్పుకచ్చినంక నాగురించే చెప్పుతన్న జనం గురించి చెప్పనేలేదని పిచ్చింది. పికిలి వినుకుంట కూకున్నడు........... పికిలి ఎంతదూరం నుంచి నడిసచ్చిండో?



ఇంటామెను లేపి చెప్పితే........ నేను ఆమెకు చెప్పడమేంది? మొత్తానికి బాగా అలిసిపోయి నట్టున్నడు. వింటూ వింటూనే మంచం చివర గోడకాని గుర్రుకొట్టవట్టిండు. పికిలిని సీదా మంచంమీద పండబెట్టి దుప్పటి కప్పుతె బాగుండుననిపిచ్చింది....... కాని లేత్తడేమొ?

నేను లేచి ఆగదిల అటిటు తిరుగుతున్న......... గోడలకు ఏమేమొ బొమ్మలు...... తనబ్బిలో ఎన్నో కితాబులున్నయి. అన్నిటిమీద చేతులుంచి రాసిన...... గుండె ఝుల్లు మన్నది. గీకితాబులల్ల ఎన్నెన్ని ఏడుపులు, కొట్టుకోల్లు, మొత్తుకోల్లు ఉన్నయో? ఎందరు మనుషులున్నరో? చేతికందిన కితాబొకటి తీసి తెరిచి చూసిన... అది ఇంగిలీషులున్నది. లోపట పిల్లి గడ్డపు మా గురువున్నడు...

నాకు పట్టరానంత కుషిగా ఉన్నది. ఇంటామెను లేపి లడలడ ఏదన్న సెప్పుతె బాగుండు.... "సూడు మేం తప్పక గెలుత్తం...దుఃఖం, దరిద్రం లేని లోకాన్ని గెలుసు కుంటం... అందరికి అన్ని ఉంటాయి. గ లోకంల నర్సయ్యలు, బయ్యి లుండరు.... దగాకోరు దొరలుండరు.." అని సెప్పాలనుకున్న........నాలోపల నేనే ఏందేందో పిచ్చిదాని తీర్గ మాట్లాడుకుంట ఆడికీడికి దిరిగిన... ఎంత తిరిగిన ఆగదిలో ఇంకా తరుగని దూరమున్నట్టే అన్పిచ్చింది.

నాకత సుత రాత్తే....... బిగుసుకపోయి వెనకకు సేతులానించుకొని గోడ కొరిగి నిలుచున్న...... ఎంతసేపు అట్లున్ననో... తలుపు సప్పుడు....ఉలిక్కిపడి తలుపుకాడికి నడిచిన. ఇంటామె వచ్చింది.

నేనే తలుపుతీసిన. దొడ్డు బట్టలుగల నడీడు మనిషి ఎదురుగ... తెల తెల వారుతోంది.... బజాట్ల నుంచి బొక్కటోపీలూపుకుంట బొగ్గుబాయిలకు గావచ్చు పనులకు బోతండ్లు... నీల్లపంపుకాడేమో ఆడోల్ల కీచులాట వినిపిత్తంది............

"రాండ్లి....." అన్నది నా వెనుకున్న ఇంటామె........

నేను పక్కకు జరిగిన... రాగిమీసాలు, నెత్తికి రుమాలు, కోలమొఖం....... నాకన్న ఈడుల పెద్దనేమొ...

తెల్లారినంక ముగ్గురం కూసుండి మేం పనిజేయాల్సిన ఊళ్ళగురించి మాట్లాడు కున్నం........ రైతు బతుకుగురించి బాగా దెలిసినోడు... ఎక్కడో మొదలేసి అంతా చెప్పు కొచ్చిండు. బూముల గురించి చెప్పుకొచ్చినప్పుడు గొంతుల సిత్రమైన సప్పుడు. కండ్లల్ల మెరుపు....

ఆఖరుగ నేనన్న..."మీ మాటలబట్టి నాకు తెలిసిందేమంటే ఊరూర ఇంతో అంతో జనం కదిలిండ్లు... సంగాలు బెట్టుకున్నరు....... జనం ఓ దిక్కు రోజురోజుకు కలిసిపోయి బలంగైపోతుంటే దొరలు వాళ్ళవాళ్ళ బలాలను పెంచుకుంటండ్లు... మరికొన్ని ఊళ్ళల్ల సంఘాలు బలంగైపోయి దొర కాళ్ళకింది నేల కదిలిపోతె ఆళ్ళు పోలీసోల్ల దెచ్చుకున్నరు..... ఈసారి మనోల్లకు; ఓదిక్కు దొరలతోని మరోదిక్కు పోలీసోల్లతోని లడాయి జేయాల్సి


www.eTelangana.org

వచ్చింది. దొరలతోనైతె మందిమి మనం ఎక్కువున్నంగన్క దోసి పోయింది. పోలీసోల్లతోనే తిప్పలచ్చింది. పోలీసోల్లు తుపాకులు ఎదురుబొచ్చెలకు తాకిచ్చి సత్తవా బతుకుతవా అని అడుగుతండ్లు.... గిందట్ల రొండు సంగతులు మనం ఎరిక జేసుకోవాలె...... ఒకటేమో లడాయిలకు దిగినంక గీ లడాయి పోను పోను దూరం పోతంది... గీ దూరాన్ని దొరలు ఆళ్ళ మనుషుల సంగతులు దెలుసుకొని ముంగటికి నడువాలె. అంటేందన్నమాట... రాసకీయం ఎరుకజేసుకోవాలె నన్నమాట...... రెండోది... మనం ఉత్తుత్తి మాటలతోని జేసే పనిగాదు గిది... తీగ గుంజుతె పొదంత కదులుతంది... గపొదల పుల్లు, గుడ్డేలుగులు, గుంటనక్కలే గాదు... తుపాకులు... నాగుబాము లున్నయి..... నాగబాముల గొట్టాల్నంటే కట్టె గావాలె.... అంటేందన్నమాట... మనం మనకున్నదేదో పట్టుకోవాలన్నమాట... అతారె అంటే దానికి కతుంటది........దాన్ని ఎట్ల గొట్టటం? ఎట్ల పట్టుకోవుటం? ఎవల్ని గొట్టటం? ఎప్పుడు గొట్టటం?......" నేను ఇట్ల చెప్పుకచ్చిన.

పికిలి నోరెల్లబెట్టి ఇన్నడు. రైతు మెచ్చుకోలుగా సూసిండు.......

ఆనాడు రాత్రి మేం ముగ్గురం మా మా పనుల్లకు ఎల్లిపోయినం....

✳

# 3

అట్లిట్ల నెల గడిసిపోయింది.... మొసెల్లకుంట పనులు....... ఒక దిక్కు సంగాలను నిలబెట్టుకొంటనే మరోపక్క మరింత పదనెక్కాలె.. రెండో పక్క దొరలు అందినకాడికి చేత్తనే ఉన్నరు...... సంగపోల్లు పనులు బందుబెత్తె దొరలు సేతలే బందు బెట్టుకున్నరు. అట్ల ఊకున్నరా, అప్పులు కక్కుమంటరు. రెండో పక్క సంఘపోల్లు పంచాతులల్ల దొరలు దిగమింగిన రొక్కం కక్కుమంటరు..... దొరలు పోలీసుల దెత్తరు.... ఆళ్లు ఎవడెవడు సంగంల నిలుసున్నడో అన్నేరి కేసులు, కొట్లు మొదలు బెట్టిండ్లు......ఈ గడబిడల మజ్జెన కొన్నూల్లల్ల సంగాలు లోపట పనిజెయ్యవలసత్తె మరికొన్ని జాగల్లకు కొత్తగ పాకినయ్..... గీ సంఘాలన్నిటిని గట్టిగ జెయ్యాలె... అంటె రాజకీయాలు జెప్పాలె... అంటె పారిటిని జనంల నిర్మించాలె.... నాకైతే ఈనెల దినాలు ఊళ్లు దిర్గడం... అందరితోని కలవడం వరకే సరిపోయింది........

నెల తరువాత ఓ ఊళ్ళె ముగ్గురం కలుసుకోవాలనుకున్నం.....ముందుగ నేనెళ్ళిన.... ఆ ఊళ్లె ఓ సంగతి సంగం ముంగటికచ్చింది. అదేందంటే కలాలిహన్రాజు....ఆ ఊళ్లె అయిదు నూర్లకు పైన్నే తాళ్లున్నయి....సంగం లేకముందు దొరే వాటి హన్రాజు పాడుకచ్చెటోడు. గీసెటోళ్లు మాత్రం గౌండ్లోల్లె. కల్లమ్ముకునుడు గౌండ్లోల్లె. సెట్టుకు నూర్రూపాలు దొరకు గట్టాలె... అంతటితోనే అయిపోలే... దొరకు రోజు ఉల్ఫారోజు కల్లు యివ్వాలె... అదిబోను సుట్టాలు పక్కాలచ్చినప్పుడు ఎంతంటె అంత కల్లు ఉల్ఫగనే



పొయ్యాలె.... అంటె ఓ దిక్కు గౌండ్లొల్లకు మిగిలేది రెక్కల కట్టమే... తాగిటోల్లకు రూపాయిబెడితె గొంతు తడిసేదిగాదు.......ఆ ఊళ్లె పావుల మందం గౌండ్లోల్లె ఉన్నరు.

నేను పోయెటాల్లకు తాళ్ళల్ల కమ్మల గుడిశెల సిన ఈరయ్య ఎదురుసూత్తండు. అయినె సంగం పెద్ద సుత.......

"ఊళ్లె మన సంగంలున్న ముఖ్యులను ఈడికి తీసుకత్తవా?" అన్న......

"ముఖ్యులంటె రైతులున్నరు. కూలోల్లున్నరు, గౌండ్లోలున్నరు. గిది గౌండ్లోల్ల ఎవారం గద" అని నసికిండు.....

"అదేంగాదు. గిది అందరికి పట్టున్న సంగతే. సెట్టు గీసేది గౌండ్లోలే అయినా తాగేది ఊళ్ళోలందరు గదా!"

"నిచ్చమే ననుకోండ్లి... గని ఆళ్ళంత ఒప్పుకుంటర"

"ఏదొప్పుకోరు!"

"హన్రాజు గౌండ్లోల్లె పాడ్తనంటె..."

"హన్రాజు సంగతి అటెంక... మంచికో సెడ్డకో సంగమంటు బెట్టుకున్నం గద... ఎవలకేదచ్చిన సంగం ముంగట బడ్తందిగద.......మంచైనా చెడ్డయినా ఊళ్లె జరిగే సంగతేదున్నా అందరు ఇసారం జేసి గిది సై అంటెనే సై అయితది."

"సరే తీసుకత్త........నేనచ్చేదనుక కూకోండ్లి........" చీకట్ల కలిసిపోయిండు సిన ఈరయ్య.

మండువ బోసిగున్నది.. ఎవడో కమ్మల గుడిసె బయటినుంచి నత్తి నత్తిగా పాడుకుంట పోతండు.......

తాళ్ళల్లనుంచి ఎవలసందాల వాళ్ళే ఒక్కొక్కలే కమ్మలగుడిసెకు చేరుతండ్లు.

అందరచ్చినంక గుడిసెల సిన్నకందీన బెట్టిండ్లు...... గుడిసె ముంగట అడ్ల ఎంకయ్య గొంగడి ముసుగబెట్టుకొని కూకున్నడు... పది గజాల దూరంల ఖాళీ కల్లులొట్లు బెట్టుకొని కత్తులు నూరుకుంట ఇంకో గౌండ్లాయన నిలుసున్నడు.....

"ఈ ఏడాది హన్రాజు దినాలత్తన్నయి... మీ కెరికేగద" అన్న నేను....

"ఔ నిచ్చమే......." అన్నడు ఓ రైతు......

"ఏం భాగ్గెం..... నీతల్లి కూసంత గొంతికె తడుపుకుందామంటె కల్లు తాడిమీదెక్కి కూకున్నది. మందలియ్య వశంగాదు" అన్నడు ఓ కుమ్మరాయన...

"గౌండ్లోడు మాత్రం గందట్ల తిన్నదేముండె... ఊరును గొట్టి ఉపారం బెట్టినట్టున్నది పనివరుస" ఓ గౌండ్లాయన.........

"పోనీ దీనికేదన్న ఉపాయమున్నద" అన్న నేను.......


www.eTelangana.org

"ఉపాయ మేమున్నది. పట్టుమంటె కప్పకు కోపం... ఇడువ్‌మంటె పాముకు కోపం," అడ్ల ఎంకయ్య గునిసిండు....

"కల్లయిపోయిందయ్య........" కత్తులు నూరుతున్న గౌండ్లాయన పెద్దగా అరిచిండు....

"నాకు కల్లుగాదు ఈరన్న గావాలె..." అంటండు వచ్చిన మనిషి...

"ఈరన్నెవడు. ఈరన్నెరుకలే... గారన్నెరుకలే...ఊళ్ళెకు బోయిండ్లు గౌండ్లోల్లంత" అన్నడు గౌండ్లాయన...

ఈరయ్య వచ్చినతన్ని గుర్తుపట్టి "మనోడె...మనోడె" అన్నడు.........

వచ్చినోడు పికిలి.

మళ్ళా తర్జన భర్జనలు.......

"పోనీ నాకోటి దోత్తంది సెప్పమంటారా?" నేను......

"చెప్పండ్లి........" ఎంకయ్య.

"ఈపారి హర్రాజు సంగం బడ్తది....హర్రాజు పైకం ఇంటి కింత జమజేత్తాము... తక్కువకు పాడుదాం.... సర్కారుకు బైటకు తక్కువ బడ్తదిగన్క కల్లు సుత తక్కువకు అమ్మచ్చు, ఏమంటరు" అన్న నేను.......

"మంచి మాటె మరి దొరోడు అడ్డమత్తెనో" ఈరయ్య......

"అత్తె గీసెటోల్లం మనమా! ఆడా!"

"గీసెటోల్ల దెచ్చుకుంటడు."

"గీసెటోల్ల దెచ్చుకుంటడుగని... తాగెటోల్ల దెచ్చుకోడు గదా?"

"పక్కోల్లకు గొంటబోతడు......."

"అంతవరదనుక సంఘం సేతులు ముంగట బెట్టుకొని కూసుంటదా?" గౌండ్లాయన.......

"మనండ్లమాట ఏం జేత్తమోంట?" ఎంకయ్య.......

"మొగులు కోసేత్తం....... అచ్చినోల్లకు కడుపుల తలబెట్టి గీ సంగతి జెప్పతం... పక్కోల్లకు ఎట్ల గొంటపోతడో సూత్తం...." ఇందాకటి గౌండ్లాయనే.

మొత్తానికి హర్రాజు సంగం పాడటానికి నిశ్చయమైంది. ఎటోల్లటు వెళ్ళి పోయిండ్లు....

గౌండ్ల చిన ఈరయ్య మాకిద్దరికి అన్నం దెప్పిచ్చిండు.......తను పది గజాల దూరంల నెగడికాడ కూకున్నడు.

నెల తరువాత మళ్ళ ఇదే పికిలిని కలుసుకోవటం. ఇంక రైతు రానేలేదు.



వాళ్ళంత పోయిన తరువాత పికిలి ఏదేదో చెప్పకచ్చిండు. మొత్తానికి బలే సంబురంగున్నడు.....

"బయ్యక్క నేనో కత రాసిన" అన్నడు ఉన్నట్టుండి.

"అది కూడ షురువు జేసిన వన్నమాట... కతలు రాసుడంటె కారం గటుక మెక్కినట్టనుకుంటన్నవ" అన్నాన్నేను......

"నిచ్చంగనే బయ్యక్క......."

"సదువెక్కడ నేర్తివి......కతలెప్పుడు రాత్తివి" అన్న, ఏదో కాకమ్మ కతలాంటిది రాసుంటడులే అనుకొని.

"కాదు నువ్వింటవా?" అన్నడు.....

అదేదో పెద్ద తతంగమే అనుకున్న... గుడ్డిలాంతరు వెలుగులో పికిలి మొఖంలకు చూసిన... అలాంటి తెగింపేదో చేసినట్టుగనే ఉన్నడు...... "రాసేటోడే సదివి వినిపిత్తనంటె ఇనేటందుకు నాకేం ఫికరు... సరే కానియ్యి" అన్నాను.

పికిలి సిగ్గుపడ్డాడు.......బాగా మాసిపోయిన కాయిదాలేవో బయటికి తీసిండు. నాకు'ఆటకోయిల' తనంగానే ఉన్నదింక... ఏమి రాత్తడు పికిలి... పోరాటాలని కావచ్చు.......

"మంచిదే....... 'మన పోరాటాల గురించి... జనం గురించి రాయల్నంటే మనమే రాసుకోవాలె'... నని మన పెద్దన్న చెప్పెటోడు..." అని, "అట్ల చైనలెక్కన్నో బిచ్చగాళ్ళు రాసిండ్లట" అన్నాను...

పికిలి గొంతు సరిచేసుకొని... మళ్ళ సంశయంగ నా మొకంలకు చూసి చదువబోయిండు...

ఇంతట్లకే నెగడుదగ్గర మాటలు... పికిలి కాయిదాలు దాసేసిండు...

ఈరయ్య లోపటికచ్చిండు. రైతచ్చినట్టు చెప్పిండు. ఈరయ్య ఎనుక రైతు వచ్చేసిండు...

"ఎంకట్రావు పల్లెల షికం దున్నిన... సంగపోల్లను పోలీసోల్లచ్చి అరెట్టు సేసిండ్లు... ఊళ్ళోళ్ళు... పక్క నాలుగూళ్ళోల్లు అట్ల గ షికం కాడి కురికచ్చిండ్లు. పోలీసోల్ల మోటరను గిరేసుకున్నరు... గీరెల్ల గాలి తీసేసిండ్లు.... పోలీసోల్లను అరెట్టు జనం సేసిండ్లు... నాత్రిదనుక ఎవలు కదలలే... జిల్లనుంచి పెద్దోడచ్చి అరెట్టుజేసిన సంగపోల్ల నిడిసిపెట్టి పోలీసోల్ల ఇడిపిచ్చుక పోయిండు..జనం సంబురపడి ఇండ్లకు జేరుకొన్న నాత్రే మంచి మంచోల్ల రాత్రికి రాత్రి పట్టుకపోయిండ్లు పోలీసులు... గదీ సంగతి" అని గుక్క తిప్పకోకుండ చెప్పిండు...

మొత్తానికి పికిలి కత అట్లనే ఉండిపోయింది.

✳


www.eTelangana.org

# 4

ఆరం దినాలకు పికిలిని సావదెబ్బలు గొట్టిండ్లని వార్తచ్చింది. నా మనసు సుమ్మర్లు సుట్టుకపోయింది.. ఎట్లా కలవడం పికిలిని? ఆదరబాదరగా వార్త తెచ్చిన మనిషితో వెళ్ళిన...మేము పోయేటాల్లకు పికిలిని దవాఖానకు తీసుకపోయిండ్లని తెలిసింది... దవాఖానకు ఎట్లా పోవాలె? చేసేదేమిలేక దవాఖానకు మనిషిని పంపిచ్చిన... నాకు పికిలి తల్లిదండ్రులు యాదికొచ్చిండ్లు..

మొత్తానికి నేను పికిలిని గలిసెటాల్లకు మరో పది దినాలయ్యింది- దెబ్బల పుండ్లు పక్కు గట్టినయ్. ఒళ్ళంతా పునికి సూసిన.

"తమ్మీ... తమ్మీ ఎట్లా జరిగింది?"

"ఏం గాలేదక్క....ఆవూల్లె సంగం బెడుదామని సానొద్దులనుంచి తిరుగుతున్న... ఆళ్ళూల్లె తురకదొరోడు... ఎవలు ముందుకు రావడంలేదు భయపడి. ఓ నాతకాని రైతు దొరోనిదగ్గర పదేండ్ల కింద ఇన్నూరో మున్నూర్లో అప్పు తీసుకున్నడట. అడ్డీ అసలు యిచ్చినంక సుత రైతు అయిదెకురాల సేను రైతుకియ్యనే లేదు. సరే ఏడనో ఓకాడ మొదలుబెట్టాలెగన్క, నాతకాని రైతు నిలబడ్తనన్నడుగన్క బూమి దున్నిచ్చిన నేను గెట్టుమీద నిలుసున్న... మొదుగాలు సుంకరోడచ్చిండు... 'దొర తమరిని రమ్మంటడని.' నాతకాని రైతు నీళ్ళు మింగిండు. నేనన్న... 'తగాద భూమికోసం జరిగింది. తీటుంటే మీదొరనే ఈడికి రమ్మనుపో' అన్న... మళ్ళ నాగలి సాగింది. ఈసారి ఆడు, ఆని బలగమచ్చింది... మాట ముచ్చెట లేకుంటనే కొట్టబట్టిండ్లు... సరే మరింక సేసే దేమున్నది? కొట్టుకుంట ఊళ్ళెకు దీసుకపోయిండ్లు.... ఆనింటి ముంగట ఏపసెట్టుకు కట్టేసిండ్లు. జనమంత ఆడ కుప్పకూడిండ్లు."

"నిన్నట్ల కొడ్తుంటె జనం ఏమనలేదా...."

"ఏమంటరు.......కడుపుల్ల కసున్న బయటికిరాలే...కత్తిరిచ్చిన గడ్డం గళ్ళలుంగి దొరోడచ్చిండు...'మా వూళ్ళెకు నీకి రావటాన్కి ఎన్ని దమ్ములుబే...నీ పేరేందిబే' అన్నడు వాడు..... 'నువ్వు గీడకూడిన పేదోల్లను దోసుకుంటన్నంత కాలం నేను తప్పకత్త... నేను కాకుంటె ఈన్నే పుడుతడు' అన్న నేను...'పిట్ట కొంచెం కూత ఘనం ఉన్నది...నీ పేరేందిబే' అన్నడు వాడు .......మందిలెవలో 'అయినె పేరు రామలింగు, అయితారంపేట దొర!' అన్నడు....'ఔరా నీ పేరదేనా?' అన్నడు. ఔనన్నట్లు తలూపిన..."

"నీకి నేను రామడనుకుంటన్న బతికిపోయినవ్ పో...." అని కట్లిపిచ్చి "సూసిండ్లా సంగెం గింగమని ఎగిరిండ్లో నా తడాఖా" అన్నడు జనాన్నుద్దేశించి.

"అట్ల ఒంటరిగ పోవటం మంచిదేనా పికిలి" అన్న నేను...

"మరెట్లనక్క?" అన్నడు పికిలి....



"నిన్న మల్ల బొయిన...నాతకాని రైతు ఇంటికి దీసుకపోయిండు. అంద రచ్చిండ్లు...నా పెయ్యంత పునికి సూసిండ్లు. సంగం బెట్టినం...."

"ఎట్లెట్ల?"

"ఎట్లేంది... ఈపారి ఊరు ఊరంత గలిసి నాతకానిరైతు సెలుకల కచ్చిండ్లు. సెలుక దున్నిండ్లు..." పికిలి కండ్లు మెరుత్తన్నయ్...

ఆమాట ఈమాట అయిపోయినంక నాకు పికిలి కత గుర్తొచ్చింది....

"పికిలీ కత రాసిన్నంటివి గదా?" అన్న నేను.

"అద్దులే అక్క....ఏమంత మంచిగా రాయలె" అన్నడు...

"మంచో సెడ్డో దాండ్ల నీకెట్ల తెలుత్తది... నీ దగ్గెరది ఉన్నదా" అన్న.

పికిలి సిగ్గుపడుకుంటనే సంచిలనుంచి కాయిదాలు తీసిండు... సన్నని గొంతుతో సదువసాగిండు.

మొదట్ట మొదటనే నా పేరు. ఉలిక్కిపడ్డ.......

పికిలి వంచిన తలెత్తకుంట ఆదరబాదరగా మొదలుపెట్టి చదువసాగిండు.

బయక్క యాదికత్తె రోమాలు నిక్కపొడుత్తయి, ఏడుపు ముంచుకత్తది. బయ్యక్కకు నాకు ఎప్పుడనంగ దోస్తానీ అయినదో నాకిప్పుడు సరిగ యాదికిలేదు. కాని బయ్యక్కతోటి నేను ఆడుకున్న దినాలు నా కిప్పటికీ ఇప్పుడిప్పుడే జరుగుతున్నట్టుగా ఉంటది.

బయ్యక్క నాకెన్నో శాత్రాలు చెప్పేది. బయ్యక్కవాళ్ళకు రెండెకురాల సేనుండేది. గ సేను మా సేను పక్కన్నే. చేన్ల కావలికోసం బయ్యక్క నేను కలిసే పోయెటోల్లం. నాకు దోసకాయలు ఎనుకులాడిచ్చేది. అటుకులు కాపిపెట్టేది. తన పక్కల పండబెట్టుకొని చిత్రంగ కండ్లు తిప్పుకుంట కతలు సెప్పుకచ్చేది. ఆ కతల్ల ఓ దేవకనిక ఉండేది. ఆమె సాన నియ్యతి తోటి బతుకుతుంటె రాచ్చాసులు ఆమె మీదబడి నానా హంగామా సేసేటోళ్లు. ఆ దేవకనిక సిట్టసివరకు కొట్లాడి కొట్లాడి రాకాసుల సేతుల్ల సావడంతోటి కత ఆఖరయ్యేది .... అప్పటికి బయ్యక్క సెంపలమీన కన్నీళ్లు సారికలు గట్టేవి.... ఎటో సూసుకుంట ఎక్కెక్కిపడి ఏడ్చేది.......

బయ్యక్కకు ఎన్నో పదాలచ్చు. ఆమె పదం పాడ్తుంటె నా కెందుకనో బయ్యక్క ఒళ్ళె తలబెట్టుకొని ఎక్కెక్కి ఏడువాలనిపిచ్చేది. పాడంగ పాడంగనే ఆమె గొంతిక జీరబోయేది. మరింక పాడలేక ఎక్కిళ్ళతోటి నన్ను మరింత బిగ్గెరగ అలుముకునేది.

బయ్యక్కకు పసువుల సంగతి పిట్టల సంగతి బాగ తెలుసు. ఆమె కెందుకనో పైడికంటె అంటె సానయిట్టం. నా కొకసారి సింత బొర్రెల బిక్కుబిక్కు మనుకుంట ఒంటిగ బయంబయంగ సూసుకుంట కూసున్న పైడికంటెను సూపెట్టింది. దాని మొకంలున్న గుడ్లు సూసి నాకు బయమయ్యింది.


www.eTelangana.org

బయ్యక్క గురించి మావూళ్ళె సానామంది సాన తీర్గ చెప్పుకునేటోల్లు. మా అవ్వ నన్ను బయ్యక్క దగ్గెరికి పోవద్దని ఎన్నో పారీలు కొట్టింది.

"ఏం ఎందుకు పోవద్దు? బయ్యక్క నాకు బువ్వ తినిపిత్తది. శాత్రాలు సెప్పుతది... పదాలు నేర్పుతది... బయ్యక్క సానా మంచిది" నేను.

"అది గడుసు లం......" అని నన్ను బజాట్లకు తరిమేది.

అప్పట్ల గ మాటంటేందో నాకు ఎరికయ్యేది గాదు కని గదే మాటను సానమంది బయ్యక్క ముంగటనే అనంగ నేను సానా పారీలు విన్న. కాని ఒక్కపారన్న బయ్యక్క గ మాటను పట్టించుకున్నట్టు కనిపిచ్చేది గాదు. నాపేరు ఏదో పిట్ట పేరు బెట్టి "పికిలెంక" అని పిలిచేది.

నేనోపారి అన్న "బయ్యక్క నిన్నెవలన్న లంజ అంటె సూస్కో ఆళ్ళ పుర్రె బలుగ్గొడత" అని.....

"నా తమ్మీ....... నాతంద్రీ" నేను ఉక్కిరిబిక్కిరి అయ్యేటట్టు ముద్దులాడేది.

"గట్లంటేందక్కా...." ఓపారి నేను.

"పికిలెంకా... నీ కెందుకియ్యన్ని.....? నువ్వు బయ్యక్కని పిలుత్తన్నవ్ సాలు......." ఇట్టం లేనట్టు సూసింది.

"నాకు సెప్పకుంటె....సూడు నేను గింత కారం మింగేత్త..." కారం ముద్ద తీసుకున్న.

"అద్దు....అద్దు తమ్మీ..... నా బంగారికొండ సెప్పుత సెప్పుతరా..."

"మరైతె జెప్పన చెప్పు...." మంచె కిందికి దిగి....

"నీతోని సావచ్చెటట్టున్నది....ఎట్ల సెప్పాలె... మా అవ్వ ఎప్పుడనంగనో ఎవలనో పట్టుకపోయిందట... మరందుసేత మాకు కులం లేదు."

"అంత ఉత్తది....నువ్వవద్దం సెప్పుతన్నవ్...."

"కాదు...కాదు.......గందుకనే మా గుడిసె ఊరవతల... నాకు పెండ్లిగాదు. ఎవడో ఒక గాడ్దెకొడుకు నా దగ్గెర కత్తడు"

"నా కెరకలే...కారం మింగుతున్న......."

"ఎట్ల జెప్పాలె పికిలి?"......గునిసింది.......

"నాతోడు... నీతోడు పికిలి...." నేను నమ్మిన గప్పుడు.

నాకిందట్ల ఒక్క ముక్కన్నా తెలువలేదు.



బయ్యక్క సేతల గురించి సెప్పుకత్తన్ననే గని... బయ్యక్కెట్లుంటదో సెప్పనేలేదు. బయ్యక్క సామనచాయగా ఎత్తుగ ఉండేది. కోలమొకం, వాలుసిక.

సికల ఎప్పుడు ఏదో పువ్వు బెట్టుకునేది. నల్లగ గిడుసబారిన పెదువులు... గుండ్రటి కండ్లు... కంది పండ్లు... మనిషెప్పుడు ఉతికిన గుడ్డతీర్గ తేటగుండేది. అరిపాదాలు మాత్రం నెర్రెలుబాసి సీరుకపోయి ఉండేవి. బొడ్లె ఎప్పుడు బాగా మాగిన బట్టసంచి ఉండేవి. గ సంచిల బీడికట్ట, అగ్గిపెటె తయారుగుండేవి. బయ్యక్క బీడి తాగటం సూడాల్సిందే. ముక్కుల్లనుంచి పొగ బలే గమ్మత్తుగ తీసేది. పొగను మింగి పొగనోరు తోటే మాట్లాడేది. అప్పుడప్పుడు పొగాకు నమిలి చిత్రంగా పండ్ల సందుల్ల నుంచి ఊంచేది.

బయ్యక్క అప్పుడప్పుడు బాగా అలిసిపోయి తలెంటికలు ఇరబోసుకొని సొలుక్కుంట చేండ్లకచ్చేది. ఆమె నోట్లెనుంచి సారా ఆసన గప్పునచ్చేది. గప్పుడు కలల మాట్లాడుతున్నట్టుగ - కొత్తమనిషి తీర్గ మాట్లాడేది.. గట్లచ్చిన బయ్యక్కను సూత్తె నాకు చెప్పరానంత బయమయ్యేది...బయ్యక్క ఏందేదో పాడుమాటలు తిట్టుకుంట మట్టి పెళ్ళలు ఇసిరేది. నేను దూరంగ ఉరికెటోన్ని... నేను గిన దొరకితినా! నన్ను గట్టిగ అలుముకొని గప్పున ఆసనగొట్టంగ ముద్దులాడేది.

"పికిలీ నువ్వు నన్ను పెండ్లాడ్తవా? మొగకుక్కల కొడుకు లందరికి నేను గావాలె... ఆకుతూ....మీ పుటుకు గాల... మీ ముండ మొయ్య... తొందురు బాలిగానికి, పిట్టగాళ్ళ మొండోనికి, కుట్టాది రాయలింగనికి, మొగిలిగానికి... అందరు లం....కొడుకులకు నేనే గావాలె... కని నన్నెవడు సేసుకోడట... నేను లంజను... పికిలీ నువ్వయిన చెప్పు, నన్నెవడు గిట్ల సేసింది? నాకు కులం లేదు. కులంలేని దానితోని కులికే మొగ బాడుకావ్ గాళ్ళందరికి భారీ భారీ కులాలున్నయ్... ఒరే పికిలెంకా! నా మొగడా! నన్ను నువ్వన్న సేసుకోరాదుర..." గట్ల అంతుపొంతు లేకుంట తిట్టి వదిరి వదిరి కీసుగొంతికతోని లెల్లాయి పదాలు పాడి పాడి అటెన్క చప్పగ సల్లారిపోయి ఎటు సాతకాక ఏడ్సేది...

ఏ సందెలు బడేటాల్లకో నిష దిగిపోయేది.......గప్పుడు రయికిప్పి రక్కులు, పండ్ల గావులు నాకు సూపెట్టేది...

"అక్కా! ఏడువకక్కా! నేను నల్లాలం బండమీన దంచి పెత్త... అవే పోతయి."

"గియి మనిషి గావులు తమ్మి.... మానేవిగావు.... నా తమ్మీ, పాపిట్టి దాన్ని నిన్ను బెదురగొట్టిన. మళ్ళెప్పుడు గిట్ల సెయ్య... సరేన..." నన్ను ముద్దిచ్చుకొని గ సంగతి మరిపిచ్చి కత సెప్పేది.

బయ్యక్క గురించి గిట్ల ఎన్నైన సెప్పచ్చు.

నేను ఎప్పుడన్న కనిపియ్యకపోతె పిచ్చిదానితీర్గ నాకోసం ఎతుకులాడేది. మా అవ్వ తిడ్తన్న లెక్క సెయ్యకుంటా నన్ను తనెంట పిలుసుక పొయ్యేది.


www.eTelangana.org

"పికిలీ! నాకేమున్నది తమ్మీ బతకడానికి? నే నందరికి గావాలె నా మాటెవడింటడు.........? నువ్వంటె సిన్నపిల్లగానివి. నేను జెప్పేటియన్ని ఇంటవ్......." అట్ల నడిర్ఘాము తిరిగిపొయ్యేదాక వోట్లె కూసుండబెట్టుకొని మెరిసే సుక్కల దిక్కు సూసుకుంట... తన చిన్నతనం... మరాఠి దేశంల ఎట్ల గడిసిపోయిందో సెప్పుకచ్చేది....నాకు అప్పుడప్పుడు కొన్ని మరాఠి మాటలు నేర్పేది.

వాళ్ళ అవ్వ గూని ముసల్ది... దాన్ని సూత్తేనే నాకు భయం. దాని తలకాయ కాళ్ళ దగ్గరుండేది. నడుము బాగా అంగిపోయుండేది. ఒకటి మెంట కన్ను... ఎత్తుపండ్లు. అదెప్పుడు నశం బీర్సుకుంట కనిపించేది. పొవాకుకోసం అచ్చెపోయేటోల్లను ఆపి అడుగుతుండేది. ఎవడు దానికి పొవాకు బెట్టంగ నేను చూడనేలేదు. అయినా అది ఆశగా తొవ్వొంట చూసుకుంట అచ్చెపోయేటోల్లను అడుగుతనే ఉండేది. పొవాకు పెట్టకపోతె మానెగని ఆళ్ళు కండ్లు అదోతీరుగ ఎగిరేసి దొంగనవ్వులు నవ్వుకుంట... "నీ బిడ్డ సంపాయిత్తలేదా?" అనుకుంట పోయెటోల్లు...

ముసల్దానికికూడ సాన శాత్రాలు అచ్చేటట్టే కనిపిచ్చేది. అది నశెం జమాంచి ఎక్కిచ్చినప్పుడు కాళ్లు బారజాపి కూకుండి ఎటో చూసుకుంట గొణిగేది. ఎవలన్న తన మాట లింటన్నరా లేదా అని సూడకుంటనే దాని సందాల అదే చెప్పుకపోయేది...

"ఆ కాలం బంగారికాలం... నా సవితి కొడుకులు నన్ను ఊళ్ళేనుంచి తరిమేసిండ్లు... సచ్చే లోకానున్నడో మారాజు నన్ను సేరదీసిండు. గ దెవుసాలు మళ్ళత్తయా? ఎంత సుకపెట్టిండు. ఇద్దరం సద్దులు గట్టుకొని పత్తేర బోయెటోల్లం. పెద్ద గంపల బయ్యిని పండబెట్టి కూసంత నల్లమందేసిన్నంటే పొద్దుగూకె దన్క కుయిక్కు మనక పొయ్యేది! సచ్చే లోకానున్నడో ఆళ్ళ కట్టం సూసిండా సుకం సూసిండా? మారాజు తీర్గ ఎల్లిపోయిండు. పుట్టినూరు కగ్గి దల్గ గీడికత్తె గీడ గీ బాగోతం"... గిట్ల పొద్దంత గులుకుతుండేది.

బయ్యక్కకు ఒక అన్న ఉన్నడు. అతని పేరు నర్సయ్య. ఆనెగాళ్ళు... ఎప్పుడు గడ్డం బెరిగి మనిషి సీదర సీదర గుండెటోడు. కండ్లు తాగినోని కండ్ల తీరుగుండేయి. పెయ్యంత మట్టిగొట్టుకపోయి అప్పుడే దుబ్బలనుంచి లేసచ్చిన కుక్క తీరు. మాట్లాడ్తె కరిసినట్టే.... పింజెలకు పింజెలు పొగాకు నములుకుంట తుప్పతుప్ప ఊసుకుంట, ముసలి దున్నపోతులతోని ఎడతెగని ముచ్చెట్లు బెట్టుకొంట రాత్రిపగలనక ఒంటిగ తిరిగెటోడు. ఎప్పుడో మనసు బడ్డప్పుడు గుడిసెకచ్చెటోడు...నిలబడే గడుక ముద్దలు మింగి నిలబడి నిలబడే నిద్రపోయెటోడు. ఎప్పుడో తెలివొచ్చినపుడు తల్లి, సెల్లె అని సూడకుంట ఎటుబడితే అటే వదిరెటోడు. గ తిట్లు ఎవలను తిడుతండో సచ్చినా తెలిసేదిగాదు. "కుక్కలు బంచత్.....పందులు తూ౼ పందులు నయ్యేం.... కుక్కలతీర్గ పన్నరు లంజెలు... ఓసి సుప్పనాతి లంజెకానా నన్నెందుకు గన్నవే... నర్సడు గడ్డం ముదిరి... సెత్త మురిగి అక్కెరకు రాకుంట పోతడు బంచత్... పన్జేసి పన్జేసి సీకి పోతడు... కులంలేని నర్సనికి పెండ్లాం దొరకది- దొంగలంజ కొడుకుల్లాలా నన్నడు గుండ్లి...



నన్నడుగుతె ఎవడు సొక్కప్పొసోంట... ఎవడోంట... లంజెకానా! ఊళ్ళె లంజకొడుకుల కుక్కలజేసి నీసుట్టు తింపుకుంటున్నవ్... పురుగులుబడి సత్తవే ముండ.... నువ్వాడి దానివి..." చేతులున్న కట్టెతోని పిచ్చోని తీర్గ నేలమీద కొట్టెటోడు... మళ్ళా కుక్క మొరిగినట్టు... నాభి పెకిలి పోయినట్టు తిట్లు, మాటలు....

బయ్యక్క మాట్లాడకుండ నర్సయ్య ఒంటికేసి చూసుకుంట కూసుండేది. ఏదన్న మాట్లాడిందో బస్. మోటు సేతులతోని దబడ దిబడ గుద్ది... కాళ్ళెగురేసుకుంట ఎవలో ఎంటబడి తరుముతున్నట్లుగ సీకట్ల గలిసి ఎటో పోయెటోడు.... ముసల్ది "నర్సని కాడు గాల్తది... ఆడు మనిషిగాదు" అని కాండ్రకిచ్చి ఊంచేది.

ఊళ్ళోలందరు నర్సయ్యను 'కాడు దున్నపోతు' అనేటోళ్ళు.

"పికిలీ మా అన్నను సూత్తన్నవ్గద. ఆడు మనిషే... ఆనికి సీము నెత్తురున్నయి. గ నెత్తురు మురిగిపోయింది, కంపాసన గొడ్తంది. ఎవలు పికిలీ ఆన్ని అట్లా మురుగ గొట్టింది? ఎవలు? ఎవలో ఆని కెర్కలే... గ కోపం గందుకే... కని గ కోపం ఎవలమీన సూపెట్టాలె... నాకు మాత్రం తెలిసి సత్తందా? నీకేమన్న తెలుత్తదా..."

నాకెట్ల తెలుత్తది? బయ్యక్క సెప్పే మాటలన్ని సిత్రమే. ఒక్కటీ తెలిసి చావదు.... ఇంతెందుకు ఎప్పుడు నవ్వుతదో, ఎప్పుడేడుత్తదో తెలువనే తెలువదు. మంచిగ మాట్లాడ్తది...అన్నీ చెప్పుకత్తది.... పడిపడి నవ్వుత నవ్వుతనే ఏడుత్తది... బయ్యక్క గిట్లెందుకు చేత్తది? ఎందుకంట సార దాగుతది? గియ్యన్ని నాకు ఎరుకనే లేదు.

అడివికి బొయి ఇప్పపూల సారాబట్టి దగ్గర పూటుగ సారా తాగత్తదని ఎరుకయ్యింది. తాగచ్చినప్పుడల్లా పెయ్యిమీద గావులుండేటియి. గ గావులెట్లయినయో నాకు ఎరికయ్యేదిగాదు.

ఓపారి మేమిద్దరం మంచెల పన్నం. ఎండ తగ్గింది. కొంచెం పైర గాలి బెడ్తంది... జొన్న కర్రలు సిందిమాదిగి సెంద్రడు అల్లిరాణేషమేసి ఎగిరినట్టుగ ఊగుతున్నయి. మా మంచె మీదినుంచి ఎర్రముక్కు, జల్లితోక సిలుకలు కిలకిల మనుకుంట బోతన్నయి. బీళ్ళల్ల గొర్రెంకలు కవ్వర కవ్వర మొత్తుకుంటన్నయి. నేను పొద్దుగాల తెచ్చుకున్న సద్ది కొద్దిగ ఉంటె తింటన్న... గొడ్డుకారంకు నాకండ్లల్లకు నీళ్ళచ్చినయ్.

"అంతకారం తినకు పికిలీ..."

"తింటె బలం..."

బయ్యక్క నవ్వింది. సానా గమ్మత్తుగా నవ్వింది. అటెనుక నీళ్ళకోసం చౌట్లవాగుకు పోయినం. నీళ్ళమడుగు సూసెటాల్లకు నాకు పానం బడ్డది. నేను జెప్ప జెప్ప నీళ్ల తాగుతుంటె బయ్యక్క వొడ్డుమీద నిలుసుండి నవ్వుతంది. ఏమనుకున్నదో ఏమో నన్ను నీల్లల్లకు దొబ్బేసింది. నా బట్టలు తడిసిపోయినయి.... గొంతు పిసుకాలన్నంత కోపమచ్చింది....


www.eTelangana.org

"నీ బట్టలు సూడు పికిలీ! ఎట్ల మాసున్నయో? నేను ఉతికిత్త. సూడు పెయ్యంత ఎంత మన్నున్నదో?" బండమీద నిలబెట్టి ఒళ్లు రాసింది.

నా కోపం తగ్గలే... అక్క రెండు సేతులట్లనే పట్టి నీళ్ళల్లకిగ్గిన.

"అయ్యయ్యో! నా కున్న దొక్కటే సీరె... వాడత్తడెట్లా?"

"అది ఎండుతది. మరి నన్నెందుకు దొబ్బినవ్.... పోనీ ఏడువకు. నేను ఉతికిత్త."

బయ్యక్క నన్ను ముద్దాడింది. రయికిప్పింది, సీరిప్పింది. తను నీళ్ళల్ల ఉండి తన బట్టలు నా బట్టలు ఉతికిచ్చింది. నేను బరిబాతనే ఇద్దరి బట్టలు తంగెడు చెట్లమీద ఆరేసిన... మళ్ళ నీళ్ళలకు పోవాన్నంటే అక్క నవ్వుతంది...

నాకు రోషమచ్చి నీల్లల్ల దునికిన... అక్కఈదుతోంది. ఈదుకుంటనే నా దగ్గరి కచ్చింది... నాకు ఈత నేర్పుతనని మొల్దాడు బట్టుకున్నది...ఊహుఁ మునిగిపోతున్న. కడుపుకింద చెయ్యేసింది.... నాకు చెక్కలగులి.... ఆ తికమకలో బుక్కెడు నీళ్ళు మింగి సరందప్పి అక్కను అలుముకున్న. "భయపడకు పికిలి" తను నన్ను అలుముకున్నది.... లోతు నీళ్ళల్లనుంచి బయటకు అట్లనే తీసుకత్తంది... నేను అక్కను గట్టిగ అలుముకొని... ముద్దుబెట్టుకున్న...

అక్క నన్ను దూరంగ నెట్టి తను ఒడ్డెక్కి తడిబట్టలు చుట్టుకున్నది.... నేను ఒడ్డెక్కిన. అక్క కండ్లల్ల చెప్పరానంత కోపం...గంత కోపం నేనెన్నడూ సూసెరుగ....

"పికిలీ నువ్వు అందరసొంటి మొగోనివేనా?" కంఠంల వొనుకు........

ఇద్దరం మంచె చేరుకున్నం. దారిల అక్క ఒక్కమాటన్నా మాట్లాడలేదు. ఏమాట్లాడ్తె ఏం ముంచుకత్తదోనని నేను మాట్లాడలే. ఇంతకుముందు మేమిద్దరం ఎన్నో మట్ల గిట్ల ఈతగొట్టినం. అక్క పొక్కల్ల సేతులుబెట్టి మాలపంకిడి మొట్టలు బట్టేది. ఇద్దరం కాల్సుకుని ఉడుకుడుకియే ఊదుకుంట తినెటోల్లం...కని అక్క ఎప్పుడు గిట్ల కోపంతోటుండటం నేను సూళ్ళేదు.

మంచెక్కినంక నా మొకాన్ని తన దిక్కు తింపుకొని కండ్లల్ల కండ్లుబెట్టి సూసింది. నాకు బయమయ్యింది. నన్ను అలుముకొని "తమ్మీ... నువ్వు అందరసొంటి మొగోనివి గావద్దు" అనుకుంట ఏడ్సింది...

"నేను మొగోన్ని గాదక్కా........" బెదురుకుంటనే కీసుగొంతుతోని నేను...

బయ్యక్క వక్కడ వక్కడ నవ్వింది..."అమ్మయ్య......." ఎట్లయితెనేంది కోపం పోయిందన్నమాట. ఇంక బయ్యక్కను నవ్విచ్చేటందుకు ఏదన్న చెప్పుదామనుకున్న.

ఏం జెప్పాలే?....

"బయ్యా.......బయ్యా" మంచెకింద ఎవలో సన్నంగా గొంతుమార్చి పిల్లుత్తండ్లు.



"సూడు పికిలి ఏ గద్దచ్చిందో?"

మంచె కిందికి వంగి చూసిన, మొగిలయ్య..........

"లంజెకానా!" గొంతు సిత్రంగా ఉంది.

"ఎవనివిరా! నీ పెండ్లాన్ని, అక్కను, సెల్లెను, అవ్వను గట్ల పిలుసుకపో ఎమంటరో! నడువ్.." అక్క.

"గంత కోపమెందుకే సిలుకా? బీడికట్ట తెచ్చిన."

నేను నిచ్చెనకాడ కూసుండి ఇద్దరి మొఖాలు సూత్తన్న. మొగిలయ్య గుంద్రగ కుదిమట్రంగా పొట్టి గుమ్మడికాయ తీరుగున్నడు. పెయ్యంత గుడ్డేలుగు తీర్గ రోమాలు. ఎడంకాలు పీలబడిపోయిందేమొ సన్నగ పుల్లతీర్గున్నది. ముద్దతీరునున్న మొకం. కండ్లల్ల ఏదో రవులుకొంటంది. డొప్పలసొంటి చెవులు, ఎడంచెవికి బంగారి కొనుక పోగు. మూతిమీన కత్తిరిచ్చిన మీసాలు. పెదువులు సన్నగ వికారంగ ఉన్నయి... మొగిలయ్య మావూల్లె కొత్తంగ పెద్ద మనుషుల్ల జత కలుత్తండు. తాత సచ్చిపొంగ కొడుకు ఎడ్డిబాములోడని మనుమనికి తాళపుచేతులిచ్చి సచ్చిండు. గప్పటినుంచి డబ్బు సేతులాడ్తంది... కని పిసినారోడు. బట్టలు మాసున్నయి. పంచాతుల్ల ముంగట కూకుండి... అందరు తననే సూడన్నని లేసిలేసి ఏదో చెప్పబోతడు. మామంచెకాడికి ఎన్నో మట్లచ్చిండు. ఆడచ్చినప్పుడల్లా బయ్యక్క తిడతనే ఉంటది....ఊళ్ళైనైతె పరువు పోతదట. గందుకనే గీడ కత్తండట... బయ్యక్కకు గీడంటె ఇట్టమున్నట్టు లేదు.

"బయ్యా.........పిల్లా?" మొగిలయ్య నక్క తీర్గ పైకి సూత్తండు.

"ఏం పావురం గారిపోతుందిరా! అంతలావు పావురముంటె నన్ను సేసుకోరాదు నీ యింట్లనే పడుంట."

"ఎప్పుడు గట్లనే అంటవు" తల గోక్కున్నడు.

"ఔ రా! నీకు గ బెత్తెడు జాగా ఎప్పుడు గావాలె... బయ్యి అవసరం లేదు. బయ్యి ఎట్ల మురిగి ముక్కి బతికేది నీకు పట్టిలేదు.... మొకంమీన మొకం బెట్టి నీ గబ్బునోరును బయ్యి బరాంచాలె... నీ కుంటి సేట్టలకు కిలకిల నవ్వాలె... బయ్యి ఏ గంగల దునికినా నీకు పోయేదేమీ లేదు. నీకు పరువుగావాలె... ఇంట్ల పరులదిక్కు కన్నెత్తి సూడని పెండ్లాముండాలె... బయట లంజె లుండాలె..."

"బయ్యా ఆడికే అత్తునా? బామ్మరిదీ రాముడూ... ఆగో గ మూల గుంపు మీన గొరైంక లాలినయ్ కొట్టిరాపోరా! అక్కన్నుంచి ఆగో మా చేండ్ల తియ్య దోసకాయలున్నయి తెచ్చుకపో."

"వద్దు పికిలీ... అద్దు.......నువ్వీన్నే ఉండు......." అక్క మంచెదిగి మొగిలయ్యతో నెల్లిపోయింది. వాళ్ళిద్దరు జొన్నకర్రలు పాపుకుంటూ చేండ్లల్లబడి నాకు కనపడకుంటయే


www.eTelangana.org

దాక పోయెటోల్లు... నాకు చెప్పరానంత కోపం...మళ్ళ అక్క ఆదినం నాకు కనిపిచ్చేది కాదు....

✧

"వద్దు కామ్రేడ్ వద్దు......" నేను కీచుగొంతుతో అరిచిన. నా వొంటిమీద తేళ్ళు జెర్రులు పాకుతున్నాయి. అసహ్యంతో నావొళ్ళు వొనుకుతుంది....గొంతు పొడారి పోయింది..... నాకు నిలువెల్లా చెమటలు పట్టినయ్........ నా ముకంల ఎంత అసహ్యం పేరుకున్నదో పికిలి చూడద్దనుకొని మొకం కప్పుకొని దిగ్గున లేచి బయటకు నడిచిన... బయట చీకటి తెరలు తెరలుగా రాలుతోంది....చీకటి ఎంతో భయంకరంగా ముద్ద కట్టుకపోయి నా లోపల ఇంకి పోతున్నట్లనిపించింది.....నా మెదడు మొద్దుబారి పోయింది.... అంతా చీకటిలాగ మసక..... ఆ మసకలనే చేండ్లు, వాగులు, నీళ్ళ మడుగులు, మాగుడిసె... అవ్వ...అన్న అంతా నా ముంగట తిరుగుతండ్లు.

నేను మళ్ళ మామూలు మనిషయ్యేటాల్లకు గంగన్న మాటలు వినపడ్డాయి....... ముకం కొంగుతోటి తుడుచుకొని ఏమెరుగునట్టే వాళ్ళిద్దరి దగ్గెరకొచ్చిన.

ముగ్గురం మా పని గురించి మాట్లాడుకున్నం...

"పల్లెల్ల మనం బెట్టిన కొత్త కమీటీలున్నయే......." గంగన్న.

"గ్రామ కమేటీలు..." పికిలి......

"అద్గదీ.......నువ్వు జెర లైనుమీది కత్తన్నవ్ కామ్రీడ....ఎట్లయిన పడుసోనివి గద..... అదిసరెగని...గీ కమేటీల గట్టిగ జేయాల్నా లేదా?"

"చేయాలె......." నేను.

"ఎట్ల చేత్తమంటరు..... నాకైతె తికమకగనే ఉన్నయి. మొన్న మావోడొకడు కితాబు చదివి సెప్పుకచ్చిండు. నాకు పురాగ సమఝ్కాలే......"

"రాజకీయాలు నేర్వాలె....."నేను.

"అద్గదీ........గ పనెవ్వలు చెయ్యలోంట.......నాదా గొడ్డటి పురాండం........"

"బయ్యక్క చేత్తె బాగుంటది" పికిలి.

గంగన్న ఔనన్నట్లు నాకెళ్ళి సూసిండు.

"నేనొక్కదాన్నే ఎట్ల జేస్త... మనమంత జెయ్యాలె."

"నేననేది గట్లకాదు...పత్తిరికలు ఇంకొంచెం తెలిసెటట్టు రాయిమను సెప్పుండ్లి .....రైతులకు రాసేదాంట్ల కొద్దిగ చెమత్కారముండాలె... ఇన్నరా? దాని కగ్గిదల్గ అదేంది... సామరాజ్జెవాదం..... ఛత్తెరి ఏదో అక్కురంగనే అత్తంది....."



"అదా సామ్రాజ్జెవాదం...." పికిలి.

నాకు నవ్వొచ్చింది....

"నవ్వకు...ఎకురం పొలం అయ్యడమయ్యెడ దున్నచ్చు. పట్వారోని జిత్తులు కనిపెట్టచ్చుకని గిది బమ్మకట్టమున్నది... దాన్ని తగిలెయ్య నేరుసుకోక తప్పద్దా..మన ఇలాక సంగతులంటె నాకు బాగెరుక... కని మనోల్లు బయటి సంగతుల గురించి సంపుక తింటరే....... అలువాటయిన పానం......ఎందట్ల ఏం రాసున్నదోనని గారె గలిపిన మడుగుల సాపల తీర్గ తిరుగుతండ్లనుకో........ఎందుకంటె ఇయల్ల రైతులకు అవుసరం..." ఇట్ల సాన సెప్పుకచ్చిండు.

"పత్రికలు బాగా సదువాలె...." నేను........

"పుర్సత్ దొరుకుతలేదు. సదువాలె.....నాది అనకాలం సదువాయె... తట్టుకుంట తట్టుకుంట ఒక్క కాయిదం సదివేటాల్లకు సల్లసెముటలు బెడ్తయి.... సూడాలె......."

అట్ల సానసేపు మాట్లాడుకొని పోవటానికి ఎవల సామాన్లాల్లం సదురు కున్నం... గంగన్న ముంగటెల్లిపోయిండు.

పికిలి నా ఎదురుగ తలంచుకొని నిలుసుండి...

"అక్కా నన్ను మన్నించు........నేనెట్ల గిటుకెల్లచ్చిన్నోని రాసిన గని నీకు....." చివుక్కున తలెత్తి నా కండ్లల్లకు సూసిండు..కండ్లల్ల నీళ్ళు........

నేను పికిలి తల పునికిన........ "తమ్మీ! ఇందట్ల రాసింది అంతా నిచ్చమే. కాని గ నిజం పాపిష్టిది...మనుషులు పసురాలకన్న కనీసంగా బతికిన బతుకది... నువ్వు రాసినకాడికి నాకియ్యి......నువ్వు సూడని నీకు తెలువని సంగతులు నేను రాత్త.........గీ రాస్తల నువ్వొక్కనివే లేవు తమ్మీ... నీతోపాటు నేనున్న..గీ కత నా వొక్కదాని కతగాదు. నీ వొక్కని కతగాదు. ఈ దేశంల నూర్లెకురాల బూములు ముడ్డి కిందేసుకున్న దొరలు... వాళ్ళకింద బుక్కెడు బువ్వకోసం అంగలార్చే జనం... మరోపక్క కాలుమీన కాలేసుకొని కోట్లు కూడబెట్టుకునే ఎజమానులు... బొగ్గుపొక్కల, కార్ఖానాల్ల బుక్కెడు నెత్తుర్లు కక్కుతూ సావలేక బతుకుతున్న కార్మికులున్నారు... ఈల్లందట్లనే వీళ్ళ కాళ్ళల్లనే...రెక్కల్ల బొక్కల్లనే మెదులుకుంట సుత కనీసం మనిషిగానన్న సూడబడని ఆడోల్లున్నరు.....అన్ని తీర్ల దుట్టితనాలను, దోపుకాలను రూపుమాపి... పేదోల్ల రాజ్జెంకోసం జరిగే గొప్ప పోరాటంల నేన నీ వెంటనే తమ్మీ.....మీ వెంటనే ఉన్న......పిడికిల్ల గాయాలతోటి, నొప్పులతోటి, గుండె రాయిజేసుకొని మీవెంట... అడుగుల్ల అడుగు గలిపిన.......నా చిన్నారి తమ్ముల్లాలా! నా అన్నలాలా! నేను మీకెంతో ఋణపడివున్న........." ఊపిరాడక నా గొంతు పూడుక పోయింది ....ఇంకా ఏదో చెప్పాల్సనే ఉన్నది........కని ఒక్క మాటన్న దొరుకదే.......ఎటూ సేతకాక పికిలిని మెదట్ల కొట్టుమిట్టాడుతన్న మాట తెలుసు కోమన్నట్టుగ ఊపిన....

పికిలి గబగబ రెండడుగు లేసిండు.....


www.eTelangana.org

“పికిలీ.........నేను సుతరాత్త.......మనోల్లకు ఇత్తాం... కని పాత బయ్యక్కెప్పుడో సచ్చిపోయింది. ఆ బయ్యక్క నీకొక్కనికే ఎరిక........”

“లాల్ సలామ్ కామ్రేడ్?” పికిలి అనేసి ఎనకకు సూడకుంట ఎల్లిపోయిండు........

“కామ్రేడ్ బయ్యక్క.........” గొనుక్కుంట కాయిదాలు పిడికిల్ల పట్టుకొని నిలుసున్న.......ఎక్కడో మొండి చింతచెట్టు కింద ఒళ్ళంత నెత్తురుతో దిక్కుతోచక కూకున్న ఆడది నా మనుసుల మెదిలింది....

నేను నడుత్తన్న....ఆకాశంల మిలమిల మెరిసే చుక్కలు నాకు తోడు....గాలి .... చిమ్మెట్ల రొద....... బండకెక్కెరగాడు కురకుర లాడుతంది.... ఎక్కన్నో దూరంగ తీతువపిట్ట ‘కిక్కిరికీ కిక్కిరికీ’ అంట ఎగురుతోంది...

“దీన్ని మంటేసి మాడ్సుక తిన... దీని కెట్ల తెలిసింది.”

✧

# 5

పట్టపగలు.....ఎండకు నెత్తి మాడిపోతంది.... బోడగుట్టల కింద ఒక్కటంటే ఒక్కటే గుడిసె.........నన్ను అల్లంత దూరాన్నే సూసి మల్లయ్య ఎదురొచ్చిండు. బోడగుండుమీద జుట్టుపోస... నా చేతుల చెయిసంచి తీసుకున్నడు...

“మా నాయన్న నువ్వత్తవని సెప్పిండు... నాత్రికి సంఘపోల్లు ఈడికే అత్తమన్నరు“ అన్నడు.....

సరేనని గుడిసెల జొచ్చిన.........అది కుమ్మరి శంకరి తోట... కాయగూరలు పెట్టుకున్నరు.. ఇక్కన్నుంచి ఊరు మైలునరన్నా ఉంటుంది. నేను గడంచలో కూలబడ్డ......

శంకరి కొడుకు మల్లయ్య బుర్రల నీళ్ళు దెచ్చిండు. గటగట నీళ్ళు దాగి కొన్ని మొఖంమీన జల్లుకున్న.........

“అక్కా నాయిన్న గూడూరు పోతనన్నడు. సద్ది దేను నేను బోవన్నా” అన్నడు.

నేను తలూపిన.......

మల్లయ్య వెళ్ళిపోయినంక నాకెటు తోసలే........కాసేపు కునుకు తీద్దామను కున్న......కాళ్ళు బారజాపి గడంచలో పండుకొన్న.....కండ్లముంగట ఏమేమో కన్పిత్తన్నయ్ ........నిద్రబట్టేటట్టు లేదు......గప్పుడు పికిలి రాసిన కత గుర్తుకచ్చింది.

కాయిదాలు దీసిన......అల్లిబిల్లి రాతతోని పికిలి రాసిన కాయిదాలు అటిటు దిప్పిన.......పికిలి ఎక్కడొదిలేసిండో సూసి మిగతా సదివిన... పికిలి రాసిన మిగతా కత ఇట్లా ఉన్నది...



ఆదినం నన్ను ఒంటిగ ఇడిసిపెట్టి పొట్టి మొగిలియ్య బయ్యక్క చేండ్లల్ల బడిపోయి నంక నాకు సానా కోపమచ్చింది. బయ్యక్క ఈపారి కనిపిచ్చినప్పుడు కొట్టాలనుకున్న కాదు కొరుకుత.......పాపం ఏడుత్తదేమొ? నా కోపమెట్లా తగ్గాలె? ఈపారి కలుత్తే మాట్లాడకుంటే రోగం కుదురుతది. ఎన్నో పారీలు తనే మాట్లాడిచ్చింది. ఈపారికూడా తనే ఏదన్న సెప్పి నవ్విత్తది.....తిడుత. ఏమని తిట్టాలె? నాకు ఎరికున్న తిట్లన్ని యాదికి తెచ్చుకున్న... గ తిట్లన్నిటికి ఆఖరున ‘లంజె’ అత్తంది. దొంగ లంజ... లంగ లంజ ఇట్లా... బయ్యక్కను అందరు గట్లనే తిడుతరు. నేను సుత గట్లనే తిడితె ఏడుత్తదేమొ? బయ్యక్కేడిత్తె మళ్ళి నాకేడుపత్తది. మరెట్లా? సిట్టసివరకు ఓ ఉపాయం దోసింది.

అసలు గిసొంటి బయ్యక్కను జల్మల కలువనే కలువ. గిట్లనుకునేటాల్లకు మనసు నిమ్మళమైంది.

తెల్లారి మా అయ్య “ఒరే రాములు సేను నోట్లెకచ్చింది. మరిసుంటె మన్నయి పొద్ది. పిట్టలు పీక్కుతింటయి. నువు ఎడ్లకుబో... నీకు పిట్టలాగయి నేను పిట్టకావలి బోత” నన్నడు.

రెండుదినాలు నేను ఎడ్ల గాయబోయిన. నాత్రయ్యిందంటే నాకెరుక లేకుంటనే బయ్యక్క గుడిసెదాక పోయి మళ్ళీ రోషమచ్చి ఎనుకకు తిరిగచ్చెటోన్ని.

మూడోదినం దీపాలు ముట్టిచ్చిండ్లు.....మా యింటికి బయ్యక్క రానే వచ్చింది. వాకిట్ల మూగదయ్యం తీర్గ నిలుసున్నది. దీప మెలుగు సగం బయ్యక్క మీన పడ్తంది. నేను మంచాల మా అవ్వ సీరె నిండ గప్పుకొని దొంగతనంగ బయ్యక్కేం జేత్తదోనని సూత్తన్న.

“ఏమే బయ్యా కైనీడకు నిలుసున్నవ్... ఇట్ల ఎలుక్కురా?” మా అవ్వ.......

బయ్యక్క అడుగుల సప్పుడు. నేను సీరె ఇంకింత మొకంమీనికి ఇగ్గుకున్న.

మా అవ్వ గడుక ముద్దలు నములుకుంట ఏదో సెప్పుతంది. “బయ్యా ఆడిదాని పుటుకే దురుజెట్ట పుటుకు. బిడ్డా నిన్ను సూత్తాంటె కడుపుల పేగులు నోట్లెకత్తయ్. సెట్టెత్తు పెరిగి నీ సెత్త కాకుల గద్దల పాలైతంది. నీ కిప్పుడు ఎటు కొట్టుకపోతన్నవో ఎరుకలేదు బిడ్డా! నువ్వు నరకంలకు బోతన్నవ్.......”

“నాకు మరే దిక్కు గన్పిత్తలేదు సిన్నీ! నేనేం తప్పు జేసిన్నని నన్ను అందరు గట్ల సూత్తండ్లు.”

మా అవ్వ కసేపు మాట్లాడలేదు.

“చిన్నవ్వ....నాక్కోపం కసి మొగోల్లందరి మీన కని.......” బయ్యక్క ఏడుత్తంది....

నేను సీరె పీకేసి లేసి కూకున్న... నన్ను సూసి బయ్యక్క ఏడుపెక్కువజేసింది. నేను ఉరికిపోయి బయ్యక్క ఓట్లె కూకున్న.........


www.eTelangana.org

"పోరడు నీకు బాగా అలివయ్యిండు. ఆడిదాని మనసు తల్లిమనసు... గ మెత్తదనాన్ని ఆసర జేసుకుంటరు మొగోళ్ళు..."

బయ్యక్క నేను కలిసి బయ్యక్కింటికి బోయినం.

సుక్కలను సూసుకుంట బయ్యక్క నాకు ఎన్నో సంగతులు సెప్పుకచ్చింది. "పికిలీ నీకు గిప్పుడు గిప్పుడే లోకం సంగతి తెలుత్తుంది పికిలీ...... గందుకనే నీకూ నామీన కోప మత్తుంది...... నేను బుక్కెడు కూడుకోసం నా దగ్గరేదున్నదో అదమ్ము కుంటన్నంటే నీ కెట్లా తెలుత్తది పికిలి! నా అరిపాదాలు సూడు పికిలీ... ఎట్లా పగిలి నెత్తుర్లుగార్తన్నయో! నా పెయ్యంత సూడు పికిలీ... ఎట్లాపండ్ల గావులతోని పుచ్చి పోయిందో? నా ఎంటికలు సూడు పికిలీ... అళ్ళమోటు సేతుల్లబడి తెగిపోయినయో? నాకేం గీ బతుకు ఇట్టమను కుంటన్నవా? నేను పెండ్లి సేసుకోవద్దు.....నాకు అందరిసొంటి బతుకద్దా? మా అన్న కులపోల్లకు వెయ్యో రెండువేలో కర్సుబెట్టి కులపోల్లకు పూటుగ తాగిత్తె వానికి కుల మత్తది. కనీ మా అన్నకు పైకముండదు. కులం గీ జన్మల రాదు. గిప్పటికే గ కుంటోనికి అయిదు నూర్లప్పు... నేను అద్దుపోరా కుంటోడంటే మా సేను గుంజుకుంటడు. మా అన్న ఉరిబెట్టుక సత్తడు. మా అవ్వ పిచ్చి లేసిపొద్ది............పికిలీ గీ పీట ముళ్ళ బతుకులు నీ కెట్లా తెలుత్తయి?.......నీకు కోపం రాకుంట గీ పని మానేత్త ననుకున్న కని........" బయ్యక్క ఎక్కెక్కిపడి ఏడుత్తుంది.

"గ సుక్కలు సూడక్కా, ఎట్ల మెరుత్తన్నయో? నా కెన్నడో ఓ శాత్రం బాకి....ఇయ్యల్ల సుక్కల శాత్రం సెప్పు......"

కండ్లు తుడుసుకొని నవ్వింది బయ్యక్క........సుక్కల కత మొదలేసింది బయ్యక్క... నే నెప్పుడు నిదురబోయిన్నో ఎరికలే... బయ్యక్క ఒక్కతే సుక్కల కత ఎంతసేపు సెప్పిందో?

✧

మా అయ్యకేదో బలువు పని బడ్డది. మళ్ళ బయ్యక్కెంట సేను కావలి నేనే బోతన్న.

బయ్యక్క నేను మంచెల పన్నం. బయ్యక్క "కొడుకుకు పాలియ్య లేదు... జోకొట్టలేదు నాగమ్మ......మాయలపక్కీరు సెరల... సిక్కిపోయెనమ్మా నాగమ్మా......" బాలనాగమ్మ పాట బాడ్తుంది...... పక్కీరోడు పాపం బాలనాగమ్మను లావు తిప్పలు బెడ్తుండు.

*"గోడుగోడున గుండె నరుసుకొని*

*గొల్లు మన్నదమ్మా నాగమ్మా...."*

బయ్యక్క ఏడ్సుకుంటనే పాడ్తుంది..... పైరగాలికి మొత్తం జొన్నసేనంత తల లిరబోసుకొని బాలనాగమ్మ తీర్గనే ఏడత్తన్నట్టనిపించింది. మా సేనుమీద గద్దను నల్లపిట్ట



తరముతుంది.... పంబాలోని సేండ్లనుంచి గుమ్మిదొడ్డు పొగలేత్తంది. అటుకులకు పిడికెలు అంటుబెట్టుకున్నట్టున్నది. పడమటి దిక్కు పొద్దు తల్లి కడుపులకు బోను ఏగిరపడ్తుంది.

మా మంచె కింద కిర్రు సెప్పుల సప్పుడాగి పోయింది.

"బయ్యా పిల్లా..." ఎవలో గుసగుసగా పిలుత్తుండ్లు.

నేను మంచె కిందికి సూసిన... గౌరయ్య...... సతికిపోయిన సెంపలు... దొడ్డు పెదువుల మజ్జెన కాల్తన్న సుట్ట... గంపంత రుమాలు. మనిషి బానంబద్ద తీర్గ అంగిపోయున్నడు. సేతులున్న కంకకట్టె నడుము కానబెట్టుకొని నిట్టనిలువుగ నిలుసున్నడు. పూరేడు పిట్ట కండ్లసొంటి కండ్లల్ల బూసులు. రెండు దండలకు ఎండి కడాలు... మొకం ఏడిదాడ ముడుతలు బడిపోయి ఊగులాడ్తుంది.

"ఓ(రామా జెర బయ్యిని పిలు......" గౌరయ్య.

"నేను బిలువపో......" నాకు కోపమత్తుంది....

బయ్యక్క లేసి కూకుండి "ఏందట?" అన్నది సిరాకుగ.

"కూసంత పనిబడ్డది" మొదుగాలు కళ్ళెగురేసి... అటెంక ఎడం కన్నుమూసి సూసిండు...

"సాలు సరసం.........నీకు సుత గీ దిక్కుమల్లె సెత్తే కావాల్నా?" బయ్యక్క గొంతుల వనుకు.......

"అదెనే లంజకానా నీకేం గావాల్నో సెప్పు........" గౌరయ్య సతికిపోయిన దవడల ఊగులాడంగ సిత్రంగ నవ్వుతండు.

నాకు కారం రాసినట్టయ్యింది.... "నీ యవ్వ ముసలితొత్తు........" నేను.

"ఏందిరో ఆడిదాకత్తె కాళ్ళుబట్టి గుంజకు కొడ్త ఏమనుకున్నవో....." ముసలోడు.

"అః మా కొడుతవు... ఏది కొట్టు సూద్దాం......... నేనే నీ బొండిగ పిసుకుత........." నేను.......

"అద్దు పికిలీ.......అద్దు........." బయ్యక్క.

"నువ్వాగు బయ్యక్క........" నేను.

"అద్దు తమ్మీ అద్దు.........తుః నా బతుకు బొగ్గయిపోను... బయ్యా నువ్వు సావకుంట ఇంకా బతుకున్నవు........ నీ కిది బనావుగాదు. నా యెత్తు కొడుకుల బిడ్డల బెట్టుకొని." బయ్యక్క పబ్బతిబట్టి మొక్కింది.

"దుత్తెరి పున్యానికా........" ఆడు.......


www.eTelangana.org

"నీ కొడుక్కు నేను గావాలె... నీకు నేనే గావాలె..."

గౌరడు దవుడ బొక్కలు జోరుగ కదులంగ తిట్టబట్టిండు......నేను మంచెదిగి మీదికి కురికిన... సేతులున్న కట్టెతోని నన్ను కొట్టిండు.

బయ్యక్క మంచె దిగింది....

"నీకు సిగ్గు సెరం లేదు....... పిలగాన్ని ఎంత దెబ్బ గొట్టినవ్........నీ సేతులకు జెట్టలు......." తిట్టుకుంట మీది కురికింది.

ముసలి లమ్డికొడుకు బయ్యక్క రయికె సింపిండు. సీరె బీకుతండు........"లంజె గీ దీనికి సిగ్గేందే" అంటండు.

నే మళ్ళురికిన... అప్పటికే బయ్యక్క "తుఁ" కాండ్రకిచ్చి ముసులోని మొకంమీన ఊంచింది.

ముసులోడు పిచ్చి లేసినోని తీర్గ సేతుల కట్టెతోని నన్ను బయ్యక్కను గొట్ట బట్టిండు. బయ్యక్క అట్ల లేసింది. దొరకబట్టి అంగంత సింపింది. నా కందిన ధోతి నేను చింపిన........ కింద పడేసింది. బయ్యక్క సాతిమీద నేను కాళ్ళమీన లేవకుంట కూసున్నం. మన్నుల తల బొలిపింది....

అటెన్క నన్ను తనెంట ఇగ్గుకపోయింది.

ముసులోడు లేసి "నీ గులాపు తల్లీ! అందరిదగ్గెర పండంగ లేంది? నీ అంతం కండ్లజూత్త. బయ్యీ నిన్ను మిలమిల సూడంగ బొందబెడ్త..... నిన్ను గీ ఊళ్ళెనుంచి కుక్కను దరిమినట్టు తరిమియ్యకపోతె బంచత్ నేను దబ్బుడుకం గౌరన్నే గాదు....బంచత్ మీసేను రేపొద్దుగాల ఒర్రంగ గుంజుకుంట, మీఅన్నను గంగల కలుపుత......." అట్ల తిట్టుకుంట కర్రపొడుసుకుంట వాడు వెళ్ళిపోయిండు.

బయ్యక్క నన్ను సొట్లాగుకు గుంజుక పోయింది. తను నీళ్ళల్ల దునికి నన్ను నీళ్ళల్ల ముంచింది.......తలనుంచి నీళ్లు గారుతుండంగనే తడ బట్టలతోటి మంచెకాడి కచ్చినంక... "పికిలీ! నీ బయ్యక్క సచ్చిపోయింది తమ్మీ" ఏడ్సింది. నేను బయ్యక్కతోని గల్సి ఏడ్సిన........

✧

# 6

తెల్లారకముందే మా ఇంటికి సుంకరోడచ్చిండు.

"ఇయ్యాల్ల గౌరయ్య పటేలు పంచాతున్నదని చెప్పిండు పటేలా?" సుంకరోడు.

"ఏం ముంచు కచ్చిందట?" మా అయ్య.



"కడింటి నర్సయ్య బూమి పంచాతంట"అనుకుంటనే ఎల్లిపోయిండు.

"అయితే నర్సయ్య గుడిసెకు అగ్గి బెడ్తరన్నమాట. ఇవ్వారకు ఆళ్ళకు జేసిన నిర్వాకం జాలదా?" మా అవ్వ.

"ససరాదే దేనికి ముంగటనే ఉరికత్తవ్? ఆడోల్లదేనా పపంచం?" మా అయ్య గయ్యిన లేసిండు.

"దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకున్నరట. గ బయ్యి మొకమన్న సూడరాదుండ్లి. దాని ఉసురు దాకి మా పోతరు. అయినా దాని సెత్తను దప్ప మీ మొగోళ్ళు ఏడుపు సూత్తారు!"

"పొద్గాల పొద్గాలనే గదాని పేరెందుకు దెత్తవ్?"

"ఔనయ్య గట్ల దాన్ని సేసిందెవలు?"

"లంజెకాన ససరాదే!" మా అయ్య పండ్లు గొరికిండు.

"ఉన్న దున్నట్టంటె సచ్చెటంత కోపం... గ మాట నేనంటె ఏడుంటావ్?"

మా అయ్య రుసరుసలాడుకుంట ఆన్నుంచి లేసిపోయిండు.

మా అయ్యవ్వ ఏదో దానికి రోజు గిట్లనే కొట్లాడుకుంటరు. ఒకలు ఎద్దు కొమ్మంటె మరొకలు బర్రెకొమ్మంటరు. తిట్టుకుంటరు....... ఆటెనుక ఇద్దరు ఇసారాలు జేత్తరని నాకు రాంగ రాంగ ఎరుకైంది. మా అవ్వకు తెలిసినంత మా అయ్య కెరుకలేదేమొ అనిపిచ్చి మా అవ్వ నడిగిన....

"ఇందట్ల తెలువకపోయే దేందున్నది? అద్దం తీర్గ గన్పడ్తానే ఉండె. మీ అయ్య మందికోసం నోరు కుట్టేసుకుంటడు. పంచాతుల దొర నందిగాదు పందంటె ఔ బాంచెనంటరు......" మా అవ్వ....

నేను సేండ్లకు బొయి పొద్దటి బువ్వకోసం ఇంటికి రాంగ మూడు పానాదుల కాడ ఊళ్ళోలందరు కుప్ప కూడున్నరు. గడంచల పొరుగూరి నుంచచ్చిన ముంగీస మూతి దొర కాలుమీన కాలేసుకొని కూకుండి సికిలేటు తాగుతండు... గీదొర పెద్దొర బామ్మర్ది గుర్రాల సోవడసోంటి పసుల కొట్టాల దగ్గెరికి ఎప్పటికి అచ్చిపోతంటాడు. మాఊళ్ళె పంచాతులన్ని గీనే తెంపుతడు. మావూరి పెద్దొర ఎప్పుడన్న ఊళ్ళె కచ్చెటోడు. అతని గజ్జెల సవారి కచ్చులం ఊళ్ళె జొచ్చిందంటె ఊరంత ఖాళీ... మా పెద్దొర బామ్మర్ది కర్రెగ తునికి మొద్దు తీరుగున్నడు. కండ్లు ఎర్రెకండ్లు.

గౌరయ్య రోలుమీన కూసుండి తిడ్తండు. పట్వారిగాడు బెల్లంరంగు కాయిదం మీద ఏందో గీకుతండు.

బయ్యక్క అవ్వ ముసల్ది దుబ్బల కూలబడిపోయి... రెండు సేతులతోని నేలను గీక్కుంట పిస్సదాని తీర్గ నెత్తిమీన పోసుకుంటంది......... అది సొల్లుగారంగ నాలికెల్లబెట్టి రాగం తీసుకుంట ఏందో సెప్పుతంది.


www.eTelangana.org

"దొరా నీ బాంచెన్......... నేను సెడిపోయినదాన్నే, కాదన. నా సంపాదన కగ్గిదల్గ నేను సంపాయించింది పాపపు సొమ్మే... మరాటిదేశంల కులంగానోనితోని కట్టమో నిట్టూరమో ఎల్లబోసి ఎయ్యిరూపాలు దెచ్చిన. గయ్యి దెచ్చి మీమీ అసోటి కాల్లు గడ్పులు బట్టుకొని సేను గొనుక్కున్న. నా కొడుక్కు అంతుజెరం గొట్టినప్పుడు గ గౌరయ్య నూరో ఇన్నూరో నాకిచ్చిండు. ఏటా నాలుగు బత్తాల ముచ్చాలసొంటి జొండ్లు అడ్డికింద గొలుత్తనే ఉన్న......."

"ద్దుత్తెరి ముసలిదాన గదంత బారత మెందుకు?" ఎవడో కసురుకున్నడు.

నర్సయ్య నోట్లెనుంచి సొల్లు గార్తంది. మనిషంతా దేవుడచ్చినోని తీర్గ ఊగుతండు... ఉన్నట్టుండి ముసలిదాని ఈపుల పెడిపెడిన గుద్దవట్టిండు.

"బాంచోతు నిన్నెవడు కనుమన్నడు? కంటె మెడలుబిసికి బొందెందుకు బెట్టలేదు? అంతుజెరంల సచ్చెటోన్ని ఎందుకు బతికిచ్చినవ్?" అరవబట్టిండు.

ముసల్ది మొత్తుకోబట్టింది. అక్కడున్నోల్లంత సోద్దెం సూత్తండు గని ఎవలు ఇడిపియ్యనన్న లేదు.

ఏడినుంచి ఉరికచ్చిందో బయ్యక్క బానంపుల్ల తీర్గ.....

"వారీ సుప్పనాతోడా! గ కోపం కన్నతల్లిమీన గాదుర సూపేది? అందరు గన్నట్టుగనే అది గన్నది. నువ్వే మొగోనివైతే... నీకు నిచ్చెంగనే నెత్తురు మరిగిపోయి కోపమత్తె... ఒరే నీకెందుకు బతికే అక్కులేదో గీడ సచ్చిన బగ్గొడ్డు కాడ పంతరగల్లోలె కూకున్న మనుషుల నడుగు...అడగరా అడుగు..." వనికే కుడిసెయ్యి అందరి కెళ్ళి సూపెట్టింది....

"బరితెగించిన లంజె" గౌరయ్య కాండ్రకిచ్చి ఊంచిండు.

నేను బయ్యక్కదిక్కు ఉరికిన.......నాకే బలముంటే ఈల్లందరి పుర్రెలు బలుగ్గొట్టి బయ్యక్కకు ఏడుపు తప్పిత్తును...పోనీ గ ముసలి గౌరన్నన్న సేండ్లనే గొంతిక పిసికేయకపోతిని.......బయ్యక్కెప్పుడు గింతే...

దొర సెప్పూడబీకి బయ్యక్కను కొట్టబోయిండు. నేను దొరమీది కురికిన.

ఏన్నుంచచ్చిండో మా అయ్య నన్ను ఈపుల గుద్ది గొరగొర గుంజుకొని పోతండు... ఎనకకు గింజుకుంట మర్రిసూత్తునుగదా! నర్సయ్య దుబ్బల బడిపోయి ఏడుత్తండు. బయ్యక్క ముసల్దాన్ని నడిపిచ్చుక... పోతంది....

మా అయ్య "లంజకొడుక నా కొంపకు ఉరిదెత్తావురా? నెగులబుట్టని కోడిపిల్ల మంచం మూడు సుట్లన్నట్టున్నది...." తిట్టుకుంట మళ్ళ పంచాతుకాడికి బోయిండు...

"ఏందిర ఏం జరిగింది.... తలలు దప్పదీసెటోని తీర్గ గ సూపేంది?" మా అవ్వ దగ్గెరకు దీసుకున్నది......

"లే.......నన్నిడువు. గొడ్డలియ్యి...... ఆన్ని నరికేత్త......." నేను అటిటురికిన.



ఏమనుకున్నదో ఏమో మా అవ్వ నన్ను దగ్గెరకు దీసుకొని "అద్దురా గట్ల తీరిపోతె గ పని ఎప్పుడో ఎవడో ఒకడు సేసెటోడు........" గిట్ల ఏందేందో సెప్పిందిగని నా కొక్కటి తలకెక్కలే......

మా అయ్య మొకం ఏలాడేసుకొని ఇంటికచ్చిండు.

"బగమంతుడా! గంపంత కన్నుబెట్టుకొని యాడున్నవో తండ్రీ! నరులం గీ పాపం సూడలేము........" ఆ దినమంత గిట్లనే ఏదేందో అనుకుంట తిరిగిండు........

"నర్సిమ్మడు ఉరిబెట్టుకుంటడు" మా అవ్వ.

"మొండి బతుకు గంత జెప్పన పోతాది? నేనెంత మందిని సూల్లేదు..... నా ఎంటికిలంత మందిని...... బూములు బోయినప్పుడు, ఊళ్ళె నిలువ నీడ లేకుంటయి పోయినప్పుడు ఆళ్ళు సిరుసు బద్దలు గొట్టుకొని సత్తరనుకున్నా......కట్టపు పుటుకులు అంత జెప్పన కడతేర్త యనుకున్నవ" మానాయన.

"ఏదన్న గత్తరో గాయో అచ్చి గీ ఊళ్ళె అందరు సత్తె బాగుండు."

"పాపం బరుపూర నిండనియి... కంసునికి నూటొక్క పాపం నిండుతెనె గద బగవంతుడు సెక్రుర మిడిసింది... గిందట్ల లోపటి సంగతేందో ఎరికేనా? గౌరడు బయ్యిని గుంజిండట...."

"శివశివ! వాని కాడుగాల... రేపోమాపో కాటికి బోయెటోడు..."

"ఆని కొడుకుగ్గావాలే... ఆనికి గావాలే.........."

"బయ్యీ నువ్వే నా బిడ్డవైతే గొంతు పిసికి సంపేత్తును...."

"బగవంతుడా!" మా అయ్య ఇంకేందో అన్నడు....

"నీ బగవంతుని గుళ్లె రాయిబడ......."

మా అవ్వ గ నాత్రంతా నిదుర పోనేలేదు.

నాకు నిదుర బట్టలే.... సుక్కల సూత్తాంటే... 'సుక్కలాంటి సుక్కల్లో... సూడసక్కని సుక్కల్లో... నువ్వే సుక్కలున్నావో... నా సెలియా ఓ సీతా.......' అని రాముడు పాడిండని బయ్యక్క పాడినపాట యాదొచ్చింది.... సీతమ్మవారు అడివిల రాచ్చాసులల్ల ఏడుసుడు గనిపిచ్చింది... దిగ్గునలేసి బయ్యక్క దగ్గెరి కురుకుదా మనుకున్న... చిమ్మంసీకటి... కుక్కలు తెగ మొరుగుతన్నయ్. బయమయ్యింది...పోనీ బయ్యక్కే నా దగ్గెరికత్తదనుకొని ఆకిట్లకు సూసుకుంట పన్న.

ఎప్పుడు కన్నంటుకున్నదో! బయ్యక్క రానేలేదు.......

✧


www.eTelangana.org

# 7

మళ్ళ బయ్యక్క నా మంచెమీనికి రానేలేదు. నేను ముసిముసి సీకట్లనే లేసి మంచెకాడికి బోయిన. బయ్యక్క చేండ్ల ఎవలో కొత్తోల్లు కేకలేత్తండ్లు....... ఎటూ తోసక కాలుగాలిన పిల్లి తీర్గ సేనంత కలెదిరిగిన. దోసకాయలు ముట్టబుద్ధి కాలే. బయ్యక్క చేండ్ల కేకలేత్తన్న అమ్మోరు మొకపు కొండడు గౌరిగాని పాలేరోడు. వాడు రేగటిమట్టి ముద్దతీర్గ కొసమొదలు ఒక్క తీరుగున్నడు....అన్ని నేనెన్నోమట్ల సూసిన... మా వూళ్ళే అన్నందరు డోలు కడుపోడంటరు. ఆడు ఏదిదొరకుతది ఎప్పుడు సూసిన ఏదోవొకటి తినుకుంటనే కడుపీడ్చుక పోవుకుంట గన్పడ్తడు.

అన్ని సంగతేందని అడిగిన. బయ్యక్క మళ్ళింక సేన్లకు రాదట... గౌరయ్య సేను కొన్నడట... అడ్డికింద పంట తనే తీసుకుంటడట.

"లంజకొడుకు........లంజకొడుకు" అన్న కోపమాగక, నా సేతుల నేనే గుద్దుకుంట....

"దబ్బుడకపోడు సిన్నోడా? గొడ్డుబర్లకు బందాలు బోసెటోడు" అన్నడు కొండడు కిసుక్కున నవ్వి.

అంబటాల్లకు గులుక్కుంట పిచ్చిసూపులు సూసుకుంట నర్సయ్యచ్చిండు. గెట్లన్ని తిరిగిండు. కర్రకర్రను ముట్టిసూసిండు. కంకికంకిని సెంపలకు రాసుకున్నడు. కొండన్ని కొట్టకొట్ట బోయిండు. కొండడు పెడబొబ్బలు బెట్టి సేనంత ఉరికిండు. ఆఖరుకు ఏమనుకున్నడో ఏందో మొకం ఏలాడేసుకొని గెట్టుమీద సానాసేపు నిలుసుండి ఏడ్సి.... ఎనుకకెనుకకు సూసుకుంట కాళ్ళీడ్సుకుంట ఎల్లిపోయిండు.

నాలుగొద్దులు నర్సయ్య ఏన్నుంచో సేను దగ్గెర కచ్చెటోడు. రోజు గిదే తంతు. గీ నాలుగొద్దులు బయ్యక్క కనిపియ్యనేలేదు. నాకు తీరిక బడలేదు. మా సేను కోతబట్టిండ్లు. ఇంటికి రాకుంట మా అయ్య నేను సేను దగ్గెర్నే పండుకునేటోల్లం.

బయ్యక్క సేను గిప్పుడు గౌరని సేను సుతకోసి గూళ్ళేసిండ్లు. అయిదో నాడు గౌరయ్య బండ్లచ్చినయ్. బండ్లల్ల సొప్ప మెలిగిండ్లు. ఎక్కన్నుంచి ఉరికచ్చిండో నర్సయ్య... బండ్లకడ్డంగ పెళ్ళలమీన ఎల్లెలుకల పన్నడు. నెత్తి కొట్టుకుంట ఏడ్సుకుంట "నా బొందిల పానముండంగ నేను గీ బండ్ల కదులనియ్య. గౌరయ్యా నన్ను సంపు... నామీనికెల్లి బండ్ల గొట్టుకొని నా నెత్తురు, సెముట, నా పంట గొంటబో......" అన్నడు.

గౌరయ్య పాలేరోల్లు నర్సయ్యను అమాంతం లేవట్టుకపోయి దూరంగ దించిండ్లు.

నర్సయ్య కాళ్ళుసేతులు తపతప కొట్టుకుంట... "దబ్బుడుకం గౌరిగ... నీ అంతం కండ్ల సూత్త... నిన్ను గావుబడ్త" అనుకుంట గింజుకున్నడు. గౌరిగాడు సేతులున్న సెత్రితోని నర్సయ్య డొక్కల పొడిసిండు. నర్సయ్యకు ఏడినుంచచ్చిందో బలం! తనను బట్టుకున్న నలుగురిని అతులం కుతులం జేసి ఇడిపిచ్చుకొని ఉరికి గౌరయ్య గొంతు పట్టుకున్నడు.



గౌరని పూరేడుపిట్ట కండ్లు తేలేసిండు..... 'సావు కుక్కలకొడుక........' అనుకుంట పిసుక బట్టిండు. సచ్చిటోడె... పీలబడిపోయిన కాలెగిరేసుకుంట మొగిలయ్య ఉరికచ్చి ముల్లుగట్టె తోని నర్సయ్య తలమీద గట్టిగ కొట్టిండు. నర్సయ్య గావుకేకబెట్టి కిందబడిపోయిండు. పుర్రెపగిలి సొడసొడ నెత్తురు కారబట్టింది.... బండ్లు కిరకిరమనుకుంట సోకంబెట్టినట్టుగ ఈడిగిలబడి కదిలిపోయినయి..........

మా అయ్య, అవ్వ, నేను నర్సయ్య దగ్గెరి కురికినం. మా అయ్య మొకం మీన నీల్లు జల్లిండు. మా అవ్వ పేగుతోని మొకంమీది నెత్తురు తుడిసి కొంగు తోని గాలిసిరింది... నర్సయ్య సానా సేపటికి లేసి కూకున్నడు... నోట్లెకుగారిన నెత్తురూంచిండు ........ ఒక్క మాటన్న మాట్లాడకుంట సొలుక్కుంట సేండ్లనుంచి ఎల్లిపోయిండు......

ఆ దినమే పెద్దొర మనుషులచ్చి నర్సయ్య దండసేతులకు తాళ్ళుగట్టి కర్రెదొర ఎంటుండంగ పట్టుకపోయినట్టు బయ్యక్క సెప్పింది.

ఆనాడు సందెలు బడేయేళ్ళ నేను బయ్యక్క దగ్గెరికురికిన. బయ్యక్క సింతకింద సీతమ్మోరి తీర్గ కూసున్నది. కండ్లపొంట నీళ్ళు గార్తన్నయి. ముసల్ది మాటలు రాక మూలుగుతంది. పందిరికింద కుక్కి మంచాల నర్సయ్య కాళ్ళు రెక్కలు తెగనరికినోని తీర్గ పడున్నడు. నర్సయ్య గట్ల పండుకొని ఉండటం నేనెప్పుడు సూడనేలేదు.

బయ్యక్క నన్ను కావలించుకొని ఆనకాలం బొబ్బలుగొట్టే ఆగు తీర్గ ఎక్కెక్కిపడి ఏడ్సింది.

"పికిలీ అంతయిపోయింది. గ ముసలి గబ్బు లమ్డి కొడుకు అన్నంత పన్జేసిండు. నేలసెక్క... దున్నపోతులూ అన్ని గంగల గల్సిపోయినయ్. మా అన్నగాన్ని ఆని సేతులు నరికి కుప్పలుబెట్ట నుగ్గునుగ్గు గొట్టిపారేసిండ్లు....... ఆని అంశం నిర్వంశంగాను... పెద్దదొరోనికి దున్నపోతులు... గౌరని కాడుగాల... ఆని కొమ్మున బూమి బెట్టుకున్నడు."

"లంజెలు. లంజెకానా ఏడ్వకు. లంజకొడుకులు వానవ్వల కుక్కల్....." నర్సయ్య.........

"అవ్వకు సెప్పు పికిలి బయ్యి సచ్చిపోయిందని" బయ్యక్క.

నేను సానాసేపు బయ్యక్క పక్కన కూకున్న... నాకు ఈసారి ఏడుపురాలే... ఎంత ఇసారం జేసినా గీ సిక్కంతా ఏందో తెలువలే... గిదీ సంగతని ఎవలు నాకు సెప్పరు. ఒకలనొకలు తిట్టుకుంటరు... కొట్టుకుంటరు... ఏడుత్తరు.

నేను ఆనాత్రంత బయ్యక్క దగ్గెర్నే పండుకున్న. బయ్యక్క పెయ్యి అగ్గితీర్గ కాల్తంది. ముసల్ది నాత్రంతా మూలుగుతనే ఉన్నది. నర్సయ్య తిడతనే ఉన్నడు. గ మూలుగుడు... తిట్లు నేను సానొద్దులనుంచి ఇంటున్నదే.....

కని నాకా నాత్రి కంటిమీనికి కునుకు రానేలేదు.

✳


www.eTelangana.org

కాయిదాలు మడిచిపెట్టి గుడిసె బయటికి తొంగిచూసిన, సూర్యుడు పడమటి దిక్కు గుట్టమీద అలిసిపోయినట్టు కనిపించిండు. రెక్కలు టపటప లాడిచ్చుకుంట బాయిగడ్డమీది తుమ్మసెట్టుమీద గువ్వ లేసిపోయింది... తుమ్మమీద గొరైంకలు బాగా సప్పుడు సేత్తన్నయ్. కనుసూపుమేర పరుసుకున్న బీళ్ళకెళ్ళి సూసుకుంట సానాసేపు నిలుచున్న......

నా మనసులో రేగిన ఇసారాలు నేను రాయలేను........

✧

# 8

పికిలి రాసింది నా బతుకుగురించే అయినా పికిలికి తెలవని ఎన్నో సంగతు లున్నయి. నా బతుకుల సీకటి మూలలగురించి నేనే రాయాలె...... సానొద్దులనుంచి గుంజాటన పడ్తన్న...ఏది ఏమైన రాయాలనే గట్టిగ అనుకొని కాయిదాలు ముంగటేసుకొని పెన్నుపట్టుకున్న. నావొళ్ళంత సెముటపట్టింది. సేతులు వణుకుతున్నయి... గుండె లబడ దిబడ కొట్టుకుంటంది... నేను ఇంతకు ముందుకు ఏది రాయలేదనికాదు........ కని గిప్పుడు రాసేది నా బతుకు...అది అందరి ఆడోళ్ళ తీర్గ బతికిన బతుకుగాదు... గిదంత రాత్తే ఎవలకైనా ఒరిగేదేంది? ఇప్పటికే అడోల్లగురించి సానా పుస్తకాలు రాయబడినట్టు పుస్తకాలు సదివేటోల్లు సెప్పుతరు. కాని నా బతుకు........బహుశ గీదేశంల ఆడదాని బతుకు పాతదే కావచ్చు. నాకన్న చండాలపు బతుకు బతికి నోల్లుండచ్చు. కని ఏ అడదైతే తన నరకంలాంటి బతుకునుంచి బయటకచ్చి అందరి జనంతోపాటుగ లడాయిల నిలబడి సావుకు మూరెడు దూరంల నిలుసుండి లడాయి సేత్తందో... గ బతుకు ఇయ్యల్లగాకపోతే రేపు జనాని కక్కెర కత్తది....

తన కొడుకు మాటలు అచ్చుకొట్టిన కాయిదాలు స్టేషన్ల పోలీసుల ముంగట ఎగజల్లిన అమ్మ మొండిదైర్యం నాకు యాదికచ్చింది.......టావ్‌చంగ్ యాదికచ్చింది.

పెన్ను కదులుతంది.... అచ్చరాలు అలుక్కపోతన్నయి. ఓ నా దోస్తులాలా! పాఠకులాలా! గీ పల్లెటూరి ఆడది మీకోసం సుతిమెత్తని అందమైన మాటలు రాయలేక పోవచ్చుగాక... మిమ్ముల మొసమలుపకుంట ఏకబిగిన సదివించలేక పోవచ్చుగాక - కాని నొప్పులతో, బరువెక్కిన గుండెతో, కడవెడు దుఃఖంతో రేపటిమీద గట్టి నమ్మికతో వనికే సేతులతో నేనిది రాత్తన్న....... మిమ్ముల నేనేమన్న ఇబ్బందిపెడ్తే మన్నింతురు గాక........

నా కతను పికిలి ఒదిలిపెట్టిన దగ్గరే మొదలుపెడుతున్న.

✧



# 9

నేను బతుకుతున్న బతుకు మంచిదో సెడ్డదో నాకు తెలువడంలేదు. నేనెందుకు పుట్టినట్టో నాకెరుకలే... నా సిన్నతనమంత మరాఠి పత్తితోటల్ల గడిసిపోయింది. నేను రెక్కాడిన కాడినుంచి పనిచేత్తనే ఉన్న. మా నాయన నాకిప్పటికి యాదికున్నడు. ఎర్రగా సెయ్యెత్తు మనిషి....మాట పలుకు లేకుంట ఎప్పుడు ఏదో పని జేసుకుంటనే ఉండెటోడు. మమ్ముల దిక్కులేని పచ్చులజేసి మానాయన ఎందుకు సచ్చిపోయిండో... మా అవ్వ గీ ఊరెందుకచ్చిందో నాకు గదంతా గుర్తు లేనేలేదు.

నా సిన్నతనం నుంచి నాకు అందరితోని కలిసి తిరుగాలని, ఆడుకోవాలని ఉండేది. కాని నన్నెవలు కలువనిచ్చెటోల్లు గాదు. నా కెందుకనో నా తోటిపిల్లలను కొరికి, గిచ్చి కొట్టాలనిపిచ్చేది. వాళ్ళు నాతో కలిసి ఆడుకోవాలంటే ఏంజెయ్యాల్నో తోసేదిగాదు. గట్లనే పెరిగి పెద్దదాన్నయిన. నా కోపం నాతోపాటే పెరిగింది. నాకెవలు సెప్పకుంటనే బీడీలు తాగటం అలవాటయ్యింది. మొట్టమొదటిసారి నన్నెవలు కలిసిండ్లో, ఎప్పుడు ఎట్లా కల్సిండ్లో నాకిప్పుడు యాదికిలేదు...... దాదాపు మా ఊళ్ళున్న నా యీడు పోరగండ్లు నాకన్న కొద్దిగ పెద్దోల్లంత నన్ను కలిసిండ్లు... కొందరు రంబ వన్నరు. వాళ్ళ కుతి దీర్చుకున్నరు. వెల్లిపోయిండ్లు... రానురానూ నే నొంటరిగనే మిగిలిపోతన్న... నా మనసుల కసి పేరుక పోతంది. గీ కసి ఎవలమీద్దో ఎట్లా తీర్చుకోవన్నో? గీ కసిని ఎవలకు సెప్పుకోవాలో నాకు తెలిసేదికాదు.

ఎవలు సూడకుంట వాగులపొంట తిరుగుతూ, సెరువుకట్టమీది ఈతపొదల్ల కూకుండి ఎవల్నో కసిగ తిట్టేదాన్ని. తిట్టితిట్టి నా కేడుపచ్చేది. మొదట మా అవ్వకు సెప్పుకుందామనుకున్న... మా అవ్వ అప్పటికే బతుకుల సానా రోసున్నది. దానికి ఎవరి కట్టసుఖము వినే ఓపికలేదు. దాని ప్రపంచమల్లా సిమ్మెడు నశం........

మా అన్న ఎడ్డోడు. ఆని కండ్లల్ల నాకన్నా పెద్ద వెలితి కసి తొంగిసూసేది. వానికి సూడంగనే ఈడు ముదిరిపోయింది. వాడు రాత్రులు ఏదో పోగొట్టుకున్నోని తీర్గ ఎక్కన్నో తిర్గెటోడు. వానికి దొరకని బతుకు నాకు దొరుకుతున్నందుకు నా మీద మా అన్నకు కసి. ఈ కసితో వీలుసిక్కితే నన్ను తన్నెటోడు. వాడెంత మురిగిపోయిండో రాత్రిళ్ళు వాని మొకం సూడాల్సిందే... ఆని మండే కండ్లు సూత్తె ఆడెప్పుడో అమాంతం నా గొంతు పిసికి సంపుతాడేమొ ననిపిచ్చేది....నే నొక్కొక్కసారి వాడు నన్ను బలాత్కరిత్తడేమొనని బయపడేదాన్ని. ఈ ఆలోచనతోటి గడ్డకట్టుక పోయెదాన్ని. వెంటనే నా మనుసే కుళ్లిపోయిందని తోసేది. గట్ల ఇసారం సేసినందుకు అప్పటి కప్పుడు ఉరిబెట్టుక సత్తె మంచిగుండు ననుకునేదాన్ని.

మా అన్నగాడు తన కోపాన్ని, కసిని మరిసిపోవటానికి దున్నపోతులతోటి దోస్తానీ సేసుకున్నడు. రాత్రి పగలు దున్నపోతుల ఎంబడేసుకొని ఎక్కడెక్కడనో తిరిగెటోడు. వాని కట్టం సుకం గ నోరులేని జీవాలకు సెప్పుకునేటోడు.....


www.eTelangana.org

'సుక్కపోతా ఇంటన్నావే? మనిషి జల్మ బహుపాతకంది. ఇంటన్నవా బంచోతు.... ఇను.... ఉన్నోడు లేనోడు కులమున్నోడు... కులం లేనోడు... మాదిగోడు... మాలోడు... డెక్కలోడు గిట్ల... మీదాంట్ల కులాలు లేవు. తుంగ నీ కులమడుగదు. అడుగుతదా? నా బతుకు నువ్వు సూత్తన్నవా? నాకు పెండ్లిగాదు. మా బయ్యి గట్లనే తిరిగి తిరిగి పురుగులుబడి సత్తది. నేను మనిషినే కని నా మాటెవడింటడు? రెండు ఎయిల రూపాలుంటె నాకు కులమత్తదట... ఏన్నుంచి తేవాలె రూపాలు. ఎవనిల్లన్నా కట్టుక రావాల్నా! త్రువ్వలెల్లె కములపోతుకప్పుడే కోపమత్తందోంట... గంత తెగాయింపె ఉంటె నాకు కులమెందు కుండది..........నీకు సుత నర్సిగాని ముచ్చెట ఇన బుద్దయితలేదా? సెవులు లొటలొటగొడ్తన్నవ్........ నాత్రి పగలు దిట్రగ మేపుతన్న గాయింత గురుత్తం లేదా? ఔనే పోతా నేను తొవ్వొంట బోతోంటే ఊళ్ళె పోరగండ్లెందుకు ఎక్కిరిత్తరు? పడసు లంజెలెందుకు నన్నుసూడంగనే కిసకిస నవ్వుతరు. వీడుత్త బాడ్కావ్ గాడనా? సూపెడుతా నా తడాఖా సూపెడుతా సూడు...ఇయ్యేడు పండిన జొండ్లన్ని అమ్మి ఏటిన్ని రూపాలు కుప్పజేత్త... గుడిసె పీకి గూనిల్లేత్త... తోళ్ళసొంటి గీ బట్టపేగుల పెంటబొందల దొక్కి మల్లెపువ్వసొంటి తెల్లంగీలు దొడుగుత... గప్పుడు సక్కని సుక్కను దెచ్చి పెండ్లాడుత... ఊళ్ళోల్ల కండ్లు పత్తిత్తులోలె గావాలె... నర్సడంటె ఏమనుకున్నరో! ఆయ్.........త్రువ్వలెల్లె........' ఇట్లా కలువరిచ్చెటోడు.

అగో గసొంటి యేల్లన పికిలి నాకు కల్సిండు. పికిలి ఈడు అందరి మొగోల్లతీర్గ నా వొంటిని కోరే ఈడుగాదు. నాతోటి తొందరగనే జత కలిసింది. మరింక నేను ఏ కట్టమీది ఈదుల్లనో... ఏ వాగు కయ్యల్లనో ఒంటిగ కూకుండి ఏడ్వవలసిన పనిలేదు.

పికిలి సూత్తె ఒక్కొక్కపారి కొడుకు తీర్గ కన్పిచ్చెటోడు. నాకు అందరి తీర్గ పెండ్లయితె పికిలికన్న మూడు నాలుగేండ్ల సిన్న పోరో పోరడో ఉండెటోడు. జనుపగింజల దంచుకతిని నాకచ్చిన కడుపులు కరిగిచ్చుకోకపోతేనో?

నాకు నెల తప్పిందంటే ఒళ్ళు తిమ్మిరెక్కేది. మా అవ్వ బతుకు అందుకు కారణం కావచ్చు..... నాకు కడుపైతే ఊరికి ఎక్కిల్లత్తయి. మా గుడిసె పట్టపగటించి పీకి కుప్పబెడ్తరు. దిక్కుమల్లె దినాలల్ల ఎటనిపోము.......... పుట్టబోయెటోల్లు ఆడిపిల్లయితె నా తీర్గ... మొగోడైతే మా అన్నతీర్గ కాకుంట ఎట్ల బతుకుతరు? మరందుసేత మా అసొంటి దిక్కుమల్లె మనుషులు మా ఊళ్ళె పుట్టద్దు. పుట్టిన గసొంటోల్లకు నేను తల్లిని కారాదు.......

'నేనేమైపోతన్న?' నా కప్పుడప్పుడు కలుక్కుమనేది. నాకు నట్ట నడడివిల పొద్దు గూకినట్టు గుండేదిగని... తొవ్వేదే దారేదో తెలిసేదికాదు...మీదికెల్లి ఏ జంతువో మీదదునికి నా కండలు బీకి, నెత్తురు గటగట తాగేత్తదని గుండె దడదడ గొట్టుకొనేది. నేను ఏదో ఓనాడు అందరిలెక్కనే సత్త....కని నాకోసం ఒక్కలంటె ఒక్కలు కంట తడిబెట్టరు. నాతీరుగ ఎందరు పుట్టిండ్లో? ఎందరు గీ ఊళ్ళె మట్టిల గల్సిపోయిండ్లో? ఇప్పుడీ ఊరిని కాలబెట్ట



దాని కుళ్ళు దానికుండనియ్యి.......ఎప్పుడో సచ్చేదానికి ఇప్పుడెందుకు పీకులాట... నాగ్గా వల్సింది నేను పిండుకుంట... దినమంత ఎండల కర్రెపిట్ట తీర్గ పిటపిట మాడితె తవ్వెడు జొండ్లియ్యని లంజకొడుకులు నేను కండ్లుమూసుకొని తెరిత్తె రెండు రూపాలు పారేత్తరు.......నీతిని గోదాట్లె గలుప కడుపునింపుతదా? నాకు కులమే లేనప్పుడు... నా కడుపు మాడిపోతున్నప్పుడు నీతిని నేనేం జేసుకోవాలె... పోని... నా నీతి ఎవనికి గావాలెనంట... అసలు నీతంటేంది?

కడుపుల పిండాన్ని కరిగించుకున్ననాడు నాకు తల మొద్దుబారిపోయేది. ఏడుపుకన్న కనీసమైనది నా బాధ......కడుపుల నాభి కలుక్కుమనేది......... మూగ మొద్దు తీర్గ బావులసుట్టూ తిరిగేదాన్ని. బావిల దునుకుదామనుకొని గడ్డమీన కూకుండి పత్తాయించేదాన్ని. నేనెందుకు సావాలె? ఏ లంజకొడుక్కు బయపడి సావాలె... నేనెందుకు బయపడాలె....ఇట్లా అనుకొని ఎనుకకు తిరిగచ్చేదాన్ని .... గడ్డకట్టుకపోయిన సలికాలపు రాత్రుల్లు... సీకట్ల ఒంటిగ కూకుండి నా గుండెసప్పుడు నేనే ఇనుకుంట బీడిమీద బీడి ఊదేసేదాన్ని... అయినా ఎటూ తోసేది కాదు....ఎంత గింజుకున్నా నన్ను కలవరపెట్టే సంగతేందో తెలిసేదికాదు... తిమ్మిరి ఒదిలేదికాదు.......ఇట్లా కాదని అడివిల సారాయిబట్టి కాడికి పోయిన.

నేను మొదట్ల సాపుసీదా బట్టి ముంగట నిలబడి తెనుగు ఎర్రన్ని సారా కావాలన్న... ఎర్రడు కుక్కతీర్గ నా వొంటికెళ్ళి సూసెటోడు. నేను నవ్వేదాన్ని... బొమ్మేడు పొదల్ల ఆడు కుక్క తీర్గనే నామీద బడెటోడు. అటెంక నేను తాగినంత సార పోసెటోడు. సారా కైపెక్కినంక లచ్చన్ని కొమురన్ని నేనే కవ్వించేదాన్ని. అట్లా ఒళ్ళంత దుమ్ముకొట్టుకపోయి తూలుకుంట పిచ్చిపదాలు పాడుకుంట ఊళ్ళె సొచ్చేదాన్ని.

ఆడముండలు నన్ను సూసి దడుసుకునేటోల్లు... ఆళ్ళ కండ్లల్ల గుబులు సూత్తెనే నాకు కారం రాసినట్టుగుండేది. "ఒసే లంజె నాసవుతులాలా! నేను మీ అందరికన్న కుషామతుగ తిరుగుతన్న... మరి మీరో సాలీసాలని కూళ్ళతో... తలకు తల సమరులేక కంపలసొంటి తలతోటి... ఎండకు వానకు ఎండి నాని సీకిపోతండ్లు.... పన్జేసి పన్జేసి పిప్పిగ మిగులుతండ్లు... మీరంత మాదండి సంసారులు... మీ సంసారాలు గుడిసెల్ల ముక్కిపోతే... నేను బయట మురిగిపోతన్న... బస్ గంతే తేడ.......మీ రొక్కనితోనే లంజెరికం సేత్తే... ఎందుకులే....." సొలుగుతూ తిడుతూ నేను ముంగటికి నడిసేదాన్ని.

మొగలంజకొడుకులు ఊసిపోయిన నా ఎంటికలకెల్లి, సినిగిన నా రయికెల నుంచి ఈతలబడ్డ రొమ్ముల దిక్కు పెదువులు నాక్కుంట సూసెటోళ్ళు. అచ్చం కుక్క సూపులే... పడుసోల్లెదురైతే ఆళ్ళ ముఖాలమీదికి వంగి "వారీ మీ అక్కనురా?" అని పగలబడి నవ్వేదాన్ని... కొంచెం పెద్దోల్లయితే "మీ బిడ్డనురా!" అనేదాన్ని.

ఆళ్ళు ఆళ్ళ అక్క సెల్లెండ్లను, బిడ్డలను నాతీరుగ సూసుకొని గింజుకుంటారని నేననుకునేదాన్ని.


www.eTelangana.org

బిచ్చగాళ్ళ నారిగాడు ఎదురైతే నాకు బయమయ్యేది. ఆడు నాకెళ్ళి సూడకుంటనే "బయ్యవ్వా! నీకు గిది బనావు గాదు తల్లి! నీ కోపం నిన్నే నిలువుత ముంచుతది. నువ్వు ఊరుమీది కోపాన్ని నీమీదనే సూపుకుంటన్నవ్ తల్లీ!" అనేటోడు.

మొట్టమొదటిసారి నేను తాగచ్చినప్పుడు మా అన్న తన్నిండు. రానురానూ నాకు తన్నులు అలివైపోయినయ్. ఆనికి విసుగచ్చింది.

అగో గట్ల నేను ఉట్టికి సర్గానికి అంటకుంట బతుకుతున్నప్పుడు పికిలి నాకు కలిసిండు... నేను తిక్కలేసి ఏది వదిరినా పికిలికి తెలిసే ఈడుగాదు. పికిలికి నా మాటలు సిత్రంగా సంబురంగా తోసేవి. పికిలిని సంబుర పెట్టేటందుకోసం నేనెన్నో శాత్రాలు అల్లి సెప్పేదాన్ని.. పికిలిని నిద్రపుచ్చేటందుకు పదాలు పాడేదాన్ని... పికిలి పిల్లగాని సేట్టలు, సూపులు, మాటలు వింటంటే నాకు గమ్మత్తుగా, హాయిగా ఉండేటియి. నేను సుత పికిలి ఈడంత దాన్నయిపోయి... సిన్న నాడు ఏయే సంబరాలనైతే పోగొట్టుకున్ననో గయ్యన్ని గిప్పుడు తీర్సుకునేదాన్ని.

కాని నా దిక్కుమల్లె బతుకు నీడ పికిలిమీద బడ్తుంది. ఓమారు ఉన్నట్టుండి తనకో బీడి కావాలెనన్నాడు. నేను అదిరిపోయిన.

నా దగ్గరికచ్చే మొగిలయ్య పికిలి ముంగట మోటుగ ఏదన్న అంటడేమొనని బయపడేదాన్ని... మంచెమీదనే మా యిద్దరి సర్గం. గందట్లకు మొగిలిగాడు రావటానికి వీల్లేదు. గందుకనే అడచ్చినపుడు కిక్కుమనకుండ ఆనెంట పడిపోయేదాన్ని... పికిలి తెల్లారి ఆ సంగతి ఎత్తుతాడేమొనని కలవరపడేదాన్ని... గందుకనే పికిలిని ఏదీ మాట్లాడనియ్యకుంట ముందుగాల్నే శాత్రం మొదలేసేదాన్ని... కని పికిలి కియ్యన్ని యాదికుండేటియి గావు.

మేమిద్దరం ఎన్నో పారీలు పసిపోరగండ్ల తీర్గ బరిబాత సొట్లవాగుల ఈతలు గొట్టెటోల్లం. కాని ఎన్నడు పికిలి ఉలికి పడలేదు. ఆనాడు పికిలి కండ్లల్ల అదేమంట. గ మంటే నన్ను సత్తెనాశనం సేసింది. గ సూపు ఖచ్చితంగా మొగోనిది... పికిలి నన్ను అలుముకున్నడు. నా రొమ్ములమీద ముద్దిచ్చుకున్నడు. నా పెయ్యి జడితిచ్చింది. నాకు నోటమాట రాలే... కాలుసెయ్యి ఆడలే... పికిలి ఈడెంత? పికిలి మొకంలకు ఎన్నోపారీలు గుచ్చి గుచ్చి సూసిన... మళ్ళా అలాంటి నీడలెవ్వి కనిపియ్యలేదు.

పికిలిని నేను సెడగొడుతున్నానేమొ? ఏది ఏమైనా ఇకముందు పికిలి ముంగట గసొంటి పనులు సెయ్యొద్దు. గిట్ల అనుకున్న కాన్నుంచి... మొగిలయ్య దూరంగ గన్పియ్యంగనే ఏదో వంకబెట్టి నేనే పోతన్న. నామాటల్ల బూతురాకుంట జాగర్తపడుతున్న. మాటలన్ని మళ్ళా కొత్తంగ నేర్సుకుంటన్న.

గిట్ల నేను పికిలికోసం మార్తన్న యాల్లనే ఆడు... డబ్బుడుకం గౌరడు దాపుర మయ్యిండు. పికిలినుంచి ఏ సంగతి దాయాలనుకున్ననో గదే వాడు ఖుల్లంఖుల్లా



సేసిండు. అదిగాక ఎంత సెడ్డదాన్నయినా తండ్రి కొడుకు... లిద్దరికి ఒళ్ళమ్మటానికి నేను పసురాన్ని గాదు...గిది కొత్తసంగతే... అంతకు ముంగట నాకు గసొంటి పట్టింపు లుండేవికాదు. ఏ మొగలం...కొడుకు సూపులైనా గవే కుక్కసూపులు. గయ్యన్నిటికి నేను ఇలువిచ్చేదాన్ని గాదు.

అగో ఆనాడు అట్ల పెద్ద గడబిడ జర్గింది. నాకెందుకనో సంబురం గల్గింది.

పికిలి తోటట్టుగ పికిలి తల్లిదండ్రులతోని నాకు మాట కలుత్తంది. పికిలి అవ్వను సూత్తె ఎందుకనో నాకు గుండె లబడదిబడ కొట్టుకొనేది... ఆమెకు నా గురించి అన్ని సంగతులు ఎట్ల ఎరికయ్యేవో నాకు తెలిసేదిగాదు. ఆమె అప్పుడప్పుడు నా గురించి దీనంగా, మందలిచ్చుకుంట ఏందేందో సెప్పుకచ్చేది... పికిలి తండ్రంటే నాకు మొదటినుంచి గురుత్తం...

నేనెన్నో పారీలు తాగిన మైకంలో అతని కెదురుపడ్డ. గ గుబురు కనుబొమ్మలు ముడుసుక పోయేటివి. "నీ బిడ్డను......" అన్నమాట నా గొంటికలో గురుగురలాడేది. అతను తలంచుకొని ఏదో ఇసారం సేసుకుంట పోయెటోడు.

ఓపారి సవుళ్ళమీద పూట్గ తాగి బుడుగుల కానక దిగబడిపోయిన. బురదల అంతకంతకు కూరుకుపోవుకుంట బయటపడే తొవ్వలేక నిషల ఎటూ సమఝ్ కాక బురదల తప్పడ తప్పడ చేతులు కొట్టుకుంట ఏందో పదం పాడ్తన్న... పికిలి తండ్రి బుడుగులనుంచి జబ్బలు బట్టి బయట కీడ్సి నీల్ల మడుగుకాడ దించి పోయిండు.

ఆదినం నాత్రి కములవ్వ చిన్ని సెప్పిన మాటలు "బయ్యీ ఆడిదాని బతుకు అసలే బుడుగు... మరిత్తివా గంతే. ఎంటికలు సుత గన్పియ్యకుంట మునుగుతవ్!"

బతుకు గురించిన ఇసారాలు ఎప్పుడు మొదలైనయో గప్పుడే నాకు కట్టాలు షురువైనయి.

మొట్టమొదటిసారిగ గౌరనికి ఎదురు తిరిగిన నాత్రి తెగ ఇసారాలు సేసిన. 'నేనెందుకు గీ పని జెయ్యాలె' అనుకున్న... నడిఝాము నాత్రిదాకా నాకు గి దీనికి జవాబు దొరకలే... బీడి ముట్టిచ్చినప్పుడు బీడిలకోసమనుకున్న, సారా యాదికచ్చి గదానికోసమే అనుకున్న. సారా ఎందుకోసం అలువాటయ్యింది?.... తెల్లారినంక కూడుముంగట కూకున్నప్పుడు కూటికోసం కోటి విద్దెలనుకున్న. మా అన్న గన్పించి నప్పుడు... మా అన్నకు రూపాలు కూడబెట్టి కులం తెప్పియ్యాలెననుకున్న..... ఇంకోపక్క ఇంకో గొంతు. గిది కొత్తగొంతు. 'ఇవ్వార్దనుక ఎంత కూడబెట్టినవ్...' అంటంది.

"ఇకముందు కూడబెడ్త..."

"నీబొంద...."


www.eTelangana.org

"బతుకు తెరువుకోసం నా దగ్గరున్నది అమ్ముకుంటే తప్పేంది?...."

"గట్లనన్న ఏడ్వరాదు. మరి అందరు గిదేపని జేత్తండ్లా?"

"అందరిని తుంగలో దొక్క... నేను అందరసొంటి దాన్ని గాదు. గ అందరి జోలంటేనే నాకు రోత"

"వారెవ్వా! దీనితోని నాశిడవయ్యే దెవలు?"

"నేను నాశిడం కావద్దు?"

"ఏం ఎందుకని... బతికేం బావుకుంటవట"

"ఏదో ఒకటి... నీ కెందుకోంట మజ్జెన"

"గౌరనికి సై అంటే గీ పీకులాటుండక పోవునేమొ?......"

బువ్వల సెయ్యి కడిగి లేసిపోయి ఆకిట్లకచ్చిన. ఆకిట్ల బక్క కుక్కోటి కడుపు పీడ్చుకపోంగ కుయ్యికుయ్యి మంటుంది. దాని కండ్లల్ల సెప్పరానంత ఆకలిమంట... లోపటి కురికి నా కంచలది దెచ్చి దాని ముంగట కుమ్మరిచ్చిన... అది తోకూపుకుంట ఎగబడి తింటంది....

"ఆడు రేపు మా సేను ఒర్రంగ గుంజుకుంటడు."

"గుంజుకోనియ్యి అని తాడు దెంప... ఇయ్యాల్ల ముసలి గౌరడు. రేపు అసొంటి గద్దలు నా పెయ్యిల ఆఖరి నెత్తురు బొట్టుదనుక గుంజుక తాగుతరు. ఆఖరి మాంసపుముక్క పీక్కతింటరు......"

"ఆడు మీసేను గుంజుకుంటె మీ అన్న నర్సడు ఉరిబెట్టుక సత్తడు."

"సావనియ్.... గదిసుత సూత్త"

"కని అట్లా ఒప్పుకోను.....ఒప్పుకోనంటే ఒప్పుకోను." గ న్రాత్రంత గట్ల నా అండ్ల నేనే గులుక్కుంట కూకున్న.....నేను పుట్టి బుద్దెరిగిన కాన్నుంచి గింతలావు పరిషాన్నెప్పుడు కాలే... పికిలికి గిదంతా సెప్పుకొని ఎడువాలనిపిచ్చింది. రెండు మార్లు ఆకిట్లకు బొయి ఎనుకకు దిరిగచ్చిన. మా అన్నను లేపి, "ఒరే అన్నా! నీ సెల్లె గుండె బగ్గున మండి బొగ్గయి పోతందిరా!" అని ఏడువాలని పిచ్చింది. కాని వానికిది తలకెక్కదు. మా అవ్వను లేపి "అవ్వా! అవ్వా! నీ కూతురు కాలి కూలిపోతందని" చెప్పాలనుకున్న. కాని లాభం లేదు......

అయ్యో! గీ సీము నెత్తురున్న మనిషి మాట్లాడి, నవ్వి, ఏడిసే మనిషి ఎంత ఒంటరిదై దిక్కులేని పచ్చయిపోయింది. గీ ఊరినిండా మనుషులున్నరు. ఒకల కట్టసుకము మరొకలు పంచుకుంటరు. కాని నేను మాత్రం గీ దిక్కుమల్లె న్రాత్రి... గీ



చండాలపు న్రాత్రి... గీ గుడిసె ముంగట... దయ్యం తీర్గ ఉలుకని పలుకని సింతసెట్టు కింద... సీకట్ల ఒంటరిదాన్ని. నాతో పక్కపక్క పండి ఎయ్యిముచ్చెట్లు సెప్పి కుతిదీర్సుకున్న ముండకొడు కెవనికన్న నా దుఃఖం పట్టిందా? ఎంత దగా గీలోకంల... ఎంత మోసం గీ జగతి .... పసురాలు యిట్టాయిట్టాల తోటి కలిసిపోతయి. కాని గీ మనుషులు... సీ!సీ! ఆ గవులుగొట్టే నరకం నాకద్దు... ఆ కంపు నాకద్దంటే అద్దు....... నేను అందరితీర్గ ఎందుకు బతుకలేనో అదీ సూత్త... అందరి తీర్గనే కోతలు గోత్త - మోతలు మోత్త... కలుపులు దీత్త... నాట్లేత్త...... అదీ కాదంటే బంటపనిజేత్త... ఆళ్ల చేండ్లల్ల సెలకల్ల నా నెత్తురు ఒడుప దలుసుకుంటే ఆళ్ళకు కుల మక్కరలేదు. మాదుగులు మన్నేలు సేయటం లేదా? రేపు ఏదైతే అదీ గాని..." అనుకొని సమాధాన పడ్డ...

"ఇంకో దిక్కు గీ పీకులాటెందుకు? తలకు వాసిన ఎంటికవు నువ్వు... ఏ రేవున పోతే గిప్పుడు పట్టింపేంది? గౌరన్ని...."

"నీకు సిగ్గూ శెరం లేదు..." మంచాల కూకుండి నా గొంతు నేనే పిసుక్కున్న... ఎటూతోసక సింత నీడనుంచి బయటికచ్చి లేత ఎన్నెట్ల కసేపు అటిటు తిరిగిన... లేత ఎన్నెట్ల నాకేసి నేనే చిత్రంగ సూసుకున్న... గీ అందమైన నా వొంటిమీద నాకే సెప్పరానంత రోత గల్గింది.

అట్లా గుంజుటాన పడంగనే తెల్లారింది. చింత బొర్రెల బయంబయంగ తొంగిసూసే పైడికంటె నన్ను ఓదార్స కూసింది.. సానాసేపు దాన్నే సూసుకుంట నిలుసున్న... దాని బతుకు సుత ఎంత ఒంటిది, ఎంత వికారమైంది? మిగతా పిట్టలు దాన్ని సూత్తె సాలు పొడువత్తయి. గందుకనే అది బయంతోటి బొర్రెల దాక్కుంటది. దాని గొంతుల పొరలు పొరలుగ తను అన్ని పిట్టల తీరుగ ఎగురాలనే కోరిక పలుకు రూపంల బయటపడుతది. నేను పైడికంటెనేనా?

నేనిట్లా పైడికంటెను సూసుకుంటుండంగనే మా యింటి ముంగట సుంకరోడు ముని తీర్గ నిలుసున్నడు. ఆడు సెప్పిన మాటిని మా అవ్వ మాట పడిపోయినదాని తీర్గయిపోయింది. మా అన్న అట్లకాలే... ఆడెప్పుడో గిసొంటి దత్తదనే అనుకున్నట్టుగున్నడు. సానాసేపు మాటపలుకు లేకుంట బరబర నెత్తి గోక్కుంట నిలుసున్నడు. వాని నెత్తిమీది ఎంటికలు ఎన్నెల్లవో? నెత్తి నిండా మన్ను... అడ్డదిడ్డంగా పెరిగిన ఎంటికలు గాలికి ఎగురుతున్నయి.

సుంకరోడు పోయినంక మా అన్న ఎటూ తోసక మంచాల దబ్బెల్లున కూలబడి పోయి మోకాళ్ళమీద గద్దువబెట్టుక కూకున్నడు. ఆని మొకంల సెప్పరాని దిగులు. సగం రిక్క పొవాకు నుంచుకొని నోట్లేసుకున్నడు. దున్నపోతు నెమరేసినట్టు దవడలు ఆడిచ్చుకుంట నములపట్టిండు. వాని గడ్డంసూత్తే నాకు రోత బుట్టింది. మరో నిముషంలనే 'అయ్యోపాపం' అనిపిచ్చింది.

"అన్న గ సౌరం జేయించుకోపోయినవ్...." గీ మాట నాకే వింతగా తోసింది. నా నోటినుంచి గిసొంటి మాటిని కళ్ళెత్తి సూసిండు...


www.eTelangana.org

"బయ్యి...." గీ పిలుపు కొత్తదే.

"గౌర డెందుకు పిలిసిండో నీకేమన్నా ఎరికేనా?"

నేను తప్పిచ్చుకోవాలనుకున్న... కని నాకు అవద్దం సెప్పబుద్ధికాలే.

"ఆనికి నేను గావాల్నట..." నేను గుడిసెల కురికి పొయ్యి అంటించిన. మంట....నాల్కలు సాపుతూ వొంపుసొంపులు తిరుగుతూ మంట... కట్టెపుల్లల్లెక్కన్నో తునికి కట్టె ఉన్నట్టున్నది... సిటసిట సిట్లుతంది. మంటను సూసుకుంట కూకున్న.

"వానవ్వాన్ కుక్కల్ దె......." గుట్టమీదినుంచి గుండు దొర్లి గుబెక్కున బడ్డట్టు వినపడ్డది... నేను బయటికచ్చి సూసిన... మా అన్న లేడు......జర్గబోయె విపరీతం గురించి ఇసారాలు సేసుకుంటనే కూడండిన... పొద్దెక్కుతాంటే నాకాళ్ళు ఉయ్యాల లూగబట్టి నయ్. గీ ఊళ్ళె గిది తప్పని ఎవలన్నా సెప్పలేరా? గీ అన్నాలెం... అక్కురం ఆపలేరా? ఆ లంజకొడుకు లందరి మెడలు పుటుకు పుటుకున ఇరిసేయలేరా? ఒరే మాట్లెకిట్టా నీ ఇరన్నకసిపున్ని ఇరిసిన నర్సిమ్మ సామి నిటు తోలరాదుర నీకు పున్నెముంటది?

సూరుకింద ఓట్లె సేతులు బెట్టుకొని ముట్టయిన దానితీర్గ కూకున్న... ఏదన్నాలెం? వాడు నన్ను రమ్మనుడా? ఎట్ల సెప్పాలె? ఎవలకు సెప్పాలె? ఎవలు నా మాటింటరు? ఆడు అన్నంత పని జేత్తండు. నాకు సప్పున ఓ ఇసారం తట్టింది.

మొగిలి గాన్నడుగుతె... ఆడు పెద్దమనిషిగ గిప్పుడే ముంగటి కత్తండు. ఆనికోసం ఊళ్ళె అటిటు దిరిగిన... మొగిలిగాని భవంతి పొంచి కూకున్న పెద్ద పులి తీరుగున్నది. అప్పుడే జనం ముచ్చెట్లు బెట్టుకుంట... నన్నుసూసి కండ్లెగరేసుకుంట... గుసగుసలాడుకుంట... మూడు పానాదులకాడికి బోతండ్లు... లోపటి సంగతి ఈల్లకేం దెలుసు?

మొగిలిగాని పెండ్లాం బజారరుగులు అలుకుతంది. ఇంకా వడగాలులు సోకని మొక్కతీర్గ నాజుకుగ అందంగ ఉన్నది.... లోకం సంగతి తెలువని పసిపిల్ల కండ్లు... నీ మొగడు బద్మాషి అని చెప్పుతే ఏమనుకుంటది? ఏమనుకోదు......... వాకిట్ల నిలుసున్న... ఎట్లా పిలువాన్నో తోసలేదు. నేను ఎనుకకు తిరుగుదా మనుకునేటాల్లకే ఆడొచ్చిండు.

నన్ను సూసి చూడనట్టుగ సరసర నడువ పట్టిండు.

"మొగిలీ! జబ్బలదాక నీల్లచ్చినయ్. నేనేగాదు. నా కొంప మునుగుతంది" గులిగిన.

వాడు కోపంగ సూసిండు. ఆని పెండ్లాం అలుకు పిడుస బట్టుకొని సోద్దెం సూత్తంది.

"అడ్డమైన లంజలందరికి ఏ యేల్లల బడితె ఆయేల్లల అప్పులు గావాలె... నా దగ్గెర గిప్పుడు సిన్న కొత్త లేదు పో......" ఆడు మాట మార్సి సరసర కాటేసి పుట్టల కురికిన పాము తీర్గ ఎల్లిపోయిండు.



"ఓసి కుంటి నా కొడుకా! నీ నోట్లె సాడుగదరా?" కసిగా తిట్టిన... ఆ పిల్లకు ఆ తిట్టు సరిగ తెలువలె. వాన్ని ఆపి ఆ దవడ ఈదవడ పగుల గొట్టాలనిపిచ్చింది. ఈ కుంటి ముండకొడుకు... గీ సెముటకంపు పొట్టోడు. ఒరుసుకపోయే నల్లరేగడి పెళ్ళల్ల జొన్నకర్రల నీడల కూకుండబెట్టి ఎన్ని తియ్యటి మాటలు సెప్పిండు... వీని తాడుదెంప ఈనికి పరువు గావాల... బయ్యి అవుసరం జొన్న సేండ్లనె... జొన్నసేను గట్టెక్కినంక వీడు పెద్దమనిషి... బయ్యి లంజ...లంజ........ లంజ........ కాండ్రకిచ్చి ఉమ్మేసి తిరిగచ్చిన.

అప్పటికే మూడు పానాదులకాడ మంది జమకూడిండ్రు.

నా కాళ్ళు అనుకుతన్నయి. ఎందరో మా అసొంటి దరిద్రులందరి తీర్గనే మా నర్సన్ని ఆ మూడు పానాదులకాడ ఒక్క నెత్తురుబొట్టన్నా కారకుంట తల నరకుతరనిపిచ్చింది....

పక్క దడి గలుమలగుండా పెరండ్ల మీది నుంచి గుడిసె సేరుకున్న. గుడిసె గొళ్ళెం వేసున్నది. గుడిసె పనుగడి గుండ కుక్క కూనొకటి నన్ను సూసి ఈతలి కచ్చింది. మూతికి కూడంటి ఉన్నది. కుక్కలు ముట్టిన కూడు. కుక్కి మంచాల కూలబడిపోయిన... తల పగిలిపోతంది. ఆ నడిమందిల కురికి "వారి దబ్బుడుకం గౌరిగ... ఇగో నా ఒళ్ళు తీసుకో...." అని మొత్తుకోవాలనిపిచ్చింది.

దారెంట ఎవలో వత్తండ్లు. ఎవలో పోతండ్లు. ఆ అడుగుల సప్పుడు దడేలు దడేలుమని ఇనబడ్తంది. కొమ్మల్లెక్కన్నో పైడికంటె లోకం మునిగిపోతందన్నట్టుగా పలుకుతంది..

గుడిసె బయటికచ్చి ఎనుకకు సూసిన... నా గుండె నాకె లకలుకలైన పెద్ద బండి కంకరాళ్ళమీద ఉరికినట్టుగా ఇనపడ్తంది. దూరంగా అడివి గన్పిత్తంది. గోండోల్లు అతారె లేకుంట గుడిసె దాటరు, నాలుగైదేండ్ల కిందట గావచ్చు ఆడివిలున్న గోండు గుడిసెల్ల 'బడితె పూజ' సూసిన.... నేను గొడ్డలందుకొని గౌరిగాని తల నరికితే గ పని గీ ఊళ్ళె గాకుంట సేండ్లనె సేత్తె పీడబాసు. నన్ను జేల్లకు పట్టుకపోదురు.......మొగిలిగాడు ఇయ్యేల్ల ఆని అయ్యేం జేత్తండో ఆడు గదే సేసెటోడు. మరిగ దీనికి ఆఖరెక్కడ?

ఎటూ మనసొప్పక ఏం జరుగుతుందోనని మంది దగ్గరి కురికిన. నేను బోయె టాల్లకు మా అన్నగాడు మా అవ్వను గుద్దుతండు. నేను ఉరికిన... ఆడ కూకున్నోలందరిని కసితీర తిట్టాలనుకున్న... కని గొంతు పెకులదే... మా అవ్వను లేవదీసుకొని ఏదో అన్న. నా శరీరం నా అదుపుల లేదు. మా అవ్వను దీసుకచ్చి గుడిసెల కూకుండబెట్టిన... నా మెదడు మొద్దుబారిపోయింది. ఏ ఇసారం లేకుంట ఆకిట్ల కుప్ప తీర్గ కూలబడిపోయిన... సింతకొమ్మల్ల కత్తిరిచ్చిన ముక్కలతీర్గ మొగులు... సింతబొర్రెల దాని సావు నిర్సావుగాను... పైడికంటె గుడ్లు తిప్పుతంది.


www.eTelangana.org

ఎవడో ఏడుపుపాట నత్తినత్తిగా పాడుకుంట పోతండు. ఆన్నాపి ఆ పాట పాడకని ఈడ్సి దవుడ మీద గుద్దుతే....

"అయిపోయింది... అంతా బగ్గన మండి బొగ్గయిపోయింది, ఆళ్ళ నోట్లె గలుగులు" మా అవ్వ........

✧

# 10

అది జరిగినంక ప్రతిదానికి నేను నిలువెల్లా వణికిపోయిన. నన్ను సూత్తెనె నాకు బయం. నా నీడను సూత్తెనే బుగులు... మా అన్న ఇంకా కిందామీద పడ్తనే ఉన్నడు. ఆడు సొప్ప బండ్ల కడ్డంపన్నంక పెద్దొర మనుషులు గౌరయ్య తరపున్నే నిలబడ్డరు. నాకప్పుడు తెలిసొచ్చింది. గీ ఊళ్ళె జరిగే పతిదానికి ఏదో పీటముడున్నది. ఎవరి బతుకులాల్లయి గావు. వీటన్నిటి అతుకేందో ఎంత ఇసారం జేసిన తెలిసేదిగాదు. గౌరయ్య పక్కన దొర నిలబడ్డడు. పెద్దమనుషులు నిలబడుతరు. బూములు సేతులు మారటం గిదే కొత్తకాదు. ఏదో ఒక మిషతోటి గరీబోడు పంచాతుల ఏడుసుకుంట... తిట్టుకుంట నిలబెట్టబడుతడు. పండిన పంట... పెంచిన పసురాలు... దున్నుకునే బూములు... అన్నీ అన్నీ కాళ్ళచ్చినట్టు సేరేకాడికి సేరిపోతయి... తప్పులు...తప్పులు...తప్పులన్నీ గరీబోల్లవే.... బూములు పొంగ ఏడుసుడేకాదు... ఎదురు దిరుగుతరు. కని అప్పటికే కుందేలు పిల్లకు నాలుగు దిక్కుల్ల ఉరులే ఉంటయి...

గీ ఏడుపులు ఎప్పటినుంచో సాగతున్నట్టుగనే అనిపిచ్చింది. మరినేను, ఇదివరకున్ననా? ఏ రూపంల... బయ్యాలు ఇదివరకున్నరా? మా అవ్వ రాజి నాకు అసలు రూపు కాదా? మా అవ్వ గిట్లనే నిలదీయబడలేదా?

"ఒరి నీ ఉచ్చులుగాలా?" నా లోపట సుళ్ళు దిరుగుతున్న గీ కొత్త ఇసారాలతోని కోపం పెరిగేది. గీ కోపమే నాకు నరకం తీర్గ తయారయ్యింది.

ఒక్కొక్కపారి నా పాతబతుకు మళ్ళా మొదలుపెట్టాలనిపిచ్చేది. బీడీలేక నామెదడు మొద్దుబారేది. సారాలేక నా నరాలు తిమ్మిరెక్కేవి....

పికిలి కనిపించక అయిదు దినాలయ్యింది. అయిదోనాడు మాపటించి అచ్చిండు పికిలి. నా ఒట్లె కూకుండబెట్టుకొని మొత్తం ఏడుపు కడిగేసుకోవాలన్నట్టు ఎక్కెక్కి ఏడ్సిన... నేనెందు కేడ్తన్నట్టు...

గ నాత్రంత పికిలి నాదగ్గర్నే పన్నడు. నా పెయ్యి కాలుతంది. జెరమచ్చింది. పికిలి ఏం మాట్లాడలేదు... పికిలికి గీ సంగతులన్ని తెలుత్తన్నయి... ఆ సూపు.......తెల్లారి పికిలి ఏం మాట్లాడకుంటనే ఎల్లిపోయిండు.



సేనుకోసం, పంటకోసం సేసిన ఆఖరి పని దెబ్బలతో తీరటంతోటి మా అన్న మాట్లాడటం మానకున్నడు. మా అన్న మామూలు మనిషయేటందుకు పది దినాలు బట్టింది. ఓపికగా ఆనికి దినాము అయిలాకు నీళ్ళు పోసేదాన్ని...దెబ్బలకు ఎంపలాకు ఉడుకబెట్టి కట్టేదాన్ని...

ఇంట్ల గాసం అయిపోతంది. ఏదో ఒకటి సేయక తప్పదు. ఇయ్యేడు పంట గంగల గల్సింది. జొన్న కోతలన్ని అయిపోయినయి. ఇప్పుడిప్పుడే తావుగూళ్ళు విరుపులు పట్టరు. మరేం పని సేయన్నో తోచలేదు. ఇట్ల అనుకుంటుండంగనే మాగుడిసె ముంగటినుంచి మాదిగ శాయన్న తట్ట, గడ్డపార పట్టుకొని పోవుకుంట కనిపించిండు. అతనెంట ఇంకో నలుగురున్నరు.

శాయన్న నాపి నేను అత్తనన్న. ఆడు అంకర పెదువులిప్పి తొర్రిపండ్లు కనిపిచ్చేటట్టు నవ్విండు.

"మీతోటి బంటపనికి నేనత్త."

"గిది కోత మోత పనిగాదు. బంటపని."

"అయితేంది?"

ఆడు ఏమనుకున్నడో ఏమో నన్ను కిందికి మీదికి సూసి "సరెరా! సద్దితెచ్చుకో" అన్నాడు.

నేను సద్ది ముళ్ళె గట్టుకొని ఆనెంట బొయిన... మొదట ఊడుగు పొరకమట్టి తట్ట నెత్తిమీది కెత్తుకోంగనే మెడ ఆ బరువుకు జివజివలాడింది. కాళ్లు అనికినయ్.

గాంగులోల్లు కిసకిస నవ్విండ్లు...

"దుద్దత్తెరి. గాడ్డులతీర్గ ఏందిరా గ నవ్వు......ఏంగాదు, కూసంత కొద్దికెత్తుకో...గదే అలివైతది" శాయన్న.

ఆయస పడుకుంటనే పొద్దంత తట్ట మోసిన... నాపెయ్యంత మన్ను నిండి పోయింది. సెమటల జాకెట్టు తడిసి మన్నుబడి ఉప్పుదేలి అట్టగట్టినట్టయినది. నెత్తిమీని ఎంటికలు పిడుసగట్టినయి. ఎండకు నా మొఖం మాగిన పెంకయిపోయిందని శాయిలన్నడు.

"బయ్యవ్వ నేను మెచ్చిన... మన రెక్కలెవ్వడు గుంజుకోడు. అంతలావయితే కాయలు గాసిన గీ రెక్కలే మర్రేసిన వనుకో కత్తులే తల్లీ....!" శాయన్న మెచ్చుకున్నడు.

గ దినం నాత్రంత పెయ్యంత ఒకటే పోటు. మా అన్న అద్దుమ రాత్రి నా మంచం దగ్గెరకచ్చి తన సేతులల్లకు నా సేతులు తీసుకొని అరిసేతులు పునికి సూసిండు. నా సేతుల ముద్దిచ్చుకున్నడు. నా సేతులమీద ఎచ్చటి కన్నీళ్ళు.....


www.eTelangana.org

మా అన్న నా కోసం ఏడుత్తండు. వాని నెత్తురు నాకోసం పొర్లుతంది. "అన్నా నువ్వు మనిషివే... నీకు ఏడుపెరికె... అన్నా! అన్నా!! నువ్వు నా కోసం ఏడుత్తన్నవా?" అంతదాకా కండ్లు మూసుకున్నదాన్ని దిగ్గున లేసి వాని సేతులు పట్టుకున్న... మా అన్న కుమిలి కుమిలి మనిషంతా సుడిగాలికి కదిలిన సెట్టు తీర్గ ఊగుకుంట ఏడ్సిండు. నేను పిచ్చిదాని తీర్గ ఏందో అంటనే ఉన్న. ఏడ్సుకుంటనే నా కాళ్లు మొక్కిండు.

నాగొంతు పిసికేత్తన్నట్టుగ... నా కడుపుల ఎవలో చెయ్యేసి దేవుతన్నట్టుగా....

తెల్లారక ముందే మా అన్న నన్ను ఉషారుగా కేకలేసి లేసిండు. అంపుకుండల్ల నీళ్ళున్నయి. వాడే తెచ్చిపెట్టిండన్నమాట... నేను జెప్పజెప్ప కూడండిన... మా అన్న ఎక్కడియో రెండు బొక్కితట్టలు తెచ్చి తాళ్ళతో బాగుసేసిండు. ఇద్దరం సద్ది గట్టుకున్నం. శాయన్నోల్లు రాగానే ఇద్దరం వాళ్ళతోటి బయలెల్లినం... అన్న నేను పొద్దంతా పనిజేసినం.

మూడోదినం మా యిద్దరి కొచ్చిన కయకలి ఇరవై అయిదు రూపాలు...గ కాయిదపు నోట్లు పిడికిట్ల ఎచ్చంగ. కాసేపు నా మతిపోయింది. గీ కాయిదపు నోట్లకోసం ఎందరు ఎన్ని తీర్ల పుల్లెందులు పడ్తన్నరో గదా? గుండె కదుముకున్న... నా నెత్తురంత ఎచ్చంగ........నా ఎదురుంగ పికిలి నిలుసుండి సూత్తండు.

"బయ్యక్క బంటమోసి సంపాయించింది పికిలీ! గీ రకం కోసం నేనెంత సెముటడిపిన్నో! నా సేతులు సూడు పికిలీ ఎట్ల కమిలిపాయినయో! నా కాళ్లు సూడు పికిలీ ఎట్లా సీరుకపోయినయో! నా ఈపు సూడు పికిలీ ఎట్లా మాడిపోయిందో?" గిట్ల సంబరంగ సెప్పుకపోయిన.

పికిలి ఏందో అడుగుతండు. నాకేమీ ఇనిపిత్తలేదు. నాకెన్నో పదాలు యాది కచ్చినయ్... నా మనుసుల ఎన్నో రాగాలు పోటెత్తుతన్నయి ఆ నాత్రి పికిలికెన్నో శాత్రాలు సెప్పిన... ఎన్నో పదాలు పాడిన... పికిలి ఇంతకు మొదలు ఇన్నయి కానేకావు. గీ కథల్ల పాటల్ల ఆఖరుకు దేవానదేవతలు రాచ్చాసుల సేతుల్ల సచ్చిపోరు. దేవతలకు రెక్కలు పుట్టుకత్తయి. రాకాసులు మొత్తుకోంగ దేవతలు ఆకాశంలకు ఎగిరిపోతరు...

పికిలి రోజు మాయింటికి అత్తండు. నేను రోజు శాత్రాలు సెప్పుతనేఉన్న. దినాం బంట తట్ట మోస్తనే ఉన్న. సుత్తెతోటి భగభగమండే కంకర గొడ్తనే ఉన్న... కట్రలు నరుకుతున్న ....జొన్నకంకి ఇరుత్తన్న. ఇంకా ఏపనైనా సేయగలను. గిప్పుడు మొగిలిగాని బుడ్డిమూతి ఎంగిలి ముద్దుల భరాంచి బీడికట్టో, మాసిపోయిన రూపాయి నోటో నాకు అవుసరంలేదు. ఎర్రోని సారాకంపు మొఖాన్ని భరాంచి సారా తాగాల్సిన పనిలేదు. నేను తట్టతోటి, పారతోటి, గడ్డపార, సుత్తె, కొడవలితోటి నా కడుపుకు నేను సంపాయించు కోగలను. ఎవలను 'దేహీ' అని అడుక్కోవలసిన అవుసరం లేదు.

నాకు గిప్పుడు కులాన్ని కుంట్లబెట్ట. గదీ లేకున్నమానే... మొగన్ని మానేట్లతొక్క... ఆడు లేకున్నమానే... నేను గిట్లనే సచ్చిపోత........ నా తోటట్టు పజ్జేసే అన్నలు తమ్ములు నాకోసం కంటతడి బెట్టరా?



గీ సంబురం నెలమీద పదిహేనొద్దులున్నది....

నెల తప్పింది....... మళ్ళా నా మెదడు కోళ్ళు దవ్విన పెంటయిపోయింది. ఏ పాపాలతోటి తెగతెంపులు సేసుకోవాలనుకున్ననో గ పాపం నా లోపట మిగిలేపోయింది... ఏడుపుతోని గడ్డ కట్టుకపోయిన... గీ ఏడుపు నెవలకు సెప్పాలె...

నా మెదట్ల సెదలు పురుగుల తీర్గ ఇసారాలు. మళ్ళా కడుపు కరిగించుకుంటే... ఈపారి మనసు ఎదురుతిరుగుతంది. నాకు కలల సిన్న పిలగండ్లత్తండ్లు. వాళ్ళు గుక్కపట్టి ఒకటే ఏడుపు. అంతకంతకు గ ఏడుపు పెద్దదైపోయేది. ఉలిక్కిపడి లేసి కూకునేదాన్ని... గొంతెండిపొయ్యేది. సింతమీద పెద్దపిట్ట కూత తప్పిచ్చి ఏ అలికిడి లేదు. మళ్ళ గా నాత్రి కునుకు పట్టేదికాదు తెల్లారే దనుక... కండ్ల ముంగట నల్లగ ఏంటియో ఎగిరేవి...

"దుఃత్తెరి... మళ్ళ గీ లంపాటక మెందుకు? తలకు బాసిన ఎంటిక ఏరేవున బోతేంది?" అనుకొని జనుపగింజలు దెచ్చుకొని నూరుకున్న. గ నాత్రి ఏ రంధి లేకుంట నిదరబోయిన. మళ్ళా గయ్యె కలలు... సిన్నారి సేతులతోని, మాయామర్మంలేని సూపులతోని నా దిక్కు తప్ప తప్ప అడుగులేసుకుంటత్తంది. నేను పిల్లను దొరికిచ్చుకొని గొంతు పిసుకుతున్న, పిల్ల దద్దరిల్లుతంది. నాసెవులు దిమ్మెక్కిపోయినయ్... ఉలికిపడి లేసి కూకున్న..... మాకు కొంత దూరంలున్న సాకలోల్లింట్ల పసిపిల్ల ఏడుత్తున్నది. మా అన్న నడిమంచాల కూకుండి పొగాకు నములుకుంట కనిపిచ్చిండు.... తెల్లారబోతుందని సింతమీద కాకులు కావురుకావురు మంటన్నయి.... ఈ లొల్లికి మించి నల్లపిట్ట సిత్రంగ కీసుకీసు మంటంది. 'మా అన్నకు గీ సంగతి సెప్పుతే', 'చత్ అద్దు'....... ఆడు ఏదచ్చిన పట్టలేడు. ఆ కోపంల నా బొండిగ పిసికేయచ్చు లేదా ఆడే పిసుక్కోవచ్చు.

ఆ దినం నాకు జెరమచ్చిందని పనికిబోలేదు. మా అన్న నా నొసలు ముట్టి సూచి "గింత దబ్బెడ గాసుక తాగు" అని సెప్పిపోయిండు... కూడండి సద్ది కట్టిన కంచం ముంగట కూకుంటే నాకు కక్కు రావట్టింది. తూర్పున సూర్యుడు నెత్తురు ముద్ద తీర్గ పుట్టుకచ్చిండు. నిదుర మొహంతోటే ఆవుళించుకుంట పికిలచ్చిండు. పొద్దంతా నా సుట్టే తిరిగిండు....

"పికిలీ నీకు అల్లుడు గావాల్నా! కోడలా?" అన్న....

"కోడలద్దు... ఊకే ఏడుత్తది......."

పికిలి గంతులేసిండు. పొల్లగండ్ల నత్తిమాటలు ఎట్లుంటయో మాట్లాడి సూపెట్టిండు. పికిలి పోయిండు. పోయినంక "ఎందుకు జెప్పిన్నా? ఆళ్ళ అవ్వకు నాయిన్నకు జెప్పడుగదా" అనుకున్న.

కుక్కిమంచాల కాళ్లు చేతులు పడిపోయినదాని తీర్గ పండుకున్న. "గీ బిడ్డకు తండ్రెవలు?"... మొగిలయ్య తప్ప మరింకెవలు కన్పియ్యలేదు. ఆనికి గీ సంగతి జెప్పుతే... ఏమంటడో? బయపడ్తడేమొ? నేను ఎందుకంట గీ పాపాన్ని నెత్తికి సుట్టుకోవాలె... గిది


www.eTelangana.org

ఊళ్ళె తెలుత్తె ఎట్లుంటది? ఊరు ఊరంత గుసగుసలాడ్తది. ఆడనియ్..... కత్తులు నూర్తది. మళ్ళీ పంచాతులు, దండుగులు, దోసాలు.... అదీ సూడనే సూత్త. గీ ఊరు నాకేమీ పీకిపెట్టింది? కడివెడు కన్నీళ్ళు. నా కడుపు సింపుక పుట్టే బిడ్డను పల్లెకోసం ఆళ్ళ లంగ పంచాతుకోసం ఎందుకు సంపుకోవాలె? నాకు పరవులేదు...కులంలేదు....... ఒక్కొక్కడు సెంగ సెంగ ఎగురనియ్.... అదీ సూత్త...నాకు కనే అక్కు ఎందుకు లేదోంట? నా అంతుకు ఎవలు నొప్పులు పడరుగదా? ఏదేమైన గీ బిడ్డను కననే కంట........

అట్లా అనుకునే యేల్లకు పొద్దు జారిపోయింది. నిన్న ఇడిసిన బట్టలు తీసుకొని ఆక్కు ఉతికేటందుకు బోయిన... మడుగుల నీళ్ళు ఏ పాపం ఎరగనట్టు తేటగున్నయి. "పాపమంటేంది? పున్నెమంటేంది?" నీళ్ళల్ల నా రూపం పాపపుమొఖమా? ఎక్కిరిచ్చిన...... నవ్వొచ్చింది... సిన్నతనం బలే గమ్మత్తుగ ఎల్లిపోయిందిగదా? ఏం బతుకు బతికినట్టు....... కులాసాగా ఎగురుకుంట 'టింగురంగ' అని ఉండక...గీ పీకులాటలు, దేవులాట లెందుకోంట...నాకు నేనే కొనితెచ్చుకుంటన్నా? ఎవలకు గిసొంటి తిప్పల్లు లేవా? ఉతుకుడు మర్సిపోయి భీరిపోయి నిలుసున్న........రేవుకాడ పిట్టలు నీళ్ళల్ల మునుగు తన్నయి. పడమటి దిక్కు ముత్తైదె ముకంల సెదిరిపోయిన కుంకుం తీర్గ ఎర్రడాలు...

నీల్లమడుగుల తడలు....... నాకాళ్ళకు సల్లగా తాకి ఎనుకకు బోతన్నయి. సిన్న సేపపిల్లలు నీల్లమీన ఎగురుతున్నయ్. ఆగొడ్డుమీద మొండిగ నిలబడ్డ మద్దిసెట్టుమీద సిలుకొకటి ఎటూ తోసక కిలకిల మంటంది. సల్లగ హాయిగ గాలి తోల్తంది.... అట్ల నన్ను నేను కాసేపు మరిసి నిలుచున్న.

"బయ్యా...." ఉలిక్కిపడ్డ. నన్ను ఒరుసుకుంట మొగిలయ్య నిలుసున్నడు.

నాకు కారం రాసినట్టయ్యింది. "వీల్లింట్ల పీనిగెల్ల... జెనిగలతీర్గ ఒదులరుగద"... ఆ వీపుమీన మాసిన బట్టలుతికేయాలనిపిచ్చింది. ఆని పీలబడ్డ కాలుదిక్కు సూసుకుంట కోపాన్ని బిగబట్టిన.

"కోపమచ్చిందా బయ్యి! అదసలె అనుమానం మనిషి" ఎప్పటి ముచ్చెటకో గిప్పుడు జెప్పుతండు. పెండ్లానికి బయపడే మొగోనితీర్గ... నన్ను మోసపుచ్చెటందుకు ఆనికి ఇంకో మాటేది దొరకనట్టు....

"సూడు మొగిలీ! మరింక నా బతుకేందో నన్ను బతుకనియ్యి..." నామాట నాకే వింతగ తోసింది. నేననుకున్నదేంది? మాట్లాడేదేంది?

"మన బతుకను" ఆడు పాసుపండ్లెల్లబెట్టి నవ్విండు...

"నీ నవ్వు కగ్గితల్గ....నాత్త నాత్త నా కొంప ముంచినవ్. గిట్ల నవుకుంటనే... నా బతుకుల మండేమంటలు నీ కద్దు.. నా కడుపుల సొద నీ కక్కరలేదు.... నీగ్గావెల నాసెత్త" అనాలనుకున్న... కని "మొగిలీ నీ పాపం నా కడుపుల పెరుగుతంది" అన్న గులుగుతన్నట్టుగ...

వాడు నాదిక్కు కండ్లు పులపాడిసి సూసిండు.



"నాకు నెలతప్పింది..."

వాడు ఉలికిపడ్డడు. ముద్ద సెంపలు జేవురించినయ్........."లంజకానా! ఎవరిదగ్గర్నో పండి నా మీనకు దొబ్బుతున్నావా......."

"ఔరా నేను లం......నే.........లంజకొడుకా నేను......"

నామీదికి కోడిపుంజు తీర్గ ఉరికచ్చిండు. నేనేమనకుంటె నా బొండిగ పిసికెటోడె. వాని పీలబడ్డ కాలుమీద జాడిచ్చి తన్ని మడుగుల పడగొట్టిన....... తలకాయమీద ఎడంకాలు బెట్టిన... నీల్లల్ల మొసెల్లక బుడగలిత్తండు. కాల్లు సేతులు తప్పడు తప్పడ గొట్టుకున్నడు. ఇంకాసేపుంచితే యెగిరి సచ్చెటోడె... కాలుతీసిన... మీదికి తేలిండు. కండ్లల్ల సావుకళ కనిపిత్తనే ఉన్నది.

ఆని మొకం మీద కాండ్రకిచ్చి ఊంచి తడిబట్టలు బట్టుకొని గుడిసెకెల్లి నడిసిన. యెనకకు సూడనేలేదు. ఆడు లొడలొడ నన్ను తిడ్తనే ఉన్నడు.

ఈపారి ఆడేం జేత్తడోనని యెదురుసూసిన... కని అసొంటిదేమి రానేలేదు. నేను మల్ల పనికి పోతన్న కని మునుపటి ఉషారులేదు. పని సేయంగ సేయంగనే సల్ల సెముటలు పోసేవి. పెయ్యంత నీల్లకుండ తీర్ల సల్లబడిపోయేది. గొంతు యెండుక పోయేది. నేను తొవ్వంట నడువంగ యెవలన్న నా కడుపుకెల్లి పరిచ్చబట్టి సూత్తండ్లేమోనని బయపడేదాన్ని... మళ్ళీ గీ బయమెందు కనిపిచ్చేది. నిండ మునిగినంక సలేడిది? ఇయ్యాల్ల గాకుంటె రేపెప్పుడో గీ సంగతి అందట్ల బడనే బడ్తది.......గిదీన్ని నేనెక్కడ దాయాలె? అసలెందుకు దాయాలె? అందరు కంటలేరా? కనటానికి ఎట్లా కంటెనేంది? పెండ్లి చేసుకునే కనాలె... లేకుంటె కనద్దని ఎవలు సెప్పిండ్లు? ఇట్లా ఇసారాలు......

మా అవ్వ ఓనా డడిగింది. "బయ్యా మళ్ళేమన్న కొంప ముంచుతన్నావే?" అంట.

ఆ మాటకు నేను ఉలుకక మూగమొద్దు తీర్గ సానాసేపు నిలుచున్న...

"ఆడదాని పుటుక కుండసొంటిది బిడ్డా! ఏ రవుతు తాకినా పగిలిపోద్ది... నా చేతుల్లేమున్నది బిడ్డా! ఏది నేననుకున్నట్టు జర్గింది గనక." ఇగ మా అవ్వ మాటలకు అంతు పొంతుండదు.

గ మాట లినిని నా సెవులు దిబ్బెడ బడిపోయినయ్. గయి తప్పిచ్చుకోను బయటకు నడిచిన... ఎటు పోతున్ననో నాకు ఎరుకనే లేదు. తీరా అగి సూసుకుంటె ఊళ్ళెనుంచి సానాదూరం నడిసిన. ఆడ ఆగు బండలమీదినుంచి నీల్లను ఎత్తిపోత్తంది. ఏపసెట్ల నీడ సల్లగా హాయిగ ఉన్నది. నా నొసలుకు పట్టిన సెముట కొంగుతోటి తుడుసుకొని కసేపు కూకున్న. ఆగుల నీళ్ళు రొద సేసుకుంట పార్తన్నయ్....బీళ్ళల్ల పనుల పోరగండ్లు లొల్లి సేసుకుంట ఏందో ఆట ఆడ్తండ్లు... దూరంగ బొమ్మెడిసెట్ల గుంపుల్ల సారాబట్టి పొగగొట్టం తీర్గ లేత్తంది. పాలకొడిశె సెట్లు తెల్లగా విరుగపూసున్నయి. ఎవడో పోరడు తునుకులావల ఒంటిగ కొండపొడుగు రాగం తీసి సన్నగా పిట్ట కూత్తన్నట్లు


www.eTelangana.org

పొద్తుండు... గ పదం ఇన సొంపుగ ఉంది. ఆడి నుంచి సూత్తే పెద్దారి పాము కదలక మెదలక పన్నట్టుగ కనిపిత్తుంది. పెద్దారి పొంట నాలుగైదు కట్టెబండ్లు బరువుగ మెల్లెంగ పోతన్నయి. ఆ బండ్లల్ల కట్టిరుసు బండేదో కిర్రుమని రాగం తీత్తుంది. ఆడినుంచి మా పక్కూరి సింతలు కనిపిత్తన్నయి. గ ఊళ్ళె యెవలో సచ్చినట్టున్నది... సావుడప్పు అంతకంతకు యెక్కువగ వినిపిస్తున్నది.

కాసేపు గీ సప్పుల్లన్ని కరిగిపోయి ఏ సప్పుడు లేకుంట ఉంటే బాగుండు ననిపిచ్చింది.... అన్నీ ఎక్కడి యక్కడ ఆగిపోయి నాకొక్కదానికి రెక్కలచ్చి ఠయ్యిమని ఎగురుతే బాగుండు ననిపిచ్చింది. గాలికి టేకుటాకులు రెపరెపలాడ్తన్నయి. నా గుండె లబడ దిబడ కొట్టుకోబట్టింది.

నీల్లను సూసి మనసు రెపరెపలాడింది....ఒడ్డుమీదినుంచి కిందికిదిగి పరుపు బండమీద కూకున్న. నీళ్ళు సల్లగా నా కాల్లకు తాకుతన్నయి. ఎంతసేపో అట్లా నీల్లల్ల కాళ్ళు ఆడిచ్చుకుంట కూకున్న... దోసిలిబట్టి నీళ్ళు దాగిన... మొకం కడుక్కున్న.

ఆరు నూరయినా నూరు ఆరైనా నేను బిడ్డను కనేతీర్త...ఏమో ఎవలు సూడచ్చిండ్లు... రేపటి దునియా గింత పచ్చి బద్మాషి కాకపోవచ్చు.......నాకు బుట్టినోడే నిలదీయచ్చు......... నా సేతు లేమున్నది? నా బతుకుల గిట్ల సేసిందెవలు? ఒక్కలా ఇద్దరా? నా నోరు మూతబడిపోయింది. లేసి నిలుచున్న. గీ సంగతులన్ని మర్సిపోయి నేను పసుల పోరగండ్ల దగ్గరి కురికి వాళ్ళ తీర్గ పదాలు బాడుకుంట ఎగురుతే ఎంత మంచిగుండు.

నాకు ఆడినుంచి కదలబుద్ధి కాలేదు. ఏపసెట్టు మొదలు కొరిగి సొమ్మసిల్లి పోయినట్టుగ కూకున్న-పొద్దుగూకడానికి ఇంకా బారెడే ఉన్నది. పడమటిగుట్ట పాపం తీర్గ పెరిగిపోయి తన సీకటి నీడల ఊళ్ళను ముంచేటందుకు తయారుగున్నది. తూరుపుదిక్కు ఎన్నీల పేలిపోయి మొగులుకు అదో మచ్చతీరు గన్పడ్తంది పడమటి ఎర్రడాలు. అత్తిరి బిత్తిరి ఎగిరే పిట్టలు.......లొల్లిబెట్టే ఆగు...... ఏపసెట్టు ఆకుల సప్పుడు... పాలకొడిశె పూల ఆసన... తెరలు తెరలుగ గాలిల తిరుగుతన్న పసులపోరని పదం........నాకు సర్గం తీరుగున్నది. గిక్కన్నే.......కండ్లు మూసుకున్న...........

నా పక్కల అడుగుల సప్పుడు... కండ్లు తెరిసిన... నాపక్క వొడ్డు పొడుగున్న మనిషి... నల్లగ కోలమొకం, ఒంటె పెదవుల తీరు మోటుపెదవులు... ఇంకా మీసాలు సరిగ రాని పేడిమూతి... మొకంనిండ వికారంగ బొటిమెలు... నెత్తినిండ నూనెరాసి నున్నంగ దువ్వున్నది...వాడు మావూరి కోమటోని పెద్దకొడుకు. ఎందుకచ్చినట్టు... నా ఆడతెలివి పసిగడుతంది.

"ఇక్కడున్నవా? నీ కోసం నిన్నటినుంచి వెతుకుతన్న," సిగ్గుపడుకుంటనే తొందరగ తడబడుకుంట సెప్పిండు. నాకన్న ఈడుల ఎంత సిన్నోడు. నా కోసం ఎతుకుతండట.



"ఎందుకోంట"... సూటిగ అని మొకంలకు సూసుకుంట.

"జెరంత.........." తల నేలకేసి....

నీ మొకముతక... నీకు ........ఇంకా కండ్లన్నా తెరువని నీకు నేనే గావల్సివచ్చిన్నా? మీ అక్కను. సెల్లెను ఎవడన్న గిట్ల అడుగగలడా? బయ్యో నీ బతుకు పురుగులు బడిపోయింది. సూసుకున్నవ.......ప్రతి మొగకుక్కకు నువ్వే కనిపిత్తవు... నాలికెల్లబెట్టి సొల్లు కార్చుకుంట నీమీది కురికత్తరు..........నువ్వేమొ పుట్టబోయె బిడ్డ గురించి కొట్టిపోసుకుంటన్నవ్.

"ఏమంటవ్? పదిరూపాలిత్త."

నేను ఆని మొకంలకు సూసిన... నా కెందుకనో ఆనిమీద కోపం రాలే... నామీద నాకే కోపం...

"అనడాని కేమున్నది బాపయ్యా? నేను కుక్కనుగాదు మనిషిని........"

"నేనట్లన్ననా..........నేను సచ్చిపోతన్న......"

"సూడు, నిన్నేమనన్నో నాకు దోయటం లేదు. నేను గసొంటి పని జేయ దల్సుకోలే."

"అబ్బ నాకెరికేలే......ఎల్లుండి నా కాల్లగోల్లు.....గిప్పుడే తెలుసుకోవన్నని."

"ఓరి నీ తాడుదెంప... నిన్ను దొంగలు బొడువ... నడువ్ బాడ్కావ్....... నడువు గాడ్డికొడుక నడువ్......." నేను లేసి నిలబడ్డ.

బాపయ్య బిత్తరపోయి సూసిండు. ఆని పెదవులు కుక్క పెదవుల తీర్గ ఊగుతన్నయి. నాకెరికే. వీడు నన్ను అవే గబ్బుమాటలతోని తిడ్తడని. 'లంజ' గివ్వేగదా? ఇంకేంది నాకు అట్లచ్చింది కోపం... ఆని మీద కురికిన... అసలే కోమటి పిరికి... నాకు పిస్స లేసిందనుకున్నడేమొ... ఆడు ఎనుకకు మర్రి సూడకుంట ఉరుకబట్టిండు. ఆనెనుక తరుముకుంట నేను. ఇద్దరం పెద్దారి మీది కచ్చినం.

సవారిబండి ఎదురచ్చింది. గ బండె ఆని తండ్రి రాజీరున్నడు......"ఏంది కొడక" అని ఆడు బండి దిగకముందే బాపడు బండెక్కి ఎగపోసుకుంట "బాపూ, గీ లం........నన్ను రమ్మంటంది" అన్నడు.

వాడు పొట్టి కోమటోడు... పూసిన పెదువులిప్పి "ఓసి లం.......కానా బరితెగిచ్చి పోయినావే! నీ అసొంటిదాన్ని నీల్లు లేనికాడ బొండిగ గోసిన పాపంలేదు... నీ అసొంటిదాన్ని ఊళ్ళె ఉంచుడు మాదే తప్పు.......... పడుసు పోరగండ్ల నాశనం జేత్తవు. మదపిచ్చి లం........నీయక్క నీ అంతు తేల్చకపోతే నేను కోమటోని కడుపున్నే పుట్టలేదు," అనుకుంట సేతులున్న ఆరుగట్టైతోని కొట్టిండు... అదే కోపంల ఆనిమీద బడేదాన్నే కాని అదే దారంట


www.eTelangana.org

తట్ట నెత్తిమీదేసుకొని మా అన్న అచ్చుకుంట గిది సూసిండు. గ మాటలిన్నడు.... రెక్కబట్టి సచ్చిన కుక్క నీడ్సుకచ్చినట్టు బరబర ఈడ్సుకచ్చిండు. గుడిసెల మంచంల కుదేసి నా పెయ్యంత పెట్టన పేలేదాక కొట్టెండు...........

నేను ఏమని సెప్పాలె... సెప్పినా వినేదెవ్వలు?... మాఅవ్వ...

"గిదేం పాపంర నర్సా! నీ కాడుగాల నీకేం బుట్టిందిరా? దాన్ని నన్ను ఊకె సంపనన్న సంపరాదురా?" అనుకుంట అడ్డమచ్చింది....

"దీన్నా! కాకులకు గద్దలకు సీరిపారేత్త ముండలే........." నని మా అవ్వను ఒక్క తన్ను దన్నిండు........

అది కూలబడిపోయి శోకం మొదలేసింది....

మా అన్న మళ్ళీ మనిషి కానేలేదు. నన్ను సేతులు నొచ్చేదనుక కొట్టికొట్టి మంచంల కుదేసి వాడు ఏడ్సిండు. గ రాత్రే గ దిక్కుమల్లె నాత్రే... మా అన్న గుడిసెలనుంచి ఎల్లిపోయిండు. గట్ల పోవుడు కొత్తగాదు. కని ఈపారి మల్ల మా అన్న తిరిగి రానేలేదు.

సుట్టూ రెక్కలు సాపి, ముక్కులు సాపి, కాళ్ళుగోళ్ళు ఆడిచ్చుకుంట 'కీ కీ' అని ఒర్రుకుంట గెఫగెఫ నా సుట్టు సెక్కర్లు గొడ్తున్న పంతరగల్ల మద్దెన నన్నొంటి గిడిసి ఉన్నొక్క దిక్కు మా అన్న బోయిండు...ఆడు మరింత పెనుగులాడలేక తప్పుకున్నడు. మరి నేనో?

రోజు సింతసెట్టు మొదట్ల కూకుండి బితుకు బితుకు మనుకుంట తొవ్వలు సూసేదాన్ని... ఏ బొంగురు గొంతు వినచ్చిన మా అన్నే అనుకునేదాన్ని... వాడెంత బంద మనిషి......నట్టనడడివిల సుట్టూ కాపెట్టుక కూకున్న జంతువుల మజ్జెన మమ్ము లిద్దరిని విడిసిపెట్టి తన దారి తను సూసుకున్నడు. అప్పులోల్ల పోరు పడలేక మరింక దారేది లేక బాబాజుల్ల గలిసిపోయిన వరమ్మ మొగడు, తన పెండ్లాన్ని సెరబట్టినప్పుడు ఇడిపిచ్చుకునే దారేదీలేక ఉరేసుకున్న అవుసుల నారాయణ... ఉన్న కోంద్ర దొర కొమ్ముగ బెట్టలేక ఎదురాడి సావదెబ్బలు దిని పంచాతుల మల్లదండుగ గట్టాల్నంటే నడిఝాము నాత్రి పెండ్లాం పోరగండ్లతోని ఆగన్న పచ్చుయిపోయిన కాపోల్ల సినసెంద్రయ్య........గిట్ల ఎందరో యాదికచ్చిండ్లు.

✧

# 11

**మా** అవ్వ మంచాలనుంచి లేసుడే గగనమైపోతంది......అది సెట్టెత్తు కొడుకును తలుసుకొని మిడిగుడ్లేసుకొని మంచాల సూసుకుంట వండేది......దినాము పికిలీ అచ్చెటోడు... నా కండ్లల్లకు పులుకుపులుకున సూసుకుంట కూకుండెటోడు. పికిలి సిన్నారి కండ్లల్ల ఎన్నో అడుగాలనే మాటలు........నేనేం సెప్పుకోవాలె... దినాలు వారాలు గడిసిపోతన్నయి.



ఇంట్లున్న సెంబు కంచాలు అమ్మిన... మరింక అమ్ముకోవటానికి నేనే మిగిలిన... దానికితోడు మూడోనెల... మళ్ళా పాతబతుకు దారిల నడవటమే అన్నిటికి జవాబుగా తోసింది. గీ ఏడుపు నుంచి దరిద్రం నుంచి నేను బయటపడాల్నంటే నేను ఓడిపోక తప్పేటట్టు లేదు. 'బయ్యా నువ్వు సావక తప్పదు.'

మా అన్న అత్తడనే ఆశ గంగల గలిసిపోయింది. ఆకాశంల నా కట్టాల తీర్గనే మబ్బులు కుదురుకుంటన్నయి.... ఎండకాలపు గాడుపు దుమారంకు గుడిసె కప్పు ఎగిరిపోయింది.

ఆ దినం 'అచ్చిన కట్టం సచ్చిన దప్పదని... మెడకు బడ్డ పాము కరువక తప్పదనుకున్న.' కడుపు దిగపోసుకోవాలె ననుకున్న.

ఆ దినం పొద్దుగాల శాయన్నచ్చిండు.

"బిడ్డా! నర్సయ్య బొయ్యి మిమ్ముల ఆగన్న పచ్చుల జేసిండు. గరీబోల్ల బతుకు దినదినగండం నూరేండ్లాయుషు. మరేం పర్వలేదు. నువ్వు నా ఎంటరా! మన రెక్కలు మూలబడేదన్క సూత్తాం" అన్నడు.

ఇసారాలన్ని కట్టిపెట్టి శాయన్నెంబడి బంట పనికిబోయిన. పిట్టతీర్గ నోరు తెరిసి కూడో కూడంటన్న మా అవ్వకు మాపటించికన్న గింత కూడుబెట్టాలె... ఆదినం పొద్దుగూకే దనుక మట్టి మోసిన... మూడు రూపాయ లచ్చినయ్. కోమటోడు పదారు పండ్లెల్లబెట్టి బొత్త కిందికి మీదికి ఊగంగ నవ్వి "ఎవని కొంప ముంచినవ్" అన్నడు. గీ నవ్వెనుక నా నెత్తురు తాగాలనే ఆని కోరిక ఉన్నదని నేను పసిగట్టిన... ఈడెప్పుడో నా మీద దునుకుతడు. తన కొడుకు పగ గప్పుడే తీసుకుంటడు.

"నా కెరికే ఎవన్నో ముంచినవ్ గని" మళ్ళీ ఆడే.........

'తుః......... నీ తీరుగ కాలుమీన కాలేసుకొని మాసిపోయిన బుర్రపంచె ఊపుకుంట కొంపలు గూల్సి సంపాయించింది గాదురా! నా నెత్తురు సెముటడిపి సంపాయించిందిరా!' అనాలనుకున్న... గ మాటలు గొంతులనే తొక్కిపట్టి వాడు కొలిసిన ముక్కిన జొన్నలు తీసుకచ్చి రోట్లేసి అక్కముక్క దంచి అంబలిగాసిన.

మా అవ్వ ఎగబడి తాగింది. మళ్ళీ కొత్త ఇసారాలత్తన్నయి.........మళ్ళీ బతుకుమీద తీపి... కడుపుల పాప......

గ నాత్రంతా గడగడ ఉరుముకుంట... చెక్‌చెక్ మని మెరుసుకుంట కుండపోతగ ఆన గొట్టింది... ఈదరగాలి జోరుగ ఈడ్సి ఈడ్సి కొట్టింది. మా అవ్వ నేను ఆనల నానినము. గ నాత్రంత మా అవ్వను కూకుండబెట్టుకొని సింతసెట్టు మోతినుకుంట అనుక్కుంట కూకున్న... ఆ సీకట్ల... గ ఉరుముల్ల నేనేం ఇసారం జేసిన్నో నా కిప్పుడు యాదికిలేదు. నా కెప్పుడు కునుకు బట్టిందో ఎరుకలే... అవ్వ మంచంల కాళ్ళకట్టకు ఒరిగిన... నేను ఉలిక్కిపడి లేసెటాల్లకు తూర్పున పొద్దు పొడిసి బారెడెక్కింది... ఆగు బొబ్బలుగొడ్తు


www.eTelangana.org

పార్తన్న సప్పుడు. పైడికంటె గొంతు సించుకొని పలుకుతంది. అవ్వదిక్కు సూసిన... తెరిసిన కండ్లు తెరిసినట్టే ఉండి పచ్చబారిపోయినయ్ - తెరిసున్న నోట్లె ఈగలాల్తన్నయి. ముట్టి సూసిన... తల తిరిగి దబేల్మని కింద బడిపోయిన...

సావు మా అవ్వను గట్ల కొంటబోతదని... నన్ను దిక్కులేని దాన్ని సేత్తదని నాకే మెరుక......!

తెలివచ్చేటాల్లకు నా పక్క పికిలి ఏడుసుకుంట కూకుండి ఉన్నడు. శాయన్న ఆకిట్ల పాడె గడ్తండు.....ఊరోల్లంత ఆకిట్ల నిలుసుండి పిసపిస లాడ్తండ్లు. కులం లేనిదాన్ని కొంటబోవద్దని కొందరు... సచ్చినదానికి కులమేందని మరికొందరు. నాతో పన్జేసిన మాదుగులే పాడె గడ్తండ్లు.

పాడెమీద మా అవ్వ సెత్త నుంచిండ్లు.

"సెట్టెత్తు కొడుకుండి అగ్గి బట్టకుంటయ్యిండు... ఎవని కొడుకులు?" ఎవలో అంటండ్లు.

శాయన్న అగ్గికుండ నా సేతికియ్యలే...

'నువ్వుత్త మనిషివి కాదన్నట్లు' సూసిండు. నేను ఆ సూపులు లెక్కసేయకుంట అగ్గికుండ గుంజుకొని పూనకం పూనిన దానితీర్గ పాడె ముంగట నడిసిన. మా వూరోళ్లు "రాచ్చాసిముండ....... మనిషిగాదు. అది నల్ల సరంబండ" అంటండ్లు....... నాకు గంత దుఃకంల సుత నవ్వచ్చింది. 'అమ్మలారా! అయ్యలాలా! నాకు సీము నెత్తురున్నయి. నా ఏడుపు తాకి పల్లె బగ్గున మండిపోద్ది' అనుకున్న.

అడివిల కట్టెలు పొగసూరుకుంట మండినయ్. ఆళ్ళంత ఆగుల నీల్లల్ల మునిగిండ్లు. నేను నీల్లల్ల మునిగి ఏప సెట్టుకింద తడిబట్టలతోనే కూకున్న... నెలకింద గిదే ఏపసెట్టుకింద కూకున్న బయ్యికి ఇప్పటి బయ్యకి ఏడా పోలికలే లెవ్వు... ఆగు బొబ్బలు గొట్టుకుంట పార్తంది... మెళికలు తిరుగుతూ, ఎత్తిపోత్తూ....నీల్లల్ల కంప, పొరుక, ఆకు అలం కర్రలు కొట్టుకొత్తనయ్.......మోత.........అట్లా సూసుకుంట సానాసేపు కూకున్న...

ఆనాడు నాత్రి నాదగ్గరే పండుకుంట నన్నడు పికిలి. బతిలాడి పంపిచ్చిన... పికిలి పోయినంక దుఃఖ మాగలే... కడుపుల సొద ఎల్లిపోయే దనుక ఏడ్సిన... ఊళ్ళె గంతమందుండి సుత నన్ను ఊకుంచెటోల్లు ఒక్కలంటె ఒక్కలు లేరు. ఎడ్డోడయిన నా ఏడుపుకు తను కుమిలిపోయే అన్నలేడు. కన్నకడుపు అవ్వలేదు........మొండిమాను తీర్గ సింకి గుడిసెల నే నొంటిగ మిగిలిన... సావు కగ్గి దల్గ నాకన్నా రాలే... ఏ ఆశ నన్నింక బతకమంటున్నదో నాకు తెలువలేదు.

✧



# 12

**నా** బతుకు సిత్రమైంది.......ఏడుపు నేను బుట్టినప్పుడే పుట్టింది......నాదన్న సర్వం పొడగొట్టుకుంట... మళ్ళీ తలకాయెత్తి దేనికోసమో దేవులాడుత... ఇంత కన్న మొండి కట్టాలేముంటయో నా కెరుకలేదు.

పదిహేనొద్దులు గడిసినయ్. వానలు పడ్తనే ఉన్నయి. నేను పనిజేత్తనే ఉన్న... బితుకు బితుకు మనుకుంట నాత్రి గుడిసెల గడుపుతనే ఉన్న... నాకడుపు పెరుగుతంది. నా రొమ్ములు గుండ్రంగ అయితన్నయి.

"నీ సెంపలు ఎంత ముద్దత్తన్నయో?" అన్నడు కోమటోడు ఒకానొక నాత్రి మనక ఎన్నెల్ల ముసుగేసుకొని నిలుసుండి....

నేను బెదిరిన....... సుట్టూ అలికిడేది లేదు.......

"నేనిప్పుడు కడుపుతోటున్న" అన్న బజాట్లకు సూసుకుంట.

"గదా సంగతి...నలుగురు నడిసిన బాటల గడ్డి మొలువదే."

"గ సంగతి షావుకారమ్మ నడుగు... నడువ్........"

"గంత కోపమెందుకే బయ్యి... గుడిశె బాగ సీకిపోయింది. మా పాలేరోల్ల తోలిచ్చి బాగుసేయించనా?"

"బయ్యా ఇంక సీకిపోయింది. దాన్నెట్ల బాగుసేత్తవ్?"

వాడు వెకవెక నవ్విండు.

"పోనీ నన్నుంచుకోరాదూ?"

వాని మొకం మాడిపోయింది. కండ్లు ఎరుపెక్కినయి.

"లం.......ను" వాడు మాట పురాగ అనకముందే నేను దుడ్డుగట్టె అందుకున్న. శాయన్న మన సేతులే మనకు పనికత్తయన్న మాట నిచ్చమే.

"కోమటోడా? మల్ల నా గడుప తొక్కితె పుర్రె సెక్కలేత్త"... నేను కోపంగ ఉరికిన.

ఆడు కోపంగ పిర్ర లెగిరేసుకుంట సింత నీడల గలిసిపోయిండు. 'కుక్కల కొడుకులు'... కాండ్రకిచ్చి ఊంచిన...

ఇంకోనాడు మొగిలిగాడు......

"బయ్యా నామీన కనికరం లేదా?"

"నా మీద ఏ కుక్కల కొడుక్కన్న కనికర మున్నదా?"


www.eTelangana.org

"నీకోసం ఏది సెయ్యమన్న సేత్త" బూరె సెంపలు ఉబ్బిచ్చి...

"అయితే ఉరిబెట్టుక సావు."

"లంజెకానా?"... మళ్ళ మళ్ళ గదే మాట... ఈ పందులు, గాడ్దులు ఆడిదాన్ని గ పేరున తప్ప పిలువలేరు గద... గీ సుప్పనాతి గాడ్దులను ఈళ్ళ పెండ్లాలు ఎట్ల భరాంచుకుంటండ్లో! గీ గబ్బు మనుసుల... కంపు మొకాల ఉతికేసి.....నేను నా ఖ్యాలిల బడిపోయిన.

"నా పేరు సెప్పవు గదా?"

"నీ పేరే సెప్పుత... ముమ్మాటికి నువ్వే?"

ఆడు సింగిబింగాడుకుంట నేలమీద కాల్లు పొడుసుకుంట ఎల్లిపోయిండు.

"నీ పేరు సెప్పి నా బిడ్డకు మురికి అంటియ్యరా పంది" అనుకున్న.

మరోసారి బాపడు..

నేను మంచి నిదురలుండంగ నా కాళ్ళ దిక్కు కూకున్నడు. అనుక్కుంట నా కాళ్ళు పట్టుకున్నడు. నేను దిగ్గున లేసి కూకున్న.

"నేనే.........నేనే......" తడబడుకుంట...

"ఔ రా! నీకు కాళ్ళగోళ్ళు దియ్యలేదా?"

"నీ కాళ్ళు మొక్కుత ఒక్కపారి."

అమాంతం అని మెడమీద సెయ్యేసి బయటకు గెంటిన... వాడు కుక్క తీర్గ మూలుక్కుంట పోయిండు.

ఆఖరుగ దొర బామ్మరిది పాపరాజు. ఆడు బాగ తాగి తూలుకుంటచ్చిండు. మాటగీట ఏది లేకుంటనే నామీద బడ్డడు. సార ఆసన గప్పుమన్నది. ఆని తోడేలు సేతుల్ల మొసమర్రలే... పెనుగులాటల ఇద్దరం కిందబడ్డం. నేను ఆని సాతిమీద కసికొద్ది కొరికిన... ఆడు నా సీరె రయికె సింపేసిండు. నేను బరిబాత గుడిసె సుట్టు ఉరుకులు పరుగులు బెట్టిన...

ఆడు పులి తీర్గ నా ఎనుక బడ్డడు......... ఎటూ తోసక గ సీకట్ల తప్పిచ్చుకొని పికిలి ఇంటికి ఉరికిన... ఆడెక్కన్నో పడిపోయిండు. నన్ను గట్ల సూసి కమలవ్వసిన్ని మాట పడిపోయినట్టు నిలుసుండిపోయింది.

"నేను షికారు జంతువునైపోయిన సిన్నవ్వ... నీ కాల్లు మొక్కుత, నన్ను గీ నాత్రికి తలదాసుకోనియి."

కమలవ్వసిన్ని పాత ధోతి, పాత రయికి ఇచ్చింది. అటెంక వెంకటయ్య లేసిండు. నేను ఏడుసుకుంట జరిగింది సెప్పిన...

"మరేం ఫికరులేదు, ఇయ్యాటికి పండుకో" అని గడంచ దరువాజ దగ్గరేసుకొని దుడ్డుగర్ర గడంచ పక్కకు బెట్టుకొని నాత్రంత సుట్టతాక్కుంట కూకున్నడు.



నేను పికిలి పక్కల పడుకున్న. పికిలి హాయిగ నిదురపోతండు.

నాకు నిదుర రాలే... కండ్లు మూత్తె సాలు......... నా సుట్టు పంతరగల్లు గెఫగెఫ తిరుగుతున్నట్టుగ... ఎంత దూరమని ఉరుకాలె! నేను అలిసిపోయిన... ఆటి ముక్కులకు, కాళ్ళకు దగ్గరైతన్న. నా సెత్తంత పీల్సి నెత్తురు తాగుతయి... నా కండలు పీక్కతింటయి... నేను గిట్ల ఇసారాలు సేసుకుంట ఆనాత్రి గడిపిన... కోడిగూయింగనే ఎవలకు నా మొకం సూపెట్టద్దని నా గుడిశె కురికిన...

అది నా బతుకు తీర్గనే ఉన్నది.

పాపరాజుగాడు నాత్రి గడుక కుండను తొక్కేసిండు. బుగ్గెండి కంచాన్ని తొక్కిండు. మంచినీళ్ళు కుండ పగిలి ఇల్లంతా బురదైపోయింది. గడుక తడువనందుకు నవ్వుకున్న... ఇల్లంత సదురుకునేటాల్లకు పొద్దెక్కిపోయింది. పరిగడుపు తోటే శాయన్నెంట బోయిన... ఆ గుడిసెనుంచి తప్పుకోవన్నని నా ఆరాటం... మట్టితట్ట ఎత్తుకొని సొలిగిపడ్డ... నా మొకం మీదికంటా అంగి కోలకండ్ల రాయేశడు "అక్కా" అని పిల్లుత్తండు. శాయన్న లేపి నన్ను అడివి తంగెడు సెట్టుకింద కూకుండబెట్టిండు. అడివి తంగేడు ఎర్రపూల సూసుకుంట కూకున్న.

నేను మళ్ళ తట్ట మోయలేకపోయిన... పొద్దుగూకుతంటె దప్పులుగొట్టినట్టు దడ... ఇంకాసేపట్ల నా బతుకంతా సీకటి ముసురుకుంటది. ఏ తోడేలో, నక్కో నా యింటిమీద పడ్తది... ఇట్ల ఎంత కాలం నన్ను నేను కాపాడుకుంట... నా వల్లౌవుతుందా? నేను సీకటికి లొంగిపోతే... కొండ మీది నుంచి జారిన రాయి తీర్గయితది. నన్ను అందరు వాడుకుంటరు. నా నెత్తురు తాగుతరు. ఏ ఇనుప మూతి కాకుల మజ్జెన్నో దిక్కులేని సావు సత్త... నన్ను పారేసేటందుకు దిక్కుండదు. నేను గిదె గుడిసెల పురుగులుబడి సత్త.

పనైపోయినట్టున్నది, శాయన్న నా కాళ్ళదగ్గర కూకున్నడు.

"ఎట్ల సెప్పాల్నో నాకు దోత్తలేదు బిడ్డా! నీకు గీ మట్టిపని సాతగాదు. నువ్వుత్త మనిషివి సుతగాదు," శాయన్న మట్టికొట్టుకపోయిన మొకంల బండ పెదవులు వనికినయ్. ఎండిన బాయిలసొంటి కండ్లల్ల తడి.

"తల్లీ! నా కెవలున్నరు. నాతోని దీస్కపోయి పువ్వులబెట్టి సాదుకుందును. కని నీ దెక్కువ కులం."

నాకు ఇంక కులమున్నదా? అదెక్కువదా?

తడబడే అడుగులతోటి గుడిసె చేరుకున్న... సీకటి పడ్తాంటె పయిడికంటె కియ్యాల్లేం బుట్టిందో సెవులు దిబ్బెడ బడేటట్టు ఒకటే లొల్లి... దాని కూత రోత గున్నది. అదిగిన నాకు దొరుకుతె మెడబిసికి సంపేద్దును. ఎవరి దొడ్లెనో ఆవోటి లేగ సచ్చినట్టు


www.eTelangana.org

పేగులు తెగేటట్టు అరుత్తంది. సాకలి సిన్నమ్మను దాని మొగడు బుగ్రమీసాల రాయడు తాగచ్చి తన్నినట్టున్నది. అది తిట్టుకుంట ఏడుత్తంది.

నేను మంచాల పడుకున్ననేగాని నా లోపట బుగులు అంతకంతకు పెరిగి పెద్దగయితంది. కడుపుల కనికరంలేని ఆకలి. లేచి పొయ్యంటు బెట్టాలనుకున్న... గీ ఆకలితోటి గిట్లనే ముతమార్నమైపోతె బాగుండు.

బజారు పొంట అడుగులు... కొన్ని మోటుగ... కొన్ని ఈడిగలబడి... గ అడుగు లెప్పుడో నా యింటి ముంగట ఆగుతయి... ఒల్లు జడితిచ్చింది. ఇయ్యాల్ల మళ్ళా పాపరాజుగాడత్తే? ఎట్ల తప్పిచ్చుకోవాలె... గీల్లంత నా ఎంటెందుకు బడుతండ్లు! అడివిల జినుకల్నెందుకు షికారు జేత్తరు? ఓ దిక్కులేని ఆడిది. అందునా గరీబుది... ఈడుమీదున్నది... నేనెంతకని ఏగియ్యగలను? నన్ను గీళ్ళ నుంచి ఎవలు కాపాడ్తరు?

గిట్ల ఇసారాలు సేయంగనే రాత్రి పెరిగిపోయింది. కాళ్ళు పడిపోయిన ముసులోడు సెంద్రయ్య పెద్దమ్మల్లి డోలు గీరినట్టుగ 'డప్పుక టప్పుక డప్పుక టప్పుక బాల్లబాలి' అన్నట్టుగ... రాగం తీసుకుంట కామమ్మ కత మొదలేసిండు. కామమ్మకు కట్టాలు మొదలైనయి... సెన్నపట్నపు కొలువూడిపోయింది మారయ్యకు. నేను లేసి నిలుసున్న... నాకు ఎరుకలేకుంటనే నా అడుగులు పికిలి ఇంటి దిక్కు పడ్డయి.

నేను ఆకిట్ల దీపం కైనీడకు తలొంచుకొని నిలుసున్న.

"ఎవలూ! బయ్యా!" కములవ్వసిన్ని దీపం తీస్కచ్చి నన్ను నా కన్నీళ్ళను సూసింది........

"బయ్యా తిన్నవ."

నేను సిన్నవ్వ కాళ్ళకు సుట్టుక పోయిన.

ఇంత గడుక తెచ్చి నా ముంగట బెట్టింది... కుక్కతీర్గ ఆవురావురు మనుకుంట తిన్న... యెంకటయ్య లేసచ్చిండు.

అటెన్క నేను పికిలి దగ్గెర పండుకున్న... నిదుర రాలే...

నాత్రి వాళ్ళిద్దరి మాట లినచ్చినయ్.

"ఊరు కెదురాడటం... ఏటి కెదురీదటం"

"గిందట్ల ఊరు కెందుకోంట కడుపునొప్పి."

"నీకు తెలువది కములా! దాని నీడ పడ్డదంటే..."

"దాన్ని నట్టనడి అడివిల అందరు గలిసి ఉరెయ్య రాదుండ్లి."

"మనం గరీబోల్లం కములా! దానెంట బడ్డోళ్ళు బలిసినోళ్ళు."



"నేను రమ్మంటినా? పాపం పోరి ఎట్లనుకుతంది."

"పరాత్పరా మనిషిజల్మ మరింక నా కద్దు" వెంకటయ్య ఆఖరుగ అన్నడు.

*

ఊళ్ళె నా కడుపుమీద పెద్ద రభసే జరుగుతంది. నీల్లసెలిమె దగ్గర ఆడోల్లు వోరసూపులు సూత్తండ్లు......ఎప్పుడో ఊరు ఊరంత నామీద ఇరుసుకపడ్తదని ఆ దినంకోసం బుగులుతోటి ఎదురుసూత్తన్న... దినాం మాపటేల్ల కాంగానే పికిలి ఇంటికి బోయి పండుకుంటన్న... కములమ్మచిన్ని నాతోటి మనుసిచ్చి మాట్లాడ్తలేదు... నా గురించి ఆళ్ళిద్దరాలుమొగలు ఏందో మాట్లాడుకునేటోల్లు..........

"షావుకారి, గౌరయ్య, పాపరాజు నన్ను కంటిరెప్పల కింది నుంచి సూత్తండ్లు."

"అదే ఆళ్ళ కేం మార్నగాలం బుట్టిందట."

"ఎప్పుడో సందు సూసి నామీన దునుకుతరు."

"........ .......... ............"

"బయ్యమీన పగ."

"దాన్ని నిలువుత అగ్గి దల్గబెట్టు మనరాదు. ఊళ్ళో లందరి కండ్లు సల్లబడ్తయి."

"ఏందో నాకంత అడ్లు బెరుగు గలిపినట్టున్నది."

కమలమ్మసిన్ని మాట్లాడలేదు.

ఊరోల్లంత గలిసి నామీద గూడుపుటానేదో తయారు జేత్తండ్లనిపిచ్చింది. నేను ఎంకటయ్య వాళ్ళకు కట్టం కలిగియ్య! నా బతుకు ఎట్లనన్న గడువనియ్య...

మరునాడు నాత్రి పోలేదు. మంచాల పండుకున్న... ఎప్పటియో సంగతులు యాదికత్తన్నయ్. పాతరోజులే బాగున్నట్టనిపిచ్చింది. మరింక తలంచక తప్పేట్టు లేదు. ఒంటిగ నేనెంతకాలం ఈదుకరాగలను? గ నాత్రి బీడీల మీదికి మనసు కొట్టుకున్నది. నా ఒళ్ళంత గరుకదేలిపోయింది. నా మనసు మొద్దుబారిపోయింది. గ నాత్రి గట్ల గడిసిపోయింది.

తెల్లారి మామూలుగనే పనికిబోయిన. ఎడ్లకొట్టం దగ్గర పాపరాజు సిగరెట్టు తాక్కుంట నిలుసున్నడు. పక్కకు కుక్కొకటి సూసుకుంట నిలుసున్నది.

నన్ను సూడంగనే సిగరెట్టు నేలమీది కిసిరికొట్టి సెప్పుకాలుతో రాసి కాండ్రకిచ్చి ఊంచి "పాపరాజు నుంచి తప్పించుకపోయింది మళ్ళ బతుకలేదు. నీ అంతం సూత్తనే కుక్కా?" కుక్కను ఝూడిచ్చి డొక్కల తన్నిండు. కుక్క కుయ్యికుయ్యి మనుకుంట ఉరికింది.


www.eTelangana.org

మూడు పొనాదులు కాడ కోమటోడు సింగులు తన్నుకుంట ఎదురచ్చిండు. “గజ్జెల గుర్రం తీర్గ నడ్తంది. మస్తిమీనున్నది లం.........ఊరును నాశినం జేత్తంది” ఆడు.....

నేను ఊరును నాశినం జేత్తన్న నట.......

గ నాత్రి ఆళ్ళిద్దరి మాటలు తాపతాపకు యాదికచ్చినయ్... వాళ్ళిద్దట్ల ఏ ఒక్కడన్నా ఇయ్యాల్ల తప్పకుండ అత్తడనుకున్న - అత్తే ఏం జేయాలె... లొంగి పోదామనుకున్న... సెవులు రిక్కించి అడుగుల సప్పుడుకోసం కాసుక్కూకున్న. ఊరులుకు మగ్గింది... కుక్క ఎక్కన్నో దీనంగా ఏడుత్తంది.

నా గుడిసె ముంగట అడుగుల సప్పుడు. ఎర్రగా సుట్టకొరుకు. దిగ్గున లేసి కూకున్న. వచ్చింది ఎంకటయ్య.

“బియ్యా నిన్ను సూత్తె నా కడుపు తరుక్కపోతంది. దిక్కుమల్లె బతుకులు... నేను నీ కోసం ఊరు కెదురాడి బతుకలేను తల్లీ! నన్ను మన్నించు. నేను కండ్లుండి సూసుకుంటనే కుక్కల బోనులకు తోలుతన్న... నా మెడకు కనిపియ్యని తాళ్లు కట్టున్నయి బిడ్డా...”

నేను అదిరిపోయిన. గిసొంటి మాట లినటం నాకు కొత్తే! ఆ సీకట్ల అతని మొకం చూడాలనుకున్న. అతని ఓట్లె తలబెట్టుకొని ఇన్నేండ్ల దుఃఖాన్ని ఎల్లబోసుకోవాలనుకున్న. కాని నా గొంతు పూడుకపోయింది... నా కండ్ల పొంట ఎడతెరిపిలేని కన్నీళ్లు........ మంచం మీద కూకోమన్న... కూకున్నడు. నేను మంచం కింద కూసున్న... పిచ్చిదాని తీర్గ నేనేదో సెప్పుతన్న.......

గ యేల్లన ఇంకొకలు ఆడికి అచ్చిండ్లనిగని... మళ్ళీ పోయిండ్లనిగాని మాకిద్దరికి తెలువనే లేదు.

నేను ఉన్నట్టుండి తలెత్తి సూసెటాల్ల కేమున్నది మా ఇంటి ముంగట సీకట్ల జనం......ఎటూ తోయక నేను నిలుసున్న. నా సేతులకు జనుపపగ్గాలు. ఎంకటయ్యను కూడ కట్టేసిండ్లు.

మమ్ము లిద్దరిని తిట్టరాని తిట్లల్లా తిట్టుకుంటు మూడుపొనాదుల దగ్గెరికి గొర్రగొర్ర ఈడ్సుకపోయిండ్లు. ఏపసెట్టు ఎదురుంగ సింతసెట్లకు ఇగ్గి కట్టేసిండ్లు. తెల్లారేదనుక అట్లనే పడున్నం.........

పొద్దు పొడువంగనే ఊళ్ళె పెద్దలు... జనం ఏపసెట్టుకింద ఎవలు పిలువకుంటనే కుప్పకూడిండ్లు... ఎవలమాట ఎవలినకుంట తిట్టబట్టిండ్లు.

“గీ ఈడుల ఎంకటిగాన్కి గిదేం బుద్ధి...”

“మాదిగి బుద్ధి.”

“దురి జెట్టకాల మచ్చింది.”



“బయ్యే బద్మాషి.”

“బియ్యా గీ ఊళ్లె ఇప్పకు తొర్ర బుట్టినట్టు సెడబుట్టినవే.”

“బియ్యికి కడుపు జేసింది గీడేనేమొ?”

“గందుకనే నల్లికుట్లోల్లను నమ్మద్దంటరు.”

“ఎన్ని దినాలనుంచి సాగుతందో.”

నా సెవులు సిల్లులు బడిపోతున్నయి. పికిలి అక్కడెక్కన్నో జనం మజ్జెన నిలుసుండి అందరి మొఖాలు సూత్తండు....అయ్యో నా తండ్రి నీ కెట్లాసెప్పాలె? బయ్యక్క బతుకు గురించి నువ్వేం ఇసారాలు జేత్తన్నవ్ తమ్మీ! పికిలి రెండురెక్కలు బట్టుకొని కములవ్వసిన్ని కనిపిచ్చింది. ఆమె కండ్లల్ల ఎతికిన... కనికని... నాగ్గావాల్సింది ఆ కండ్లల్ల లేదు. ఎదురుంగ భూలచ్చిమి సెక్క బొమ్మలు ఊళ్ళోల్లంత కోల్లగోర్ల గోసి పూదిత్తరు. నాకైతే ఆ సెక్క బొమ్మలు తొక్కుకుంట...... పిచ్చిదాని తీర్గ ఎగురాలనిప్పిచ్చింది....... పికిలి తల్లి సేతుల్ల గింజుకుంటండు....

పాపరాజుగాడు దర్జగ కొలువు దీరిండు. వాని మొకంల మన్నుబడ. ఎంతో ఠీవి. ఆని ఎర్రటి కండ్లల్ల గెలుపు. ఆని పక్క మొగిలిగాడు, గౌరడు, కోమటోడు... ఇంకా సానమంది కూకున్నరు.

గుడిసెల సూర్లకింద... సింతసెట్టు నీడల ఆడోల్లు ముక్కులమీద వేల్లేసుకొని ఇచ్చెంత్రపడి నిలుసున్నరు. పెచ్చులూడిన మొండిగోడపక్క దుమ్ముల మాదుగులు మన్నేలు కూలబడ్డరు. శాయన్న కండ్లల్ల నీళ్ళు... నాకు బతుకనేర్పిన శాయన్నా... నా తండ్రీ... నా మనసు తెలుసుకో........అనాలనుకున్న.

మా ఇద్దరి ముంగట సుంకరి బొత్తోడు తనకిదేమి పట్టనట్టు నిలుసున్నడు. ఆని బొత్త వికారంగా ముంగటికి పొడుసుకచ్చింది. ఆని పుల్లలసొంటి కాల్లు బెచ్చులు బెచ్చులుగ గోకున్నయి. ఆని కండ్లల్లేమున్నదో నాకు తెలువలేదు. వాడెన్ని గిసొంటి పంచాతులు సూసున్నడో? నిజానిజాలు ఆనికన్న ఎరికేనా? ఎవలకు తెలిసిన తెలువకున్నా అగో గక్కడ కూకున్న పీతిరి గద్దలే నాయం నీతి సెప్పుతరు. నేను ఉల్టా తిరగబడెతెనో? ‘ఒరే లంజకొడుకుల్లాలా... నా అసొంటి దిక్కులేని ఆడదానికోసం మీరంత కుక్కలతీర్గ ఎగబడి...నేనందక పోయేటాల్లకు పన్నిన వుచ్చురో యిది అంటెనో?’ ఎవలింటరు గన్క!...

పంచాతి మొదలయ్యింది.

బానకడుపు ఎల్లుగాడు మూడు మార్లు పండ్ల సందులనుంచి సుతారంగ ఊంచిండు.

“అందరచ్చినట్టేనా? అచ్చినట్టే... మనూరికి మంచోల్లమో సెడ్డోల్లమో నలుగురం ఇంకా బతికున్నం బిడ్డా! మేం దరుమమో అపదర్మమో, నాయమో అన్నాయెమో


www.eTelangana.org

గింతదనుక సేసుకచ్చినం. బగవంతుని దయవలన ఊరు గింతవరదనుక కట్టడి తప్పిపోలే... ఊరన్నకాడ మాదిగిండ్లు ఉండే ఉంటయి. మంచిసెడ్డ జరుగతనే ఉంటది..." బొత్తోడు మళ్ళీ ఊంచిండు.

"వారీ! పాపం మాటలు నాసేత సెప్పిచ్చినందుకు నాకు కూసంత పాపం సుట్టుకుంటది. బయ్యి గురించి గీ ఊళ్ళె పాల్జీకే పోరి కెరికే... అది ఏమంట ఊళ్ళె అడుగుబెట్టిందో ఊళ్ళె మంచోడు ఎర్రి లేసిపోయిండు. సిరికిట్ట పరమాత్మ డేం జెప్పిండు?"

కోమటోడు "సేసుకున్నోనికి సేసుకున్నంత."

"అర్ధదీ! షావుకారి సెప్పినమాట రైటూ....... ఎవలకర్మం వాడే కుడువాలె... ఇందాక ఏమన్న, ఆడిదాని బుద్ధి అపబుద్ధి. సేసుకున్న పెండ్లాన్నయినా ఓ కంట కనిపెట్టాల్నంటడు. నేనేమన్న, ఎవడు జేసినా పాపం పాపమే. ఎంకటిగాన్ని పుట్టి బుద్దెరిగిన కాన్నుంచి సూత్తన్న... ఆడు మంచోడే........"

"బట్టుముండగాదు, గి దీన్ని నమ్మతరమా? గి దీన్ని ఊళ్ళె ఉంచుతె ఊరు కగ్గిదలుగుద్ది," మొగిలిగాడు మాటల మాట గల్పిండు.

"అందుకని గిదీంట్ల నాయెం ఔనాయం మీరే నిర్నాయం జేయాలె," గౌరడు గులిగిండు.

పాపరాజు నా దిక్కు కండ్ల కిందికెల్లి సూసిండు. జనం గులుగుతండ్లు... తిడుతండ్లు... ఎవలో ముసలోడు ముంగటి కచ్చి మొక్కిండు.

"గీడ కొలువుదీరిన పెద్దలు మన్నించాలె బాంచెన్.....సెట్టెత్తు అన్న దేశాలు బట్టిపోయిండు. ఉన్న తల్లి గంగల గల్సింది. బయ్యవ్వ దిక్కులేని పచ్చుయిపోయింది," ముసలయ్య గొంతు పూడుకపోయింది.

నాకోసం...నాకోసం... ఒక ముసలోడు నా తరపున మాట్లాడ్తండు. నేనేం ఉపకారం జేసిన. నన్ను ఆడుకున్న గిందరు మొగముండకొడుకులు గిప్పుడు నన్ను నడిబజాట్ల ఇజ్జత్ దీత్తండ్లు. నా గొంతు పిసికేటందుకు కాసుక్కూకున్నారు. లోకంల పసురాల మజ్జెన సుత మనుషులు బతికే ఉన్నరు. నాలాంటి దిక్కుమల్లె మనుషుల తరపున ఇయ్యల్ల ఒక్క గొంతు... అదీ అనుకుతనే మాట్లాడచ్చు... రేపు... నాకు రేపున్నదా?

ముసలోని మీదికి ఎందరో కాకులు గద్దల తీర్గ లేసిండ్లు-

"అరే సూడుర ముసలోడ... కండ్లు కడుక్కొని బగ్గసూడు. మొగడు లేకుంటనే దానికి బొత్తయింది." ఎవడో కోపమాసుకోక నామీనికి తన్న తన్నచ్చిండు.

ఎంకటయ్య దించిన తలెత్తలేదు. ఏమనుకుంటండో?



మరి కాసేపు నా గురించి మోటుగ, పరమ గలీజుగ, నేను రాయటానికి కుదరనంత రోతగా అంతమంది ఆడోల్లముంగట మాటలు సాగినయ్......

ఒక బాడ్‌కవ్ గాడన్నడు. "నా కడుపు కరుగబోపియ్యాలె."

మరొక లుచ్చగాడన్నడు. "కోసెయ్యాలె."

వాళ్ళెందుకట్ల అంటండ్లో నా కెరికే. ఆడ దొంగ నక్కల తీర్గ కూకున్న పెద్దల మెప్పుకోసం.

"ఈల్లేదు........" నేను బలాన్నంత కూడదీసుకొని మొత్తుకున్న...... ఏది ఈల్లేదు?

సద్దు మణిగింది. నేనింకా ఏం జెప్పగలనో అని అందరు సెవులు రిక్కించ్చి సూసిండ్లు.

నాకింక సెప్పేటందుకేమున్నది గన్క. ఒకప్పుడు గీ పిరికెడు పిరికెడు మీసాల మొగోల్ల అధికారంమీద కసితోటి దిగజారిన. గీ ఊరొక సాలెగూడు. దీన్ని నేసిన సాలెపురుగు ధీమగ, దర్జగ... నేను ఈగతీర్గ తపతప రెక్కలు కొట్టుకుంట ఆని కాళ్ళదగ్గరికి రావటం సూత్తండు. మరింక నామీద దునుకుతడు. దెబ్బ తెలువకుంట... గాయం కనిపియ్యకుంట ఒడుపుగ నా నెత్తురు తాగేత్తడు.

అనుకున్నట్టుగనే పాపరాజుగాడు గొంతు సవరిచ్చుకున్నడు.

"తప్పొప్పులు ఇదివరకే నిర్ణయమయినై... మీ అందరిముందు ఈ లం.....కు ఏ శిక్ష యివ్వాల్నో" కోపం పట్టలేక అదాటున లేసి ఆని బస్తి మొలల సెప్పొడ బీకిండు. మరి కాసేపట్ల నాసెత్తంతా ఆని మొలల సెప్పుదెబ్బలకు సితికిపోయింది.

ఒక్కలు ఒక్కలంటె ఒక్కలు గీ దిక్కులేనిదాన్ని రచ్చించరా? ఒరే ముసలయ్యా! నీ పీల సేతులన్నా అడ్డుపెట్టవా? నా సేతులు కట్టేయబడ్డయి. నా నోటికి తాళమేసిండ్లు. నా తండ్రీ! పికిలీ! నీ సిన్నారి సేతులు ఊరంత పెరిగి నన్ను కాపాడు పికిలీ! అగో నా కోసం నాతండ్రీ పెనుగులాడ్తన్నవ్........

ఆని పసురం బలం నా మీద సూపి అలిసిపోయిండు. మట్టిమోసి మోటు బడ్డ సెత్త ముంగట ఆడు ఓడిపోయిండు.

ఆడు సెప్పు కింద పారేసి నొసలుకు బట్టిన సెముట తుడుసుకున్నడు. ఆని నల్లటి మొకం కమిలిపోయింది.

"గిది దెబ్బలకు లొంగేది లేదు. మరింక గిది మనూల్లె ఉంటె ఊరు నాశిడమైపోద్ది... పసిపోరగండ్లు దీని సుట్టు దిరుగుతరు."

"మరింకనా దీన్ని ఊళ్ళె ఉంచుడు" కోమటోడు.


www.eTelangana.org

"తెలిసి సేసిన తెలియక సేసినా తప్పు తప్పే...తప్పు రాజుకైనా బంటుకైనా ఒకటే... మరింక ఎంకటిగానికి గీ తప్పు జేసినందుకు........." పాపరాజు ఆగి అందరి మొకాలు సూసిండు.

"పదిహేన్నూర్ల దండుగు." సలిపిడుగు బడ్డది.

కములమ్మ గోడుగోడున ఏడ్చుకుంట అందరి కాళ్లు మొక్కింది.

"ఎనిమిది రోజుల్ల దండుగ గట్టకుంటె అగ్గినీళ్ళు బందు." అఖరి ఎచ్చరిక అయిపోయింది.

"ఔరా! ఎంకటిగ నన్నొప్పుకొమ్మంటవా?" గౌరడు. ఎంకటయ్య సడీసప్పుడు లేకుంట తలూపిండు. మా కట్లు ఊడదీసిండ్లు...

నేను ఇట్లా కదిలిన్నో లేదో నా మీద జనం బడ్డరు. అట్లా నిప్పులు సెరిగే పట్టపగటించి ఒంటినిండా దెబ్బలతోటి ఏడు నెలల కడుపుతోటి నేను ఊరిడిసిన. ఆఖరిసారిగ పికిలి దిక్కు సూసిన... పికిలి కములమ్మ సేతుల్ల గింజుకుంటండు. పికిలీ నువ్వింకా సిన్నోనివేరా.

"నన్ను ఎల్లగొడ్తన్న మీరంత సత్తెనాశినం అయిపోతర్రా" అని మొత్తుకోవాలనుకున్న. ఇంకా సానా అనాలనుకున్న... కాని నోరు పెకులదే! నా కాళ్లు ఊరవతలకు బడ్తన్నయి. నా యెంట పోరగండ్లు ఉరికత్తండ్లు... ఈలలు. చప్పట్లు... ఎవడో పోరడు - "లం.......లం......." అనుకుంట పూనుకం అచ్చినోని తీర్గ ఎగురుతండు.

గుంపుల నుంచి ఎవడో రాయిసిరిండు. రాళ్ళు పడ్తనే ఉన్నయి. నేను పిచ్చిదాని తీర్గ ఉరుకుతన్న... గుంపుకు సానా దూరంగ... అప్పుడు సూసుకుంటే పెద్దారిల సానాదూరం అచ్చేసిన... ఎటుపోవాలె.

ఆడో మొండి సింతున్నది. ఆ మొండి సింత కింద కసేపు కూకున్న. నా ఒళ్ళు నెత్తురు మయమైపోయింది.

మరి కాసేపటికి లేసి నడుక సాగించిన... నా మనసుల ఊళ్ళె నేను గడిపిన దినాలు మెదులుతన్నయి. అట్లా ఇసారాలు సేసుకుంట పొద్దుగూకే యాల్లకు ఏదో బస్తీ అచ్చింది. నేను బస్తిల కడుగుబెట్టిన.

✻

# 13

**బ**స్తీ చేరుకోంగనే నాకెక్కడలేని ఆయాసమచ్చింది. కాళ్లు పీకుతన్నయి. కండ్లు మూతలు బడిపోతున్నయి. ఏన్నన్న కాసేపు ఒరుగుతె బాగుండు....నిండ మునిగినంక సలేందన్నట్టున్నది. ఏడ ఒరుగాల్నో తెలువలే... కాసేపు అట్లా కూకుందామని ఓ బట్టల దుకానం ముంగటికి నడిసిన. దాని అరుగుమీద గీ రాత్రి ఎట్లనో గట్ల గడుపుతే రేపటి



సంగతి రేపు. కడుపుల పిండం కదులుతంది. 'నా తండ్రీ నువ్వేడ్తన్నవా?' అనుకున్న... నాకేడుపచ్చింది. ఎక్కన్నుంచో కాకిబట్టల సప్పిడి ముక్కోడురికచ్చిండు. ఆడు బాసల నన్ను తిట్టి నేను కదలక పోయేటాల్లకు జబ్బబట్టి ఆడినుంచి దొబ్బేసిండు. ఆడినుంచి ఇంకోకాడికి... ఆడ గట్లనే మరొకలు. ఈడగూడ నాకు నిలువనీడ లేదా?

అట్ల తిరుగంగనే బస్‌స్టాండు కనిపిచ్చింది. ఆడ నా అసొంటి దిక్కులేనోల్లు సానామంది పండుకొన్నరు. ఓ మురికి గుడ్డలోడు సొల్లు కారుసుకుంట గుర్రుకొడుతండు. ఆని తలకింద బీడీలు సొల్లుల నానుతన్నయి. నేను ఓమూలకు బితుకు బితుకు మనుకుంట కాసంత జాగ సూసుకొని కూకున్న. ఎదురు బంగుళ మీద కరంటు బుగ్గ వికారంగ ఎలుగుతంది. ఓ కుట్టాది రోగపోడు ఎల్లెలుకల పండుకొని తొస్సినోరు బొంగురు గొంతుతోని "ఏమిరాజ్జుం... ఎముల రాజ్జెం... సావురాజ్జెం... సవారాజ్జెం" అని పాడ్తండు. వాడు అట్ల పాడకుంటె బాగుండు. ఆని నోరు తెగి పడిపోతదన్నట్టుగ నోరు తెరుసుకుంట పాడుతండు... వాడు నాతీర్గ ఏ ఊరు తరిమేసిన బాపతో? ఇయ్యాల్టినుంచి ఈల్లంత నాతోటి మనుషులు. వీళ్ళంత ఎప్పటినుంచో పాతుకపోయినంత ధీమగ ఉన్నరు.

నా కాళ్ళదగ్గర ఎముకల గూడసొంటి ఆడది. దాని సుట్టూ మట్టి ముద్దలసొంటి పొల్లగండ్లు అడ్డదిడ్డంగ పడున్నరు. నాకు పుట్టెటోడు గిట్లనే... పెయ్యి గొగ్గరిచ్చింది. నా గుడిసెను ఆళ్ళేం జేత్తరో? కాలబెడతరా? నాకెందుకు? దాని పక్కదేంది? కదులుతంది. ఇందాక బట్టల ముళ్ళె అనుకున్న. ఆడు మొగోడు. ఆ సీకటికాని మసక ఎలుగుల దాని రొమ్ములు తడుముతండు. కక్కచ్చింది. లేసి ఎటన్న పోవాలనుకున్న... వాడు లేసి బరబర తలగోక్కొని నాదిక్కు కుక్కతీర్గ గుర్రుగ సూసిండు.

"నీయమ్మ దీనికింక నిదుర కాలబడ్తలేదు" గులుక్కుంట ముడుసుక పన్నడు.

దోమలు పీక్కతింటన్నయి... ఆకసంలెక్కన్నో గుడగుడ ఉరుముతంది. కుట్టాదోడు పాటాపి "అర్జునా! పార్థుడా! కిరీటి" అంటండు. ఆనత్తదేమొ? మరికాసేపట్లా బిగుసుకపోయి కూకున్న. తుప్పరతుప్పర సినుకులు పడవట్టినై... నాకు కన్నంటుకున్నది. నా గుండెమీద సేతులు పాకుతన్నయి. కండ్లు తెరిసిన. ఇందాక సొల్లుకార్సుకుంట గుర్రుకొట్టినోడు నామీది కెగబాకుతండు. ఒక్కతోపు తోసిన... ఆడు పక్క గోడకు తలకొట్టుకొని పడిపోయిండు. మళ్ళ నా మీదికి రాబోయిండు. వాళ్ళంత గి సప్పుడుకు లేత్తరేమొనని సూసిన. గది మామూలే అన్నట్టు ఎవలు పట్టిచ్చుకోనేలేదు.

సడీ సప్పుడు కాకుంట ఆనల తడుసుకుంట కొంతదూరం నడిసిన... ఎదురుంగ కనిపిచ్చే బంగుళ సూరుకిందికి సేరిపోయిన... నాత్రంతా ఆన పడ్తనే ఉన్నది. నేను కూకుండి కూకుండే నిదురబోయిన.

✻


www.eTelangana.org

# 14

నేను కండ్లు తెరిసేటాల్లకు బలే సందడిగున్నది. పాపరాజుగాడు కొట్టిన దెబ్బలకేమొ ఒళ్ళంతా వాసింది. మెడమీద గాయం సీము పట్టినట్టున్నది, సలుపుతంది. ఇట్లనే గిక్కన్నే సచ్చిపోతానేమొ ననుకున్న. పెయ్యిలనుంచి ఉడుకు పొగలత్తన్నయి, పోతన్నయి. మురికి మొకాల మనుషులు ఎగపోసుకుంట ఈడిగిలబడి రిక్షాలు తొక్కుతండ్లు... మా ఊళ్ళె ఎడ్లబండ్లు యాదికచ్చినయ్. రిక్షా తొక్కేటోల్లు ముసలెడ్ల తీర్గ కనిపిచ్చిండ్లు. బస్టాండు కళకళలాడుతంది. ఎంతో మంది అచ్చి చేరుతండ్లు... పోయేటోల్లు పోతండ్లు. నేను మెల్లెగ లేసి నిలుచున్న. నాబట్టలన్ని సినిగున్నయి. నా తలెంటికలు పిడుసగట్టుక పోయున్నయి. నా పెయ్యంతా మన్ను..........

బస్టాండుల సానాసేపు కూకున్న. ఎంతోమంది ఎర్రబస్సులెక్కి పోతండ్లు... మరెంతో మంది అడికచ్చి దిగుతండ్లు. వాళ్ళ బతుకుల్ల గిదొక మజిలి. మరి నేనేడికి బోవాలె? గి బస్టాండే నా మజిలి అయిపోతదా?

నా కడుపుల ఆకలి. పేగులు కయ్యికుయ్యి మంటన్నయి. నాత్రి పీనుగుల తీర్గ పడున్న మన్ను ముద్దలసొంటి పోరగండ్లు సత్తు గిన్నెలు పట్టుకొని ఆడుక్కుంటండ్లు. వాళ్ళ గొంతులకు కొస ఊపిరి తెచ్చుకొని గీమాలుతండ్లు.

చూడుంగ సూడంగనే పొద్దు నెత్తికచ్చింది. ఏం జేయాల్నో ఎంత సేపని కూకోవాల్నో తోసలేదు. గిన్నే ఆకట సత్తె పీడబాసిపోవు. పికిలి గుర్తొచ్చిండు. అతని తల్లిదండ్రులు యాదికచ్చిండ్లు. ఇంకా నా కండ్ల ముంగట పంచాయతు జరుగుతున్నట్టుగనే ఉన్నది. మా అన్నగాడెక్కడున్నడో? ఉన్నడో లేడో? ఉంటే ఏం సేత్తండో?

నాకడుపుల పిండం అటూయిటూ తిరుగుతంది. నా కండ్లకు సీకట్లత్తన్నయి. మనుషులంతా సడీసప్పుడు లేకుంట దయ్యాలతీర్గ ఎగురు తన్నట్టనిపిచ్చింది. సెవుల్ల ఏదో లొల్లి.........గీ మనుషులు దయ్యాలెందుకయిండ్లో? నా మెదడు కేదన్న రోగమచ్చి గీ ఇసారాలు ఆగిపోతే పీడబాసు.......నీ యింట్ల పీన్గెల్ల... నన్నే కట్టెన గాలనియ్యవు. అన్నీ నీకే గావాలె-

నా ముంగట బరిబాత పోరడొకడు కూకుండి సిల్లర పైసలు పంచుకుంటండు. వానికి బతుకు ఏం నేర్పింది? అడుక్కోవడం. నేనెందుకు అడుక్కోవద్దు.....ఒళ్లు ఝుల్లుమన్నది. బయ్యా నువ్వేడికి జారిపోతన్నవ్? గింత మంది బిచ్చగాళ్ళకన్న తనెందట్ల మిన్న! నిచ్చానికి ఇసారం జేత్తే అంతా బిచ్చగాళ్ళె... ఆడోల్లు బుక్కెడు కూడుకోసం... ఓరయికె బట్టకోసం మొగలను అడుక్కుంట లేరా? గీ పోరగండ్లెందుకు అడుక్కుం టండ్లు? బగ్గబలిసా? ఆకలికోసమా?



గ బరిబాత పోరడే కడుపిప్పుడు నిండటానికి మొట్టమొదటి గురువు... ఆ పిల్లగాన్ని జేగర్తగ సూసిన... ఆ సెయ్యి సాపుడు... మొకంల గ దిక్కుమాలిన తనం.... అబ్బో బిచ్చమడుక్కోవటం సుత అల్లాటప్ప పనిగాదు. ఎంతో తెలివిగావాలె... నేను లేసి నిలబడి అనుక్కుంట సెయ్యి ముంగటికి సాపిన... రంగు రంగుల బట్టలు గట్టుకున్నోల్లు నా ముంగట నుంచి పోయిండ్లు... నా సేతుల ఎవలు ఒక్క పైసన్న పారేయలేదు. గిందట్లసుత నేనే ఓడిపోతనా? ఎవడో మాంసంముద్ద తీర్గ దొల్లుకుంటచ్చి నన్ను కిందామీద సూసి "ఎన్నో టోకరా తిన్న బాపతున్నట్టున్నది." వాడు పదిపైసల బిళ్ళ నా సేతుల పారేసి పోయిండు.

నేను ముంగటికి కదులబోయిన... నా సేతిమీద కర్ర. నా పక్క కుంటోడు బట్టతల... కండ్లెక్కడున్నయో లేవో అక్కల ముక్కల బెరిగిన ఎంటికల్ల కనిపియ్యనే లేదు. వాని ఎడమ జబ్బకు రాగి తాయెతు. సంకకు జోలె.........

"లం......గీ బసిస్టాండు నాది......" వాడు అదే మాట. గి మనుషులకు ఆడిదాన్ని పిలిసేటందుకు గదొక్కటే మాటా? తొమ్మిది నెలలు మోసి వీల్లందరిని కన్నతల్లి... రకుతం పంచుకొని తోడబుట్టిన సెల్లె... తన రెక్కల్ల బొక్కల్ల కట్టంల సుకంల ఎంట కుక్కతీర్గ పడుండే పెండ్లాం... వీళ్ళందర్నీ ఒకే ఒక్క మాట 'లంజ'.......తోటి పిలుత్తండ్లు.

ఇంతకు గీ జాగా ఈనిదంటడేంది?

"గ పోరగండ్లు అడుక్కుంట లేరా?" కూసంత కోపంగనే...

ఆడు కిసుక్కున నవ్విండు.

"రూపాయికి పావుల" వాడు.

మొదట్ల నాకు సమఝ్‌కాలే... తెలిసేటాల్లకు ఆడు గెంటుకుంట పోయిండు. నేను ఆడుక్కున్నదాంట్ల ఆనికి రూపాయికి పావులియ్యాలె... మేమంత ఆనికింద పనిజేసెటోల్లం........బాగున్నది పనివరుస........

అట్లా పొద్దుగూకే దనుక... కాళ్ళు పీక్కుపోతుండగ మనిషి మనిషికి తిరిగి తిరిగి అడిగిన... కుంటోని కియ్యంగ నా దగ్గర మిగిలింది 90 పైసలు. ఉరుకులు పరుగులమీద హోటల్ల కురికిన. ఆడు గ పైసలు దీసుకొని నా కిచ్చింది మూడు మిరపకాయ బజ్జీలు... దొరికిందే బుక్కని తిన్నా. గొంతు దిగలే... కుతికె బడ్డది. గుడ్లల్ల నీళ్ళు. వాడిచ్చిన మంచినీళ్ళు గటగట తాగి హోటల్ పంచల సొమ్మసిల్లి కూలబడ్డ... నాకండ్లకు ఓ ఆడది కనిపిచ్చింది. బొగ్గు మోసుకచ్చి హోటలెనుక పారేసింది....ఆమె బొగ్గుతీర్గ మసితోటి నల్లగున్నది. హోటలోడు ఇకిలిచ్చి కొన్ని పైసలిచ్చిండు.

నాకు సుత గ పనిసేత్తె బాగుండు ననిపిచ్చింది. అడుక్కోవటంతోటి పొట్ట గడిసేటట్టు లేదు. ఆవిడెంట బడ్డ.....నేనడిగిన దానికి మొదట ఆమె ఏం మాట్లాడనే లేదు....... నా కడుపుసూసి మెత్తబడ్డది. నాగ్గావాలె పిడికెడు...... గ దాని కోసం పైకం...


www.eTelangana.org

గ పైకం యిచ్చే కయికిలి.........కాసంతసేపు ఎనకా ముందాడి, సరే తనతోటి రమ్మన్నది. మేమిద్దరం బస్తి పొలిమేరలు దాటి బొగ్గుబాయి దగ్గెరి కచ్చినం. మమ్ముల సూడంగనే "కొనయే" అనుకుంట ఓ కాకిబట్టలోడచ్చిండు.

నా గురించి ఆనికేందో సెప్పింది...అయినె లెక్కలు సెప్పిండు. నేను బొగ్గు అమ్మంగ అచ్చిన దాంట్ల సగం అయినె కియ్యాలె... ఏదో ఒకటి సేయకతప్పదు. నాకేడిదో పాతతట్ట తనే తెచ్చి యిచ్చిండు. దానికి రూపాయి అయితదన్నడు. నేను ఏమనలే........

అట్ల బొగ్గు దొంగతనంగ అమ్మేతందుకు కుదిరిన... దినమంతా ఏన్నో తిర్గటం....... సీకటి సీకటున్నదనంగనె బొగ్గు దొంగతనం........హోటల్లోల్ల సూపులు... పరాచికాలు... తొవ్వల ఎవడో ఒకడు బెదిరిచ్చి రెండోమూడో గుంజుకునేటోడు......ఇదంత జేత్తె నా ఆకలి మొత్తానికి సల్లార్తంది.

కని నాత్రి ఏడ పడుకోవాల్నో తెలిసేదికాదు. ఏన్నన్న కాసంత సోటు దొరుకుద్దే మోనని ఎతుక్కుంట తిరిగేదాన్ని... ఎవడో ఒకడు నా ఎంట దల్గెటోడు. తప్పిచ్చుకోను ఓ పంచనుండి మరో పంచ........

ఎన్ని దినాలిట్లా పంచలు దిరుగను? ఏ సీకట్లనో ఏ బిచ్చగాడో తాగుబోతో నామీద బడ్తడు. నాకు నెలలు నిండుతన్నయి. ఏడ పురుడు బోసుకోవాలె? నేను బతుకుడే గగనమైపోతున్న యేల్లల బిడ్డనెట్ల సాదాలె.......?

రెడ్డి సెరువు గండి పడ్డప్పుడు గండి ముయ్యటాని కచ్చిన ఒడ్డెది యాదికచ్చింది. నేను గప్పుడు శాయన్నతోని గలిసి మన్ను మోత్తన్న... ఆనకాలం... పది దినాలల్ల గండి ముయ్యాలె... ఏ యేల్లలనన్న ఆనగొట్టచ్చు... అగో గసొంటి యేల్లల ఒడ్డెరోల్ల ఆడది నీల్లాడింది... మొస తియ్యటానికి సుత పుర్సతు లేదు. దాని పెయ్యి కగ్గిదల్గ పసిగుడ్డుకు బొందతవ్వి తట్టల గుడ్డలేసి పండబెట్టి ఏమి కానట్టే మళ్ళా తట్ట మోసింది.... నా గతీ గంతేనా?

బొగ్గు అమ్ముతన్న... బిచ్చమడుగుతన్న...బాసండ్లు దోముతన్న......మొత్తానికి దినాలు గడత్తన్నయ్.........

గిట్ల బతుకుతున్న యేల్లన ఓ దినం.....బొగ్గు హోటల్ల పడేసిన.......ఒళ్ళంతా నొప్పులు. నిదుర ముంచుకత్తోంది...ఏడ పండుకోవాలె...గింత బస్తిల నా అసొంటి దిక్కులేనిదానికి గీ నాత్రి తలదాసుకోను కూసంత జాగే లేదు......అడుగును తీసేయటమే ఎంతో కట్టంగున్నది...బస్టాండు దాటిన....నా వెనుక ఎవడో తూలుకుంట త్తండు........నేను ఓ గుడిసె చూరు కిందికి ఒదిగి ఒదిగి నిలుసున్న.........తాగుబోతు పసికట్టిండు... నా దిక్కె అత్తండు... ఎటూ తోసక తప్పిచ్చుకోను ఉరికిన... తాగుబోతు నా ఎనుక బడ్డడు. ఆని సేతికి దొరికితే నన్ను పీక్కతింటడేమొ?

అట్ల ఉరికి ఉరికి అలిసిపోయిన....సడీసప్పుడు లేని సీకటినాత్రి... నా కాళ్ళల్ల సత్తువ మరింక లేదు. ఆడు తిట్టుకుంట ఎగపోసుకుంట నా దిక్కత్తండు. తప్పిచ్చుకోను దారేదిలేదు. దబడ దిబడ కనిపించిన గుడిసె కొట్టిన...



తలుపు తెరుసుకున్నది. గజగజ అనుక్కుంట లోపలికురికిన. గుడిసెల దీపం ఎలుగుతంది - తలుపు తీసిన మనిషి మొగోడె... అయినె తప్ప గుడిసెల ఇంకెవలున్నట్లు లేదు... నా వాలకం చూసి ఏమనుకున్నడో?

తాగుబోతు కేదో సెప్పిండు.....ఆడు తిట్టుకుంట గులుక్కుంట ఎల్లిపోయిండు.

అప్పుడు సూసిన.......మనిషి జెర మంచి మనిషి తీర్గనే ఉన్నడు...నల్లగున్న మనిషి కొంచెం మందంగనే ఉన్నడు........మనుసుల ఏమనుకుంటండో నేను పసిగట్టలేకపోయిన ....నాకు ఇంకో దిక్కు పీసుపీసు మంటనే ఉన్నది. ఎటూ దోసక భీరిపోయి నిలుసున్న...

"పర్వలేదు........ఈ బస్తిల ఇది మామూలైపోయింది...తప్పు వాళ్ళది గాదు...వాళ్ళను జంతువుల చేసిన కల్లుది....అదే చిత్రం.........సారా డిపోలన్ని పెట్టింది పెద్దపెద్దవాళ్ళే! ఇంత రాత్రిదాకా......" ఇంకా ఏదో మాట్లాడబోయి నా మొకంలకు సూసి ఆగిపోయాడు.

నేను మాట్లాడకుంట నిలుసున్న... నాకింక అనుకు తగ్గలే...

"ఆడెల్లిపోయిండు. మరింక నేను పోత...." చేతులు జోడిచ్చి తలుపు దగ్గెరికి నడిసిన.

"అరె! ఎందుకట్ల భయపడుతున్నరు. నేను మనిషినే నమ్ము...పులిని గాదు...పోనీ మీ ఇల్లెక్కడో చెప్పితే నేను మీ వెంట వస్త... అపరాత్రి గీ గుడిసెల్ల తిర్గడం అంత మంచిపని గాదు."

నా ఇల్లెక్కన్నని సెప్పను? నాలెసూపులు సూసుకుంట నిలుసున్న.........

"పోనీ గాబర పడ్డట్టున్నది. రేపు ఉదయం వరకు ఇక్కడే పడుకొండి.... నేను బయట పడుకుంట..."

"అద్దద్దు...." ఏమనాలో తోసక.

అతను మాట్లాడకుంట కాసేపు ఎటో సూసుకుంట నిలుసున్నడు. నేను ఆ గుడిసెను మూలమూల సూసుకుంట నిలుసున్న...

"పోనీ మీకు అభ్యంతరం లేకుంటే ఆ పక్కమీద పడుకొండి...నేను చదువుకుంటూ ఉంటా......."

అతను నా జవాబేమి వినకుండనే దీపం తెచ్చుకున్నడు.

"అద్దద్దు......మీపక్క పాడైపోతది...నా బట్టలు........."

అతను తలెత్తి నా కండ్లల్లకు సూసిండు...ఆ సూపుల ఏమున్నదో నాకు సరిగ చెప్పరాదు.... కని నా నెత్తిమీద సెయ్యేసి దవ్వినట్టనిపిచ్చింది...మారు మాట్లాడకుంట పక్కమీద బెదురు బెదురుగ ఒరిగిన......కండ్లు మూతలు పడుతున్నాయి.

✧


www.eTelangana.org

# 15

కండ్లు దెరిసెటాల్లకు గుడిసె కన్నాలల్ల నుంచి ఎండపొడ కత్తుల దీర్గ ఏలాడుతంది. కాసేపు నేనేడున్ననో తెలిసిరాలే. అట్ల ఎటూ తోసకనే ఆవులిచ్చుకుంట తలుపు దిక్కు సూసిన... తలుపు దగ్గెరేసున్నది. ఇల్లంతా సదిరిపెట్టున్నది. లేసి నిలుసున్న...గప్పుడు యాదికచ్చింది...సీరె సదురుకొనుకుంట నా దిక్కు సూసుకున్న ....దయ్యం తీరుగనే ఉన్ననను కున్న... 'ఏడికి బోయిండో' అనుకుంట తలుపు దీసిన ...నీల్లకుండల నీళ్ళు నిండున్నయి. కుండ సాటుకు చిన్న గిలేటు గిన్నెల సగం బువ్వున్నది. కూరున్న జాడలేదు........ఎటు బోయిండో......పెండ్లి కానట్టున్నది......సుట్టుపక్కలోల్లు ఏమనుకుంటరో?

ఇగత్తడు పోత, అగత్తడు పోత ననుకుంటనే, అంబటేల్ల దనుక ఇంట్లకు బయటకు దిరిగిన....... అంబటేల్ల దాటిపోయింది. మరింక రాడేమోనని పక్కమీదనే కూకున్న... పట్టపగలయ్యింది...రానేలేదు.....తాళమన్నాఏసి పోదామనుకుని ఇల్లంత సూసిన....ఓ మొలకు తాళమున్నది.....తాళపుసెయ్యి ఎవలకియ్యాలె? అట్లనుకుంటనే పక్కమీది కొరిగిన... కండ్లు తలుపుదిక్కు బెట్టిన.....

ఎంతకు రాడు....ఎటూ తోసక ఇల్లంత మల్లమల్ల జూసిన. గుడిసెల బాగా ఎలుగుపడే జాగల నాలుగు బొమ్మలున్నయి. ఒకతను తెల్లగడ్డం.........మనిషి ఏ రంధి రవుసు లేనోని తీరుగున్నడు. అయినె పక్కబొమ్మ పిల్లిగడ్డపతను. పెదువులు మోటుగ దొడ్డుగుండి తిడుతన్నట్టుగున్నది...అతనిపక్క ఇంకో పిల్లి గడ్డం...గీ మనిషి కండ్లు లావు జిత్తులమారిగున్నయి... నాలుగో అతను ముద్ద సెంపలు... సీమకండ్లు... ఎడ్ల బాటతీర్గ నెత్తిమీద బట్టతల..... కుడి సెంపకింద గవ్వంత ఉలిపిరికాయ. గిసొంటి మనుషుల నేనెప్పుడు సూసినట్టు యాదికి లేదు. అదే గోడమీద జాజుతోటి కొడవలి, మద్దెన సుత్తె ఉన్నయి. ఇంకొంచెం కింద మాసిన లాగు అంగి ఏలాడ్తన్నయి... లాగుమీద బొక్కటోపి.

ఇతనికి పెండ్లాం పిల్లలు లేరా? ఎటు పోయినట్టు? ఎంతకు రాడేం? ముక్కు మొకం తెలియని దానిమీద ఇల్లిడ్సిపెట్టి పోయిండు గదా? లేసి కూకున్న... తలుపు కొద్దిగ తెరిసిన... దూరంగ పట్నం తుమ్మసెట్లు... ఆడ పందులు గురుకూ గురుకు మనుకుంట కొట్లాడుకుంటన్నయి....

ఆకలి కాగలేక ఎట్లయితె గట్లయితదని ఉన్న బువ్వ తినేసిన...తిన్నంక ఎన్నో అనుమానాలు....మల్ల పక్కమీద ఒరిగిన....కన్నంటుకున్నది......

మళ్ళ కండ్లు దెరిసేటాల్లకు సీకటయ్యింది...అరరె! ఎంత పనైపోయిందని దిగ్గున లేసిన....అగ్గిపెట్టె ఎతికి దీపం ముట్టిచ్చిన...



దీపాన్ని సూసుకుంట కూకున్న....గీ నాత్రి గడిత్తె తెల్లారి ఏదో సెయ్యాలను కున్న.....

తలుపు మూసి పక్కమీద పడి నిదురబోయిన.....

నేను మంచి నిదురలుండంగ తలుపుమీద దబడ దిబడ సప్పుడు....లేసి కూకున్న ........తలుపు సప్పుడు అట్లనే అయితంది...'ఎవలూ' అందామను కున్న.......అనుకుంటనే దీపం బట్టుకపోయి తలుపు దీసిన...అతగాడు సుడిగాలి తీర్గ గుడిసెల కచ్చిండు....నేను కొయ్యబారిపోయిన...

అతని నొసలునుంచి నెత్తురు కార్తంది... బట్టలు సినిగున్నయి. మొకమంతా దుబ్బకొట్టుక పోయున్నది. నన్నే మడుగకుంటనే పక్కమీద ఒరిగిపోయిండు. మాట గీట ఏది లేకుండనే మూలుగుతండు........

గిప్పుడు నేనేం జెయ్యాల్నో తోసలే....సానాసేపు దీపం బట్టుకొని సూసుకుంట నిలుసున్న...

కాసేపటికి తేరుకొని తడిగుడ్డతోటి నొసలు నెత్తురు తుడిసిన... మూలుగుతనే ఉన్నడు. దెబ్బలు గొట్టింది ఒక్కలు కానట్టున్నది. గ దెబ్బలు సేతులతోటో, కట్టెలతోటో గాక మరి దేనితోనో కొట్టినట్టున్నది... అంగిడిసిన.....పెయ్యంత పెద్ద కొత్త సందులేకుంట పికిలి పోయున్నది. నెత్తురు గలుసులు......నెత్తురంత తుడిసిన...

గిప్పుడేం సెయ్యాలే... కండ్లు తెరిత్తె బాగుండు. మూలుగుడు బందయితె మంచిగుండు.....ఏడికన్నా తీసుకపోయి మందో మాకో రాత్తె బాగుండు. ఎవలు గొట్టిండ్లు? ఎందుకు గొట్టిండ్లు?

ఏడనో కుక్కలు మొరుగుతన్నయి. సుట్టుపక్కలోల్లెవల్నన్న పిలిత్తె బాగుండు... తలుపు దగ్గెరికి బోయి ఆగిపోయిన...

ఏమని చెప్పాలె?.....నువ్వెవలంటె ఏం జెప్పాలె? అసలు సెప్పన్నో అద్దో? మళ్ళీ ఎనక్కచ్చి దీపందగ్గెర కూకున్న...

ఇంతట్ల తలుపుదగ్గెర సప్పుడు.........నేను అటు సూసెటాల్లకే బక్కగున్నతడు లోపటికచ్చిండు. మొకంల బొక్కలు తప్ప కండ లేనేలేదు. సేతుల తోలు సంచున్నది...

నన్ను సూసి కండ్లు పుల పొడిసి...

"అక్కా ఇప్పుడెట్లున్నది?"

నేను గ పిలుపిని ఉలికిపడ్డ.......గ మాట నా గుండెల మళ్ళా మళ్ళా ఇనపడ్డది.......మళ్ళా గదే మాటన్నడు. నేను ఇనిపిచ్చుకోలే... అతగాడు వంగిసూసిండు.

నేను తేరుకొని "దెబ్బలు బగ్గ తాకినయ్...ఎటన్నా తీసుకుపోతే బాగుంటుంది" అన్న. గ ఎటో నాకు తెలువది.


www.eTelangana.org

“హఠాత్తుగ దాడి సేసిండ్లు... మరేం పర్వలేదు. మీరు ధైర్యంగా ఉండాలె....బతుకు సొంతం నెత్తురుమయమే కదా!” ఎటో చూసుకుంట కలల మాట్లాడినట్టు మాట్లాడి ...........అతని ఒళ్ళంతా తడిమిండు. లేచి నిలబడి... “ఓ గంటలోపల డాక్టరొస్తడు........” అనుకుంట ఎట్లా వచ్చినోడు గట్లనే పోయిండు.

“అటు.......జాగ్రత్త.........మేం తలుసుకుంటే......కార్మిక శక్తి......జిందాబాద్........” అంతూ పొంతూ లేకుంట అతను కలువరిత్తండు......

నాకు ఒక్కమాటన్నా తెలువలేదు........తడిగుడ్డతోని తుడుసుకుంట కూకున్న ........ఎంత సేపయ్యిందో? డాక్టరచ్చిండు. గిలేటు చెంబులో నీళ్ళు వెచ్చజేసి యిమ్మన్నడు. ఇచ్చిన. అతను కట్టుగట్టి సూదిచ్చి మందు బిళ్ళలిచ్చి ఎప్పుడెప్పుడేయాల్నో సెప్పిండు.........“మళ్ళీ రేపొస్త........మరేం పర్వాలేదు”.........డాక్టరు పోయిండు. డాక్టరు పోయినంక మొదుగాలచ్చినాయినె మళ్ళచ్చిండు.

తెల్లందాక నాకు సెప్పుతన్నట్టుగనో తనండ్లతనే గులుక్కున్నట్టుగనో ఏది తెలువకుంట ఏందో సెప్పుకచ్చిండు. గీ మాటలన్ని కొత్తయి..........నేను ఏం మాట్లాడ కుంట కూకున్న. నా గురించి అడుగుత డనుకున్న........ఏమని చెప్పాలె? అతను అడుగనే లేదు. తెల్లర్తదనంగా అతను ఎల్లిపోయిండు.

మందులు పన్జేసినట్టున్నయి. అతను సుకంగ పన్నడు. సప్పుడు గాకుంట ఇల్లూడ్సిన- గిన్నెలు కడిగిన... నీల్ల కోసం నల్ల దగ్గెరకు బోయిన.......ఆడోల్లు కిందామీదా సూసిండ్లు- ఆడ కుక్కల కొట్లాట... సడీసప్పుడు లేకుంట అందరు బట్టుకున్నంక నేను బట్టుకున్న.......

కంకబద్ద తీర్గున్న ఒకామె... “ఏం గావాలె?” అన్నది......

నాకు ఆ మాట తెలువక బిక్కమొకంతోటి నిలుసున్న........

“గదే బిడ్డా ఏమైతవు?”........అన్నది ఓ మచ్చలమొకం దొడ్డుమనిషి.....

ఏం జెప్పాల్నో తోసలే........ఏదో ఒకటి సెప్పాలెగన్క “సెల్లెను” అన్న........

“అట్లనా? ఎన్నో నెల?”....ఇందాకటామె.

ఇంకెవలో “ఎన్నో కాన్ప”న్నరు మందిలనుంచి.

మాట్లాడకుంట నీల్లు బట్టుకున్న.

“బిడ్డా! నువ్వేం ఫికరుపడకు. మేమంత లేమా?” అన్నది దొడ్డామె.......

అతనిగురించి సెప్పాలనుకున్న.......సెప్పన్నో అద్దో! కుండెత్తుకొని గుడిసెల కచ్చెటాల్లకు గుడిసెనిండా మాసిన బట్టలోల్లు బొక్కటోపీలోల్లు సానా మంది న్నరు.........ఆళ్ళంత ఎవల్నో తిడుతండ్లు. పండ్లు కొరుకుతండ్లు. నేను ఆళ్ళ తిట్లు



ఇనుకుంటనే నాలుగు కుండల నీళ్ళు తెచ్చిన... అప్పటికి వాడమీది ఆడోల్లంతా గుడిశె ముంగట సేరిపోయిండ్లు... ఆడోల్లు సేతులు తిప్పుకుంట శాపనార్థాలు బెడుతండ్లు....

ఎవలో “గాలి ఆడనియ్యండ్లెహేఁ! గీడ మాతిడుతరు. యాల్లకత్తె మోఖబడితె ఏడోడాడ తోక ముడుత్తరు” అన్నడో ముసలోడు.

“ఎవలురా ముసలినా కొడుక తోకముడిసేది?.......నిండనియ్యి పాపం బరుపూర నిండనియ్యి... గప్పుడు బత్తి అంటుకుంటది.........” అన్నడు ఓ పొట్టోడు......

అతను మద్దెన కూకుండి అందరికి ఏదో సెప్పిండు.......అట్ల తిట్టి, పండ్లు గొరికి ఎటోల్లటు ఎల్లిపోయిండ్లు.....కొంతమంది పండ్లు గొనుక్కచ్చిచ్చి పోయిండ్లు

గుడిసె బయట పాత తట్టలతోని కూసంత సాటు గట్టున్నది. నీల్లను సూసెటాల్లకు నాకు పానం లేసచ్చింది. సన్నీల్లతోటి తలకు బోసుకున్న........బట్టల కింద పాద్దోతి దొరికింది. గది కట్టుకున్న... రయికె పిండుకొని తడిదే తొడుక్కున్న.

నేనిదంత సేసెటాల్లకు అతను మళ్ళీ నిదురబోయిండు..........మళ్ళీ నా సీరె సిరుగులు కన్పియ్యకుంట సరిసేసి కట్టుకున్న...

పగటించి లేసిండు.

“నీ వంట్లె గిప్పుడెట్లున్నది” అడుగాలనుకున్న.

అతను మళ్ళీ కండ్లుమూసుకున్నడు.

“నేను పోత” గులుగుతన్నట్టుగ అన్న.

“మీకు శ్రమ గల్గించిన... మన్నించాలె”... అతను లేసి కూకున్నాడు.

నేను మాట్లాడలే......

“ఇందాక ఈడకచ్చి పోయిన ముసలాయినె బయటెక్కన్నో ఉంటడు. మిమ్ముల మీ యింటికాడ దించత్తడు... నేను బిలుత్తనన్ననని పిలువగలరా?”

నేను బయటకచ్చి నిలుసున్న... నేనేం జెప్పాలె! ఏడ నా ఇల్లని సెప్పాలె? ఏ ఊరు తరిమికొట్టిందని సెప్పాలె? గింత పీకులాటెందుకు? నా కెవల తోడద్దని సెప్పిపోతె కాదా?

లోపటి కచ్చిన... నోరు పెకులలేదు.

“ఎవలు కన్పించలేదా?”

“నేను మాపోత........” నేను ఎనుకకు దిరిగి బయటకు నడిసిన. తూర్పుదిక్కున సూరీని సుట్టు వరదగూడెసింది. బయట సందడిగున్నది. నేను అడుగేయబోయిన, లోపలినుంచి పిలిసినట్టనిపిచ్చింది. పోవాల్నా అద్దా అనుకుంటనే మళ్ళ గుడిసె లోపటికచ్చిన...


www.eTelangana.org

"మన్నించాలె... మీ పేరడుగనే లేదు."

ఇందుకా పిలిసింది!

"పోనీ వదిలేయండి."

నా కండ్లల్ల నీళ్ళు సిమ్ముకత్తన్నయి. పెదువులు అదురుతున్నయి....గట్లనే ఉరుకుతే మంచిగుండు.

"మీరు నిన్ననే పోవాల్సింది. మీకోసం మీవాళ్లెవలు ఎతుక్కుంట రాలేదా?"

గీ ముసుగుల గుద్దులాటెందుకు? ఉన్న సంగతి సెప్పుకుంటె నాకు పోయేదేమున్నది?

"సరే! నా కోసం ఎవలన్న అచ్చిండ్లా?"

నేను సెప్పిన....

"ఆళ్ళ గురించి ఎక్కడా అనద్దు....."

నేను ఒకడుగు గడుపావలేసి కలల మాట్లాడ్తన్న దానితీర్గ "నేను గీ లోకంల బిచ్చగాళ్ళదాంట్ల ఒకదాన్ని... నా యిల్లు బస్టాండు. బంగుళల పంచలు, నా పని బొగ్గెత్తుకచ్చి అమ్ముడు, హోటల్ల బాసండ్లు కడుగుడు...."

అతని దిక్కు సూడకుంట రెండో అడుగు బయటేసిన...

"మీ పేరు సెప్పలేదు...."

"బయ్యక్క......గని....గ పేరెప్పుడో పెద్దార్లె గలిసిపోయింది."

"బయ్యక్కా....నేను గందట్లనుంచే వచ్చినవాన్ని...."

అతని మాటినకుంటనే ముందుకు నడిచిన....

"అరెరే! ఎటో పోతండ్లు. ఏమన్నా కావాలంటే ఎవరి నడిగిన తెచ్చి పెడుతరు. అతన్ని సూసుకుంటుండాలె." రాత్రి వచ్చిన బక్కతను సనువుగ నా సెయ్యిబట్టుకొని గుడిసెలకు తీసుకచ్చిండు. నేను ఏది మాట్లాడకుంటనే మరిన్ని పనులు సెప్పిండు.

నేను ఎటుతోసక నిలుచున్న.

నేను ఆడ ఉన్నట్టుగ మరిసిపోయి వాళ్ళిద్దరు మాటల్ల పడిపోయిండ్లు. గ మాటలు ఎంతకు ఒడువలేదు. అతను సెప్పిన పనులు సేసిపెట్టిన. మళ్ళ నాత్రయ్యింది. డాక్టరు పండ్లు గొనుక్కచ్చిండు. మళ్ళా ముగ్గురు మాటల్ల పడిపోయిండ్లు. మద్దెల మరో పిలగాడచ్చిండు. అతను ఎఱ్ర కాయిదం తీసి మొకం మీద నెత్తురు పేరంగ తీసి సదువబట్టిండు. ముగ్గురు వుండుండి తలలూపుకుంట ఇన్నరు. గందట్ల గితని పేరు రాజారామని.



అతగాన్ని మరెందుకో మరెవరో కొట్టిండ్లని తెలుసుకున్న. గ నాత్రి సానామంది అచ్చిపోయిండ్లు.

నాత్రి సానా గడిసిపోయింది....అందరెల్లి పోయినంక మోకాళ్ళమీద గద్దువబెట్టుకొని కూకున్న...

"ఏదన్న చెప్పుండ్లి... ఇంట."

నేనేమీ మాట్లాడలే... పోనీ ఏదో ఒకటి మాట్లాడ్త? నాకు ఎరుకలేని కొట్లాట సంగతడిగిన... అతను సిన్నపిల్లకు సెప్పినట్లు సెప్పుకచ్చిండు. మాటల్ల మాటల్లనే మా ఊరి సంగతుల గురించి, మనుషుల గురించి సెప్పుకచ్చిన... నేను చెప్పిన సంగతులన్ని ఇని...

"నేను సెప్పే మాటలన్ని తిరకాసుగున్నయా? మనందరం కనీసం మనుషులుగా బతకడంకోసం పెనుగులాడ్తన్నం...ఈడికచ్చి నోల్లందరియి గిసొంటి కన్నీటి బతుకులే... ఎవలను కదిలిచ్చినా గిసొంటి మాటలు కోకొల్లలు....మీరేమనుకోకుంటే మీకు నచ్చినంత కాలం ఈడనే ఉండచ్చు. ఎప్పుడు పోవాలనుకున్నా పోవచ్చు" అన్నడు....

నేను పోతాననలేదు. పోనూ అనలేదు. నా మనుసుల ఆశ... వీళ్ళంతా నా బతుకుల ఎదురైన మనుషులతీర్గ లేరు. కాన్పు అయ్యేటంత వరకైనా పొద్దందాకా నా తిప్పలేవో నేను పడి నాత్రికన్నా తలదాసుకోవచ్చు....

"నాకు గీ దునియల నా అన్నవాళ్ళెవలు లేరు! నేను దయ్యాలను తప్ప నా బతుకుల మనుషుల సూసెరుగ.....సూత్తంటే అదెదో లోకంలున్నట్లున్నది. నా పొట్ట తిప్పలకోసం నేను పడే పుల్లెందులు నేను పడ్త. నేను దిక్కుమల్లెదాన్ని .....కనీసం...."మాట ముద్దయి పోయి ఏడుపు పొంగుకచ్చింది. తమాయించుకోను లేసి నిలుసుండి దరువాజ కాడికి నడిసిన.....ఏడుపాగలే...మొకాన కొంగుబెట్టుకొని ఏడ్సిన...

"సరే మీ యిట్టం....కని ఈడికి రోజు సానా మందత్తరు. వచ్చెటోల్లు అర్ధరాత్రుళ్ళు, అపరాత్రుళ్ళు ఆకలికి నకనకలాడుకుంటత్తరు....మీ కభ్యంతరం లేకుంటే అక్కలా, తల్లిలా కాసంత వండిపెట్టండి. మీ తిండికోసం ఏరే తిప్పళ్ళు పడుడుండదు."

నేనే మనలే....అతను మరేం మాట్లాడలే. కాసేపటికి సన్నగా గురక ఇనిపిచ్చింది.

నేనట్లనే కూకున్న... గిది కలా? నిజమా? బతుకెటు పోతంది?

అట్ల నా బతుకు కొత్త మలుపు తిరిగిందని... గ మలుపు ఎంతో నీచమైన, రోత గలిగేదైన... కట్టాలు ఏడుపులతో నిండిన నా బతుకును వెలుగుదిక్కు రెక్కబట్టుక ఈడ్సుక పోతదని నా కెరికనే లేదు. గీ బతుకు నాకు ఏం నేర్పిందో సెప్పుకోవటానికి నా దగ్గెర మాటలులేవు....నా ఆడదాని మనసు ఎంత కరిగి నీల్లయిపోతందో. అయ్యో నేను


www.eTelangana.org

మీకెట్లా సెప్పుకోగలను... కండ్లల్ల ఊరే నీల్లతోనే నేను ఏడ్సిందిగాదు. నేను మనిషిగా మీ అందరి ముంగట నిలుసున్న... నా నెత్తురు సివరి బొట్టుసుత మనుషులకోసం నా తోటి అక్కలకు, సెల్లెండ్లకు, అన్నలకు, తమ్ములకు యియ్యాలనుకున్న.

నేనిప్పుడు మారుమూల పల్లెల ఏటాడబడే జంతువుని కాదు....కవులు రాసే సుతి మెత్తని, సుంగారమైన ఆడిదాన్ని కానేకాదు. నేను పల్లెల పొలుమార్లు దాటినదాన్ని... గుది గుచ్చినట్టున్న గుడిసెల్ల ఇల్లిల్లు దిర్గి నెత్తురు ఇలువగురించి రాత్రి పగలు నూరిపోసినదాన్ని... నా అన్నలకు, తమ్ములకు, కామ్రేడ్లకు బుజానికి బుజం, కన్నుకు కన్నైనదాన్ని....

✧

# 16

**నా** సుట్టేం జరుగుతందో నాకు తెలిసేదిగాదు....నేనుంటన్న గుడిసె...మిగతా గుడిసెలకు కొంచెం దూరంగున్నది....మా గుడిసెనుంచే పట్నం తుమ్మసెట్లు మొదలైతయి. కొంచెం దూరంల ఇంకో గుడిసున్నది. సానా దినాలదాకా అందట్ల ఎవలు ఉన్నట్లు కన్పియ్యనేలేదు. నాలుగైదు దినాలయినంక ఓ ముసులోడు కనిపిచ్చిండు. సెక్కుకపోయిన సెంపలు పీక్కపోయిన కండ్లు... మొకంల ఏమున్నదో ఎవలకు తెలిసేటట్టులేదు. అతడు డూటీ బట్టలతోని దగ్గుకుంటచ్చెటోడు. అట్లనేపడి నిదురబోయేటోడు. అండుకుంటడో లేదో కనిపియ్యలేదు. అప్పుడప్పుడు పొద్దుగూకినంక సొలుక్కుంట బొక్కటోపి సిప్పతీర్గ పట్టుకొని గులుక్కుంట ఎటూ సూడకుంటచ్చెటోడు. ఏం మాట్లాడ్తుండోనని ఇనేదాన్ని... ఆ మాటలకు కొస మొదలుండేది కాదు. ఒక్కొక్కపారి సలిదవుడలు కదులంగ గీరగ ఏదో పదం ఎత్తుకునేటోడు. ఆ పదం సుత కొస మొదలుండేది కాదు. 'నిలువది నిలువది కాయం...గిది నీటిబుగ్గ సుమి... నిముషం లోపట మాయం.' 'బొగ్గు కుప్పల అగ్గినడుమ... నీ బొందకింత జాగేదే సిలుకా!'... ఇట్ల పాడెటోడు. అతను బర్రె ఒర్రినట్టు రాగంతీసి టక్కున పదం ఆపెటోడు.

ఒక్కొక్కపారి మా గుడిసెల కెవలన్న అచ్చినపుడు ముసులోడు సుట్టతాక్కుంట గుడిసె ముంగట కూకుండెటోడు. 'పహర' కాత్తన్నట్టు రాజరాం సెప్పిండు. ఎందుకనో నాకు తెలువలేదు.

మా గుడిసెల జరిగే సంగతులు సుత నాకు ఒక్కటీ తలకెక్కుత లేదు. ఏడినుంచో కొంపలు మునిగిపోతన్నట్లు మనుషులచ్చెటోల్లు... దుబ్బకొట్టుకపోయి, సొలుగుక్కుంట బాగా అలిసచ్చేటోల్లు....వాల్లండ్ల పిలగండ్ల కాన్నుంచి ముసులోల్ల దనుక ఉండెటోల్లు......



అచ్చినోల్లు గుంపుగ కూకుండి గొంతు తగ్గిచ్చి మాట్లాడుకునేటోల్లు. ఆళ్ళు తెలుగులనే మాట్లాడినా నాకు తెలిసేది కాదు. ఉండుండి ఎవలో ఇట్లా కాదనెటోళ్ళు.... ఇంకొకలు మళ్ళా మొదటినుంచి చెప్పుకచ్చెటోళ్ళు....అయినా నేను ఒప్పుకోనంటె ఒప్పుకోనని పెద్దగ అనేటోడు. వాదాలు జరిగేయి. గ ముచ్చెట్లు సూత్తె ఎప్పుడో ఈళ్ల ఒకల గొంతు ఒకలు నులుముకొని సావరుగదా అనిపిచ్చేది....మళ్ళ మొదటినుంచి ఎవలో సెప్పేటోళ్ళు. నాకు కండ్లమీదికి నిదురరాంగా ఆ మాటలన్నీ ఇనేదాన్ని. ఆళ్ళట్ల మాట్లాడుకుంటుండగనే బొగ్గు పొయ్యి ముట్టిచ్చేదాన్ని. ఒక్కొక్కపారి కూర గీర ఏది లేకుంటనే గొడ్డుకారంతోనే తినేటోల్లు.

ఎవలు లేనప్పుడు... తనెటు పోనప్పుడు రాజారాం ఏదన్న రాసుకుంటనో సదువు కుంటనో ఉండెటోడు. ఒక్కొక్కపారి ఏ అపరాత్రో లేసికూకుండి రాసుకునేటోడు....నాకు ఇసారాలు ఎన్నో తీర్ల సాగేటియి. ఇతగాడు ఏ అపరాత్రో నన్ను.....కండ్ల కొసలనుంచి అతగాన్ని సూసేదాన్ని... అతను నా సంగతే మరిసిపోయేటోడు. నేను కదులుతే "నిద్ర పత్తలేదా? దోమలను ఏం సేసేటట్టు లేదు" అనెటోడు...అతను అట్ల ఒంటిగ కూరుకుతున్న దీపం ముంగట కణతలదగ్గెర నరాలు ఉబ్బుకరాంగ సదుకోవుటం జూత్తె నాకు జాలేసేది. ఇంతకూ గ వయిలల్ల ఏం రాసుంటరు? కితాబులల్ల గంత మంచి సంగతులుంటయా? ఏమో ఎవలకెరుక? నాకే గీకత్తె... గ కలంపుల్లతోని బరబర నాలుగు గీతలు గీకేద్దును... అతను కాసేపు ఒరిగెటోడుగదా? అప్పుడప్పుడు నేను లేవటం ఆలిశ్యమైతే అంట్లగిన్నెలు కడిగుండేయి. నీల్లు తెచ్చి ఉండేయి.

"నేనెందుకున్నట్టు?" కాసంత రోషంగనే...

అతను కనీ కనిపియ్యకుంట నవ్వి పోయేటోడు.

ఓపారి నిలదీసిన

"ఆడోల్లు అంట్లే తోమాలని ఏడనన్న రాసున్నదా?"

"మరి నేనెందుకిక్కడ? నేను పల్లెల బుట్టినదాన్ని....."

ఎవలమీద నా కోపం....?

రాజారాం కాసేపాగి, "తప్పక నీకూ పని తగులుతది....ఊపిరి సలుపనంత పని.... గప్పుడు ఏమంటవో సూడాలె. కని నువ్వు కొంతకాలం ఇట్ల ఉండాలె."

పగటించి రాజారాం పోయినంక నాకేం తోచేదికాదు. బొగ్గు పెళ్ళలు సన్నగ సితగ్గొట్టి పెట్టేదాన్ని... మాసిన బట్టలు ఒకటికి రెండుమార్లు ఉతికేదాన్ని... ఉన్న నాలుగు గిన్నెలు మాటిమాటికి కడిగేదాన్ని... ఎన్ని సేసినా ఎంతకూ పగలు ఒడిసేదిగాదు. గీ పనులన్ని సేసుకుంట నన్ను నేను ఓ యింటిదానిగ అనుకునేదాన్ని... అట్ల అనుకునేటాల్లకే పెయ్యంత సెముట లచ్చేటియి....నేనెట్ల ముందుముందు బతుకుత? ఎంత ఎతికినా ఇగో గిట్లా అని తెలిసేది కాదు. ఒక్కొక్కపారి నాకు పుట్టబోయే బిడ్డమీద


www.eTelangana.org

ఇసారాలు సాగేటియి. నా కండ్ల ముంగట సిన్నపిల్లలు ఆడుకుంట, పాడుకుంట కనిపిచ్చెటోల్లు....

పట్టపగలు ఒంటిగ గడుపమీన కూకుండి పట్నం తుమ్మసెట్లదిక్కు అదే పనిగ సూసేదాన్ని. గ తుమ్మసెట్ల కిందినుంచి కాలిబాట... గ బాటమీద ఎప్పుడూ ఎవలన్న నడుత్తె మంచిగుండు ననుకునేదాన్ని... అయిలింతలు దీసుకుంట గుడిసె బయటకత్తె కుడిదిక్కు మావూరి గుట్ట కనిపిచ్చేది. గ గుట్టకింది పల్లెల నేనెట్ల బతికిన? పెయ్యి గొగ్గరిచ్చేది. మళ్ళా ఆ ఆగు, ఏపసెట్టు, పికిలీ, పసురాలు, ఓహ్... ఆ పదాలు, ఆ ఆన, ఎండ.......అన్నీ యాది కచ్చేటివి. మళ్ళా ఆడికి బోతె... మా అన్న, అవ్వ యాదికచ్చెటోల్లు... కండ్లల్లకు గుబగుబ నీళ్ళచ్చేటివి.

అప్పటికి పొద్దుగూకేది బొగ్గుపొయ్యిలు అంటిచ్చి అంత గుడిసెల బయట పెట్టేటోళ్ళు... సూడంగనే పొగ కమ్ముకపోయేది. మా ఊరి గుట్టపొగల గల్సిపోయేది. నేను పొయ్యి అంటిచ్చి బయట పెట్టేదాన్ని... పొగ సూరుకుంట అగ్గి కావుటం సూసుకుంట కూకునేదాన్ని.

రాజారాం బాగా నలిగిపోయచ్చేటోడు. నేను కుండల నీళ్లు కాగబెట్టి తయారు బెట్టేదాన్ని...

"మీకెందుకీ కట్టం?"

"గిందట్ల కట్టమేమున్నది. పొయ్యిమీన పారేస్తే అయ్యే కాగె."

అతను పెయి కడుక్కొని తాములుగ కనిపిచ్చేటోడు.

"పగటించి నాకు ఏం దోత్తలేదు. ఏదన్న........"

"ఏంజేస్తరు...ఇంకా కొద్ది దినాలల్ల మీరు ప్రసవించవచ్చు... అయింక సూడొచ్చు...."

"మీరేంది? దూదేకుల అమీరు తీర్గ."

"ఏమనుమంటరు?" నవ్వుకుంట.

"బయ్యక్క అనుండ్లి సాలు."

"సరె బయ్యక్క ఒక్కపని జెత్తె ఎట్లుంటది?"

"బాగుంటది."

"నువ్వు సదువుకుంటె ఎట్లుంటది?"

తికమకపడ్డ.....నేను సదుకోవుటమేంది?

"ఏం పర్వలేదు. నీకు సదువొస్తె సానా సంగతులు తెలుస్తయి."

అంతట్లనో ఎవలో అచ్చిండ్లు... ఆ మాటలు గంతటితోనె ఆగిపోయినయ్.

✧



నడిర్యాము నాత్రి కడుపుల నొప్పి మొదలయ్యింది. లేసి కూకున్న... ఆ దినం నీరసంగుండి ఏం దినలే... గందుకనే నేమొ అనుకున్న... నొప్పి అంత కంతకు ఎక్కువై పోతంది. రాజారాం ఆనాడు రాలేదు. నాకెటు తోసలేదు. మెల్లెంగ గుడిసె బయటకచ్చిన... గుడిసె ముంగట ముసలాయినె కూనిరాగం తీత్తండు. కొంచెందూరం నడిసి "తాతా...... తాతా" పిలిసిన.

ముసలాయినె నేను ఏం జెప్పకుంటనే సుట్టుపక్కల ఆడోల్ల తీస్కచ్చిండు ......అయింక నేను రిక్షల కూకుండి ఎటో పోవటం మాత్రమే యాదికున్నది.

✧

నాకు మళ్ళ తెలివచ్చెటాల్లకు పెయ్యంత పచ్చిపుండు తీరుగున్నది....నేనో గదిల ఉన్న... కదలటానికి సుత ఈలుగానంత కడుపుకాడ నొప్పి. నాపక్క దగ్గెర నా ఈడున్న ఆడామె నిలసుసున్నది. ఆమెను నేను ఇంతకుముందు ఎక్కడా సూసినట్టు గుర్తులేదు.

"కదలద్దు, అపరేషనయ్యింది" ఆమె.

అంతట్లకే రాజారాం అచ్చిండు. అతని మొకమెందుకో దిగులుతోటున్నది.. నేను పక్క తడిమిన... ఏడీ నా నెత్తురు పంచుకొని పుట్టిన నా తండ్రీ?

రాజారాం సిత్రమైన గొంతుకతో, "కొన్ని సంగతులకు మనం మనుసు రాయి సేసుకోవాలె బయ్యక్కా! బహుశ అందులో మా అందరికన్నా నువ్వే ఆరితేరినదానివి."

ఏం మాట్లాడుతండు? ఏమయ్యింది?

"నా బిడ్డ...." అన్న సిగ్గుతోని.

"నీ బిడ్డ పానం లేకుంట బుట్టిండు."

నా గుండెల బత్తి పేలింది... నాకండ్లు సీకట్లు గమ్మినయ్. నేనెంతగ అదిలిపోయిన్నో....

"అవద్దం...అవద్దం" నేను అరుసుకుంట లేవబోయిన. నాపక్కనున్నామె నన్ను మంచాని కదిమి పట్టుకున్నది. డాక్టరు ఉరికచ్చిండు. నేనట్లా గింజుకోంగనే నాకేదో సూదిచ్చిండు. కండ్లకు మత్తు కమ్మేసింది.

సగం నాత్రెప్పుడో తెలివచ్చింది. నా నెత్తిమీద గాలిపంక బయంబయంగ తిరుగతంది. నెమ్మదిగ ఇసారాలు జేసిన... పూసిన పూలన్ని పిందెలుగావు... కాసిన పిందెలన్ని కాయలుగావు... కాయలు పండ్లు.. ఏ బిడ్డకోసం నేను ఊరు నెదిరించిన్నో... ఆ బిడ్డ లేదు....గిది ఔనన్నా కాదన్నా నిచ్చమే...

సడీసప్పుడు కాకుంట ఏడ్వటం తప్ప నా అసొంటి తల్లి ఇంకేం చేయగలదు.......?

✧


www.eTelangana.org

# 17

అప్పుడే ఆర్నెల్లు గడిసిపోయినయ్. నాకు అచ్చరాలు కూడబలుక్కుంట చిన్నచిన్న అచ్చు వయిలు సదువత్తంది. రాజారాం కైతే ఊపిరి సలుపని పనులు........సుట్టుపక్కల ఆడోల్లు రాకట పోకడ ఎక్కువైంది.....

ఆదినం రాజారాం తెచ్చిన పత్రిక సదువుకుంట కూకున్న. రాజారాం పొద్దు గూకకుంటనే అచ్చిండు...

"బయ్యక్క కూసంత చాయ్ బెడ్తవా?" అన్నడు...

"నీకొక్కనికేనా? ఇంకెవలన్న అత్తరా?" అన్న...

"మనిద్దరికి బెట్టు........." అనుకుంటనే కింద కూలబడి కాయిదాలు ముంగ టేసుకున్నడు....

బయట పడేసిన పొయ్యిల ఇంకా అగ్గున్నది. బూడిద బోయేటట్టు పొయ్యిని అటిటని లోపలికి బట్టుకచ్చి నీల్లేసిన...

"బయ్యక్కా పరిస్థితులు అంతకంతకు అధ్వాన్నమై పోతన్నయి. నీ కానాడు గుర్తున్నదా? నన్ను సావదెబ్బలు గొట్టిచ్చిండ్లు... ఇంతటితోని తీరిపోతదనుకున్నరు. కని ముదిరిపోయింది. కంట్రాక్టర్ లేబరుకు లారీ నింపినందుకు లారీవాళ్ళిచ్చేది 100 రూపాయలు... అవికాస్త కంట్రాక్టరు బెట్టిన గుండా మొఖద్దమ్‌లు తీసుకుంటరు...60 రూ॥లు ఊచీ ఆళ్ళుంచుకొని 40రూ॥ లేబరుకిస్తరు. ఆ అరువైల 20రూ॥ మొఖద్దమ్‌లకు 40 రూ॥ కంట్రాక్టరుకు. రోజుకు సగటున కంట్రాక్టరుకు అట్లా చుక్క చెమట అడుపకుంట వచ్చే అందాని రెండువేలు.........ఈకంట్రాక్టరే లేబర్ యూనియన్ నాయకుడు. సారా కంట్రాక్టర్........" ఇట్లా చెప్పుక పోతన్నడు.

"వానింట్ల పీన్గెల్ల" అన్న నేను.

రాజారాం ఏం మాట్లాడలేదు.......

"అదె మాకిది గిట్టుబాటుగాదు...కయికిలి బెంచుమంటె గాదా?" మళ్ళీ నేనే.

"గక్కన్నే గీ చిక్కంత......ఎవడన్న దైర్నంజేసి అట్ల అన్నడనుకో బస్... రేపటినుంచి నువ్వు పనికి రాకంటడు.......ఇయ్యల్ల రేపు జనమెట్లున్నరు? ........ఒపక్క పల్లెల్ల దొరికే పని ఏ మూన్నెల్లో... గీడికత్తె గీడ గీ బాగోతం.... అయినెవలో పాటగట్టినట్టు 'సావలేక మరి బతుకలేక...బతుకుతు ఉన్నారో నాయిన' "...

"ఆమాట నిచ్చమే...గ ముచ్చెట అందరడుగుతె కాదా?"



"అందరు ఒక్క తాటిమీదికి రావాలెగదా? గీ అచ్చేటాల్లకే... ఒక్కొక్కన్ని ఏరుతడు...సావగొట్టి సెవులు మూపిత్తడు........"

"కంపినోళ్ళేం పట్టిచ్చుకోరా?"

"కంపినోళ్ళు దొంగలకు దొంగలు......కంట్రాక్టర్ లేబర్ నాయకుడాయె."

"ఎట్లా సచ్చేది?......"

"అదే బయ్యక్క, సమ్మె........ఇయ్యాటికి తొమ్మిది దినాలయ్యింది సమ్మె జెయ్యబట్టి ..........ఎవనికి ఉలుకు పలుకు లేదు......ఓపక్క లేబరు ఆకలి, మరోపక్క కంట్రాక్టరు బెదిరింపు... ఇది సూడు" అనుకుంట ఓ ఎర్రకాయిదం నాకిచ్చిండు...

నేను కిందామీద సూసిన.......ఏది సదువుండ్లి అని రాజారాంకే యిచ్చిన.........

'కార్మిక విద్రోహులు కొంతమంది కల్లబొల్లి మాటలు చెప్పి మిమ్ముల మోసం చేస్తున్నారు...మీరు వెంటనే పనిలోకి దిగకుంటె యాజమాన్యంవారు పేలోడర్లు దెచ్చుకొంటారు. అప్పుడు అందరికి పని పోతంది. అప్పుడు మీకు దగాకోరు నాయకులు తిండిబెట్టరు.......' ఇట్లా చదువసాగిండు.......

నాకు బాగా కోపమచ్చింది... "లంగలు.......అవ్వ పెట్టది... అడుక్క తిననియ్యదు. తుమ్మితె ఊసె ముక్కు ఎంతకాల ముంటదోంట...ఏదేమైన........" ఇంకేం మాట్లాడన్నో తెలువలే...

పొయ్యిమీద చాయ్ బుసబుస పొంగుతంది...

"బయ్యక్కా, అంటే నువ్వు చెప్పిందే రైటు...వీళ్ళకు బుద్ధి చెప్పాలె........ఇగో ఇప్పుడే వీళ్ళకు జవాబు రాస్త........రేపు మీటింగు బెట్టాలనుకున్నం........ఇయ్యల్ల వీల్లవంతు, రేపు పర్మినెంటోల్ల వంతు... ఈ దొంగ కంట్రాక్టరును దెబ్బదీత్తె రొండు లాభాలు...వాని గావుపట్టు పర్మినెంటు లేబరుమీద సడులుతది.........మీటింగ్ ఊరేగింపు" రాజారాం చేతల కలంపుల్ల బరబర గీకుతండు. నేను చాయ తెచ్చిచ్చిన.......అంత ఉడుకు చాయ్ మంచినీళ్ళ తీర్గ తాగిండు. నేను చూసుకుంట కూకున్న....ఆ చెయ్యి కదలటం...నా మెదట్ల ఎన్నో మాటలు........ఆచెయ్యి ఆగిపోతె నేను రాసేద్దునా అన్నంత ఇదిగా ఉన్నది....

దీపం ముట్టిచ్చేటాల్లకు రాసుడైపోయింది. "బయ్యక్క నువ్వినుః...దాదా.........." అని పిలిసిండు.

"అవ్వ పెట్టది అడుక్క తిననియ్యది........కార్మికులారా ఏకం కండు.......దొంగ కంట్రాక్టరు మోసపు ప్రచారాన్నెదురించండి...." ఇట్లా నేను చెప్పినట్టే రాసిండు...

అంతా చదివి..........దిగాలు పడ్డడు......


www.eTelangana.org

"ఇప్పుడెట్ల దీన్ని అచ్చేపియ్యాలె.......సమయాని కెవలులేరు...నాకు పనున్నది. బస్తంతా తిరుగాలె... రేపటి మీటింగుకు ఏర్పాట్లు చూడాలె" అన్నడు.

"పోనీ నేను........" అన్న ఏం జేయాలెనో ఎరుకలేక......

"మంచిది.......మంచిదే........కని నీకు..........సరె ఈ బస్తి బాగ ఎరికేనా?" అన్నడు.

"ఓ మహబాగ.......ఇల్లిల్లు గడుపగడుప ఎరికే........అప్పుడు రాత్రి అయ్యిందంటే ఏడ పడుకోను జాగ దొరుకుద్దా అని ఇల్లిల్లు దిర్గి సూళ్ళేదా?" అన్న...........

"మంచిదే... అక్కడ ప్రెస్....... ప్రెసంటే కాయిదాలు అచ్చేసేది......." దాని పేరు జెప్పిండు..........

"అక్కడ ఒంటికన్ను నడీడు మనిషి కుర్చిమీద కూకుండి ఉంటడు... నువ్వు బొయ్యి రాములు సుట్టాన్నని సెప్పు..... లోపటికి బొమ్మంటడు. అక్కడ రాములనే ఎండిపోయిన పిలగాడుంటడు...నేను తోలిచ్చిన్నని చెప్పు" అన్నడు.

ఆ కాయిదం తీసుకున్న... మడిచి పట్టుకున్న.

"అట్లనేనా పట్టుకపోయేది..........?" అన్నడు...

కాదని అటుదిరిగి రయికెల సెక్కుకున్న....

"రాత్రికి నేనొస్తనో రానో......... అవి మనింటికి నువ్వే తీసుకరా...ఎవలనన్న తోలిత్త యియ్యి" అన్నడు.

సరేనని బయటకచ్చిన...........

బయట చీకటి... మూల మలుపుమీది కరంటుబుగ్గ పోయినట్టున్నది....నా కెందుకనో అడుగులు భూమ్మీద నిలుత్తలేవు......ఎప్పుడు జేర్తనా అని ఉన్నది. నడువంగ నడువంగనే ఆడ ఇంకెవలన్న ఉంటెనో అనిపిచ్చింది. ఎట్లా? ఉంటే ఏదో ఒకటి సేద్దాం తియ్యి అనుకున్న...

నేను బోయేటాల్లకు ప్రెస్ మూసేటందుకు అన్ని సదురుతండ్లు.......ఒంటి కన్నతను కుర్చి మీదినుంచి లేసి నిలుసున్నడు. అతని ముంగట ఉంగురాల ఎంటికిల దొడ్డుమనిషి కూకుండి "ఎట్లనన్న రేపటికి యియ్యాలె" అంటండు........

"అసలే...వర్కర్లు లేరు.........సరె..........తప్పుతాది......." అనుకుంట నా దిక్కు సూసిండు.....

"రాములున్నడా?" అన్న.........సుట్టాన్నని సెప్పడమెట్లా అని....

"రాములు నీకోసం ఎవలో వచ్చిండ్లు........" అని ఎగాదిగా చూసి "సుట్టాలా అమ్మా..." అన్నడు....



"రాములు సుట్టంగావాలె..." అన్న....

"లోపలికి బోవమ్మా.... ఇదిగో రాములు మీ బందువెవరు వచ్చిండ్లు చూడు...." అన్నడు.

ఉంగరాల ఎంటికలోడు నా దిక్కు సూసి "అచ్చా నేం బోత సార్" అని లేచిపోయిండు.

నేను లోపటికి నడిచిన.....లోపల ఇరుకిరుగున్నది. రాములు అనే బక్కపిలగాడు సేతులు కడుక్కుంటండు. అతని సుట్టూ ఇంకా నలుగురైదుగురు అదే పని జేత్తండ్లు.

"రాజారాం తోలిచ్చిండు" అన్న...

రాములు "అట్లనా" అని నా దగ్గరికచ్చిండు. అతనితోపాటు మిగతా నలుగురు వచ్చిండ్లు.

"ఈల్లందరట్లేనే కాయిద మియ్యాలెనా!" నేను అనుమానంగ సూత్తన్న.

"పర్వలేదక్కా ఈల్లంత మనోల్లె...ఏది ఇటియ్యి" అన్నడు.

నేను ఎనకకుదిరిగి రయికెల కాయిదం తీసిచ్చిన... కాయిదానికి మసిమరక అంటకుంట కిందామీద సూసి సూత్తండంగనే అంతా సదివేసి...

"ఇప్పుడు గావాల్నంటరు.......ఒరే కైలాశం.... రోలర్ కడుగకు........ అక్కా నువ్వో గంటాగి రాగలవా?" అన్నడు...

"నేనిక్కడ కూకుంటె ఏమన్నయితదా?" అన్న, ఆళ్ళు జేసేపని... కాయిదాలమీద అచ్చుగొట్టేటప్పుడు సూడాలెనని....

"సరే" నని ముంగటి అర్రలకు బోయి ఏదో మాట్లాడచ్చిండు.

ఒంటికన్నాయినె ముంగటినుంచి తాళాలేసి ఎల్లిపోయిండు...

"మనమెట్ల బయటకు బోతం?" అన్న నేను.........

"దొడ్డిదారి........ఎనకనుంచున్నది" అన్నడు రాములు..........

అంతా సేతులు తుడుసుకున్నరు.......ఎడం సేతుల సెక్కలసొంటి యేవో బట్టుకొని డబ్బాలల్ల ఏరబట్టిండ్లు.....అంతా అయిపోయేటాల్లకు గంటన్నకాడ రొండు గంటలయ్యింది...

"ఇయ్యి మీరొక్కలే కొంటబోతరా?" అన్నడు రాములు.

కొంట బోతనన్న. "రిక్షల బోండ్లి... మీకెరికే గద" అని నవ్విండు...........

నేను రాములు ముందుగాలెల్లినం.... బజార్లల్ల ఎవలు తిరుగుతలేరు...రాములు రిక్షాను బిలిసి ఎక్కిచ్చి కాయిదాలండ్లేసిండు........


www.eTelangana.org

నేను ఇంటికచ్చేటాల్లకు ముసలితాత ఎదురచ్చిండు. తనే కాయిదాలు దెచ్చి ఇంట్లేసిండు.....

నేను పైసలు దీస్కచ్చేటాల్లకే రిక్షా ఎల్లిపోయింది.... ముసలితాత తన గుడిసె ముంగట ఎల్లెలుకల పండి కూనిరాగం తీత్తండు.....

✧

## 18

రాత్రి కత్తనన్న రాజారాం జాడ పత్తలేడు... ఈ కాయిదాల నేం జేయటం... బయటేం జరుగుతుందో కదా? ఇంట్లకు బయటకు కాలుగాలిన పిల్లి తీర్గ దిరిగిన... రాత్రి గడుత్తందేకాని ఎవలు రాలేదు... ముసలి తాత కేమన్న ఎరికేమొనని గుడిసెకాడికి నడిచిన.......గుడిసె పనుగడేసున్నది........మల్ల గుడిసెలకచ్చిన..........ఏంజేసేట్టు?

నడిఝాము తిరిగి పోయిందేమొ గప్పుడు తాతచ్చిండు. లొడలొడ "అయిదుగుర్ని పట్టుకపోయిండ్లు...ఊరునిండా ఇనుపటోపీల పోలీసులు కావురుగప్పిండ్లు" అని సెప్పిండు.

"ఎట్ల తాత గీ కాయిదాలు పంచాలెగదా?"

తాత నెత్తి గోక్కున్నడు. "గీ పని నాకు కొసమొద లెరుకలే... పెద్ద సిక్కొచ్చిందే" అన్నడు.

"పోనీ మనిద్దరం పంచుదామా?" అన్న నేను..........

"ఎట్ల...అందరికి ఒక్కొక్కటిద్దామా?" తాత...కొంచెమాగి "పోలీసోల్లు సూత్తరేమొ?" అన్నడు....

"నువ్వు నీ దోతిల కొన్ని బెట్టుకో..." అన్న......

తాత నవ్విండు. నేను సీరె సింగులు పైకి సెక్కుకున్న. ఓట్లే కొన్ని కాయిదా లేసుకున్న. తాత ఏడిదో బొంతసొంటి అంగి దెచ్చుకున్నడు.... అంగి నిండా నింపుకున్నడు.......

గుడిసె తలుపేసి తాళమేసి ఇద్దరం చెరోదిక్కు నడిసినం... నేను గుడిసెల ముందు ఒక్కొక్క కాయిదం పెట్టుకుంట ముంగటికి నడిసిన... పెద్ద బజాట్ల కచ్చేటాల్లకు తూరుపు రేకలు బార్తన్నయి...పోలీసోల్లు ఇద్దరు ముగ్గురు గలిసి తుపాకులు బుజాలమీదేసుకొని తిరుగుతండ్లు. కార్మికులు ఆవులించుకుంట, తిట్టుకుంట బొక్కటోపీలు నెత్తులమీద



బెట్టుకొని తట్ట సెమ్మాసేసుకొని గుంపులు గుంపులుగా నడుత్తండ్లు - హోటల్ గుడిసె ముంగట సానామంది కూసున్నరు..... పిడికెడు కాయిదాలు దీసి ఎగజల్లిన...

"ఆగో కాయిదాలచ్చినయ్.......కాయిదాలు........" కార్మికులు ఎగబడ్డరు........

అటుకేసి నలుగురు పోలీసులచ్చిండ్లు... నేను హోటల్ గుడిసెనుకకు నడిచిన....

"పేపర్లెక్కడియి?" పోలీసోడొకడు అడుగుతండు...

"మీది నుంచి గురిసినయ్" అన్నడు తొస్సినోరుతోటి ఒక కార్మికుడు.

అందరు నవ్విండ్లు...

"బొక్కల దోల్తం నవ్వినట్టుగాదు" ఇంకో పోలీసు గురగురలాడ్తండు.

"ఔ తోలరు మరి........మేం సచ్చినమో బతికినమో సూడనోల్లు ఆనికోసం జరూరు గచ్చిండ్లు... అందర్ని దోలుండ్లి, ఆడనే ఉంటం" ఎవరో అరుత్తండు.

నేను అక్కన్నుంచి కదిలిన.....పొద్దుపొడిసి బారెడెక్కేటాల్లకు నాదగ్గెరి కాయిదాలన్ని అయిపోయినయి.....

మంగలి దుకానం దగ్గెర సెక్కబల్లమీద నిలుసుండి ఓ కోతిమొకం పడుసోడు కాయిదం గట్టిగా సదువుతండు. సుట్టూ ఇరవై మంది సేరి ఇంటండ్లు.........ఆళ్ళ ముఖాలల్ల రగిలే కోపాన్నిసూసి నవ్వుకున్న......... గుడిసె దిక్కు నడిసిన..........

గుడిసెకు తాళమేసే ఉన్నది......రాజారాం రాలేదన్న మాట........ తాత గుడిసె ముంగట కూనిరాగం తీత్తండు...

"తాత అల్లు మంచిగయ్యిందా?" అన్న గట్టిగనే....

తాత లేసొచ్చి నవ్వుకుంట తను ఎట్ల కాయిదాలు పంచింది చెప్పసాగిండు. నేను తలుపుతీసి బొగ్గు సితగ్గొట్టిన.......రాజారాం ఎందుకు రాలేదో అనుకుంటనే.

✧

## 19

"ఓ దినా! మార్కెటుకాడ మీటింగట... నువ్వత్తవా?" చంద్రకళ ఉరుకులు పరుగులు మీదచ్చింది.......

"ఏమోనమ్మ ఏం మీటింగో... అచ్చేదా? సచ్చేదా?" అన్న చంద్రకళ ఉద్దేశమేందో తెలుసుకుందామని.......


www.eTelangana.org

"నువ్వెప్పుడు ఇనలేదా? పాటలు పాడుతరు..." అంది......

"అట్లనా ఏం పాటలు?"

"బావమో బంగరయ్యపాట.... నువ్వినలేదా?" అని గొంతెత్తి కొంత పాడి సిగ్గుపడ్డది........

చంద్రకళది ఏదో పల్లెటూరు. ఈ ఊరికచ్చి ఇంకా మూన్నెల్లు కానేలేదు.

"సరే పోదాం నువ్వు తయారైనట్టేనా?"

"ఇగో ఇట్లనే..... కూడండిన... పొయ్యిమీద నీల్లకుండేసిన......." అన్నది.

ఇద్దరం బజాట్ల కచ్చినం.... అప్పటికే అందరు గుంపులు గుంపులుగ మీటింగు ముచెట్లు బెట్టుకుంట పోతండ్లు.....

"జెప్పజెప్ప నడువొదినా... మీటింగు ఆరు గంటలకే మొదలయ్యిద్ది."

"నీకెట్లెరుక?"

"అయ్యో నీకు సదువత్తది గద... కాయిదం సూల్లేదా?... మా అయినె తెచ్చిండు. సదివిండు..........."

"అందట్ల ఏం రాసున్నదేంది?"

"గయ్యన్ని నాకు తెలిసి సత్తయా?"

"అంత గొట్టుగ రాసిండ్లా?"

"తెలిసే మాటలే గని.....బయటి సంగతులు గదా? మనకేడ దెలుత్తయి?"

"బయటి సంగతులు మా తమ్ముడు ఎరిక జేసుకోవద్దన్నడా, ఏంది?"

"అంటే మాత్రం నేనూకుంటనా?"

"ఏం జేత్తవేంది?"

"లాకలాంగ ఎరిక జేసుకుంటనంట."

"ఎట్ల నీకు సదువు రాదుగద....?"

చంద్రకళ విచారంల బడ్డది......

"పోనీ నాకచ్చిన కాడికి నేం చెప్పన్నా? మన వాడకట్టు ఆడోల్లమంత పనైపోయినంక ఓ గంటసేపు కూకుండి బయటేం జరుగుతందో ఎందుకు జరుగుతందో సెప్పుకుందాం..." అన్న.

"మంచి మాటొదినా" అన్నది.

అప్పటికి మార్కెటు దగ్గెరి కచ్చినం....



మార్కెటుల పడమటి దిక్కు కంకబొంగులతోటి పందిరేసిండ్లు... పందిరికింద ఎత్తు బల్లలేసిండ్లు...పందిరికి జెండాలు గట్టిండ్లు... బల్లలమీద సన్నగ కంకబొంగు తీరుగున్నతను సేతులు తిప్పుకుంట "మన నెత్తురు సుక్కలతోనే బిర్లలు బిల్డింగులు గట్టిరి... మన మాంసం ముద్దలతోనే టాటలు కోట్లకు బెరిగిరి..." అని దీర్ఘం తీసుకుంట పాడుతండు........

సుట్టూ జనం... ఇసుక జల్లుతె కిందబడనంత జనం.........దుకాన్ల పందిల్ల కింద,... నిలబడి కూసుండి జనం....ఆడాడ కట్టెలు బట్టుకొని నిలుసున్నోల్లు అందరిని కూకుండ బెట్టండ్లు... జనం సుట్టుపక్కల ఇనుపటోపీల పోలీసోల్లు నిర్రంధిగ నిలుసున్నరు....

మేమిద్దరం ఆడోల్ల గుంపుల కూసున్నం.....

నా కండ్లు రాజారాం కోసం ఎతుకుతన్నయి... ఏవలెవలో పాడుతండ్లు... ఎవలెవలో మధ్యమధ్య మాట్లాడుతండ్లు.....రాత్రయ్యింది......ఇంకా అచ్చేజనం అత్తనే ఉన్నరు. ఎన్నివేలమందో?

పోలీసోల్ల జీబు సెక్కర్లు గొట్టిపోతంది........

ఇంతట్లకే మైకుల రాజారాం మాట్లాడ్తడని చెప్పిండ్లు.

మందిలనుంచి ఎవలో మొత్తుకున్నరు. మరెవరో "కార్మికుల ఐఖ్యత" అన్నారు..... అందరు "వర్ధిల్లాలె" అన్నారు.

నేను పోలీసోల్ల దిక్కు సూసిన...రెండు పచ్చమోటిర్లచ్చి ఆగినయ్... నా గుండె దడదడ గొట్టుకున్నది........ ఉబ్బు సెంపలోల్లు బలిసినోల్లు కిందదిగి నిలుసున్నరు.

రాజారాం పందిరికింది బల్లల మీదికచ్చి మైకు ముంగట నిలుసున్నడు. మొఖం వాడిపోయున్నది. కండ్లు నిదురలేక ఎరుపెక్కున్నయి....

"సోదరులారా!" తొందరలేకుంట అన్నడు.......

ఆవలి కొసనుంచి "నక్సలైట్లు" అన్నడెవడో కీసుగొంతుతోని...

"దేశద్రోహులు" అన్నాయి మరో నాలుగ్గొంతులు......

"ఎవ్రరా" ఎవడో అటుదిక్కు ఉరికిండు....

మందిల లొల్లి లేసింది. ఫెడిఫెడిన నినాదాలు........చంద్రకళ ఎటూతోసక నా చెయ్యి పట్టుకున్నది.........

తొక్కులాటలో మేము పందిరి దగ్గెర కచ్చినం...

"సోదరులారా! మన శత్రువులు వేసే గావుకేకలు, కుప్పిగంతులు మనకు తెలియనివికావు........" రాజారాం...


www.eTelangana.org

కట్టెలు బట్టుకున్నోల్లు అందరిని సదిరి కూకుండ బెట్టేటాల్లకు అయిదు నిముషాలు బట్టింది........

"సోదరులారా! ఇవ్వాల్ల మనం మనుషులుగా బతకడంకోసం ఏకమైతన్నం......... మనం మట్టితొలిసి బొగ్గుదీసి మన యజమానులకు బంగారం యిత్తన్నం.... కాని మనకు ముడుతున్నదేమిటి? పిడికెడు బూడిద.......నిన్న మొన్నటిదాకా........." ఇట్లా రాజారాం అనేక సంగతులు చెప్పుకత్తండు.........జనం గుసగుసలాడుకుంట వింటండ్లు... ఆ సంగతులన్ని అందరికి తెలిసినవే.......

నేను పోలీసోల్ల దిక్కు సూసిన...పోలీసు పెద్దలు సెవులు గొరుక్కుంటండ్లు.

రాజారాం "మనం మన హక్కుల గురించి, మంచి బతుకు గురించి బజాట్ల కచ్చి నిలిసినం...ఆళ్ళు ఆళ్ళ బలగాలను.........మనమీది కిడిసిండ్లు... నిజానికి....."

"పోలీసు జులుం" అరుపు.

"నశించాలె....." లొల్లి.......

"కాని దురదృష్టవశాత్తు ఈ పోలీసులంతా మనోల్లే... ఏ ముఖ్యమంత్రి కొడుకు పోలీసుకాడు. మన వేలుదీసి మన కనుగుడ్లు పొడవడమే ఆడు చేసే పని......." రాజారాం ఇట్లా ఏదో చెప్పుతున్నడు......

కల్లు దుకానం దగ్గర ఓ పోలీసు కరంటు స్తంభం ఎక్కుతండు........ చంద్రకళకు సూపెట్టిన....సుట్టుపక్కల పోలీసులు కదులుతండ్లు...

మరో నిముషంల లైట్లు బోయినయ్......సిమ్మంసీకటి......పెటేల్ పెటేల్ దెబ్బలు.....కొట్టుకోల్లు మొత్తుకోల్లు... అరుపులు ఏడుపులు....

మేమిద్దరం ఆ సీకట్ల ఎటో ఉరికినం... నా ఎన్నుమీద కట్టెదెబ్బ......

మైకులనుంచి "సోదరులారా పరెగెత్తకండి... ఎదురించండి......."

ఎవరో అరుత్తండ్లు...

మరికొంతసేపు అట్లా సాగినంక కొంతమంది పందిరికాడ జమైండ్లు...

ఎవడో కడుపుల పేగులు తెగిపోయేటట్టు "తూటాల మాల దొడిగి, తుపాకి సేతబట్టి..." అని పాడుతండు.....

ఇంకెవలో రాళ్ళు బట్టుండ్లి అంటండ్లు........

మేమిద్దరం సందులు, గొందులు తిరిగి గుడిసె చేరుకున్నం.......

అప్పటికే ఆడ తాత ఉన్నడు....

"బయ్యవ్వ రాజరాంను పట్టుకపోయిండ్లు... గుడిసెలున్నయన్ని తీసేసి... గుడిసె కాళి జెయ్యాల్నన్నరు......" అని చెప్పిండు.......

"ఎందుకని" నేనడుగలే.......తాత చెప్పలేదు......

✳



# 20

**మేం** ముగ్గురం కలువాలనుకున్నం....... మా దగ్గర ఒక్కకాన్నే ముగ్గురం తిర్గుతన్నం... పని సూడవోతే సానా ఉన్నది.........మంది తక్కువ. కొత్త జాగలకు మా దగ్గరేమన్న మనుషులున్నరేమొనని పైనుంచి మాటచ్చింది...అదిగాక పికిలి మరింక మాతీర్గ తిరిగేటందుకు కుదరటంలేదు. పికిలి పనిచేస్తున్న జాగల పికిలి ఉండటం అందరికి తెలుత్తంది...పని తొందర్ల బడి రాతపని మూలబడి పోయింది...

ఆదినం గంగన్న, నేను కలిసినం... పికిలికోసం ఎంతజూసినా రానేలేదు... ఏం పని దగిలిందో? పికిలి కేం అడ్డంకచ్చిందో? ఇట్లా ఇసారం జేసుకుంటనే పోయేటందుకు తయారైతన్న. గంగన్న ఎల్లిపోయిండు.

అప్పుడచ్చిండు పికిలి........ నెత్తంత మాసిపోయి... మొకమంత పీక్కపోయి .......బుర్రల రాళ్ళేసి ఊపినట్టుగ లడలడ ఏదో సెప్పుకచ్చిండు.....

ఆఖరుగ నాలె సూపులు సూసుకుంట "అక్కా" అన్నడు. ఎందుకనో మాట అనికింది... ఏందో సెప్పాలని నోరుతెరిసి ఏది సెప్పకుంటనే నోరు మూసుకొని కాయిదాలు నా సేతికిచ్చిండు. నేను పిడికిట్లో కాయిదాలు బట్టుకున్న.

"పికిలీ! మనము సూడవోతే పిడికెడు మందిమి. కని మన పనో! ఇయ్యల్ల ఏల జనం మనకోసం సేతులందిత్తండ్లు... పికిలీ... మన సేతులింకా సిన్నయే... కని తప్పదు....ఇంకోపక్క మనం పెరుగుతన్నం .......బుడిబుడి అడుగులతోటి నడక నేర్సుకుం టన్నం...కని మనం నిలబడాలె... నిలబడట మొక్కటేకాదు కలెబడాలె...కాదంటావా? మనముంగట నిలుసున్న మన పగదారు ఒట్టి సేతుల లేడు. మందిమార్బలం సంగతటుంచు-మనం జేసిన అతారలే మనమీదికి ఎక్కుపెట్టున్నయి...మనం గయ్యి బట్టాలె.......సమఝయితందా? గియ్యన్ని ఎట్ల నేర్సుకున్నమో గట్లనే గది నేర్సుకోవాలె... కాదంటవా?"

"కితాబు నేను సదివిన్నక్కా!" అన్నాడు పికిలి..

"మరింక నీ పని నేను తీసుకుంట........నువ్వు, లచ్చన్న" మిగతా నలుగురి పేర్లు చెప్పిన......

పికిలి కండ్లు మెరిసినయ్......."అక్కా మనూరికి నువ్వు రానేలేదు. గిప్పుడు అయ్యన్ని పనులు నీయే..........మళ్ళా కలుస్తామొ లేదో?"

నాకు పికిలిని గుండె కదుముకోవన్ననిపిచ్చింది. కని గిప్పుడు గీ పికిలి నా సిన్నారి పికిలిగాదు.....ఏం మాట్లాడన్నో తోసక నేను కట్టెతీర్గ బిగుసుకపోయి నిలుసున్న - గిట్లనే ఎందరినో సాగనంపిన......రాజారాం ఏడున్నడో? నన్ను మనిషిని జేసిన రాజారాం ఏ మారుమూల ఆడివి కడుపుల మనుషులసేత తరుమబడి బిక్కుబిక్కు మనుకుంట బతికే జనాన్ని మనుషుల జేత్తండో?


www.eTelangana.org

పికిలి సెయ్యెత్తి "లాల్‌సలామ్" జెప్పి ఎల్లిపోయిండు. ఆ అడుగుల సప్పుడు ఇనుకుంట నిలుసున్న......అడుగులు... అడుగులు....ఎన్ని అడుగులు?

అట్ల పికిలి పోయినంక పని తీరక పికిలి ఇచ్చిన కాయిదాలు సూడనే లేదు.నా సంచిల మోసుకుంట ఊళ్ళన్ని దిరిగిన...

ఇదివరకున్న సంగాలను అట్లనే ఉండనిచ్చి దెబ్బ కాసుకోవటం ఒకెత్తు ....పొరుగూళ్ళల్ల సంగాలు బెట్టడం మరో ఎత్తు....సంగాలకు రాజకీయం సెప్పుడు ఇయ్యన్ని పనులు గంగన్నమీద నా మీద పడ్డయి.

రెన్నెల్లయినంక పుర్సతు దొరికింది. పికిలి యిచ్చిన కాయిదాలు సదివిన.నేను బోయినంక మా వూళ్ళె జరిగిన సంగతులన్ని సెప్పుకచ్చిండు. పికిలి రాసిన సంగతులు సుత మీ ముంగట బెడ్తన్న.........

✧

# 21

**బ**య్యక్క మతికత్తె నాకు గుబులయ్యేది. నాటికి నేటికి బయ్యక్కను సొంతం తెలుసుకోనేలేదు. ఇయ్యాల్ల బయ్యక్కను తెలుసుకునుడంటె ఈ దేశంలున్న ఆడోల్లగురించి తెలుసుకోవటమే... బయ్యక్క సుట్టు అల్లుకొనున్న అన్ని సంగతులకు ఏడనో అతుకున్నది. గ అతుకేందో నాకు తోసేదికాదు.

నా సిన్నారి మెదట్ల పరికి కంపతీర్గ గజిబిజి ఇసారాలు........బయ్యక్క మార్తంది. ఎట్ల ఎటుదిక్కు మార్తందో నేను ఎరుకజేసుకోలేక పోతున్న.

రోజు బయ్యక్క దగ్గెరికి పోతనే ఉన్న. బయ్యక్క మునుపటి తీర్గ నవ్వుతలేదు. మాగిన బీడీల సంచి బొడ్లె ఏలాడ్తలేదు. ఆమె నోట్లెనుంచి మునుపటితీర్గ సారా ఆసనత్తలేదు... ఆమె సెప్పే శాత్రాలల్ల పాడే పదాలల్ల దేవకనికెలు మునుపటి తీర్గ రాచ్చాసుల సేతుల్ల సత్తలేరు. బయ్యక్క మునుపటితీర్గ దూసి ముడుసుకుంట లేదు. పాదాలు, సేతులు పగిలినయ్. నొసలుమీద ఎండ పొక్కులు లేసినయ్... గౌరయ్యతోని కొట్లాడినంక గిట్ల మారిపోయింది.

ముసల్ది ఒంట్లె సత్తువ ఉడిగి పోయిందేమొ? మనుపటి తీర్గ గులుగుతలేదు. ఎప్పుడు కుక్కిమంచాల ఎల్లెలుకల సచ్చిన మనిషి తీర్గ పండుకొని మిడిగుడ్లేసి సూసుకుంటుండేది... గ కండ్లు సూత్తె నాకు సెప్పరానంత భయం. నర్సయ్య బయ్యక్కను తిడ్తలేడు.

మా ఊళ్ళె మునుపటితీర్గనే పంచాతులు జరుగుతనే ఉన్నయి. కులతప్పు పంచాతో, భూమి పంచాతో, తాగి తన్నుకున్న పంచాతో, కడుపుకు జాలక దొంగతనం జేసిన పంచాతో, ఎటు మొసమర్రక ఉన్నోల్లకు ఎదురు తిరిగిన పంచాతో... గిట్ల రోజుకో



పంచాతు పకడబందిగ జరుగుతనే ఉన్నది. భూములు పోయినోల్లు నేలను సరసుకుంట దుబ్బెత్తి పోసుకుంట కడుపుల పేగులు ఈతలి కచ్చేటట్టు ఏడుత్తనే ఉన్నరు. తప్పు సెయ్యనోల్లు, సేసినోల్లు దండుగులు గడ్తనే ఉన్నరు. తన్నులు గుద్దులు దింటనే ఉన్నరు.

ఈల్లంత ఎందుకు ఎప్పటికి తప్పులు జేత్తరో? ఊరి పెద్దలు ఎప్పుడు ఏ తప్పు ఎందుకు జెయ్యరో? నాకు తెలుత్తలేదు. మరి మావూల్లె గీ ఏడుపులు ఆగవా?

నర్సయ్య బూమి గౌరయ్య గుంజుకున్నప్పుడు నాకు పట్టరాని కోపమచ్చింది. రాయందుకొని పాపరాజుగాని తల బలుగ్గొట్టాలనుకున్న. ఎవలనైన కండ ఊసచ్చేటట్టు కొరికినా మంచిగుండు. కని మా అవ్వ నన్ను ఎటు మెదలకుంట బట్టుకున్నది. నర్సయ్య దుబ్బలబడి కొట్టుకుంటాంటే... బయ్యక్క వాళ్ళ అవ్వను గుంజుకపోతంటే నేను మా అవ్వ సేతుల్ల గింజుకున్న...

ఆనాడు బయ్యక్క నడిర్ఘాము నాత్రి మా యింటికి ఉరికచ్చిన్నాడు మా నాయిన అన్న మాటలిని బయ్యక్క కేదో పెద్దగండమే అచ్చిందనుకున్న... నాకీ సంగతులన్ని ఎరికైనట్టు బయ్యక్కకు తెలవద్దని మెసలకుంట పన్న.

ఆయింక మళ్ళా పంచాతు. గీ పంచాతులు సూసిసూసి నాకు రోమాలు నిక్కపొడుత్తన్నయి. మా నాయిన్నను, బయ్యక్కను పగ్గాలతోని కట్టేసిండ్లు... మా అవ్వ కండ్లల్ల కోపం... బయ్యక్క మా నాయిన్న నేందో మాయజేసిందని తిడ్తంది. నాకు నమ్మ బుద్ధిగాలే... మొగిలిగానితోని గీ ఊళ్ళె అందరితోని కులికిందట-

బయ్యక్క గప్పుడు నా దిక్కు సూసిన సూపు నాకిప్పటికి గుర్తే... ఉరికి ఆమె కట్లు కొరికేయాన్ననుకున్న... మా అవ్వ నన్ను ఇడువదే...

బయ్యక్క ఊళ్ళె నుంచి పోతంటె నా నెత్తురు పోటెత్తింది. ఆరోజంతా, "మీరంత దయ్యాలు........నాకెరికే........మీరంత బయ్యక్కను పగబట్టి ఊళ్ళె నుంచి ఎల్లగొట్టిండ్లు" అనుకుంట తిట్టిన. ఆయింక బయ్యక్కేమయ్యిందో నాకెరుకలే...

గౌరడు నరాలు దేలిన సెయ్యెత్తి పాసుబండ్లు కనిపియ్యంగ దొంగ నవ్వు నవ్వుకుంట మా నాయిన్నకు జెప్పెటోడు "అదెవన్నో ఉంచుకున్నదట... నాకెరికే అది కాలాంతకురాలు... మళ్ళ అన్నిడిసిపెట్టి మళ్ళోన్ని ఉంచుకుంటది."

ఎవడో ఒకడు గిసొంటి ముచ్చెట్లే చెప్పెటోడు. ఏడున్నదో ఈల్ల కెరికనే లేదనిపిచ్చేది. ఎందుకంటే బయ్యక్క ఏడికో దేవలోకం పోయుంటదని నా గట్టి నమ్మిక.

గ పంచాతు అయిన్నాడు మా నాయిన్న పిల్లిగొరికిన కోడిపిల్ల తీర్గ ముడుసుక పన్నడు. మా అవ్వ సెంపకు సెయ్యి బెట్టుకొని సింతకొమ్మల్లకు సూసుకుంట గలుమల కూకుండి అచ్చం ముసలిదాని తీర్గనే మాటకు మాట కలువకుంట తిట్టింది. మా యింటికి ఎవలెవలో వచ్చి కసేపు "చ్చొచ్చొ" అని తిట్టి పోతండ్లు.


www.eTelangana.org

పొద్దుగూకే యాల్లకు మా నాయిన్న లేసి ఎటో పోయిండు. నాత్రి అయినంక మా నాయిన్నను మా చిన్నాయన గొండోడు మోసుకచ్చిండ్లు... మా నాయన్న గా నాత్రంత అదురుతనే ఉన్నడు.

"ఒసే లంజకానా ఇన్నావే! లోకం పలుగాకులు... నమ్మకు నమ్మకు మన్నడు ఎవడాడు ఈరబమ్మడు. లంజెతోని కూడితె లంజెవయితవు... దొంగ సోపతి బడితె దొంగవయితవు... గీ మాటెవడన్నడు? ఒంటి నాగలెంకటిగాడు... నేను మొత్తుకుంటె సెవున బెట్టినవా? గిదంత బోను. గీ ఊళ్ళె పీతిరి గద్దలున్నయి. నీ సుట్టు గెఫగెఫ గిరేసుకుంటయి. సావక ముందే పీక్కతింటయి. నాకెరికే మనిషి జల్మ బవు పాతకందోరన్న! ఓహోయి... పాపపు జీవుల తోలుతిత్తి యిది... పదిహేన్నూర్ల దండుగంటె ఏందనుకున్నవ్...? ఎంకటిగాని సేనుకు ఉరచ్చింది. పిస్సదానా నేను బయ్యితోని పోయిన్ననుకుంటన్నవా? అది బాయిలబడ్డదంటె అయ్యో పాపమని అంగిసూసిన... ఎనుకనుంచచ్చేటోన్ని కాపెట్టలే... ముడ్డిమీద ఝాడిచ్చితన్ని నూతిల పడేసి... ఓరి గాడ్దికొడుక నువ్వు బాయిలనే ఉన్నవన్నరు. కాదంటవనే... దండసేతులకు పగ్గాలు... నోరెత్తుతవనే నెత్తిమీన పాపరాజుగాని అరిపాదం... ఔనంటివా నీ సేను టుప్పా......ఎంకటిగాడు లంజెతనం జేసిండు. బయ్యి బతుకు అడివిగాసిన ఎన్నెలయ్యిందని రంధిపడితె ఏమయ్యింది? ఎంకటిగాని బతుకు తుమ్మల్ల పొద్దుగూకినట్టయ్యింది. అగో కొంకనక్క గౌరిగాడు ఊలేత్తండు. తోడేలు పాపరాజుగాడు తొంటీడ్సుకుంటత్తండు."

"నీ కాడుగాల. నీ సావు నిర్సావుగాను, నీ పిట్టకు బెట్ట... శెరంలేని సెత్త తాగిండు సూడు" అవ్వ తిడ్తంది.

"తాగినోడు సీదా సర్గం బోతడట... తాగకుంటే ఏవున్నదే... నీ మొగడు ఎంకటయ్య రాల్‌న గుండె పలిగి సత్తడు."

గ నాత్రి ఆకటి కడుపులతోనే అందరం పండుకున్నం.

మరో మూడు దినాలు గడిసినయ్. మా నాయిన దినాము తాగుతనే ఉన్నడు. దినాం గిట్లనే అదురుతనే ఉన్నడు. ఒక్కొక్కపారి ఊరంతటిని కలిపి అంకశెండాలం తిట్టెటోడు. ఇంకొకపారి మా అవ్వను తిట్టెటోడు. ఓపారి బయ్యక్కను... సిట్టసివరకు దేవున్ని... తిట్టుకుంట తిట్టుకుంటనే నోరు తెరిసి గుర్రుకొట్టుకుంట నిదురబోయెటోడు.

నిదురబోయినంక మా అవ్వ నాయిన మొకంలకు సూసుకుంట సానాసేపు నిలుసుండి అనికే గొంతికతోని "యాడికి పోతన్నడీ మనిషి........ అంతా సత్తె నాశిడం... ఉన్నొక్క పోరడు ఎట్ల బతుకుతడో? అయ్యో గీ దురజెట్టకాలం ఎట్ల దాపురిచ్చే."

నాకు గిదంత సమఝయ్యేదిగాదు. గింతెత్తు మా నాయిన్న ఎంత సాతగానోడు...

మా నాయిన ఎందుకనో దేనికోసమో బయపడ్తండని... గదేదో మా యింటిమీద ఇరుసకపడ్తదని... గదాన్ని తప్పిచ్చుకొనే దిక్కేమీలేక... దాన్నుంచి దూరంబోయేటందుకు తాగుతండని నాకు తెలువలేదు.



గ గండమేందో రానే అచ్చింది. నీరెండకు కూకుండి గడుక తింటన్న. మట్ల మీద ఎడ్లున్నయి. ఆటిని బీళ్ళమీదికి మేపేటందుకు కొట్టుకపోవాలె... ఆడ తేటనీల్ల మడుగల్ల ఈత గొట్టాలె... టేకు సెట్లెక్కాలె... ఆడివిల గువ్వగుడ్లు పెండరాసి మంటలేసి కాల్సుక తినాలె... గిట్ల ఎన్నో ఆటల గురించి తలుసుకుంట జెప్పజెప్ప తింటన్న.

మా నాయిన్న గప్పుడే అచ్చిండు. మా నాయిన మొకం సూసి అదిరిపోయిన. కండ్లు కమ్మరి కొలుముల తీర్గ మండుతన్నయి....పండ్లు పిండివడ కొరుకుతండు... నెత్తంత మాసున్నది. కాళ్ళు దేవుడచ్చినట్లు ఊగుతన్నయి. పొడమారినట్టు "గిన్నన్ని మంచినీళ్లు దేయే" అని కేక బెట్టిండు. అవ్వ చెంబుల నీళ్లు దెచ్చి భీరిపోయి నిలుసున్నది.

"కమిలీ... మన సేనమ్మిన... నా తల్లిని కోమటోని కొమ్ముగ బెట్టిన..." గొంతులేదో అడ్డంపడ్డట్టు ఆగిండు. బనీను జేబులనుంచి రూపాల నోట్లు దీసి ఇసిరికొట్టిండు.........

"కులతప్పు తీరిపోయింది... సేనుకు నాకు రుడం తీరిపోయింది."

"నీ కాడుగాల" అవ్వ మాటట్లుండగనే పులితీర్గ మీద దునికి ఎంటికలుబట్టి అంచి దబడ దిబడ గుద్దిండు. నా నోట్లె గడుకముద్ద నోట్లెనే ఉండిపోయింది... గట్లనే ఏడువసాగిన.

"ఎందుకేడత్తన్నవ్‌ర రామా! నీకోసంగాదు దాన్ని దగ్గెరికి దీసింది.బయ్యి నిప్పుల్ల నుంచి నడిసెల్లిపోయింది. నేను మాత్రం కాలి కూలిన." నన్ను రెండు గుద్దిండు.

"వానవ్వల కుక్కల్ దెం.......ఆళ్ళంత ఒక్కటే... లేని లమ్డి కొడుకులంత ఒక్కటిగారు. ఆళ్ళ సొల్లు నాక్కుంట కుయ్యికుయ్యిమని ఆళ్ళసుట్టు దిరిగే గజ్జికుక్కలు... గీ ఊళ్ళె ఒక్కనికి దమ్ముల్లేవు... ఒక్కనికి గుండెల నెత్తురులేదు... గీల్లంత పుట్టు బాంచెగాళ్ళు... అందట్ల ఎంకటిగాడు ఎంటికగాడు... బిడ్డా! ఎంకటవ్వ నువ్వు గూబ తీర్గ పంచాతుల గూకుండి సుతిబడ్తివిగాదూ! ఇయ్యాల్ల నీ ముడ్డికిందికే నీల్లచ్చినయి......" గిట్ల అదురుకుంట ఎట్లచ్చిండో గట్లనే ఎటో ఎల్లిపోయిండు.

ఆ దినమంత మా యిల్లు ఏడుపులతోటి, తిట్లతోటి నిండిపోయింది. పక్కోల్లు ఊళ్ళోల్లచ్చి మా అవ్వను ఊకుంచిండ్లు.

మా నాయిన నడిఝాముదాకా ఏడేడనో తిర్గచ్చి పిల్లి తీర్గ ఇంట్లకచ్చి మంచాలబడి పంచె నిండగప్పుకొని మరికాసేపటికి ఎక్కెక్కిపడి ఏడ్సిండు.

అట్ల అందరితీర్గనే మేము బూమి లేనోల్లమైపోయినం. బయ్యక్క సేనెట్ల బోయిందో మాది గట్లనే బోయింది. మా నాయిన కయికిలి గాడయిపోయిండు.

దినాం ఏడ్సుకుంట కూకుంటె కడుపుల కచ్చేదెట్ల? మా నాయిన తొందరగనే మనిషైపోయిండు.


www.eTelangana.org

మా నాయిన మునుపటితీర్గ పంచాతులల్లకు పోతలేడు... పొయిన పెద్ద మనుషులకాడ కూసుంటలేడు. దూరంగ ఏడనో పిల్లిబట్టిన కోడితీర్గ కూకుండచ్చెటోడు. పంచాతులకు బోయచ్చిన్నాడు పరాకుగ కనిపిచ్చెటోడు... కూరుకుపొద్దున లేసి అడివికి బొయి మోపెడు కట్టెలెత్తుకొని మూడుమైళ్ళ దూరంలున్న బస్తికి బొయి తెల్లారేటాల్లకు అమ్ముకచ్చెటోడు. నిలుసుండే ఇంతదిని మళ్ళ బంటపనికో, నాగలిపనికో ఉరుకులు పరుగులమీద బోయెటోడు. పనిలేనినాడు నన్ను దగ్గెరికి బిలిసి తను ఏం జెయ్యబోతండో సెప్పెటోడు.

"బిడ్డా మనం సగం కడుపుకైనా దిని కొంత ఎనికెయ్యాలె... నా బొందిల పానముండంగ మళ్ళీ కొంతబూమి కొనాలె... " గిట్ల మాటిమాటికి తెగిపోతున్న దారాలను అతుకు బెట్టుకుంట గూడు గట్టుకునే సాలెపురుగు తీర్గ మా నాయిన పెనుగులాడెటోడు.

అప్పుడప్పుడు బొక్కిబోయిన రేకుపెట్టె తీసి గుప్పెడు మాసిపోయిన రూపాయి నోట్లు లెక్కపెట్టెటోడు. అయి ఏనాడు యాభయి దాటేటియి గావు. వాటిని పెంచెటందుకు పిసినాసోడయిపోయిండు. ధోతి సినిగి పీలికలైనా అదే కట్టెటోడు. ఒంటికి బనీను తొడుగుడు బందుజేసిండు. ఎండల, ఆనల, సలిల గట్లనే తిర్గెటోడు.

ఎప్పుడుసూసిన రూపాల ముచ్చెట్లె బెట్టెటోడు. మా అవ్వ దినదినం ఎండి పోతంది.... మా అవ్వ రంధేందో నాకు అంతుబట్టేదిగాదు... మాటలు తగ్గిచ్చింది.

మా అవ్వ నాయిన సుత మాట్లాడుకుంట లేరు. ఎప్పుడన్నా మాట్లాడుకున్నారంటే అది తప్పక ఒకలనొకలు తిట్టుకునుడే...

నాకు గిసొంటి యేల్లల్ల ఎటన్నా పోతే బాగుండుననిపిచ్చింది. గీ పంచాతలు, కొట్లాటలు లేని జాగలకు. మనుషులంతా దయ్యాల తీర్గ కనిపిచ్చేటోల్లు... పంచాతంటె నా పంచపానా లెల్లిపోయేటివి. నాకు తెలువకుంటనే ఆడికి పోయి నిలుసుండెవాన్ని...

ఎడ్లను మేపుతున్నప్పుడు పొల్లగండ్లమంత కుప్పగూడి అచ్చం మావూల్లె సేసినట్టే పంచాతులు జేసెటోల్లం .మాదాంట్ల కొంచెం పెద్దోడైన కొమురయ్య అచ్చం పాపరాజుతీర్గనే మాట్లాడెటోడు.

మావోళ్ళు సిత్రమైన శాత్రాలు జెప్పెటోల్లు... ఆ శాత్రాలల్ల మనుషులు, జంతువులు ఉండేటియి. అందట్ల ఏడనో ఓకాడ పసులగాసేటోల్లుండెటోల్లు... వాళ్లు పిల్లంగొయ్యి బలుకుతె పసురాలు మోరలెత్తేటియి. కని నాకెందుకనో గ శాత్రాలు నచ్చేటియిగాదు. నా సుట్టున్న నా దోస్తులు బువ్వజీతగాళ్లు. కాగులతీర్గ బొత్తలున్నోల్లు, కట్టెపుల్లలసొంటి కాళ్లుసేతులు, తప్పకండ్లు, ఆనెగాళ్లు, సీరుకపోయిన అరిపాదాలు, ఒంటిమీద సినుగుల గుడ్డలున్నోల్లు... ఆళ్ళ కండ్లల్లకు పులుకుపులుకున సూసెటోన్ని...

ఆళ్ళు తమ ఏడుపును, బలువు పనిని, ఆకలిని, పేదతనాన్ని తప్ప మంచి బతుకు కోరుతండ్లు... వాళ్ళు కోరుతున్న బతుకెటువంటిదో శాత్రాలల్ల గన్పిత్తనే ఉన్నది. కాని అది అయ్యేపనా? ఎద్దుకాలుకు ముల్లుగుచ్చుతే... ఎద్దు దండమీద ఈగ ఈపు బెడితే...



కన్ను నీరుకవుసుతే దాని డొక్కలు నిండకపోతే... అది దొంగతనంగ ఎవల సేండ్లనన్న బడ్తె - తీటరంకుల లేగబొక్కు తప్పిపోతే... ఇట్ల సవాలచ్చ కారణాలతోటి మావోల్ల ఈపులు పలిగిపోయ్యేటివి. గాడిదిగర్పటాకు, నల్లాలం పసర్లు పూసుకొని ఒకలకోసం ఒకలం ఏడ్సెటోల్లం. దెబ్బలు దిన్నోడు "ఆన్నెప్పుడో బండెత్తేసి సంపుత" అనేటోడు. మళ్ళీ పొద్దు గూకిందంటె గుండెదడ... నా తీర్గ మరో నలుగురైదుగురం సంత ఎడ్లను మేప టోల్లం......మా నాయిన్న ఇంక ఎడ్ల నమ్మలేదు.

ఒక్కొకపారి నేను ధైర్నెంజేసి శాత్రాలు జెప్పెటోన్ని... గందట్ల పుట్టెడుకట్టా లుండేటియి. మా వోల్లు "గయి శాత్రాలుగావు........ నీకు శాత్రం జెప్పరాదు" అని తెగేసి చెప్పెటోల్లు... వాటి ముగింపు ఎప్పుడు ఒల్లు జడితిచ్చే బాధతో నుండేటివి. గవి మావోళ్ళకు నచ్చేదిగాదు.

ఇట్లుండంగనే వానకాలం బోయి సలికాలమచ్చింది. సలికాలం బోయి ఎండకాల మచ్చింది. ఈయేడు ఎండలు మాంచి జోరుమీదున్నయి... పంటలన్ని అయిపోయినయ్ గన్క ఎడ్లను గాయాల్సిన పనిలేదు.

పొల్లగండ్ల మందరం ఏ సింతనీడకో, మర్రినీడకో గోళీలు, సిర్రగోనె లాడుకునే టోల్లం... ఆడపిల్లగండ్లు సరిబద్దులు ఆడుకునేటోల్లు...

ఊళ్ళె పేదసాదలు పనిలేమి లేక సానా ఇబ్బందుల్లున్నరు. సూర్లకిందనో, పందిర్లకిందనో కూరుకుపట్లు పడుకుంట కాలరీతులగురించి, పోయిన దినాల గురించి, మనుషుల మంచిసెడ్డలగురించి తలల్ల పేండ్లు కుక్కుకుంట చెప్పుకునేటోల్లు... పొద్గాల సిల్లరమల్లర పనులు గెలికెటోల్లు... పాలేరోల్లకు ఎట్లయిన పని తప్పదు. సెరువుల మట్టి సేండ్లల్లకు జేరగొట్టడమో, వాగులు వొంకలు బాగుసెయ్యటమో, సెలుకల్ల సెట్లు, ముండ్లుగొట్టి రాల్లేరటమో సేసేటోల్లు...

గీ ఎండకాలం బహు గడ్డుకాలం... అంబలి దొరుకుడే గగనం... మా నాయిన పాత నోట్లు ఆకలికి కరిగిపోతన్నయి. అవి కరిగినాకొద్ది మా నాయన ధుమధుమలాడ్తండు.

అగో గసొంటి ఎండకాలంల పట్టపగటించి...

అడగాలి ఈడ్సి ఈడ్సి గొడ్తంది. అడి ఆడి మేమంత అలిసిపోయి నీళ్ళు తాగి సింతకింద పాతగోడ కొరిగి కూకున్నం. కొందరు సొమ్మసిల్లిపోయి గ దుబ్బల్నే పడి గుర్రుకొడుతండ్లు... సింతమీన గొరైంకలు అరుత్తన్నయి. గుడ్డి బొందిగాడు తన అంకరమెడ అటిటు తిప్పుకుంట బాలనాగమ్మ కత చెప్పుతండు. ఆడెక్కన్నో శారధిగాళ్ళ దగ్గెర్నో బుడుగు జంగాల దగ్గెర్నో ఇన్నడట... అప్పుడప్పుడు గొంతెత్తి కొసమొదలు లేని ఎక్కడిమాటో పాడుతండు.

*"సిలుక మ్యేతకు బోయినదో... సిక్కు పొదలలో సిక్కినదో...*

*సంగీ నాపానం గిరగిర... తిరుగుతన్నదే సంగీ"*


www.eTelangana.org

బొందిగాని పాట ఆఖరుగాకముందే మెంటలింగడు ఏడినుంచో ఎగపోసు కుంటురి కచ్చిండు....

"మనూల్లెకు గోత్రాలోల్లచ్చిండ్లు...............గోత్రాలోల్లచ్చిండ్లు ..........." అన్నడు సంబురంగ.........

"కిట్టన్నచ్చిండా? నాసామిరంగ అల్లిరాణి ఏసం గట్టిండంటే......." గుడ్డి బొందిగాడు పాటాపి పెదువులు సప్పరిచ్చిండు. పన్నోల్లను లేపుకొని అందరం ఉరికినం........అప్పటికే ఇంటి కొంతమంది దిగిపోయిండ్లు. మాయింట్ల ఎవలు దిగిండ్లోనని నేనురికిన...... అల్లిరానేషం గట్టే కిట్టన్న మాయింట్ల దిగిండు.......

మా నాయిన్న మంచాల కూసున్నడు....

"ఎంకన్న బావా అయిదేండ్లాయె ఇటు తొక్కిసూడక... కాలం మంచిగలేదు. ఏంజేత్తం... శంకరిగాడు నిలువు నిత్తారం మోయేడు బోయిండు. రాజేశం గట్టిటోడు బోయినంక కుంటుబడే....." ఇట్ల ఏందో చెప్పుతండు.

నేను మా నాయిన పక్కకు కూకున్న.......నాఎంట ఉరికచ్చిన పొల్లగండ్లు దిక్కు గర్వంగ సూసుకుంట..........

✳

# 22

గోత్రాలోల్లచ్చిన రెండు దినాలకు "ప్రహ్లాదుడు" భాగోత మేసిండ్లు. ఊరోల్లందరికి ఆ పాటల ధ్యాసే......ఎవడు సూసిన అయ్యే పాటలు.........అయ్యే కతలు........

గోత్రాల కిట్టన్న మాత్రం తెల్లందాకా పాటలు బాడెటోడు. గ పాటలు బాగోతుల పాటలుగావు.......మా నాయిన్న గ పాటలు మనుసుబెట్టి ఇనెటోడు... ఎన్నెన్ని సంగతులో చెప్పుకచ్చెటోడు.

ఆదినం పిండారబోసినట్టు ఎన్నీల గాత్తంది. మా అవ్వ కిట్టన్న పెండ్లాం మధునమ్మకు బయ్యక్క సంగతి మా బూమి బోయిన సంగతి సెప్పుకత్తంది......

గడంచల మా నాయిన్న కూకున్నడు. కిట్టన్న సిత్రమైన మాటలు సెప్పపట్టిండు....

"బావా నేను పుట్టి బుద్దెరిగిన కాన్నుంచి సూత్తన్న..........రాణుల ఏషంగట్టి ఎగురుతన్న... ఆర్నెల్లు కింద కలెనాగురం జిల్లల జగితాల తాలుకల ఓ ఊళ్ళె ఉన్నం......ఎవలో భాగోతం కడ్తరని ఊరు ఊరంత ఒడ్డన ఒరిగింది.... మేమే బాగోతం గట్టెటోల్లమంటే ఇల్లెక్కడోల్లురా అని మేమంత సూడవోయినం... అయి రాణుల కతలగాదు, రాజుల కతలుగాదు... రైతుల కథలు... నీ బాంచెనైతె అయి పాటలుగాదు



కడుపుల దుఃఖాన్ని ఎగజల్లిండ్లు... నా జల్మల గ పదాలినలే...... ఏడిపిచ్చిండ్లు, నవ్విచ్చిండ్లు... ఆళ్ళ కగ్గిదల్ల అంతటితోని ఒదులుతే బాగుండు, పటపట పండ్లు గొరికిచ్చిండ్లు.." గిట్ల సానా సంగతులు సెప్పిసెప్పి.

*"ఊరు మనదిరా... ఈ వాడ మనదిరా?*

*దొర యేందిరో... వాని పీకుడేందిరో?*

*ఆఽమంచెకాడ మనమే......."* ఇట్ల పాడిండు.........

"మాలావుగున్నది బామ్మర్ది" మా నాయన్న మెచ్చుకున్నడు...

"మామా నాకు సుత నేర్పే" అన్న నేను...

"అల్లుడ బల్లికొండ మానేర్పుత... నేను నేర్పేదేంది అచ్చువయిలేసిండ్లు..."

"మరి నాకు సదువురాదు......" అన్న

"నేం నేర్పుత నేర్సుకుంటవా?"

"మీరూకే ఈడుంటరా?"

"ఉండకుంటేంది? మాతోటిరా అల్లుడా... అల్లిరానేషం కట్టేవ్" అన్నడు.

"ఉన్నదంత ఊడ్సుకపోయింది... ఇగ గదొక్కటే ఉన్నది తమ్మీ" మా అవ్వ.

పెద్దోల్లు ముచ్చెట్లల్ల బడిపోయిండ్లు... నాకు నిదుర బట్టలేదు. సుక్కల దిక్కు సూసుకుంట సదువుగురించి ఇసారాలు జేసిన.

తెల్లారినంక లేత్తెలేత్తెనే కిట్టన్న దగ్గెరి కురికిన...

"నాకేడ నేర్పత్తది నవ్వులాటకన్న" అన్నడు కిట్టన్న.

నేను కాళ్ళు నేలకేసి బాదుకుంట, ఏడ్సుకుంట మా అవ్వ దగ్గెరి కురికిన.

"పోరడు మంకుబెడ్తండు. ఏదన్న పెట్టియ్యారాదు తమ్మీ" అన్నది మా అవ్వ.

తప్పేది లేదని... సామాన్లన్ని ఎతికి పలుకొకటి పాతది తీసిండు. బలుపం సుత దీసిండు......

ఆ, ఆ లు పెట్టిచ్చిండు.... ఆ సెయ్యి తిరిగడం సూసిన... బలుపం బట్టుకొని గీతలెంట రాసేటాల్లకు సల్ల సెముటలచ్చినయ్... నీ యవ్వ గిది దొంగగొడ్ల కాసుడుకంటె కట్టమున్నదనుకున్న. కూడుగీడు దినకుంట అంబటేల్లయేటాల్లకు అయ్యి కిందమీద రాసిన........

అట్ల నా సదువు మొదలయ్యింది...గోళీలకు, సిర్రగోనెకు దండంబెట్టి ఒక్కటే ధ్యాసతోని అచ్చరాలన్ని నేర్సుకున్న... నెలదినాలకు కిట్టన్న నాకో పదాలవయిచ్చి


www.eTelangana.org

ఎల్లిపోయిండ్లు... నాకిప్పుడు అచ్చువయి దెలుత్తంది......... ఆ అచ్చురాల ఎనుక రాసున్న సంగతులు కొద్దికొద్దిగ ఎరుకయితన్నయి.... నాతోని పోరగండ్లందరు గియ్యే పాటలు ఆడోముక్క ఈడోముక్క పాడబట్టిండ్లు....

✧

# 23

పట్టపగటించి గుడ్డి బొందిగాడు సింతకింద కూకుండి పాడ్తుండు....

*“పొద్దుపొడుపు మెరుపుసుక్క!*

*పొయ్యేటి మేనత్తకొడుకా! ఓ నా బాలారాజా”*

మేమంత ఆని ముంగట కూకున్నం........

“చత్ గుడ్డోడ గయ్యేం పాటలు” అన్న.

“మొగోనివైతే నువ్వు పాడు” అన్నడు కొమురయ్య.

యేల్లకు నాకు ఏ పదం యాదికిరాలే... తలగోక్కున్న...

“మర్సిపోయిండాడు” అన్నడు ఎల్లడు....

“మరిసిపోయి మామ పెండ్లాన్ని అత్తన్నడా?” అన్నడు సమ్మడు... అందరు నవ్విండ్లు -

ఆఁ అచ్చింది. అచ్చిందచ్చింది.......

*“ఓ పసులగాసే పిల్లగాడా!*

*పాలబుగ్గల జీతగాడా!*

*పాలుమరిసి ఎన్నాల్లయ్యిందో!”*... అట్లా ఎత్తుకున్న.

నా పాటయిపోయింది. గుడ్డి బొందిగాడందుకొని పాడ్తుండు. మావోల్లంత ఆడు తలతిప్పుడు సూసి నవ్వుతండ్లు... ఆడు ఎన్నో శాత్రాలు చెప్పుతడు. పొద్దం దాకా కట్టె పొడుసుకుంట ఇంటికింత ఆడుక్కతింటడు. పెడితే తిన్నట్టు... లేక పోతే కడుపుల తలబెట్టుకొని పన్నట్టు... ఆడు తిన్నా తినకున్నా గిట్లనే పదాలు పాడుకుంట ఆ కొసనుంచి ఈ కొసదనుక తిరుగుతనే ఉంటడు.......

“నీ బాంచెనాతె మాలావుగున్నది పదం” అన్నడు గుడ్డోడు పదమాపి.

ఇంతట్లనే గజ్జెపేరు మోత వినిపిచ్చింది. గ మోతను గుడ్డోడు గుర్తుపట్టిండు. దొరత్తండు...... పెద్దొర...” వాడు తత్తరపడుకుంట గులిగిండు.



మేమంత ఎటోల్లం అటు సెదిరిపోయి గోడకు ఒదిగి నిలుసున్నం. మరి కొంతసేపటికి పుల్లెడ్ల బండచ్చింది. బండ్లెవలున్నరో సూద్దామనేటాల్లకే బండి మూడు బజార్ల కాడి కురికింది. మేము బండెనుక ఉరికినం........

*“బండెనుక బండిగట్టి... పదారు బండ్లుగట్టి...*

*నువ్వే బండ్లే బోతవు పిలడో... బండ్లోల్ల రమనయ్యా!”*

ముంగటి పాటరాక గుడ్డోడు “నన్నన్నా... నన్నన్నా.........నననన్న......నననన్నా” అని మూలిగిండు.

మేము ఉరికేటాల్లకే మూడు పానాదులకాడ మంది కూడిండ్లు. బండాగున్నది. మావోల్లంత పుల్లెడ్లను, నూనెరాసిన అటి నున్నటి కొమ్ముల, తలలకు గట్టిన బొక్కపూసల పంతాల్లను సూసుకుంట ఒకల బుజాలమీద మరొకలు సేతులేసుకొని నిలుసున్నరు. కుర్సిల కూకున్న పెద్దొరను సూసుకుంట నేనున్న... దొర నున్నగ గుండు తీర్గున్నడు. బట్టతల తళతళలాడుతంది. చెవుల్ల ఆపక్క ఈ పక్క పిల్లిమీసాలతీర్గ నిక్కపొడిసిన కాసిన్ని ఎంటికలు, ముద్దసెంపలు... ఎత్తుంగ, దొడ్డుగున్నడు. కాళ్ళకు తళతళ మెరిసే నల్లటి సెప్పులున్నయి. ఏల్లకు బంగారుంగరాలు... కండ్లు పాపరాజు కండ్లతీర్గ ఎర్రగున్నయి. పాపరాజు మంచం మీద కూకున్నడు. గౌరయ్య, రాజీరు మొగిలయ్య పెద్దలు సేతులు పిసుక్కుంట ఏమి దోసనోల్ల తీర్గ నిలుసున్నరు. జనం కులాలనుబట్టి, ఓదానుబట్టి సుట్టూ నిలుసున్నరు.

మొగిలయ్య ఎందుకనో పిట్టతీర్గ నోరు తెరుసుకుంట ఏందో సెప్పాల్నని పీలకాలు నిలబొడుసుకుంట ముంగటికి జరుగుక్కుంట ధైర్నంసాలక ఆగిపోతండు.

సింతకింద మందిల మా నాయిన తన కిచ్చేమి పట్టిపట్టనట్టు ఎటో సూసుకుంట నిలుసున్నడు. నోట్లె పలుకర పుల్లున్నది... ఈ మద్దెన మా నాయిన పని తీరనోని తీర్గ పొద్దందాకా పలకరపుల్ల నములుకుంటనే ఉంటండు. ఎవరన్నా ఆ సంగతడుగుతే... “తీరికేది ఇగో పొద్దున....” అని అరుసబెట్టి పనులు సెప్పుకత్తడు... మాఅవ్వ సొడలు సొడలు పోవుకుంట... “కూడుదినక కుమ్ము దినక... సంపాయించేటాల్లకు... బూమి గాదుగదా! మనమే బుగ్గిల గలుత్తమ్” అనేది... మా నాయన్న గ మాటలు పట్టించుకోడు... నేనిట్ల ఇసారం జేత్తన్న.

“గొండోల్లేర్రా” పెద్దొర లకలుకలైన పెద్ద కచ్చులం రాళ్ళమీద ఉరికినట్టుగ మాట్లాడిండు. గీ కంఠానికే... గ కండ్లకే అయిదారూళ్ళమంది బయపడతరేమొ అనుకున్న.

“అత్తండ్లు బాంచెన్........పెద్దిగాడు ఆళ్ళ నెంట బెట్టుకత్తండు........” సుంకరి బజారుగాడు బయపడుకుంట చెప్పిండు.

“గొండ లం......కొడుకులకు మదాలచ్చినయ్ బంచత్......” పాపరాజు.


www.eTelangana.org

"ఔనుండ్లి" సందు దొరికిందని మొగిలయ్య.

దొర సింతకింది మందిదిక్కు సూసిండు.

ఇంతట్లకే గొండోల్లచ్చిండ్లు......... సేతుల్ల కట్టెనో, సిన్న గొడ్డలో ఉన్నది. నడ్డి ముక్కులు... అందరచ్చి అంగంగి దండాలు బెట్టిండ్లు... "రాంరాం" అన్నరు. దొర అందరిని కలెజూసి......

"ఎండలు బాగా ముదిరినయ్ పాపం మీరంతా అన్నానికి కటకటలాడిపోతన్నరు. ఏదన్న పని జేయించుకుందామంటె ఎండకాలమాయె. పాలేర్లే జబ్బలు జారేసుక తిరుగుతున్నరు. సూసిండ్లా ఈ సంవత్సరం ఎండలెంత ముమ్మిరి మీదున్నయో?" అని ఉఫ్మని ఊదుకొని కుర్చీల సదురుక కూకుండి... "గిదంతా సూస్తే నాకో ఉపాయం తట్టింది. మన అందరికి అడివి కన్నతల్లి లాంటిది. దూరం గొట్టినా దగ్గెరికి దీసినా అడివితోనే బతుకుగదా? ఏమంట్రా గొండోల్లు?" గొండోల్లు ఏమంటరో వినకుంటనే... "మరందుసేత గండి సెరువు పాటి గొట్టుండ్లి... మీ ఊరోల్లు. గొండోల్లు గలుస్తే గదేపాటిది... మీరంత భూములు లేక సత్తండ్లు. సర్కారు ఎవరు సాపు జేసుకున్నది ఆళ్ళకే దఖల్ చేస్తనంటంది......వారీ! గది సాపు జేస్తిరా! మీ అన్నం కుక్కల్ దినయి. నూరెకురాలు కార్జమసొంటి భూమి ఆకు మురుగుడు. అది పంటకు దిరిగిందో కనకవర్షం కురుస్తది. మీదాంట్ల ఎవడూ ఆకట సావాల్సిన పనిలేదు. ఆ పని మీరు అటు చేయండ్లి... నేను కచ్చీర్ల సుట్టు దిర్గి గ భూమిని మీ పేరుమీద పట్ట జేపిస్త" దొర ఆపి మందిదిక్కు సూసిండు.

మంది కలో నిజమో తెలువక ఉక్కిరిబిక్కిరై పోయిండ్లు... మా నాయిన మొఖం దీటి తీర్గ ఎలుగుతంది. మందిని జరుపుకుంట ముంగటికచ్చిండు. గొండోల్లు గుడగుడ లాడ్తండ్లు అల్లండ్లాలె...

గౌరయ్య, రాజీరు గి దీన్ని సమఝ్ చేసుకోలేకపోతండ్లు.

"ఎట్లయిన తమరు బీదసాదల జూసె ధరమ దొరలు" మొగిలయ్య దొర తన దిక్కు సూడన్నని అన్నడు.

"కని గిందట్ల సిన్న లిటిగేషనున్నది. ఏ పనిజేసిన పుణ్యము పురుషార్థం రెండు దక్కాలె... మీకు భూమి సూపెట్టినగన్క పుణ్యమైతే దక్కుతది. ఎటొచ్చి నాకు కొట్టాలు సాలక నోరులేని జీవాలు ఇబ్బంది పడిపోతన్నయి. ఏటా ఇగ గడుత... అగ గడుత ననుకుంటనే మూడేండ్లు గడిసిపోయినయి. సైకోన్ని కట్టె అడుగుతే గంత దమ్ము నాకు లేదంటడు..... పైనున్నోల్ల కలుసుడు పడకనేపాయె... ఏటా ఏదో పని... ఊళ్ళనిండా ఊపిరి సలుపకుంట పంచాయతులాయె. బయటకు పోను తీరికెక్కడిది? నూరెకరాలల్ల కొట్టిన కర్ర నాకిత్తిరా! నోరులేని పసురాలకు కొట్టాలయిపోతయి...అటు మీ పని ఇటు నా పని అయిపోతయి. ఏమంట్రా బాగా ఇసారం జేసుకోండ్లి......." దొర సికిలేటు ముట్టిచ్చిండు.



మందిల సంబురం దాగని ముచ్చెట్లు... అప్పుడే పంపకాలు బూమి ఏ పక్క మంచిదో ఏపక్క సెడ్డదో ఇసారాలు... సెట్ల గురించి, గండిబడ్డ సెరువు గురించి ఇసారాలు......

మా నాయిన పండ్లపుల్ల పారేసిండు. ముంగటికి జరిగి "బాంచెన్ దొర... తమరు కములం బెట్టిండ్లు బాగున్నది. కని గండట్ల బుక్కల రాయి తీర్గ సైకిదారు......"

దొర ఎగదిగ సూసి "నీ పేరేందిరా?" అన్నడు.

"ఎంకటిగాడు" పావరాజు సెప్పిండు.

"ఎంకటిగ... నీ భయం నాకు అర్థమైంది. సైకోనికి నేం జెప్తత... మీరంత ఆడడుగుతే మాకేమెర్కలే దొరనడుగుండ్లనుండ్లి... మీపక్క నేనున్ననంటలేనుర."

"గాయింత మాటన్నరు... మాకు గుర్రాన్నెక్కినంత." మా నాయన మందిదిక్కు తిరిగి "ఏమంట్ర... అనేందు కేమున్నది?"

"రేపు మంచిదినం శుక్రవారం" పాపరాజు.

అదేమాట షావుకారి సుత అన్నడు.

"రేపింటికొకడు గొడ్డండ్లు నూరుకొని రాండ్లి... నాలుగైదు దినాలల్ల పనిగావాలె..." మా నాయన అరుత్తండు.

గొండ ముసలోడు "మేమంత అడ్డదారిప్పకాడ కరకర పొద్దుపొడిసెటాల్లకు తయారుగుంటం" అన్నడు.

కొందరు సంబుర మాపుకోలేక నిలుసున్న కాడినుంచే దొరకు మొక్కిండ్లు...

దొర లేని నిలుసుండి ధోతి సరిజేసుకున్నడు. బండిల కూసున్నడు. గజ్జెపేరు సప్పుడు అంతకంతకు దూరంకాంగ బండెల్లిపోయింది.

గుడ్డోడు దడిదగ్గెర కూకుండి

*"అంగడివో అంగడి... పూల సీరెలంగడి*

*అంగడివో అంగడి... రయికె బట్టలంగడి"* అనుకుంట పాడ్తండు.

నేను ఇంటికురికిన... మా నాయిన మా అవ్వతోని మాటకు మాట గలువకుంట సంబురంగ ఏందో సెప్పుతండు... గ మాటలింటె కప్ప దునుకుడు యాదచ్చింది. మాకు సేనత్తదంటె నాకు సంబురంగనే ఉన్నది. బయ్యక్కుంటే ఇట్లనే ఉరికి చెప్పేటోన్ని.

*

ఆ దినం నాత్రంత మా నాయన్న నిదురబోనేలేదు. గొడ్డలి నూరుకుంట కామ సరిసూసుకుంటనే ఉన్నడు. రేపటి పని గురించి గులుక్కుంట ఆడికీడికి తిరుగుతనే


www.eTelangana.org

ఉన్నడు. మా నాయన సంబురం జూత్తె అయింత బూమి తనకే వత్తదన్నట్లున్నది. తొలికూడి గూయంగనే ఏగిరపడిపోయిండు. మా అవ్వను పెద్దగ కేకలేసుకుంట లేపిండు... నన్ను మంచాల లేపి కూకుండబెట్టి "వారీ! రామన్నా! ఏం నిదురరా! మొద్దునిదుర... నీ యీడుల నేనైతె సెంగుసెంగున లేడిపిల్లతీర్గ ఆడిన... నాయినా లే... నా తండ్రీ లేరా! అడివికి బోతె ఆడ ఎన్నుంటయి? తునికి పండ్లుంటయి. ముసలి సెట్ల బొర్రెల సన్నపీగెల తేనె దొరుకుతది... జినుకలు, కుందేల్లు ఎన్నని? నువ్వే సూత్తవు... లేలే నాయిన్నా!"

నేను లేసి కూకున్న...

ఊళ్ళోలందరికి నిదురెట్ల బట్టిందో? దున్నపోతుమీని ఆన... కదలరు మెదులరు గదా! లచ్చిమత్తందిరో అంటే గుడిసేపు కునుకు తీత్తనన్నడట... ఎనుకటెవడో! ఇసిరెలు తయారుబెట్టుకున్నరో లేదో? పదిమందిల పాము జావదట..." ఇట్ల గులుక్కుంట ఊళ్ళెకు బోయిండు.

అట్ల అందరు బజాట్ల కచ్చేటాల్లకు తూరుపు రేకలు బార్తన్నయి. అందట్ల పావుమంది ఎకురం అరెకరం బూమున్నోల్లె... "ఆళ్ళెందుకు?" అన్నరు కొందరు. మరికొందరు "సేసుకున్నోనికి సేసుకున్నంత. ఆడ ఊకెనే అత్తదా! రానియ్యండ్లి" అన్నరు. బూమున్నోల్లు ముసిముసి నవ్వుకుంట "గిందట్ల ఏందో మోసమున్న"దన్నరు. "బూమి ఉత్త పున్నానికి ఎవడు పంచిపెట్టర"న్నరు. "అట్టి బొక్కలకు కోండ్రిగాడు దెబ్బలు బడ్డట్టే" అన్నరు "దొర కట్టె తీసుకున్నంక దుడ్డు జూపుతడు" అన్నరు........

ఎవలేమన్నా గొడ్డండ్లు సద్దులు పట్టుకొని తయారైన జనం ఆగలేదు.

ఆడోల్లు, పొల్లగండ్లు గలిపి ఎంత మంది ముంటమో నాకు లెక్క తెలువలేదు. మా నాయిన లెక్కేసి అరువై యిద్దరన్నడు.

పొట్టి ఓదెలు రాగ మెత్తుకున్నడు. మంది కదిలిండ్లు... మందిల ఓదెలెక్కడున్నడో కాసేపు నాకు కనిపియ్యలేదు.....నేను ఓదెలును సూసెటాల్లకు సిటికలేసుకుంట నడిమందిల గుండ్రటి బోడగుండు ఎగిరేసుకుంట పాడ్తండు...... సంబురం ఆగనోల్లు సుతి గలిపిండ్లు. మా నాయిన సుత ఆ పదం పాడబట్టిండు.

*"ఆఁ....దండు బయిలెల్లినాదే*
*సీమలదండు బయిలెల్లినాదే.......* ॥దండు॥
*ఉత్తురాన చెరచెర ఉరిమిన తీరు*
*దచ్చినాన మొగులు మెరిసిన తీరు*
*కళపెళ కళపెళ పెళపెళపెళ* ॥దండు॥



*అరె ఆగులుదాటి - అంతలుదాటి*
*రాళ్ళు దొక్కి - పొదలు నరికీ*
*టేకులు మద్దుల - తునికి మొద్దుల*
*బిలుగుల కొడిశెల - తవిసె మొద్దుల*
*గుట్టల గుండెలు - దద్దరిల్లగ*
*నరికీ కుప్పలు బెట్టేటందుకు* ॥దండు॥

*అరె! రాళ్లురప్పల బీళ్ళు దున్ని*
*మట్టి బెడ్డలను - నుసినుసిజేసి*
*ఉత్తెర కార్తెల - ఇత్తునమేసి*
*సిలుకల పచ్చుల - కావలిగాసి*
*ఏదుల పందుల - దూరంగొట్టి*
*బంగరి పంటల - బయటికిదీసె* ॥దండు॥

*అరె ఎయ్యర దెబ్బ - ఇప్పమానుకు*
*కొయ్యర కొడలితో - పరికీపొదలా* ॥దండు॥

నాకు తెలువకుంటనే కీసు గొంతుతోటి నేను ఆ పాటందుకున్న. ఎవరి ముఖాలల్ల సూసిన సంబురం. వీళ్ళు నూరెకరాలేగాదు ఆడివంతా ఎక్కడి కక్కడ నరికి కుప్పలు బెట్టేట్టున్నరు.

మేమట్ల దుమ్మురేగంగ నడిసేటాల్లకు నెముల్ల సెలుక దగ్గెరి అడ్డదారికాడ గొండోల్లు కూకుండి సుట్టలు తాగుతండ్లు. సంకల్ల అంబలి బుర్రలున్నయి. వాళ్ళు ఇరవై మీన్నే ఉన్నరు.

అందరం గలిసినం. గొండ ముసులోడొకడు గుడగుడసప్పుడు సేసుకుంట ఏదో రాగమెత్తుకున్నడు. అడేం పాడ్తండో నాకు తెలువలేదు. అదేదో దేవుని పాట గావచ్చు ననుకున్న. గ పాటల రానురానూ జోరు పెరిగింది. ముసులోడు ఊగుక్కుంట గాల్లె నడత్తన్నట్టు అడుగులేసిండు... నలుగురైదుగురు గొండోల్లు సేతులుగలిపి కోలాట మేసినట్టు తిరుక్కుంట నడువబట్టిండ్లు...

మేమంత బండ్లబాట దిగి కాలిబాట పొంట నడుత్తన్నం. నా రోమాలు నిక్కపొడిసి నయ్... పెయ్యి గొగ్గరిచ్చింది. తూర్పుదిక్కున పొద్దున సెట్లకొసలు ఎర్రంగ మండు


www.eTelangana.org

తన్నయి. పరుపుబండల మీదినుంచి దిక్కులు సూసుకుంట నడుత్తన్న... నాకు ఎర్కలేని పిట్టల కూతలెన్నో వినపడ్తన్నయి. దూరంగ కోతుల గుంపొకటి తామూలుగా నడుసుకుంట పోతంది. కోతిపిల్లలు తల్లికోతుల బొత్తలకు ఏలాడుతన్నయి. గువ్వ ఎక్కన్నో అడివి దనలెల్లేటట్టు 'గుగ్గుగూ' మనిగూత్తంది. ఏదో పిట్ట రెక్కలు టపటప కొట్టుకుంట ఆకసంలకు లేత్తంది.... గొండ ముసులోని పదం ఎంతకు ఒడిసేటట్టులేదు. అసలు ఆ పదానికి ఆఖరున్నదో లేదో? ఎండుటాకులమీద మా అడుగుల సప్పుడు కిర్రు సెప్పుల మోతతీర్గ గమ్మత్తుగున్నది. తునుకులు బతుకమ్మ పండుగకు కొత్త బట్టలేసుకున్న మా వూల్లె ఆడోల్ల తీరుగున్నయి.

అట్ల కాలిబాట మీద సానాదూరం నడిసినంక ఓ వాగచ్చింది. ఆగుల రాళ్ళ సందుల్లనుంచి నీళ్ళు  తేటగ పార్తన్నయి. అందరు ఆడాగి నీళ్ళు దాగిండ్లు. నీల్లల్ల నల్లటిసేపలు... తోకలూపుకుంట తిరుగుతన్నయి. నేను ఈన్నే ఉండిసేపలు బట్టాలె ననుకున్న.

బయ్యక్కకు ఎంత ఒడుపుగ సేపలు బట్టత్తది. బయ్యక్క నీల్లమడుగుల దిగిందంటే సేపలన్ని గజగజలాడేటియి. గట్ల గప్పుడు బయ్యక్క యాదికచ్చింది. మా ఎంటున్న ఆడోల్లల్ల బయ్యక్కకోసం ఎతికిన... సింపిరి ఎంటికలతోటి, సినిగిన బట్టలతోటి వాళ్ళు కట్టం చెయ్యడానికే పుట్టినోల్ల తీర్గ కనిపిచ్చిండ్లు...

అందరు అగొడ్డెక్కిండ్లు... నేను ఆళ్ళెంట బడ్డ...

కొంతదూరం బోయినంక గొండ ముసులోడు పదం ఆపిండు. మానాయిన నేలమీది మట్టితీసి అందరికి సూపెట్టిండు. అందరు గ మన్నును సూసిండ్లు.

"పడమటినుంచి తూరుపుకు నరుక్కత్తాం" అన్నరెవలో... అందరు మళ్ళీ కదిలిండ్లు... ఈపారి సిన్న గుట్ట బోరెక్కి మళ్ళ కిందికి దిగేటాల్లకు రెండు కొండల మధ్య చేరుకున్నం. ఉత్తరం దిక్కో కొండ... దచ్చినం దిక్కో కొండ... ఆ రెండు కొండల కలుపుకుంట కట్ట... దానిమీద సానాసేపు తిరిగిండ్లు... మధ్యల పెద్ద గండీ... ఇంతకు ముందటి వాగు గ గండిలనుంచే వత్తందట... ఈవలొడ్డుమీద నిలుసుండి సూత్తే ఏన్నో పాతాళలోకంల నీళ్లు...

అందరు సద్దులు, అంబలి బుర్రలు సెట్ల మండలకు కట్టుకున్నరు. పంచెలు నెత్తులకు సుట్టుకున్నరు. ధోతులు సింగులిప్పి కాసెలుబోసి మళ్ళ కట్టుకున్నరు. గొండ ముసులోడు గొడ్డలి తూర్పుదిక్కు సూపెట్టి ఏందో సదివి... టేకుమానుకు గొడ్డలి దిగేసిండు.

పడెల్లు పడెల్లుమని గొడ్డండ్ల సప్పుడు. అడివి అడివంత ధనలిత్తంది. నేను కట్టెక్కి కొండలదిక్కు సూసిన... దచ్చినపు కొండ సివర మబ్బుతునుకోటి ఏలాడుతంది. ఆడినుంచి



సూత్తే సెట్లన్ని లైనుగ నిలుసున్న రాకాసుల తీరుగున్నయి. ఏవేవో పిట్టలు ఎగురుతన్నయి. నాకు గొంతెత్తి ఏదన్న పదం పాడాల్ననిపిచ్చింది. ఏ పదం ఏల్లకు యాదికిరాలే... కాళ్లు గుంజుతన్నయి. మెల్లెంగ కిందికి దిగచ్చిన... టేకుసెట్టు సెరసెర కూలింది. దాని సుట్టు మంది మూగిండు. ఆడోల్లు నరికిన మండలు కుప్పలు బెడ్తండ్లు. మొగోల్ల పెయ్యిలన్ని సెముటతోని తడిసి ముద్దయి పోయినయి. ఆడోల్లండ్ల గలిసి నేను మండలు కుప్పేసిన. అట్ల పగటించిదాకా సెట్లు నరుకుతనే ఉన్నరు.

పగటించి నిలుసుండే బుర్రల అంబలి తాగిండ్లు... మళ్ళ పని సాగింది. అంతసేపు తాపతాపకు ఎవలో ఒకలు కట్టెక్కి నాలుగుదిక్కుల సూత్తనే ఉన్నరు. సైకిదారత్తడేమొనని అందరి మనుసుల్ల బుగులు... ఆఖరుకు మా పెద్ద దొరన్న అత్తడేమొనని ఎదురు సూసిండ్లు... పడమటిదిక్కు పొద్దువాలేదనుక ఎవలు రానే లేదు. ఇక ఆనాటికి పనాపి ఇండ్లకు పోదామనుకున్నరు. పదెకురాలు బయిలయ్యిందని మా నాయిన ఆ మూలనుంచి ఈ మూలదాక తిరిగి సెప్పిండు. పెద్ద సెట్లు లేకుంట తుట్టెలున్న జాగల పని తొందరగ జరిగింది. పొదలు ఆడోల్లే కోసేసిండ్లు... గట్ల కోసిన పొదలు సచ్చిన దున్నపోతులతీర్గ... సెట్లు సచ్చిన రాకాసులతీర్గ పడున్నయి.

అందరు ఇండ్లకు తయారయ్యే యేల్లకు పాపరాజు గజ్జెల కచ్చులంలచ్చిండు. కండ్లు పులపాడిసి అంత సూసిండు. సింగులు మీదికెత్తి పట్టుకొని ఒక్కొక్క మొద్దును తేరిపార జూసిండు. పాపరాజు సుట్టు మేమంత కుప్పగూడినం. మా నాయిన సంబురంగా ఏందో సెప్పొకచ్చిండు.

పాపరాజు మా నాయన మాటలు ఇంటనేలేడు. మరికొంతసేటికి దొరబండ్లు పాలేరోల్లచ్చిండ్లు......మేమంత సద్దిగిన్నెలు, బుర్రలు కిందేసి మొద్దులు బండ్ల కెక్కించేటాలక్కు సీకటయ్యింది...

అందరం ఇండ్లకు మర్రినం.....మొగులుమీది సుక్కలు సెట్ల ఆకులసందుల గుండా మిలుకు మిలుకుమంటంటే... ఎండుటాకులమీద అలసిపోయిన మా అడుగులు......ఎవడో ఏదో ఊరు పేరులేని శాత్రం చెప్పవట్టిండు. ఆరుగురు మరాఠీల కతని ఎవడో అన్నడు. సిమ్మెట్లు పలుకుతన్నయి. కడుపుల పేగులు పలుకుతన్నయి. మా నాయిన చెయ్యి గట్టిగ పట్టుకొని నేను ఈడిగిలబడి నడుత్తన్న. కండ్లు మూతలు బడ్తన్నయి. ఇల్లెప్పుడత్తదో?

మేము అడివి దాటి పెద్దార్ల కచ్చేటాల్లకు రాత్రయిపోయింది.

ఇంటికాడ మాఅవ్వ మాకోసం ఎదురుసూత్తంది. అవ్వ నన్ను పెయ్యంత పునికింది.....మా నాయిన పొయ్యిమీద సలసల మలిసేనీల్లు దీస్కపోయి పెయ్యి గడుక్కున్నడు. నేను తానం చేద్దామనుకున్న... అప్పటికే ఆవలింత లత్తన్నయ్. మా అవ్వే బువ్వ తినిపిచ్చింది. తినుకుంట తినుకుంటనే ఎప్పుడు పన్ననో యాదికిలేదు.

✳


www.eTelangana.org

రెండో దినం సుత దొర బండ్లు వచ్చినయ్... కట్టె మెలుక్కపోయినయి. ఎందుకనో సైకిదారు రానేలేదు. ఆ దినమంత అంతా సైకిదారు గురించే ముచ్చెట్లు బెట్టిండ్లు...

"అత్తే ఏం జేత్తామంటరు?" నంభయ్యతాత.

"మజ్జెన మనం జేసేదేమున్నది? దొర మాట్లాడినట్టున్నది. అబ్బో! లాపోతే గొడ్డలి దెబ్బేగిందంటె ఆని గుండెల గుఱ్ఱాలురుకయి" అయిలయ్య...

"సైకిదారు ఎటన్న దొర బోయిండేమొ?"

"కావచ్చు."

"వాచర్ ఓదిగాడన్న గిటు తొంగిసూత్తలేడు."

"అడెందుకత్తడు. సైకోనెంట బోవచ్చు."

"దొర మాట్లాడిండు గావచ్చు."

"అబ్బో దానికదే... దీనికదే... గొడ్డలందుకపోతే అందినకాడికి బరుక్కోవచ్చు."

"అన్నిటికి దొరే ఉండే."

"కట్టె తనే మెలిగిచ్చుక పోవట్టె."

ఇట్ల మనిషో మాట... ఎవలేమన్న ఆనాడూ వాచర్గాని, సైకిదారుగాని రానేలేదు.

తెల్లారి సైకిదారు దొర బోయిండని నంభయ్య ఆర్త దెచ్చిండు. ఆదినంకు కట్టకింద సానా బూమి బయిలయ్యింది. ఈలెక్కన ఇంకో నాలుగొద్దులకు పని పూర్తిగావచ్చు.

ఆర్త దెచ్చినన్నాడే అంబలిదాగి అందరు పని మొదలుబెట్టిండ్లు నాకు దూపై సెరువు గండిలకు దిగి నీళ్ళుదాగి ఒడ్డుమీదికెక్కి మూతి తుడుసుకున్న... బస్ నా కండ్లు నిలబడిపోయినయ్.

మా వోళ్ళంత ఒక్కదగ్గెర సేరిండ్లు... అరుత్తన్నట్టుగ కాకిరి బీకిరని మాట్లాడ్తండ్లు... నేను ఉరికేటాల్లకు వాచర్ ఓదెలు నడిమందిల నిలుసున్నడు. కిఱ్ఱుసెప్పులు పరపరమనంగ అటిటు కల్లుదాగిన కోతోలె తిరుగబట్టిండు. అసలే పొట్టోడు... నెత్తిమీన కుండంత రుమాలు... అమ్మోరు మొకం - వడిదిప్పిన నరిసిన మీసాలు... సేతిల సిన్న గొడ్డలి... మాట్లాడ్తంటె బొండిగకు తునిక్కాయ తీర్గ ఏందో కిందికి మీదికి కదులుతంది. తిడుతండు..........

"ఒరే మొండి లంజకొడుకుల్లాలా ఎంత దమ్ములురా మీకు. సత్తర్రా సత్తరు. ఓరి నీయవ్వ కుక్కల్ దెం......ఎంతడివి గంగల గల్పిండ్లురా? మీ పెండ్లాల మిండెల దనుకున్నరా? అడుగక నుడుగక గుప్చాప్గ నరికి కుప్పలు బెట్టిండ్లు! ఒబ్బొబ్బొబ్బొ"



నోరు గొట్టుకొని నొసలు గొట్టుకొని "మీ కర్మం బలుగుద్ది... కుక్కల కొడుకుల్లారా, మీ కర్మం బలుగుద్ది.....మీ తాడు దొంగవ్వల......ఒఱ్ఱంగ సిలసిల నెత్తుర్లు గారంగ పట్టుకపోయి జల్మకైదు జేత్తరు."

"దెహె! బురుకు పిట్టోలె ఏం ఎగురుతన్నవ్? మాకు దొర ఉకుమతిచ్చిండు" ఎడ్డి నారిగాడు.

"ఓరి నీ యక్కను నక్కలెత్తుకపోను దొరెవ్వఁరా" నాలిక కొరుక్కొని ఏమనాలో దోసక నిలుసున్నడు.........మళ్ళ గొడ్డలి తిప్పుకుంట. "మోరుదోపు లంజకొడుకులు" తిట్లు.

"నోరుమూసుకోవయ్యా......" ఆడోల్లండ్ల ఎవలో గునిసిండ్లు.

"ఓసి లం.........నన్నే నోరుమూసుకోమ్మంటన్నవ.......నేనెవలనుకున్నవే ....... సర్కారు మనిషిని........." ఓదెలు కొట్టకొట్టురికిండు.

ఎవలో ఆపిండ్లు. ఇంకెవలో ఎత్తిన గొడ్డలి గుంజుకున్నరు. ఓదెలు ఏమనుకున్నడో ఏందో... పెద్దపెద్ద జంగలేసుకుంట... సిటకర సిటకర సిటికెనేలు సప్పుడు జెయ్యంగ నిక్కుకుంట నీల్గుకుంట పోయిండు....

ఆదినం సుత సైకిదారు రానేలేదు.

తెల్లారి గొండోల్ల తొడసం జంగు మళ్ళో కవరు దెచ్చిండు. సైకిదారు పెండ్లాన్ని నీల్లాటకు తల్లిగారింటికాడ ఇడిసిపెట్టిరాను బోయిండట... ఆ దినం రానేలేదు.

మరి రెండు దినాలు పని బాగనే సాగింది. అందరి సేతులకు పొక్కులచ్చి అవిసిపోయి కాయలుగాసినయ్. నా కాళ్ళయితే సీరుకపోయి పుండ్లయినయి.

ఎండిన పొదలు మండలు కాలబెడ్తామన్నరు. కొద్దిగ మాత్రమే పని మిగిలింది... ఇంక రెండు మూడు దినాలల్ల సాపుగావచ్చు. సాపయినంక... మళ్ళో ఆరందినాలు ఇంటిపనులు జూసుకొని... రాళ్ళు రప్పలేర్తా మనుకున్నరు.

మాయింట్ల తిండిగాసమై పోయింది. సేసేటందుకు బయట కైకిల పనులేమి లేవు. మా అవ్వ దంచబొయి ఇసురబొయి దెచ్చింది మా యిద్దరికి బెడ్తంది. అంబలి బుఱ్ఱలు తెచ్చుకుంటలేరు. ఆకలి కడుపులతోని పన్జేసి పగటించి నీళ్ళుదాగి సెట్ల నీడలకు ఈడ్సుకపోయే డొక్కలతోని కాసేపు ఒరిగేటోల్లు... అప్పుడప్పుడు బూమి పంచుకోవటం గురించి ముచ్చెట్లు. కాసేపు కుక్కల తీర్గ ఒఱ్ఱి మళ్ళా పనే.......

గిసొంటి యేల్లల తిండితిప్పల్లకోసం ఆరం దినాలు ఏదన్న జేసి మళ్ళ గీ పని మొదలుబెడుదా మనుకున్నరు.

ఆడోల్లు ఆదినం కంపకుప్పలకు అగ్గిబెట్టిండ్లు... బగబగ మండే ఎండల సిలపట మంటలు... అందరు మంటల సూసుకుంట నిలుసున్నరు. కట్టదనుక మైదానం.......


www.eTelangana.org

అగో గసొంటి యేల్లల ఓ పచ్చ మోటరచ్చింది. మోటర్లనుంచి సైకిదారు పడదునికిండు. నల్లంగ సగంగాలిన తునికిమొద్దు తీరుగున్నడు. మొండి లాగేసుకున్నడు. అతనెనుక మరో యిద్దరు. మరికొంతసేపటికి సెట్లల్లనుంచి సానామంది కాకిబట్టల పోలీసోలచ్చిండ్లు.

మాట ముచ్చెట లేకుంటనే ఎర్రిలేసిన కుక్కలతీర్గ మామీ దెగబడి దుడ్లతోని కొట్టబట్టిండ్లు... మావోల్లు ఊరు కగ్గి దల్గినట్టు బెదిరిపోయిండ్లు... ఎవడో "దొరే మాకీ పని చెప్పిండని" మొత్తుకున్నడు. గ మాటెవడినలేదు. పెడబొబ్బలు, ఏడుపులు, మొత్తుకోల్లు, పోలీసోల్ల జంగలాతోల్ల తిట్లు.

అందరిని అట్ల కొట్టుకుంటనే మందజేసి గొడ్ల తీర్గగ కొట్టుకుంట అడివిల నుంచి నడిపిచ్చిండ్లు... బండ్లబాటకాడ రెండు పాలపిట్టరంగు పెద్ద మోటర్లాగున్నయి. సొడసొడ నెత్తుర్లు గారంక మొగోల్లందరిని ఆటి మీది కెక్కిచ్చిండ్లు...

ఆడోల్ల సీరెలు చింపిండ్లు, రయికెలు సింపిండ్లు. బయంతోటి ఉరికెటోల్ల కిందబడేసి కొట్టరాని జాగలల్ల కొట్టిండ్లు.

నేను ఎటుతోసక ఉరుకురికి కిందబడ్డ... నా అరిసేతులమీద ఒకడు బూటు కాలుతోని తొక్కిండు. నా ఈపుల పెడీలన గొట్టిండు.......బండేదన్న దొరుకుద్దేమొనని పునికిన... కోపమాపక.........

మరి కూసేపటికి ఆడోల్లను పొల్లగండ్లను అన్నే ఇడిసిపెట్టి మొగోల్లను మోటర్ల మీదెక్కిచ్చుక పోయిండ్లు.

ఏడ్సుకుంట, మొత్తుకుంట సీకటయేటాల్లకు మేమంత ఊళ్ళె కచ్చినం.

గ నాత్రి ఊళ్ళె ఎవలు కంటిమీద రెప్పెయ్యలేదు.

ఆశాలు తాత మా యింటికచ్చిండు. మా అవ్వ తాతమీద బడేడ్సింది.

"నేనప్పుడే అనుకున్న దొరోడు గాలానికి ఎర్ర గుచ్చిండని... గ ఎర్ర బూమి... ఆకలిమీనున్నోల్లు లటుక్కున మింగిండ్లు... ఆ లం...కొడుక్కే ఏడి బూములు సాలక ఎటొక్కనిది గుటుక్కుమనుకుంట మింగుతండు - ఆడు గరీబోల్లకు బూమెందుకు సూపెడుతడు? మా గంగనితోని గదే సెప్పుతె ఇన్నడా? ఊబిల దిగబడ్డడు. పోలీసోని సేతుల బడ్డడంటె ఎముల సేతుల బడ్డట్టే."

ఆశాలు తాత పెండ్లాం భూమవ్వ "కచ్చీర్ల బడ్డరంటె నామర్ద గాదా?" అన్నది....

"ద్దుత్తెరి నామర్దా! ఎవడు సెప్పిండే! బిడ్డా! నాకైతే అడ్లు బెరుగు గల్పినట్టుగనే ఉన్నది" ఆశాలు తాత.

"కొడుకో కొడుక!" ముసల్ది శోకం బెట్టింది.....

"ఊకోయే......." తాత కసురుకున్నడు.



"ఏం జేత్తాం పెదనాయినా!" మా అవ్వ.

"నాకు తోసి సత్తందా?"

"గ గౌరయ్య దగ్గరికి బోతె. ఏమన్న ఉపాయం సెప్పుతడేమొ?"

"ఇండ్లు గాలబెట్టి పేలాలేరుక బుక్కేరకం. ఆడు కిసకిస నవ్వుతడు. సరే బిడ్డా! ఏ పుట్టల ఏ పామున్నదో నువ్వు నా ఎంట రారాదు.........నువ్వెందుకులే....." ఆశాలుతాత లేచిపోయిండు. భూమవ్వ ఏడ్సుకుంట బోయింది.

నాకా నాత్రి నిదురబట్టలేదు. కండ్లుమూసినా తెరిసినా మంటలే కన్పడ్తన్నయి. నా ముంగట పోలీసు లురుకుతండ్లు... మా నాయిన్న మంటలల్ల సిక్కుబడిపోయిండు. ఎటూ దోయక మొత్తుకుంటండు. అప్పటికి నాత్రి ఎంతయ్యిందో?

ఆశాలు తాత మళ్ళచ్చిండు. "బిడ్డా! రేపొద్దుగాల పెద్దొర దగ్గెరికి పోదామన్నడు. ఎందుకైన మంచిదే... అందరం బోదాం... మూలకం జేసింది ఆడేగదా! ఇప్పటికైతె దెబ్బలు బడ్డది మనోల్లు, కట్టె కొంటబోయింది దొర. ఉత్తబొక్కలకు కోంద్రిగాడు దెబ్బలు పడ్డట్టున్నది పనివరుస..." గిట్ల సానాసేపు చెప్పిండు.

ఆశాలు తాతెప్పుడు బోయిండో... గ నాత్రంత మా అవ్వ కండ్లపొంట నీల్లు గార్తనే ఉన్నయి. నా కండ్లల్ల మంటలు మండుతనే ఉన్నయి.

✳

తెల్లారింది. ఊరు ఊరంత దొంగలు దోసినట్టుగున్నది. బొమ్మల తీర్గ ఊళ్ళె మనుషులు తిరుగుతండ్లు... ఎవలో పక్కన నవ్వరు... మాట్లాడరు. ఏం జేయాన్నో ఎవరికి తోసి సావదు. అంబటేల్లయేటాల్లకు ఏపసెట్టుకింద కుప్పకూడిండ్లు... గౌరయ్య ఏపసెట్టుకు ఈపానిచ్చి నిలుసుండి ఏందో సెప్పుతండు. పాపరాజు రానేలేదు. పోశాలు, రాజీరు ఇద్దరు సుత సెప్పిందే సెప్పిండ్లు...

ఎవలు మాట్లాడిన మావోళ్ళను తిడుతండ్లే గని... ఎట్ల బయటబడుతరో సెప్పరు. బువ్వలు దినే యాల్లదాకా కిందమీద మాటలు సాగినయ్. సిట్టసివరకు తేలిందేందంటే అంతా కలిసి పెద్దొర దగ్గెరికి పోవటం.

"గులాపు లం....కొడుకులు పురుగు బుసి దిని పుట్టలుంటరా? ఏదో ఒకటి సేసుకచ్చి మానెత్తిన బెడ్తరు" రాజీరు గులిగిండు. అయినె నల్లటి మొకం ముడుసుకపోయి ఇంకింత నల్లగైంది.

మొదుగాలు ఊరి పెద్దలని... అయింక అందరని తేల్సిండ్లు...

పగటేల్లవరకు ఊరి పెద్దలు సవారిబండిల... ఊళ్ళె ఇంక మిగిలిన మొగోల్లు కాలినడకన పెద్దొర దగ్గెరికి బోయిండ్లు.

వాళ్ళటు పోంగనే ఆడోల్లు శోకాలు దీసిండ్లు...


www.eTelangana.org

గట్టుమల్లు ముసల్ది అందరిని దిట్టింది.

"సాలుసాలు సోకాలు.......అచ్చిన కర్మం సచ్చిన దప్పడట... మనం కూర బువ్వండు కున్నట్టుగనే బూములత్తయా? గట్ల నిచ్చంగనే అచ్చేటియైతే గయి మనదాక ఏడ రానిత్తరు. దొరోడు ఆని బంట్లే నాలికకు రాసుకుంటరు. ఎన్ని తన్నులు దింటే బూములు దక్కాలె... నిన్ననంగ బోయిండ్లు... సర్కారోల్లు మనోళ్ళకు కూడనేరా? కుమ్మనేరా? పోలీసోనికి మందాకలేమెరుక? ఇంటన్నారే సద్దులు గట్టుక పోదాం" బాలవ్వ సలా జెప్పింది.

అందరు "ఔ" నంటే "ఔ" అన్నరు. నేను మా అవ్వెంట నడిసి బత్తిల పోలీసు ఠానాకు సేరుకున్న. మేము బోయేటాల్లకు పొద్దంగింది. తుపాకులు సేతుల్ల బట్టుకొని ఇద్దరు పోలీసోల్లు ఎదురుంగ నిలుసున్నరు. అందట్ల ఒకరు సన్నం గున్నడు. ఆడు మమ్ముల జూసి "మీ అవ్వల మిండెల సొమ్మనుకున్నరా అడివి? మా నెత్తిమీది కచ్చింది. నిన్నటినుంచి ఈడ సస్తున్నం."

బాలవ్వ కొంచెం ముంగటికి జరిగి బతిలాడింది.

"నామీద మొగడున్నడే... మొగడు" వాడు మీది మీది కచ్చిండు.

కొద్దిగ లొల్లయ్యింది. గ సప్పుడుకు లోపటినుంచి మీసాలు అడి దిప్పిన పొడుగు లాగోడచ్చిండు.......ఆని కడుపు ముంగటికి ఇకారంగ పొడుసుకచ్చున్నది... కాళ్లు సేతులు మాత్రం ఆ సెత్తయి గానట్టు ఎవరియో తలగబెట్టుకున్నట్టున్నయి. ఆడు గుడ్లు మిటకరిచ్చి మా కెళ్ళి సూసిండు. అప్పటికప్పుడే ఆని మొకంల కోపం బుసబుస పొంగింది.

"ఏం చూస్తున్నావ్ బే! వాళ్ళను తరుము... బి క్విక్... ఇక్కడ ఒక్క పురుగు గనిపిస్తె నిన్ను సస్పెండు జేస్త" తిట్టిండు.

బక్క పోలీసోడు మమ్ముల గొడ్లను అదిలిత్తన్నట్టు అదిలిచ్చుకుంట, తిట్టుకుంట తాపతాపకు ఎనుకకు దిరిగి పొడుగు లాగోన్ని సూడబట్టిండు.......

మావోళ్ళు కోటి మొక్కులు మొక్కినా ఆడు ఆగలేదు. ఎంతకూ కదలక పోయెటాల్లకు తుపాకి మడుముతోని గుద్దచ్చిండు. నేను బయపడి కుడిసేతి దిక్కు ఉరికిన.

ఆడ ఇనుప సలాకలెనుక మావోల్లంత నిలుసుండి సూత్తండ్లు. మానాయిన కోసం ఎతికిన. మా నాయన్న తలకాయ కనిపిచ్చింది. చెయ్యెత్తి ఏదో సైగజేత్తండు. నేను సెయ్యూపిన. ఇంతట్లకే నా ఎనుకనుంచి పోలీసోడచ్చి ఈపుల గుద్దిండు. పడబోయి తమాయించుకొని ఆడోల్ల దిక్కురికిన.

సద్దులు అట్లనే ఉన్నయి. మీదికెళ్ళి దెబ్బలుతిని మళ్ళ మావూరి కెళ్ళి నడిసిండ్లు... మేము వూళ్లె కచ్చెటాల్లకు దీపాలు ముట్టిచ్చిండ్లు. ఏడనో ఆవు ఒర్రుతంది.



మా అవ్వ దీపం ముట్టియ్యకుంటనే పందిరి కింద కూలబడి పోయింది. నాకు ఆకలైతంది. సర్దిప్పుకొని తినమని సైగజేసింది. నేను సద్ది మూటిప్పుకునేటాల్లకు ఆశాలు తాతచ్చిండు.

తాత గడంచల కూకుండి తలగోక్కున్నడు. ఆ సీకట్ల తాత కండ్లు మెరుత్తన్నయి.

"ఏం జెప్పాలె బిడ్డా! నిండ ముంచిండు........ఆడు పులే... మళ్ళ గట్ల దెలిసి సుత గ పులినే ఆవులు నమ్ముతయి. ఎనకాముందు ఇసారం జెయ్యకుంట ఉరికిరి. ఒకడు బోయిండని ఇంకోడు. గిప్పుడు ఆడేమంటండు. ఎవారం సేతులు దాటి పోయిందట... పోలీసోల్లు పదో పరుకో తీసుకోకుంట ఇడిసిపెట్టరట... 'కట్టె తమరే దీసుకుంటిరిగదా! గ కర్సు తమరే బెట్టాలె' నందామనుకున్న...! గౌరిగాడు మాట సొర్రనిత్తెగద. ఆడికి తన మాతెపరుల కేసుగనుక ఇంటరట లేపోతే" ఆశాలు తాత ఆగి కాండ్రకిచ్చి ఊంచిండు.

మా అవ్వ సప్పుడు జెయ్యలేదు.

"బిడ్డా నీ దగ్గెర ఏమన్న పైకమున్నదా? ఇంటికి నూర్రూపాలు గావాల్నట. నేనైతె లేగ బొక్కు నమ్మిన. సావంగ మిగిలినోడు గ గుండడొక్కడేగద... గాడే బోయినంక గీ లేగలు గొడ్లు ఉండేం జేత్తయి."

అయినా మా అవ్వ మాట్లాడలే... తిండేసే బదల్ల మీన నడుత్తందని ఎట్ల సెప్పుద్ది? మరికాసేపుండి తాత ఎల్లిపోయిండు.

గ నాత్రంత మా అవ్వ ఏడుత్తనే ఉన్నది.

తెల్లారి ఎడ్లిడుసుకొని ఆక్కు గొట్టుకపోయిన... ఇంటికత్తె ఏం ఇనాల్సోనని అన్నె మడుగుల ఈతగొట్టుకుంటన్న. గప్పుడే నారిగాడచ్చిండు. ఆడుమూడు దినాలనుంచి ఏం దినలేదట... ఆని కడుపు ఈడ్సుకపోతంది......ఆని సేతుల గాలమున్నది. ఎడంసేతుల తుంగపోస, దానికి నాలుగు జెల్లలు. నాకుసుత ఆకలైతంది.

"ఇయ్యాల్ల సాపలు సుత బడ్తలెవ్."

"తుంగగడ్డల కింద పొక్కల్ల మాలపంకిడు గాళుంటయి. నువ్వురా పడుదాం."

"పొక్కల్ల గోండ్రికప్పలు, నీరికట్టెలు, ఎండ్రికిచ్చలుంటయి. నాకు బయం."

అయ్యంటె నాకు సుత బయమే... మరి ఆకలో? "గయ్యేం జేత్తయి... నేనున్నరా!"అన్న. ఆడు బయంబయంగనే నీళ్ళల్లకు దిగిండు. తుంగగడ్డల కింద ఎతికినం...సేపలు బాగనే దొరుకుతన్నయి. ఇగ సాలనుకునేటాల్లకు నా సేతికి గురుకుగ ఏందో సుట్టుకున్నది. సెయ్యి బయటికి గుంజిన. నీరికట్టెపాము.......కేకలు బెట్టుకుంట మడుగంత ఎగిరిన... ముంజేతిమీద సానా జాగల్ల కరిసింది. అది కరిసిన జాగల్ల బగబగ మంట... నీరికట్టె కరిత్తె ఏం గాదని బయ్యక్క సెప్పింది.


www.eTelangana.org

నారిగాడు సాకిరేవుల కాన్నుంచి అగ్గి దెచ్చిండు......ఎండుసెవుకాయ పుల్లలు, తంగెడుపుల్లలు కుప్పేసి సేపలు గాల్సుకొని ఊదుకుంట దిన్నం. పొద్దుగూకే యాల్లకు ఇంటికచ్చిన. మా అవ్వ గడుకరాయి విసురుతంది.

నేను బితుకుబితుకు మనుకుంట ఓ మూలకు కూకున్న మా అవ్వను సూసిన. మా అవ్వ మెడల నల్లపూసల పుత్తెల తాడు లేదు. పసుపుదారమున్నది.

"అవ్వా! అవ్వా!" నేను ఏందో అందామనుకునేటాల్లకే కొంగుదీసి కప్పుకున్నది.

ఆ దినం ఎంతో నాత్రయ్యేదనుక మా అవ్వ దారులు సూసుకుంట ఇంట్లకు బయటికి దిరిగింది. నన్ను "మీ నాయిన్నత్తండేమొ గట్ల బొయి సూసన్నరాపో" అని తరిమేది. నేను మూడు పానాదుల కాడికురికి సూసిన.

గుడ్డి బొందిగాడు సింత మొదట్ల కూకుండి ఏదో పదం బాడ్తుండు. నేను ఆని దగ్గెరికి బొయిన.

"ఎవలూ రామయ్యా!" ఆడు నా అడుగుల సప్పుడు గురుతుబట్టిండు.

"మీయిట్ల ఇయ్యాల్ల బువ్వండుకున్నరా! ఇయ్యాల్ల ఎవలు బుక్కెడు కూడెయ్యలే."

నేను ఏది సెప్పకుంటనే మా యింటి కురికచ్చిన.

నేను ఇట్లచ్చిన్నో లేదో 'కములా!" అన్న పిలుపు ఇనచ్చింది. మా అవ్వ దిగ్గున లేసి ఆకిట్ల కురికచ్చింది. అప్పటికే నేను మా నాయిన కుడి సెయ్యి బట్టుకున్న.

ఆదినం మా అవ్వ సంబురాని కంతులేదు. మా నాయిన అవురావురమనుకుంట బువ్వ దిన్నంక...

"దొరోడు కట్టె నమ్ముకున్నడట... ఏల రూపాలచ్చినయట... అవుగని పైకమేడ దెచ్చినవే?"

మా అవ్వ మాట్లాడలే... దీపం ఎలుగుల మా నాయిన పసుపు దాడుసూడనే సూసిండు.

"నన్నేం కోసుకతిందురా! వానవ్వలకు.......తోడుదొంగలు మా అంటె జేలుకు బోదు. బేకారు పన్జేసినవే కములా! బతుకవ్వ గీ బతుకుల సీరెపేగు సుత సరీగ కొనలేకపోతన్న... ఒక్కొక్కటి మీ తల్లిగారి సొమ్ము ఒలుసుక తింటన్న గదనే........"

"మనిషే పొంగ... సొమ్మేం జేత్తది?"

నాకు అడివిల బూమి యాదికచ్చింది......సెట్లు, కొండలు, ఆగు.....ఎప్పుడో నిద్రబట్టింది.....కలలు..........

✧



# 24

పిండార బోసినట్టుగ తెల్లగ ఎన్నీల........గ ఎన్నీల ఎలుగుల పాతదినాల గురుతు దెచ్చుకుంట నడుత్తన్న...... నా పక్కన గంగన్న నడుత్తండు.......మా వూరి సంగతులు సెప్పుకత్తండు.......

"నిచ్చానికి గ నూరెకురాల బూమికోసం పడరాని పాట్లు బడ్డరు. పొయిన నాలుగేండ్లబట్టి మూడేండ్లు రెక్కల కట్టందప్ప పంట దక్కనేలేదు. మొదటేడు దున్నిదోకి నువ్వులు జల్లినంక పంట నాదని దొరోడు తన మనుషుల దీస్కచ్చి పొట్టుపొట్టు గొట్టి పంట మెలుక్కపోయిండు. అదేయేడు మేం మీ ఎంటుంటమని కాంగిరేసోల్లచ్చిండ్లు. ఓట్ల దినాలల్ల బుదుర కిచ్చిండ్లు... ఓట్లు బడ్డయి. పంట సేతికచ్చేటాల్లకు జాడప త్తాలేరు...... మిగిలింది తన్నులు గుద్దులు. రెండో యేడు సోసలిట్టులచ్చి పాటలుబాడి తీరా యేల్లచ్చేటాల్లకు ఆళ్ళు గన్పియ్యలే.....మూడోయేడు తెల్ల కమ్యునిస్టులు....... ఇంటికి నూరు జమజేసి పట్టాలు దెత్తమన్నరు.. ఆళ్లు గంతే సేసిండ్లు......... ఇయ్యేడు మనం..... పంటకాడుండి దొరమనుషుల తరిమికొట్టినం........ గిప్పుడు మనకు మంచి బలమున్న దా వూళ్ళే" గిట్ల సెప్పుకచ్చిండు.

నాకు గీ మాటలు సెవి కెక్కుతలేవు. ఊరు పొలిమేర దొక్కేటాల్లకు నా నెత్తురు పొటెక్కింది. గీ సేండ్లు, గీ ఆగు, గీ మన్ను నాది...... గీ మట్టిల ఎన్నో ఎదురుదెబ్బలు దిన్న.......

ఊళ్ళె జొచ్చినం......... కుక్కలు మొరుగబట్టినయి. ఊరులుకు మగ్గిపోయింది. మా యిల్లచ్చేటాల్లకు టక్కున అగిపోయిన....... సింతకింది సీకట్ల ఆడో గుడిసె ఉండెననేటందుకు దాఖలగ మొండిగోడలున్నయి. నేను అనికే కాళ్ళతోటి సింతకిందికి నడిసిన.........

గీడనే.......... గీ సింతకిందనే మా అవ్వ సచ్చిపోయింది. మా అన్న బతుకుమీన రోతబుట్టి దెంకపోయిండు. నేను ఒకప్పుడు...సింతబొర్రెల పైడికంటె అరిసింది....

"తెల్లారిపోతంది. తెల్లారక ముందు ఈడినుంచి బోవాలె" గంగన్న.

సప్పుడు సెయ్యకుంట గంగన్నెంట నడిసిన... మూడు పానాదులు నా వొళ్ళు ఝుల్లుమన్నది. నాకు తెలువకుంటనే నా పిడికిల్లు బిగుసుకున్నయి. నన్ను తరిమేసిన పసురాలు ఇంక బతికే ఉన్నయి.

ఎడందిక్కు తిరిగినం. ఓ యింటి ముంగట నిలుసున్నం......

గంగన్న తలుపు గొట్టిండు. కొంతసేపటికి తలుపు తెరుసుకున్నది. ఎంకటయ్య కండ్లు నలుసుకుంట తలుపుదీసి గంగన్నను గురుతుబట్టి సలామ్ జెప్పిండు.


www.eTelangana.org

ఇద్దరం ఇంట్లకు నడిసినం. దీపం ముట్టిచ్చి గప్పుడు నన్ను జూసిండు. అప్పటికే కములమ్మ లేసికూకున్నది. నన్నుసూసి ఇద్దరికి మాటలు రానేలేదు.

ఆయింక గంగన్న వెంకటయ్య గుడిసె బయటకు పోయిండ్లు...

"బిడ్డా! నువ్వేనా! నా తల్లీ ఎంత మారిపోయినవ్.....తమ్ముడు సెప్పుతే నేను నమ్మలే" నా పెయ్యంత పునికి సూసి సంబురం ఆపుకోక ఏడ్సింది.

కములమ్మ ఊళ్ళె సంగతులు సెప్పుకచ్చింది.

"గౌరిగాడు సచ్చిండు. పాపపు సావు. పచ్చవాతమచ్చింది. ఆని కొడుకులు కోడండ్లు సావుదలకు మంచినీల్లన్న ఇయ్యలేదు. మొగిలిగాడు ఊరిడిసి అత్తగారింటికి బోయిండు. కోముటోడు ఇంటికి తాళమేసి బత్తిలకు బోయిండు" గిట్ల...

ఆయింక ఆశాలుతాత, నాకు బతకజెప్పిన శాయన్న మరికొంతమందచ్చిండ్లు.

వాళ్ళందరితోటి మాట్లాడిన...

"గిది మన ఊరికొక్కదాని సంగతికాదు. మన దేశంల మన ఊరు ఏరేలేదు... పెద్దొర జేసే టక్కుటమారాలు ఇంకా సేత్తనే ఉన్నడు. పోలీసోల్ల బెట్టుకొని ఎప్పటికైనా మునుపటి తీర్గ సాగిచ్చుకుంటనని కలలు కంటండు... ఏపల్లె జూసిన గిట్లనే ఉన్నది. దొరను ఎలేసి అన్ని పనులు బందుబెట్టంగనే అయిపోలేదు. ఆడున్నంత కాలం ఏదో ఉపాయంతోని మనమీదికి ఎక్కి సవారి జెయ్యాన్నని సూత్తంటడు. వానెనుక సర్కారు పోలీసుల బలగమున్నది. మనం మన రెక్కలతోని ఆని బలగాల కెదురు నిలిసినం.... మన కట్టాలన్ని బోవాల్నంటే దొరోని బూములన్ని మనకు రావాలె... దున్నెటోనికి బూమిగావాలె... గందుకోసం కట్టమైన, నిట్టూరమైన గీ లఢాయి జెయ్యాలె."

ఆయింక వెంకటయ్య మావూళ్లె సంగం పనులు గురించి చెప్పుకచ్చిండు.

తొలికోడి గూసింది. అందరికి సెప్పి గంగన్న నేను బయటబడ్డం.

✧

## 25

దాదాపుగా మేం పనిజేత్తన్న ఊళ్ళన్ని పోలీసులతోని నిండిపోయినయ్... దినాం రైతులు జేల్లకు బోతనే ఉన్నరు.... ఉన్నోల్లు బజాట్లల్ల కచ్చి అరుత్తనే ఉన్నరు...... మేం ఇంతకుముందు తీర్గ తిరిగేటట్టు లేదు...... మనుషులు ఇసారాలు జేత్తండ్లు......

సరిగ్గా అసొంటి గడ్డుదినాలల్ల నేను కూకుండి జిల్లాకు ఈ సంగతులన్ని రాత్తన్న.......గంగన్నచ్చిండు.



బాగా అలిసిపోయున్నడు. మొకంల సెప్పరానంత దిగులు... గంగన్నను ఇంతకుముందు ఎప్పుడు అట్లా సూళ్ళేదు.......

నేను కాయిదాలు మలుసుకుంట "దివాళదీసిన షావుకారి మొకం బెట్టుకచ్చిన వేంది కామ్రేడు" అన్న సిన్నంగ నవ్వుకుంట...

గంగన్న నవ్వలే... కాసేపు కాయిదాలను నన్ను మార్సిమార్సి సూసుకుంట కూకున్నడు. దోసనోనితీర్గ నెత్తి బరబర గోక్కున్నడు. అధాతుగా లేసి నిలుసుండి...

"రామయ్యను పోలీసోల్లు......"

పిడుగు బడ్డది. నాసేతుల్ల కాయిదాలు కిందబడ్డయి. బూమి సెరసెర సెక్కలైతన్నట్లు... మొగులు ఇరిగి నామీద బడ్డట్టు లొల్లి .......గంగన్న సెప్పేదేది ఇనిపించలే...........

"పికిలి... నా తండ్రీ! పికిలీ నా కొడుకా! పికిలీ నా కామ్రేడా! నువ్వు... నువ్వు నీ నులివెచ్చని నెత్తురిచ్చినవా?" నా నాభి పెకిలిపోయేటట్టు ఏడ్సిన.....

ఆ దినమంత పిచ్చిలేసినట్టు కలువరిత్తనే ఉన్న.........

✧

## 26

నెలదనుక నా కాళ్ళు సేతులాడనేలేదు... పికిలితో నేను గడిపిన బతుకు నన్ను ఎంటాడేది? కాసేపు గిది అవద్దమేమొ అనుకునేదాన్ని. నడిఝాము నాత్రిలేసి పిచ్చి లేసినదాని తీర్గ తెల్లటి గోడలమీన నా నెత్తురులో ముంచి రాసినట్టుగా జాజుతోని "రామయ్య అమర్ హై" అని రాసేదాన్ని...

కంక పొదల్ల తిరిగేటప్పుడు... గంగ ఒడ్లమీద నిలుసున్నప్పుడు..... నీల్ల గలగల ల్లల్ల ..... అడివి జంతువుల మజ్జెన ..... కట్టుకోను బట్టల్లేని అడివిల మనుషులల్ల అంతట ఎతికిన.....

నెలదినాలు అందరిని తప్పిచ్చుక తిరిగిన .....

నేను ఎంకటయ్యకు ఏమని చెప్పాలె ..... కుప్పతీర్గ కూలిపోయిన కములవ్వ సిన్ని ఏడుపు నెట్లా ఓదార్సాలె?

ఏదేమైన ఆళ్ళను కలువాలెననుకున్న.


www.eTelangana.org

నడిర్ఘూము నాత్రి అడుగుల సప్పుడు కాకుంట ఎంకటయ్య వాళ్ల ఆకిట్ల నిలుసున్న. నా నోరు పడిపోయినట్టున్నది.

ఆకిట్ల గడంచల ముడుసుక కూకున్నరెవలో!

నేను సానాసేపు అట్ల నిలుసున్న. గడంచలున్నది ఎంకటయ్య.

"ఎవరదీ?" అన్నడు

"నేనే" అన్న తడబడుకుంట.

"కములా! నీ బిడ్డచ్చింది....బయ్యచ్చింది."

కములవ్వ సిన్ని బయటికచ్చి నన్ను సుట్టుకొని "తమ్మున్నేడికి దోలినవ్ బిడ్డా! మీరందరుండంగ తమ్ముడేడ బోయిండు బయ్యవ్వా? ఆడుకుందవు రార రామయ్య! అక్కచ్చింది రారా కొడుకా!" మనిషంతా ఊగిపోవుకుంట ఏడ్సింది.

సుట్టుపక్కలోల్లచ్చిండ్లు.......

"గిన్ని దినాలు నువ్వెందుకు రాలేదో నా కెరికే" ఎంకటయ్య.

అచ్చినోల్లు ఏడ్వబట్టిండ్లు.....

ఎంకటయ్య పూనుక మచ్చినోని తీర్గ అన్నడు....

> "ఎందుకేడుత్తరే.....మనం బతుకచ్చినమా? నా కొడుకు సీమతీర్గ దోమతీర్గ సావలేదు. మందిని ముంచి పాపపు సావు సావలే ..... ఈరునితీర్గ బతికిండు..... ఈరుని తీర్గనే బోయిండు. బిడ్డా బయ్యవ్వ! నా కొడుకును మీ సేతుల బెట్టిన..... ఎందుకోసమోంట! గీ ఏడుపులు తూడుపులు..... గీ బద్దుమాసి బతుకులు, బాంచె బతుకులు, లంగరాజ్జెం, లపంగ రాజ్జెం ఉండద్దని. నేను బతికుండంగ మీరేదైతె తెత్తనన్నరో గది నా కండ్ల జూపాలె....."
>
> నేను నా కన్నీళ్ళు తుడుసుకున్న..... నా నడుముకున్న పిత్తోలుమీద నా సెయ్యి బిగుసుకున్నది.

✧



*గంగతీర్గ పారే బతుకు పోరాటంల నేనింకా పికిలి తరుపున ........ పికిలసొంటి ఎందరో నా సిన్నారి తమ్ముల తరుపున నేనింక బతికే ఉన్న........ అడివి కడుపుల పిట్టలు సెట్ల మీద, జంతువులు పొదలల్ల ఆదమరిసి నిదుర బోతన్న గీ నాత్రి నేను గిది రాత్తన్న. గీ అచ్చరాలు నా నెత్తురు పూసుకున్నయి. నాపక్క అయిదుగురు ఆదమరిసి నిదుర బోతండ్లు.*

*అందరి మొకాలమీదికి అంగి సూసిన........ ఆ కండ్లు నొసలు. ఈళ్ళంతా నా సిన్నారి పికులులే........ వీళ్ళంతా నా నెత్తురు చెలికాల్లే........*

*గీ సీకటిని సీరేసి మేమెప్పటికైనా గెలుత్తం......... మనుషులు మనుషులుగా బతికేటందుకు.....మా సివరి నెత్తురుబొట్టు కారుత్తం........*

*గీ లఢాయికోసం మా పానాలను తుపాకులల్ల దట్టిత్తన్నం ........*

*గీ నాత్రి సాక్షిగ........ ఈ చెట్ల సాక్షిగ........ గీ అడివి సాక్షిగ నేనిది రాత్తన్న........*

విప్లవం వర్ధిల్లాలె........


www.eTelangana.org

# మీ ముందు.........

ఈ అగ్నికణం నవల అరుణతార మాసపత్రికలో వస్తున్నప్పుడు చదివిన మిత్రులు........ ఈ నవల రాత ప్రతి చదివిన మిత్రులు వెలిబుచ్చిన అభిప్రాయాలు విన్న తరువాత సంజాయిషిగా కాకున్న నేను ఈ నవల యేయే ఒత్తిళ్ళమూలకంగా రాశానో చెప్పడం అవసరంగా భావించి ఈ మాటలు రాస్తున్న.....

నా బాల్యంలో కొంతభాగం మా అమ్మమ్మ పెంపకంలో గడిచింది....... మా అమ్మమ్మ *(కారుకూరి భూమమ్మ)* మా తాత *(కారుకూరి దుర్గయ్య)* చనిపోయేనాటికి అయిదుగురు ఆడపిల్లలను, ఒక మొగ పిల్లవాన్ని సాకాల్సివచ్చింది..... అంతమంది పిల్లలను సాకడానికి ఆమె ఎంతో మనోనిబ్బరంతో మొగవాళ్లు చేసే వ్యవసాయపు పనులు చేసేది....... మా అమ్మమ్మయే కాక ఆమె ఆడబిడ్డ *(కనగర్తి రామమ్మ)* కూడా ఎదిగిన కూతురును, భర్తను కోల్పోయి - దాయాదులు ఆస్థి గుంజుకోగా ఆమె మా అమ్మమ్మ దగ్గరికే వచ్చి చేరింది. మా పెద్దమ్మ *(బండి రామలచ్చుమ్మ)* ఇద్దరు కొడుకులను భర్తను పోగొట్టుకొని ఆస్థి దాయాదులు గుంజుకోగా ఇప్పటికి రోజుకూలి చేసుకుంటూ బంధువుల పంచలో బతుకుతున్నది. ఇట్లా మా చిన్నమ్మ, మా మేనత్త *(తిప్పని మీనమ్మ)* చెప్పుకుంటూపోతే నేనెరిగిన స్త్రీలంతా పుట్టెడు కష్టాలు పడుతూ... బతుకుభారం మోయలేక... సమాజంతో, పేదతనంతో సంఘర్షించారు. వీళ్ళ దుఃఖం, సంఘర్షణ ఇప్పటికి నన్ను వెంటాడుతూనే ఉన్నాయి....

నాకప్పుడు ఎంత వయసోకాని ఊహ తెలుస్తున్న వయసే... మావూళ్ళొ ఒక ఎత్తుపళ్ళ గొల్లావిడను ఒక మాలతన్ని మూడు బజార్ల దగ్గర పగ్గాలతో కట్టేశారు. పంచాయితి జరిగింది. పంచాయితి పెద్దలంతా కొట్టినా ఆ స్త్రీ తలెత్తి చూడనేలేదు. ఆ పంచాయితి ఎట్లా తీర్మానమయిందో తెలియదుగాని అప్పటినుండి ఆ ఎత్తుపళ్ళ గొల్లామె మావూళ్లో కన్పించలేదు. ఆమె భర్త భూమిని పోగొట్టుకున్నాడు. మేకలమ్ముకున్నాడు. మళ్ళీ పెళ్ళిచేసుకున్నాడు. రోగాల కుప్పయి తర్వాత అయిదారేండ్లకు చనిపోయాడు... ఇలాంటి పంచాయతులు నేను చాలా చూశాను. కాని ఆ ఎత్తుపళ్ళ గొల్లావిడ ముఖం నేనిప్పటికి మరిచిపోలేను....... ఇట్లా ఎందుకు జరుగుతున్నదో నాకు తెలిసేదికాదు........ పేదవాళ్ళ కుటుంబాలు పెద్దవాళ్ళ హింసలకు లోనుకావడం చూశాను....... పేదవాళ్ళ కుటుంబాలల్లో మళ్ళీ మొగవాళ్లు ఆడవాళ్ళను హింసలకు గురిచేయడం చూస్తేనే నాకు ఏమీ సమఝయ్యేదికాదు.......

తర్వాతి కాలంలో నాకు దొరికిన పుస్తకాలల్లో ఇలాంటి స్త్రీలకోసం వెతికాను. నూటికి తొంబయి శాతం నేను చదివిన పుస్తకాలన్నీ స్త్రీల ప్రేమల గురించే రాసి ఉండేవి....... ప్రేంచంద్ నిర్మల దగ్గరనుండి శరత్ శేషప్రశ్న కమలదాకా స్త్రీలు కష్టాలు కన్నీళ్లు అనుభవించడానికే పుట్టారనే భావన కలిగించాయి.



నేను కథలు రాయడం ప్రారంభించిన సమయంలో చాలాసార్లు నేనెరిగిన స్త్రీల గురించి రాయాలనుకున్న. కాని ఎందుచేతో నా కలం ముందుకు సాగేదికాదు. ఒకటి రెండు రాసినా నాకవేమి సంతృప్తి కలిగించలేదు.

సమాజం నాకు దాని రాక్షసత్వంతోపాటు కన్పిస్తున్నకాలంలో దాదాపు నాలుగైదు ఏండ్లకింద మర్జియా అనే ఇరాన్ గెరిల్లా 'నేను' అన్న కవిత చదివే దాకా నాకు నేనెరిగిన స్త్రీలుకూడా ఏ సామాజిక కౄరత్వం కింద అణిగిపోతున్నారో స్పష్టంగా తెలియనేలేదు. ఈ కవితను పలవరిస్తూ కలవరిస్తూ కనిపించిన వాళ్ళకల్లా చెప్పుతూ తిరిగిన. "మీ సిగ్గులేని నిఘంటువుల్లో ఏ స్త్రీనైతే గుర్తించడానికి శబ్దరాశి చాలదో లేదో ఆ స్త్రీని నేను" అని యే ఎడారిలోనుంచో పెట్టిన కేక............ 'బాధల ప్రదర్శనశాల' అన్న మాట నా మెదడంతా ఆక్రమించింది.............. ఇప్పుడు నేనేమి రాయాలో ఎట్లా రాయాలో కొంత తెలిసినట్టే కనిపించింది............... అయినా నేనెరిగిన స్త్రీలగురించి పెద్దగా ఏమి రాయలేదు.......

ఇంతలోనే 'సృజన'లో 'కన్నీటి కథ' అనే ఒకపేజీన్నర కథ చదివాను. పటార్ *(కొండమీది విశాల ప్రాంతం)* మీద బతికే ఒక గోండు నిండు చూలాలు మంచినీళ్ళకోసం పటారుమీద నాలుగు మైళ్లు నడిచి కొండదిగి కడివెడు నీళ్ళెత్తుకొని తిరుగు ప్రయాణంలో కొండమధ్యలో ఆయాసంతో కూలబడిపోతుంది. తోటి వాళ్లు వెళ్ళిపోయారు. చీకటయ్యింది. ఎలుగుబంటు ఆమె మీదపడ్డది....... ఆ స్త్రీ దానితో హోరాహోరి పోరాడి కపాలం పగులగొట్టబడి....... కడుపు చీల్చబడి ఘోరంగా చనిపోతుంది. ఈ కథ దాదాపు నన్ను పిచ్చివాన్ని చేసింది....... వీధుల్లో భర్తల వెంట సంచులు మోస్తూ, పిల్లల మోస్తూ తిరిగే ఆడవాళ్ళ వెంట్రుకలు, గుడ్డలు, శరీరం అన్నీ వికృతరూపంలో కనిపించసాగినయ్........ వీళ్ళంతా ఎలుగుబంటి వ్యవస్థచేత ఎప్పుడైనా తప్పక ఘోరంగా చంపబడుతారని ....... నా నిలువెల్లా చమటపట్టి గజగజ వనికిపోయేవాన్ని....... అలాంటి సమయంలో నన్ను తిరిగి మనిషిని చేసి 'ఎలుగుబంటి వ్యవస్థను కూకటివేళ్ళతో మనమే పెకలించివేయాలని' విప్లవోద్యమం గుర్తుచేసింది.

సరిగ్గా అలాంటి సమయంలో నావంతు కర్తవ్యంగా నేనీ నవల రాయాలనుకున్న....... నా జీవితంలో తారసపడ్డ మా అమ్మమ్మ దగ్గరినుండి మా అక్క మర్జియాదాకా నాముందు నిలుచున్నారు....... ఆ ఉద్వేగాన్నంతా రికార్డు చేయాలనుకున్న ....... భూస్వామ్య రాక్షసత్వాన్ని గుడ్డేలుగు స్వభావాన్ని స్వరూపాన్ని చిత్రించాలంటే ఈ పాత్రలేవి సరిపోలేదు.

అప్పుడు శరత్ కమలగాని, ప్రేంచంద్ నిర్మలగాని గుర్తుకురాలేదు. గోర్కీ 'బురదలో స్త్రీ' గుర్తొచ్చింది....... ఈ కథనుండి నేను అర్థం చేసుకున్నది - ఏమూల్యాన్నైనా చెల్లించి తన తప్పకాళ్ళ కొడుక్కు పిడికెడు సంతోషం ఇవ్వాలనే తల్లి వాంఛ....... కాని నాకిప్పటికి అర్థంకానిది ఆకథ గుర్తుకువస్తే కడుపుదేవడం....... ఆ పాత్ర రష్యన్ స్త్రీ దైన్యానికి కొండగుర్తు. ఇలాంటి పాత్ర అయితే తప్ప భూస్వామ్య కౄరత్వం సరిగ్గా


www.eTelangana.org

చిత్రించలేనని అనిపించింది....... సంచార తెగలోని *(పేరు గుర్తుకురావడం లేదు)* స్త్రీ చలాకితనం చెలకాష్ కథలో గోర్కిలాగా చిత్రిస్తే బావుంటుందనిపించింది........

చిత్రంగా అప్పుడు అందరిలాగే నేను అసహ్యించుకున్న నా బయ్యక్క నాముందు నిలిచింది....... ఈ బయ్యక్క దుఃఖం తిరుగుబాటు నాకు కొత్తగా అర్థమయ్యాయి........

ఏకబిగిన గ్రామంలో బయ్యక్క బతికిన బతుకు వారం రోజుల్లో రాసేసిన తరువాత నాకు చాలా సందేహాలు వచ్చాయి. పోయి పోయి నేనీ బయ్యక్క గురించి రాస్తే ఈ పాత్రమీద చదివినవాళ్ళకు ఎలాంటి అభిప్రాయాలు ఏర్పడుతాయి? ఇప్పటికే లైంగిక విషయాలు రాసి రాసి సాహిత్యం చండాలంగా తయారయ్యింది. నేను అదే విషయం రాయడం యే ప్రయోజనాన్ని ఆశించి అయినా పాఠకుల్లో ఎలాంటి ఆలోచనలకు దారితీస్తుంది? ఇట్లాగ చాలా ప్రశ్నలతో నవల ఆగిపోయింది.......

బొగ్గుగనుల ప్రాంతంలో రాజేశ్వరి అనే పేదస్త్రీ హత్యతో చెలరేగి, ఆ హత్యకు కారణమైన వాడిఇంటి తలుపులు కిటికీలు పగులగొట్టి, గనుల ప్రాంతంలో అనేక గూండా చర్యలతో విసిగిపోయిన స్త్రీలు తమ ఆగ్రహాన్ని తెలిపారు.ఈ గడబిడల మధ్య నేను రెండు మూడు నెలలు మళ్ళీ బయ్యక్కను మరిచేపోయిన. ఆ తరువాత గనుల ప్రాంతంలో లేదా పారిశ్రామిక ప్రాంతాలల్లో స్త్రీల స్థితిగతులు పోరాటంకూడా బయ్యక్క ద్వారానే చిత్రించుదామనుకొని మళ్ళీ రచన మొదలుపెట్టిన ....... తీరా నేనిది రాసేనాటికి రైతాంగ పోరాటాలు ఉధృతమయ్యాయి. కరీంనగర్ జిల్లా పెద్దపల్లి తాలూకా పాల్తెం ప్రాంతంలో భూస్వాములును రైతులు కొండమీదికి ఎత్తుకపోయి బంధించారనే నెపంతో దాదాపు 50 గ్రామాలమీద పోలీసులు దాడులుచేశారు....... ఆ తరువాత వివిధ పోరాటాలు దొరల సాంఘిక బహిష్కారందాకా ఎదిగాయి.

ఈ ఘటనలన్నిటికి రచయితగా నేను బాగా కదిలిపోయాను........బయ్యక్క గురించి రాయడంకన్నా ఈ రైతాంగ పోరాటాలే రాయడం ముఖ్యంగా కనిపించాయి. 'అగ్నికణం' *(ఇంకా ప్రచురింపబడలేదు)* నవల రాశాను. అట్లా కొన్ని కథలు 'ఊరు' నవల రాసేదాకా నాకు మళ్ళీ బయ్యక్క గురించి ఆలోచించే తీరిక పడలేదు.......

మళ్ళీ నేను నవల రాసేనాటికి బొగ్గుగనుల్లో చాలా పోరాటాలు జరిగాయి......... కనుక నేను మొదట అనుకున్న ప్రకారంగా బయ్యక్క పాత్రద్వారా కాకుండా మరికొంత నా అనుభవం, అధ్యయనం పెంచి కార్మికుల గురించి విడిగా రాయాలనుకొని అప్పటిదాకా రాసినదాన్ని అట్లాగే ఉంచాను. అట్లా బయ్యక్క జీవితంలోని రెండో మలుపు అసమగ్రంగానే చిత్రించబడింది....

ఈలోగా భూస్వామ్య వ్యతిరేక పోరాటాలల్లో స్త్రీలు ముందునిలిచారు. అవసరమైనచోట రోకలిదుడ్లు, కారంపొడి ఆయుధాలుచేసుకొని *(రామయ్యపల్లె లాంటి చోట్ల)* పోలీసుల తుపాకుల కెదురునిలిచి పోరాడారు. చరిత్రలో తుపాకి పట్టి పోరాటం



చేసి స్త్రీలెందరో ఉన్నారు........ బయ్యక్క విముక్తి కూడా ప్రజల అంతిమ విముక్తితోనే ముడిపడివున్నది అనే విషయం నా మనసులో మెదులుతుండగా నవల పూర్తి చేశాను.........

భూస్వామ్య క్రూరత్వం గ్రామాలల్లో ఎన్నెన్ని రకాలుగా స్త్రీలను గాయపరుస్తుందో దానికి బయ్యక్క నిదర్శనం. భూస్వామ్యం ఎలుగుబంటు తను వేటాడదలిచిన మనిషిని ఒంటరిగా చేసి పకడ్బందీగా వేటాడుతుంది. మొదట ఆ మనిషి మీద సాంఘికంగా దాడి ప్రారంభమౌతుంది. సాధారణంగా ఇలాంటి తొలి దాడుల్లో ఎరలు మాత్రం స్త్రీలే... దీని పతాకస్థాయి కులంనుండి వెలివేయడం. అప్పటినుండి దాడి తీవ్రమై అతని ఆస్థిపాస్తుల్ని ఒడుపుగా స్వంతంచేసుకొని......ఆ మనిషి తన కింద పనిముట్టుగా మార్చుకోవడంతో దాడి పూర్తవుతుంది....

ఇక బయ్యక్కలాంటి పతితులు, భ్రష్టులు, దగాపడిన చెల్లెళ్లు విముక్తి పోరాటంలో చేరడం సహజమైన అనివార్యమైన విషయం....... ఇప్పుడాలోచిస్తే అలాంటి స్థితిలో పోరాటంలోకి వచ్చిన వాళ్ళు విముక్తి పోరాటంలో కీలకమైన పాత్ర నిర్వహించడంగురించి కొంత కల్పితం అసహజత్వం ఉన్నట్లు తోస్తున్నది.... పోరాటంలో చేరడం అనివార్యమే అయినా వాళ్లు పోరాటం ఉచ్ఛస్థితిలోకి వచ్చినపుడు ఎంతో తర్ఫీదు అనుభవం ఉంటే తప్ప బయ్యక్కలాగా ప్రవర్తించలేరు.

అయితే ఇవ్వాళ నా అక్కలు చెల్లండ్లు విముక్తి పోరాటంలో భుజానికి భుజమై ఉన్నారు. వాళ్ళు కొద్దిమందే కావచ్చు కాని వాళ్ళ చేతుల్లో తుపాకులున్నాయి......

ఈ నవల రెండవ, చివరి భాగాలు చిత్రించడంలో నేను పూర్తిగా విజయం సాధించలేకపోయాను. ఈ నవలలోని పాత్రలన్నీ నిజమైన పాత్రలే.... ఈ పాత్రల ప్రవర్తనలో పాఠకులు ఏవన్నా లోపాలున్నాయని గుర్తిస్తే... అవి నేను సరిగా అర్థం చేసుకోకపోవడం మూలకంగానో సరిగా చిత్రించలేక పోయినందువల్లనో జరిగిందనుకోవాలి......

ఈ నవల చదివి మార్పులు, చేర్పులు చేయించి పేరుపెట్టిన కె.వి. రమణారెడ్డి గారికి కృతజ్ఞతలు.

ఈ నవల ప్రచురించిన అరుణతార పత్రికకు,

తమకు ఆర్థికంగా తలకు మించిన భారమే అయినా పుస్తకరూపంలో తేవడానికి పూనుకున్న నెల్లూరు జిల్లా విప్లవ రచయితల సంఘం యూనిట్‌కు

నేను కృతజ్ఞున్ని...

26 జులై 1983

- అల్లం రాజయ్య



www.eTelangana.org

# వెనక్కి తిరిగి చూసుకుంటే

ముప్పయైదు సంవత్సరాలు వెనక్కి తిరిగి చూసుకుంటే-నాయవ్వన ఉద్విగ్న రోజులు, సంఘటనలు - నిరంతరం కొట్లాటల మధ్య, వెతుకులాటల మధ్య గడిచిన క్షణాలు పొటెత్తాయి. తెలంగాణా సాయుధపోరాట విరమణ - ఒక పెనువైఫల్యం తరువాత తెలంగాణా మానని గాయంగా సలుపే క్రమంలోని తరం మాది. వైఫల్యాలు మా తండ్రులవైతే...కొత్తకలలు, ప్రశ్నలు - పోరాటాలు మాతరాన్ని నిలువకుండా చేసినయ్. అట్లాంటి అతలాకుతలపు కాలంలో, భూమిలో వెనుకబడిన పల్లెలో పుట్టిన వాళ్లల్లో నేనొకన్ని... అప్పుడప్పుడే మా పల్లెకొచ్చిన బడి - ఎడ్లు, గొడ్లు, పొలాలల్లో నుంచి పుస్తకాలల్లకు తొంగి చూసేటట్టుచేసింది. దొరతనం, దొరలు అంతగా తెలియని చిన్న పల్లె నుంచి అయిదవ తరగతికి దొరలు... దొరతనం గల పెద్దఊరు వెన్నంపల్లికి మారవల్సివచ్చింది. ఈ మార్పు నా బాల్యంలో పెద్ద ప్రభావం చూపింది. ఆరవ తరగతికి మళ్లీ మావూరు తాలుకా మంథనికి - అయిదు కిలోమీటర్లు కాలినడక - అదో పెద్ద ప్రపంచం. పుస్తకాలు, లైబ్రరీ. అక్కడ అడుగుపెట్టడమే కొట్లాటలతో ఆరంభమయ్యింది. నాతీర్గనే పల్లెలనుంచి వచ్చే అనేకమంది నా సహచరులు పల్లెలోని తక్కువ కులాల పిల్లలకు - తాలుకాలో ఉండే ఎక్కువ కులాల పిల్లలకు ఏ విషయంలో పొసిగేది కాదు. మాసిన బట్టలు, పెరిగినజుట్టు, కాళ్ళకు పుండ్లు, చీమిడి ముక్కులు, మాటతీరు, భాష, అంతకన్నా అమాయకత్వం, సూటిదనం - మేము పట్నం పిల్లలకు జంతువుల్లాగా కనిపించేటోల్లం. మా ఎంటబడి ఆగంబట్టించేటోల్లు - కూసునేకాడ, పాఠాలకాడ, ఆటలకాడ అంతటా కొట్లాటలే... మనుషులమధ్య ఉండే అన్నిరకాల వివక్షతలకు మా పాఠశాల వేదిక. మేం బజాట్ల కచ్చినందుకే - బస్తీమే సవాల్ చేస్తే రావాల్సిన గొడవలన్నీ వచ్చాయి....

లోలోపల మండే ఈ మంటే 1968 ప్రత్యేక తెలంగాణా ఉద్యమంగా రూపు దిద్దుకున్నది... ఏదో ఉద్యోగం కోసం చదువుకోవాలెనని పల్లె నుండి బయలు దేరిన మాకు - ఉద్యోగం కోసం చదువు వెనక్కిపోయి ఉద్యమంకోసం చదువు వచ్చింది. పాఠ్య పుస్తకాలు మారాయి. తాలుకాలోని కొట్లాటలు - హైదరాబాదు దాకా పాకాయి. ఈ తిరుగుడులో అనేక పల్లెలవాళ్లు, పట్నాల వాళ్లు కలిశారు. రెండు సంవత్సరాలు ఈ గొడవల మధ్యే గడిచిపోయాయి. తెలంగాణా రాలేదు. ఉద్యోగం రాలేదు. మళ్లీ ఖాళీ...గాయపడిన మనసు కూడదీసుకుని వరంగల్ ఆర్ట్సు కాలేజీలో చేరడం - సాహితీ మిత్రుల పరిచయం... సాహిత్య పరిచయం...

మా ప్రాంతంలో లోలోపల అనేకం రూపుదిద్దుకున్నాయి. అక్కడి నుండి అనేక మలుపులు... అనేక యుద్ధాలు........అందులో నాతరం లాగే నేను. అవ్వన్ని గుర్తొస్తే,



ఆ మనుషులు గుర్తొస్తే కడుపుదేవుతది. అక్షరాలు అలుక్క పోతాయి. ప్రజలకోసం తమ విలువైన ప్రాణాలను, నులివెచ్చని యవ్వనాన్ని ధారపోసిన వాళ్లెందరో గుర్తుకొస్తారు. అది ప్రత్యేక తెలంగాణా సాధనకోసమైనా, పీడిత ప్రజల విముక్తి కోసమైనా నా తరపు మనుషులు చంపబడ్డారు.

శివయ్య, లచ్చింరాజం, బయ్యపుదేవేందర్ రెడ్డి, లచ్చిరెడ్డి, పోశెట్టి, రమణారెడ్డి, పల్లెకనుకయ్య, పెద్దిశంకర్, గజ్జెలగంగారాం, పులిమధునయ్య, కట్ల మల్లేశు, సమ్మిరెడ్డి, నల్లపు ఆదిరెడ్డి... వీళ్లందరు మాతరం వాళ్లే... మాపల్లెలన్నీ మాతరపు కష్టసుఖాలు, చావులు అనుభవించాయి... మంచి బతుకు కావాలన్నందుకే పల్లెలను కుల్లబొడిచారు. చెంచెల్లమైపోయి చెట్టుకొకరు పుట్టకొకరు అయ్యారు. జల్లెడైన పల్లెల అంతరంగాలు, అనేక కేసులు. మాతరానిది వెయ్యేండ్ల అనుభవం ఈ ముప్పయేండ్లకే.

ఈ గొడవల్లో గుండె మనుసు చెదిరి ఆత్మహత్యలు చేసుకున్న నా తరంవాళ్లు చందుపట్ల కృష్ణారెడ్డి, సుద్దాల ధర్మయ్యలాంటి వాళ్లు, ఆకాలమరణం పొందిన శనిగరం వెంకటేశ్వర్లు *(సాహు)* లాంటి వాళ్లు.

ఈ విధంగా నా బతుకు అందరిలాగే కొట్లాటల మధ్య నుంచే మొదలై - భీకర యుద్ధాల మధ్య నుండే కొనసాగుతోంది. అది అక్కడఇక్కడ అనికాదు - అప్పుడు ఇప్పుడు అనికాదు. పల్లెలు - పల్లెల్లోని రైతులు - కూలీలు వివిధ వృత్తులవాళ్లు, కులాలవాళ్లు, పారిశ్రామిక ప్రాంతాలు అక్కడ నెలకొన్న యుద్ధరంగం - ఆదివాసి ప్రాంతాలు, అక్కడ చెలరేగుతున్న మంటలు - ఈ యుద్ధరంగంలో అడివి, పల్లె, పట్నం - ఢిల్లీదాకా అనేక స్థితులతో నిరంతరం లోలోపల రవులుకొనే కుంపటితో నాకు ఊహ తెలిసినదగ్గరి నుండి తిరుగుతున్న. నా నేలమీద - నాకాలంలో చెలరేగిన ఈ తుపానులో అల్లల్లాడ కుండా - అతలాకుతలం కాకుండా - విడిగా, ఎడంగా ఉండడం నాలాగే ఎవరికి సాధ్యం కాలేదు.

నేనీ కాలానికి, చరిత్రకు.... సాక్షిని, సహచరున్ని, టైం కీపరును. ఈ పని నేను ఇష్టంపూర్వకంగా ఎంచుకున్నదేమికాదు. నా కాలం, నాతరం నాకు వొప్పజెప్పిన కర్తవ్యమిది. గుబగుబలాడే గుండెతో ఇంత బరువును, ఆటుపోటులను, నా తరంతోనేను పంచుకున్న అనుభవాలను, తిరిగిన మలుపులను....పంచుకోకుండా, చెప్పకుండా ఉండజాలని తీవ్రమైన మానసిక స్థితినుండే నేను రాయడం ఆరంభించాను.... నేను అక్షరాలుగా పేర్చిన ఈ అనుభవాలన్ని నాతరపు అనుభవాలు. రక్తసిక్తమైన అనుభవాలు... నా అల్పశక్తితో కొంతమేరకు మాత్రమే చిత్రించగలిగాను.

కొలిమంటుకున్నది నవల రూపొందడం గురించి ఇది చివరిమాటకాదులో రాశాను. అప్పటికే రైతుకూలి సంఘాలు ఏర్పడి వందల సంవత్సరాలుగా కొనసాగుతూ వస్తున్న భూస్వామిక సమాజం మీద తిరుగుబాటు చేశాయి. ముఖ్యంగా పల్లెల్లో సర్వ


www.eTelangana.org

అధికారాలకు, అనర్థాలకు మూలమైన దొరల ఆస్థిపాస్తులైన 'భూమి' మీద తిరుగుబాటు కేంద్రీకరించబడినది. అప్పుడు తెలంగాణా పల్లెలు ఇప్పటి ఊహకందని రీతిలో ఉండేవి. నాకు ఊహ తెలిసినప్పటి నుండి నేను ద్వేషిస్తున్న దుర్మార్గమైన భూస్వామ్య సమాజం పట్ల కోపం... ఆ సమాజం మనుషులపట్ల అనుసరించిన అమానుష వైఖరి నన్ను తీవ్రంగా కలిచివేసేది. ఆనాడు తెలంగాణాలో సృష్టికర్తలైన ప్రజలు బాంచెబతుకులు బతికేటోల్లు. అయిన బట్టకట్టరాదు, చెప్పులు తొడుగరాదు, చేసిన కూలి అడుగరాదు. భూములు, పంటలు ఏదో ఒక పద్ధతిలో దొర ఆస్తుల్లో కలిసేవి. పంచాదులు, దండుగలు - చివరకు పెళ్లినుంచి చావుదాకా. పండుగలు దొర ఇష్టపూర్వకంగా జరుపుకోవాల్సిందే. ఎదురు మాట్లాడడమన్నా, తిరగడమన్నా చావుతెచ్చుకోవడమే. అట్లాంటి పీడన, వొత్తిడి, దౌర్జన్యాలలో నుండి నిప్పురవ్వ పుట్టింది. అది ఒక గ్రామం నుండి మరో గ్రామానికి పాకింది. గ్రామంలోని ప్రతిది ప్రశ్నించబడింది. రైతుకూలీ సంఘం దొరల భూముల్లో ఎర్రజండాలు పాతడమేకాక దొరలను సాంఘికంగా బహిష్కరించేదాకా - అది గ్రామాలనే కాదు - పారిశ్రామిక ప్రాంతాలను పట్నాలను వనికించింది...

**కొలిమంటుకున్నది** నవలలో ఈనేపథ్యం చిత్రిస్తే... రైతుకూలీ సంఘాలల్లో ప్రజలు సమీకరించబడి తిరుగుబాటుచేస్తే... దొరలు అనేక ఎత్తులతో, ఆయుధాలతో దాడికి సిద్ధపడ్డారు. శివయ్య లాంటి వాళ్లు ఆకాల్పుల్లో చనిపోయారు. ఈ తిరుగుబాటు కోపం ఒక నిర్మాణ రూపం తీసుకుని - అన్నిరకాల సామాజిక సంబంధాలను అర్థం చేసుకుని రాజ్యాధికారానికి సంబంధించిన చైతన్యం గురించి ఆలోచించడం - అందుకు తగిన నిర్మాణ రూపాలను ఎంచుకోవడం **ఊరు** నవలలో కన్పిస్తుంది.

(ఇదే వరుసలోనే రాసిన మరొక నవల ఊరేగింపు అనేక చోట్లకు తిరిగి చివరకు కాలిపోయింది. ఆ నవలలో భారతీయ గ్రామీణ సమాజంలో కులాల పొందిక గురించి - నూతన ప్రజాస్వామిక పోరాటంలో ఆయా కులాలు సమీకరించబడడం గురించి ఈ నవల రూపొందింది. సుమారు 60 పేజీల వరకు మాత్రమే 'నూతన' మాస పత్రికలో సీరియల్‌గా వచ్చింది.)

భూస్వాములకు ప్రజలకు మధ్య జరుగుతున్న పోరాటాలు - కల్లోలిత ప్రాంతాల చట్టం తేవడం ద్వారా - ప్రభుత్వం దొరలకు అండగా గ్రామాలల్లో పోలీసుమయం చేయగా - సాయుధ రూపం తీసుకుని - అది అశేషపీడిత ప్రజానీకానికి - అర్థభూస్వామ్య అర్థవలస స్వభావం గల ప్రభుత్వానికి మధ్యపోరాటంగా తెలంగాణాలో నుండి యావత్తు భారతదేశవ్యాపితంగా వ్యాపించే క్రమంలో.. భారతదేశంలోని మూడు రకాల జీవితం- ఆదివాసి - మైదాన గ్రామీణ, పట్టణ కార్మిక జీవిత నేపథ్యంలో **అగ్నికణం** నవల (బయ్యక్క, పికిలీ పాత్రల ద్వారా) రూపుకట్టే ప్రయత్నం చేశాను.

ఈ నాలుగు నవలలు నా బాల్యం నుండి 1980 దాకా జరిగిన పరిణామాలు, మలుపులు చిత్రించడానికి చేసిన ఒక ప్రయత్నం. నేను ఈ నవలలు రాయడంలో - నా చుట్టూ, నాతో పాటే జీవించిన పాత్రలను, సంఘటనలను ఎంచుకున్నాను. అయితే ఈ



పాత్రలు ఈ ప్రాంతంలోని వేలాది మందికి నమూనా పాత్రలుగా ఉన్నవాటినే ఎంచుకున్నాను. ఊపిరిసలుపనివ్వని అనేక ఘటనల నుండి కీలకమైన వాటిని - మలుపుకు..........గుణాత్మక మార్పుకు కారణమనుకున్నవాటిని ఎంచుకున్నాను. ఈ ఉద్యమాలల్లో అనేక రకాలచైతన్యాలకు సంబంధించిన మనుషుల్లో- గ్రామంలోని సాధారణ మనుషులకు చేరాలనే ఉద్దేశంతోనే చిత్రీకరణలో శ్రద్ధతీసుకోవడమైనది. అంతకు ముందు అప్పుకాయిదాలు, శిస్తుకాయిదాలు, కరపత్రాలు తప్ప ఎరుగని వారు ఈ నవలను గ్రామాలల్లో చదివారు. నేను కలిసినప్పుడు నాతో చర్చించారు... నిజానికి నేను చిత్రించని అనేక తీవ్రమైన ఘటనలు, వైవిధ్యపూరితమైనవి ప్రతిగ్రామంలో జరిగాయి. ఘటనల ప్రత్యేకతల్లోంచి సారాంశాన్ని మాత్రమే చిత్రించడానికి ప్రయత్నం జరిగింది.

ఇలాంటి ఉద్యమాలు - మలుపులు - ఈ నవలల్లో చిత్రించిన జీవితం కోసం చాలా మంది ఆత్మార్పణం చేసిండ్లు. చిత్రించింది నేనే అయినా ఈ మలుపులు నా ఒక్కడి మెదడులో పుట్టినవికావు. ప్రజల సమిష్టి ఆచరణలోంచి, రైతుకూలి సంఘాల పని విధానంలో నుండి రూపొందినవే. వరవరరావుగారు తన ముందు మాటలో వివరంగా చెప్పినట్లుగా ఇక్కడ స్థలకాలాల చరిత్ర లోంచి మాత్రమే ఈ నవలలు రూపొందాయి. నవలల్లోని జీవం, సారం రైతుకూలీ సంఘాలవి - వాటిని నడిపిన ప్రజానాయకత్వానిదే. ముందుగానే పేర్కొన్న అనేక మంది అమరులతోపాటు - వందలాదిమంది జ్ఞాత, అజ్ఞాత వీరయోధులు - పడరాని బాధలు పడ్డ వాళ్ల కుటుంబాలు - అప్పట్లో ఇక్కడి ప్రజలు గుసగుసగా అనుకొనే పేరు-పత్రిక వార్తల్లో విన్పించిన కొండపల్లి సీతారామయ్యగారు ఈ పోరాటాల రూపకల్పనలో భాగంపంచుకున్నారనేది అందరికి తెలిసిన సంగతే.

అయితే ఇది సాహిత్యమని గాని, ఈ రూపంలో నిలుస్తుందనిగాని, ప్రచురింపబడుతుందనిగాని నేను రాస్తున్నప్పుడు అనుకోలేదు. సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న జీవన్మరణ పోరాటాల మధ్యలో నుండి సాహిత్యం రాయడం - ముఖ్యంగా అనేక చావుల మధ్యలో నుండి రాయడం ఒక వేదనాభరితమైన విషయం. రాయకుండా ఈ ఒత్తిడి మోస్తూ బతకడం మరింత బాధాకరమైన విషయం.

ఈ ఉద్రిక్త జీవితంతో పాటే సుదీర్ఘకాలంగా నడుస్తూ - సృజన పత్రిక దగ్గర నుండి నారచనలు రావడానికి కారణమైన వరవరరావుగారు ముందు మాట రాసినందుకు, ఇట్లాంటి సాహిత్యాన్ని ప్రచురించడానికి తనవంతు కర్తవ్యంగా ముందుకు వచ్చిన పర్స్పెక్టివ్స్ ప్రచురణ సంస్థకు వందనాలు... ప్రచురణలో పాలు పంచుకున్న అందరికీ కృతజ్ఞతలు...

ఈ నవలలు రాసేక్రమంలో నేను అనేక గ్రామాలు అననుకూల వాతావరణంలో తిరిగాను. నన్ను వాళ్లోడే అనుకొని కడుపుల మాటలు పంచుకున్నారు. అన్నంపెట్టి


www.eTelangana.org

ఆదరించారు. నేను రాయని - రాయడానికి శక్తి చాలని అనేక అనుభవాలు - మనుష్యులు... సుదీర్ఘనిదురలేని అనారోగ్యపు రాత్రుల్లు - లోలోపల లుంగలు చుట్టుకపోయిన దుఃఖాలు... ప్రయాణాలు.. ఎడబాట్లు, ప్రేమలు... ఎన్నెన్నో మరెన్నో... గుండె గొంతులోకి వచ్చే ఆ జ్ఞాపకాలను సదా తల్చుకోవడం తప్ప నేను ఎవరికైనా ఏమివ్వగలిగాను? నాతోపాటు నడిచిన నా కన్నీటి పుష్పాలైన అనేక మంది నా తరపు మిత్రులతో చేసిన 'బాస'లను ఎప్పుడు తీర్చుకోగలను.

చీకటి కడుపులోని మారుమూల పల్లెలు, అడవులు, పందుల గుడిసెలు - వాగులువంకలు ఈ నవలల్లోని గ్రామాలు అప్పుడు. ఇటీవల అల్లుకపోయిన రోడ్లు - ప్రపంచంలోని చెత్తా చెదారమంతా చేరిన గ్రామాలను గతనాలుగైదు సంవత్సరాలుగా మళ్లీ చూసే అవకాశం కలిగింది. పల్లెలమీద ప్రపంచీకరణ పడగ దాడి ఎట్లాఉన్నా కూడా... పైకి కన్పించే ఈ మాయజలతారులోంచి - నాతరపు మనుషుల్లో లోపల భద్రంగా దాచుకున్న అదేనిప్పు... అన్యాయాన్ని సహించని నిప్పు... మంచి సమాజంకోసం ఎంతటి మూల్యాన్నైనా చెల్లించేనిప్పు...ఆరిపోని రాజీపడని నిప్పు - ఎప్పుడో గుప్పుమంటుందని నా ప్రగాఢ విశ్వాసం. నా తరం గ్రామాలల్లో నుండి బయలుదేరి నదులు, పర్వతాలు, హిమాలయాలు దాటి ప్రపంచాన్ని కలె తిరుగుతోంది... ఆయుధమే పరమావధిగా బతుకుతున్న పిరికి సామ్రాజ్యవాదపు డొల్లతనాన్ని అర్థంచేసు కుంటోంది.... బహుశా ఈ మాయా మోహపు మట్లికాళ్ల మహారాక్షసిని తప్పకుండా అంతమొందించే మహత్తర ఆలోచనలో, నిర్మాణంలో నా తరం మనుషులు, గ్రామాలు భాగం పంచుకుంటూ లీనమైఉన్నాయని - నాకు తెలుస్తూనే ఉంటుంది. ఈ తెలిసినదేదో రాయడం ఇంకా మిగిలి ఉంది.

ఆ మహత్తర యుద్ధంలో నావాళ్ళు ప్రపంచ ప్రజలతో కలిసి పాలుపంచుకుంటున్నారు. రక్తసిక్తమై యుద్ధ విలేకర్లుగా - రచయితలుగా నాతరం వాళ్లందరితో పాటు నేను పని చేయాలని ఎడతెరపిలేని కలలు..

మంచిర్యాల
30 అక్టోబరు 2007

**అల్లంరాజయ్య**



# కొన్ని తెలంగాణా పదాల పరిచయం

జీవాలు = జంతువులు
నిట్టాడు = గుడిసె మధ్యలోని పొడుగు గుంజ
పుల్లెందులు = కష్టాలు
అతారె = ఆయుధం
కలాలిహర్రాజు = తాడిచెట్ల వేలం
షురువు = మొదలు
గిరేసుకున్నరు = చుట్టేసినారు
శాత్రాలు = కథలు
కుట్టాది = కుష్టువ్యాధి
నశం = పొగాకు పొడుం
బుడ్డ పరక = ఒక రకమైన చేప
బరాంచాలె = భరించాలె
అలివయ్యిండు = అలవాటయ్యిండు
పానాదులు = బజార్లు
ఎర్జె = ఒకరకమైన పాము
మదన జెరం = మశూచి జ్వరం
సందెలు = సాయంత్రం
బనావు = సమంజసం
తావుగూళ్ళు = ఇండ్లకు తెచ్చిన జొన్నగూళ్ళు
పెద్ద పిట్ట = గుడ్లగూబ
కాల్లగోల్లు = శోభనం
బాబా జుల్ల = సన్యాసుల్లో
మస్తీమీదున్నది = బలిసి ఉన్నది
జెట్ట కాలం = పాడుకాలం
బొక్కల్లో = ఎముకల్లో
గిలేటు = అల్యూమినియం
మొఖద్దమ్‌లు = మేస్త్రీలు
కావురు గప్పిండ్లు = నిండిపోయిండ్లు
మట్లమీద = కొయ్యలకు కట్టబడి
పాటి = దిబ్బ
కములం = తిండి
కోంద్రిగాడు = తోడేలు
ఆచర్ = వాచర్ (చౌకీదారు అసిస్టెంటు)
మోరుదోపు = మెడబలిమి
గాసం = తిండి గింజలు (సరంజామా)
మోతెపరులు = పెద్ద రైతులు
నిచ్చానికైతే = నిజానికైతే
అలాయిబలాయి = ఆలింగనం
తనబ్బీ = అల్మారాలాంటి గూడు
సడుగు = రోడ్డు
ఉల్ఫారోజు = ధర యివ్వకుండానే
గటుక = జొన్న అన్నం
సెలుక = చేను
నియ్యతి = పవిత్రంగా
నల్లాలం = ఒక రకమైన మొక్క ఆకు
దెవుసాలు = రోజులు
మొట్టలు = కొర్రమీనులు
గారె = మందు
ససరాదే = కొంచెం ఆగరాదే
కచ్చులం = బండి
జొండ్లు = జొన్నలు
సెత్రి = గొడుగు
కర్రెపిట్ట = నల్ల పిట్ట
పనుగడి = సందులుండే తలుపు
రకం = డబ్బు
దబ్బెడ = జావ
పంతరగల్లు = రాబందులు
బుగ్గెండి కంచం = సత్తుపల్లెం
ఉలుకు మగ్గింది = సద్దుమణిగింది
బొత్త = కడుపు
బాసండ్లు = అంట్లగిన్నెలు
నల్ల = పంపు
కంచెలు = పచ్చికబీళ్ళు
లాకలాంగ = తప్పకుండ
సరిబద్దులు = ఒకరకమైన ఆట
సైకోన్ని = చౌకిదారును
ఇసిరెలు = పనిముట్లు
దౌర = డ్యూటీమీద
ఉకుమతి = అధికారం
నీల్లాటకు = ప్రసూతికి
జంగలాతోల్లు = అడవి అధికార్లు
గడుకరాయి = విసుర్రాయి


www.eTelangana.org

బేకారు = పాడుపని
తాములుగ = నిదానంగా
డాలన బోలన = ఉల్టా సీదా
నామర్దా = నామోషి
ఒర్రె = వాగు
బింకి = చిన్న కుండ
చెమ్మదిగిది = చెడుగుడు
ఉదెం = హృదయం
గడంచ = చిన్న మంచం
జాగా = స్థలం
లుక్సాన్ల = నష్టంలో
దాతిముందట = వడ్రంగి పనిచేసే స్థలం
జెనిగలు = జెలుగలు
రాస్తలో = మార్గంలో
వాజీబు = న్యాయమైన
కడ్తలేదట = గర్భంధరించుట లేదు
సడ్డకుడు = తోడల్లుడు
మాగిపొద్దు = చలికాలం
దట్టమీన = గట్టు మీద
పురాగ = పూర్తిగా
దంగల్ = గోదా.......(కొట్లాడేస్థలం)
మార్మానం = మరోపెళ్ళి
గుమ్ములర్ర = గాదెలు బెట్టినగది
ముప్పందుం = ముప్పయిబస్తాలు
దవత్తంది = చలేస్తుంది
మాట్లోడు = ఒక సంచారతెగ
బనావు = న్యాయం
కంకబెనం = వెదురు గింజలు
అంపులు = బయటి నీటికుండలు
బైటకు = నెలవారీ పైకం
పావురం = ప్రేమ
బీటు = వ్యవసాయ మార్కెట్
టుట్టి = 20 గిద్దలు
సుంకరి = రెవెన్యూ జవాను

కలీగం = కలియుగం
తఫ్‌స = తీర్పు
కలాలి = తాటికల్లు వేలం
అందాని = రాబడి
ఉదురు = ఎదురు
మందోట = ఊరవతల పశువులు చేరే స్థలం
తడలు = అలలు
కొండేలు = చాడీలు
పుర్సతు = తీరుబాటు
నంబర్లు = మెంబర్లు
అదాలతు = కోర్టు
మున్సోసాబు = జడ్జి
కోతుకం = కోపం
ఉల్ఫా = ఏవిధమైన మూల్యం చెల్లించకుండా
సేత = వ్యవసాయం
గులాపోడు = సేవకుడు
జల్తా = విందు
సిడిమెల = క్షణంలో
నాత్తానాత్తన = నమ్మించి
రేక = డొప్ప
కారున = పట్టుకారు
అంగడంగడి = చెల్లాచెదురు
బేడం = గడ
నకాషోల్లు = వస్త్ర చిత్రకారులు
కాటిపాపలు = జనాన్ని అడుక్కొని తినే తెగ
ఆరువం = పంట
గవా = సాక్షి
పరధాన్లు = ఒక అడవి తెగ
పెయ్యంత = ఒళ్ళంత
మాల పంకిడి = ఒక రకమైన చేప
పూలుకదారు = యజమాని
తరి = నీటి వసతి గల భూమి
కుష్కి = నీటి వసతి లేని భూమి
సబ్బండవర్ణాలు = అన్ని కులాలు

ఎముకాలు = సంవత్సరపు జీతాలు (పెట్టుబడులు)
కొప్పెర = నీల్లు వేడిచేసుకోవడానికి ఉపయోగించే ఇత్తడి పాత్ర
అలుగం = గడ్డికుప్ప చుట్టు బంతి కట్టడానికి వేసినగడ్డి
గోత్రాలోల్లు = మున్నూరు కాపులను అడుక్కొని వీధి భాగవతాలు వేసే ఒక సంచార తెగ



## ఎందరో సాహితీ మిత్రులు

| | |
|---|---|
| అల్లం రాజయ్య సాహిత్యం (నవలలు / కథలు) ప్రచురణ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించిన | శ్రీ అల్లం రాజయ్య |
| రాజయ్య సాహిత్యం సిరీస్‌కు స్నేహహస్తం చాచిన | శ్రీ ఆలపాటి బాపన్న |
| రాజయ్య రచనలకు సమగ్రమైన రాజకీయ తాత్త్విక భూమికను అందించిన | శ్రీ వరవరరావు |
| ఎప్పటిలానే ఈ ప్రచురణకి సహకరించిన ఆత్మీయ హితవరి పాన్‌కామ్ మార్కెటింగ్ ప్రై.లి. మేనేజింగ్ డైరెక్టర్ | శ్రీ ఆర్.జి. ప్రసాద్ |
| తొలి పరిచయంతోనే ఎంతగానో సహకరిస్తామన్న | శ్రీ ఎ.జగన్ మోహన్‌రెడ్డి |
| కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్ | శ్రీ ఎ.వి. ఆర్.ఎన్.రెడ్డి |
| మూడు దశాబ్దాల అనుబంధాన్ని నేటికి కొనసాగిస్తూ స్నేహహస్తం చాచిన శ్రీ సాయి షామిలి గ్రాఫిక్స్ | శ్రీ మూల్గంటి రవికుమార్ |
| పుస్తక ప్రతిపాదన నుంచి చివరిదాకా తగు సూచనలు, సలహాలు ఇచ్చిన | శ్రీ రఘోత్తం రెడ్డి<br>శ్రీ అల్లం నారాయణ |
| ఈ సాహిత్య సిరీస్‌ని ప్రోత్సహించి, వెన్నుదన్నుగా ఉంటామన్న | శ్రీ పాణి<br>శ్రీమతి కృష్ణాబాయి<br>శ్రీ నందిని సిధారెడ్డి<br>శ్రీ సంగిశెట్టి శ్రీనివాస్ |
| ఎప్పటిలానే సహకరిస్తున్న నవోదయ బుక్‌హౌస్ ద్వయం | శ్రీ సాంబశివరావు<br>శ్రీ కోటేశ్వరరావు |
| ఈ ప్రచురణ రూపకల్పనలో మాతో కలసి నడచిన సాహితీ మిత్రులు | శ్రీమతి పొన్నపల్లి సీత, శ్రీమతి అనల<br>శ్రీ రమణ జీవి, శ్రీ జుగాష్ విలి<br>శ్రీ ఆర్.కె. (నవ్య), శ్రీ వాసిరెడ్డి నవీన్<br>శ్రీ కె. లక్ష్మయ్య (ప్రజాశక్తి బుక్ హౌస్)<br>శ్రీ వెనిగళ్ళ వెంకటరత్నం |
| తొలి ప్రచురణలకు రూపమిచ్చిన | శ్రీ చంద్ర |
| తొలిసారిగా ఈ నవలలు ప్రచురించిన | సృజన, అరుణతార పత్రికలు<br>క్రాంతి ప్రచురణలు |

వీరందరికీ మా హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు.

ప ర్ స్పె క్టి వ్స్
సామాజికశాస్త్రం / సాహిత్యం

www.eTelangana.org

అరుణతార